
మైనంపాటి భాస్కర్
ఆఖరి
మలుపు

# ప్రొలాగ్

**అద్భుతమే జరిగింది ఆ రోజు!**

**ఇండియాకి సంబంధించినంత వరకూ అయితే అది నిజంగా పరమాద్భుతమే!**

ఒలింపిక్స్ గేమ్స్‌లో ఒక ఇండియన్ మూడు గోల్డ్ మెడల్స్ సాధించాడు!!

కల కాదు! నిజమే!

వందమంది స్పోర్ట్స్‌మెన్‌తో ఉన్న టీమ్ వెళ్ళినా ఒక్క వెండి పతకం కూడా సాధించే సత్తా లేని దేశాల్లో ఇండియా మొదటిది!

అలాంటిది, ఒక్క ఇండియన్ స్పోర్ట్స్‌మెన్ మూడు బంగారు పతకాలు కొట్టెయ్యడం....

ఫాంటాబ్యూలస్ ఫీట్!

అక్కడున్న అందరిలో అదే ఆలోచన!

ప్రేక్షకులకి, విలేఖరులకి, అధికారులకి, అనధికారులకీ ఇంటేర్నేషనల్ టీవీ క్రూలకీ....

అందరికీ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారిన రాజా మాత్రం అనవసరమైన ఫస్ చెయ్యకుండా చిరునవ్వు నవ్వుతూ నిలబడి వున్నాడు.

నిజమే! అతను మూడు గోల్డ్‌మెడల్స్ గెలిచినవాడు.

పిస్టల్ షూటింగ్.

పోల్‌వాల్ట్.

ఫోర్ హండ్రెడ్ మీటర్స్ రన్నింగ్....

అతన్ని చూసి విదేశీ విలేఖరులంతా ఎగ్జయిట్ అయిపోతున్నారు.

కానీ ఇండియన్స్‌లో మాత్రమే నెగెటివ్ రియాక్షన్స్ కనబడుతున్నాయి. కులమత భేదాలూ, ప్రాంతీయ భేదాలూ, భాషోన్మాదం ఇవన్నీ మనసులని మసిబారిపోయేటట్లు చేస్తూ వుండగా, రాజా సహచరులంతా పైకి నవ్వుతూ, లోపల్లోపల ఏడుస్తూ వున్నారు.

తనవాళ్ళ సైకాలజీ తెలుసు రాజాకి. అతను అవేం పెద్దగా పట్టించుకోలేదు. కానీ మనసులో ఏ మూలో సన్నటి సెగలాంటి బాధ.

ఈ ఫీలింగ్స్ అన్నీ వదిలించుకుని వీళ్ళు బాగుపడేది ఎప్పుడు?

అతనలా అనుకుంటూ ఉండగానే –

హఠాత్తుగా రంగప్రవేశం చేశాడు ఒక వీరాభిమాని!

అతను ఇండియన్ అయి ఉండవచ్చు.

లేదా, పాకిస్తానీ అయి ఉండవచ్చు.

బంగ్లాదేశ్ గానీ, నేపాలీ గానీ....

ఎవరైనా అయి ఉండవచ్చు.

పోలికలని బట్టి ఫలానా అని వెంటనే చెప్పలేకపోయినా, మొత్తానికి అతను భారత ఉపఖండం నుంచి వచ్చిన మనిషే అని మాత్రం సులభంగా తెలిసిపోతూనే వుంది.

ఆ అభిమాని మొహం వెయ్యి వాట్ల బల్బులాగా వెలిగిపోతోంది. సంతోషాన్ని

దాచుకోలేకపోతున్నాడు అతను.

రాజా చేతులు రెండూ పట్టుకుని, అవి ఊడిపోతాయేమో అన్నంత బలంగా ఊపెయ్యటం మొదలెట్టాడు.

నవ్వుతూ సహనంగా చూస్తున్నాడు రాజా.

వెల్! వెల్! వెల్!

సాటి ప్లేయర్స్‌కి సంతోషం లేకపోవచ్చు!

కానీ సాటి మనిషి ఒకడు ఇంతగా సంతోషం ప్రకటిస్తున్నాడు. ఇతనిలాంటి వాళ్ళు లక్షల్లో వుంటారు.

తన అభిమానులు!

తనకేం తక్కువ?

ఆ వీరాభిమాని హిందీ, ఉర్దూ కలిసిన హిందుస్తానీలో అంటున్నాడు.

"రాజా భయ్యా! నీ విజయం అంటే నా విజయమే అనుకో! నీ ఈ ఫీట్ చూడాలనే నేను ఢిల్లీ నుంచి వచ్చాను."

"నడిచి వచ్చావా?" అన్నాడు రాజా.

సంతోషంగా అన్నాడు వీరాభిమాని –

"అవును రాజా భయ్యా! మా హీరో మూడు మెడల్సు గెలుచుకోబోతుంటే యీ అభిమాని ఆ మాత్రం ఫీట్ చెయ్యలేడా?"

అతను ఇంకా రాజా చేతులు గబగబ ఊపేస్తూనే వున్నాడు.

నవ్వుతూ అడిగాడు రాజా –

"ఏమిటి నీ పేరు?"

"భగవాన్!" అన్నాడతను రాజా చేతులు ఊపుతూనే.

అప్పుడు–

కళ్ళుమూసి తెరిచేటంతలో జరిగిపోయింది అది!

మెరుపులాంటి వేగంతో భగవాన్ తన జెర్కిన్ జేబులో నుంచి సంకెళ్ళు తీశాడు. మరుక్షణంలో ఆ సంకెళ్ళు తన చేతికీ, రాజా చేతికీ కలిపి వేసేశాడు.

'క్లిక్' మనే శబ్దంతో సంకెళ్ళు లాక్ అయిపోయాయి.

వెంటనే విజయగర్వంతో చెయ్యి పైకెత్తాడు భగవాన్. అతని వేళ్లు రెండు విజయసూచకంగా విక్టరీ సైన్‌ని చూపిస్తున్నాయి. అతని చేతితోబాటు ఆటోమాటిక్‌గా రాజా చెయ్యి కూడా పైకి లేచింది.

ఇద్దరి చేతులనీ కలిపి బంధించిన సంకెళ్లు తళతళ మెరుస్తూ కనబడుతున్నాయి.

అక్కడే ఉన్న సెక్యూరిటీ పర్సనల్ అలర్టు అయిపోయారు.

అక్కడ సెక్యూరిటీ చాలా టైట్‌గానే వుంది.

ఎంత టైట్ సెక్యూరిటీ ఉన్నా కూడా జరిగే అఘాయిత్యాలు జరిగిపోతూనే వుంటాయి కదా!

కొన్నేళ్ళ క్రితం మ్యూనిక్ ఒలింపిక్స్‌లో కూడా అలాగే జరిగింది. ఎంతో సెక్యూరిటీ వున్నా కూడా టెర్రరిస్టులు కొందరు జొరబడి ఇజ్రేలీ స్పోర్ట్స్‌మెన్‌ని నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేశారు.

ఇప్పుడు....ఇక్కడ కూడా అలాగే జరగబోతోంది.

అందరిలో టెన్షన్!

తక్షణం సెక్యూరిటీ పర్సనల్ వెపన్స్‌ని భగవాన్ మీదికి గురి పెట్టారు.

భగవాన్ భయపడలేదు.

పైపెచ్చు పిశాచంలా నవ్వాడు.

"డోన్ట్ షూట్!" అన్నాడు పెద్దగా. నన్ను షూట్ చేస్తే నాతోబాటు యీ రాజాగాడూ చస్తాడు. వీడితో బాటూ మీరూ చస్తారు. నేను హ్యూమన్ బాంబ్‌ని! అర్థమయిందా? యా! ఐ యామ్ ఏ హ్యూమన్ బాంబ్! ఐ యామ్ అబౌట్ టూ

ఎక్స్‌ప్లోడ్! ఏం నమ్మట్లేదా? అంటూ జర్కిన్ జిప్ కిందికి లాగాడు.

భగవాన్ జెర్కిన్‌కి తగిలించి ఉన్నాయి గెలాటిన్ స్టిక్స్.... అనేకమైన వైర్లు. వాటితోబాటు చిన్న మెటల్ బాక్స్ లాంటిది ఒకటి.

"నేను చావడానికే ఇక్కడికి వచ్చాను. కానీ నేను చచ్చే ముందు వందమందిని చంపిగానీ చావను" అన్నాడు భగవాన్ ఉన్మాదిలాగా.

"ఎవరు నువ్వు?" అన్నాడు రాజా. అతని మొహంలో నదురు బెదురూ కనబడడం లేదు.

"నేనా? నేను యునైటెడ్ టెర్రరిస్టుల మెంబర్ని" అన్నాడు భగవాన్.

"అంటే?"

"ఇండియా అంటేనే అదొక దగుల్బాజీ దేశం! పేరుకే అక్కడ ప్రజాస్వామ్యం. బిగ్ బ్రదర్‌లాగా, బుల్లీలాగా ప్రవర్తిస్తుంది ఇండియా. అందుకే పొరుగు దేశాలన్నిటికీ ఇండియా అంటే అంత అలర్జీ! ఇండియాలో జనానికి హక్కులు వుండవు. రాక్షస ప్రభుత్వం! అందుకే పంజాబ్‌లో తీవ్రవాదం. అందుకే అస్సాంలో తీవ్రవాదం. అందుకే కాశ్మీర్‌లో మిలిటెన్సీ. అందుకే ఎవరికి వాళ్ళు యెక్కడికక్కడ ఇండియా నుంచి విడిపోయి మర్యాదగా మా బ్రతుకు మేం బ్రతుకుతాం అంటున్నారు" అన్నాడు భగవాన్ విషం కక్కుతున్నట్లు.

"యూ ఆర్ టాకింగ్ షిట్" అన్నాడు రాజా.

అక్కడ జరుగుతున్న ఊహాతీతమైన సంఘటనను ఫెయిత్‌ఫుల్‌గా రికార్డ్ చేస్తున్నాయి వందలకొద్దీ టేప్‌రికార్డర్లు, కెమేరాలూ, వీడియో కెమేరాలూ....

అనుకోకుండా ఇంత ఎగ్జయిటింగ్ స్టోరీ దొరికినందుకు ఉద్రూతలూగి పోతున్నారు దేశ దేశాల న్యూస్ సర్వీసెస్ తాలూకు విలేఖర్లు. CNN, NBC టీవీల కెమేరాలు అక్కడ జరిగిపోతున్న దానిని జాగ్రత్తగా ఫాలో అవుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన పబ్లిసిటీకి స్కోపు!

అందుకే ఆ స్థలాన్ని, ఆ నిమిషాన్ని, ఆ మనిషిని ఎన్నుకున్నాడు భగవాన్.

అతనికి కావలసింది పబ్లిసిటీ.

అది అపారంగా లభిస్తోంది ఇప్పుడు.

చెలరేగిపోతూ అన్నాడు భగవాన్–

"ఎక్కడికక్కడ ఎన్ని తీవ్రవాద ఉద్యమాలు వచ్చినా, అన్నిటినీ తొక్కెయ్యడానికి తెగ ఆరాటపడిపోతుంది ఇండియా. అందుకే యిలా లాభం లేదని తీవ్రవాదులం అందరం ఐక్యమయ్యాము. యునైటెడ్ టెర్రరిస్ట్స్ అనే ఈ ఆర్గనైజేషన్‌లో పంజాబ్ తీవ్రవాదులు ఉన్నారు. కాశ్మీర్ మిలిటెంట్స్ ఉన్నారు. ఉల్ఫా ఫ్రెండ్స్ ఉన్నారు. ఎల్.టి.టి.ఇ. కూడా మాతో కలిసింది. టెర్రిఫిక్ కాంబినేషన్! ఇంక ఇండియాని పడుకోబెట్టేస్తాం! డౌన్ విత్ ఇండియా! డౌన్ విత్ ఇండియన్ ఇంపీరియలిజమ్! డౌన్ విత్ డిక్టేటర్‌షిప్! లాంగ్ లివ్ అవర్ స్ట్రగుల్!" అని డ్రమటిక్‌గా ఒక్కక్షణం ఆగి మళ్ళీ అన్నాడు భగవాన్.

"ఇప్పుడు మీరు బీభత్సాన్ని చూడబోతున్నారు. నేను ఈ మీటని నొక్కుతాను. వెంటనే ఈ బెల్టు బాంబు పేలిపోతుంది. నాతో బాటు ఈ రాజా, వాడితోబాటు మీలో కొందరు కూడా చావక తప్పదు."

రెడీనా?

గుడ్‌బై ఫ్రెండ్స్!"

అందరూ అదిరిపడి పది అడుగులు వెనక్కి వేశారు.

ఉన్మాదిలా నవ్వుతూ మీట నొక్కాడు భగవాన్.

ఆశ్చర్యం!

ఏమీ కాలేదు.

బెల్టు బాంబు పేలలేదు.

మరుక్షణంలో రాజా చెయ్యి మెరుపు వేగంతో వచ్చి భగవాన్ మెడని పట్టేసుకుంది. ఆ చేతికి సంకెళ్ళు లేవు ఇప్పుడు.

భగవాన్ వాగుతుండగా సైలెంటుగా సంకెళ్ళు వదిలించేసుకున్నాడు రాజా.

అన్ని టీ.వీ కెమేరాలు చూస్తున్నా కూడా....

ఎవరూ గ్రహించలేనంత ఒడుపుగా....

సంకెళ్ళు వదిలించేసుకున్నాడు రాజా!

ఇది అతనికి కొత్త కాదు.

అతనికి తెలిసిన విద్య ఇదొకటే కూడా కాదు.

అనేకమైన పనులు అతి లాఘవంగా చెయ్యగలడు అతను. వాటి గురించి ముందు ముందు.

రాజా చెయ్యి తన మెడ మీద పడగానే భగవాన్ అదిరిపడ్డాడు.

బెల్టుపైగా ఉన్న పేలని బాంబు వైపు చూసుకున్నాడు.

దానిని కనెక్ట్ చేస్తున్న వైరు కత్తిరించేసి ఉంది.

వైరు ముక్కలు మాత్రం భగవాన్ పాదాల దగ్గర పడి ఉన్నాయి.

"నేనే కట్ చేశా!" అన్నాడు రాజా– చాలా తేలిగ్గా. తర్వాత సెక్యూరిటీ వాళ్ళతో అన్నాడు –

"ఇంక వీడు మీ కేండిడేట్! వీడిని ఏం చేస్తారో మీ ఇష్టం."

మరుక్షణంలో భగవాన్ మీదికి లంఘించారు సెక్యూరిటీ పర్సనల్ – అతన్ని తోసుకుంటూ అవతలికి లాక్కెళ్ళిపోయారు.

వెంటనే హర్షధ్వానాలు వినబడ్డాయి జనంలో నుంచి.

అభివాదం స్వీకరిస్తున్నట్లు కొంచెం ఒంగి తల పంకించాడు రాజా.

చాలాసేపటి తర్వాత గానీ హర్షధ్వానాలు చల్లబడలేదు.

అప్పుడు వినబడింది ఒక గొంతు చాలా ఎగ్జయిటెడ్‌గా.

"మిస్టర్ రాజా! నేను ఒక అమెరికన్ కంపెనీ రిప్రెజెంటేటివ్‌ని. నీకు ఇష్టమయితే మాతో ఒక అగ్రిమెంట్‌కి రావచ్చు. మిలియన్ల డాలర్లలో ఉండే కాంట్రాక్టు ఆఫర్

చేస్తాం. నువ్వు అమెరికాలోనే సెటిలయిపోవచ్చు! నీకు మంచి టేలెంటు ఉంది! ఆ టేలెంట్‌కి తగిన భవిష్యత్తు ఇండియాలో ఉండదు. కమ్....కమ్ విత్ అజ్ అండ్ జాయిన్ అవర్ కంపెనీ."

అంతా విని నవ్వాడు రాజా.

అవతలి వాళ్ళది ఏ కంపెనీ అని కూడా అడగలేదు అతను.

ముక్తసరిగా అన్నాడు –

"నో థాంక్స్! నేను ఇండియాలోనే ఉంటాను."

"ఏం చేస్తావ్ అక్కడ?" అన్నాడు అవతల వ్యక్తి హీనంగా చూస్తూ.

"ఐ విల్ బికమ్ ఏ పోలీస్ ఆఫీసర్! అండ్ ఐ విల్ సర్వ్ మై కంట్రీ" అన్నాడు రాజా.

ఆశ్చర్యంతో కొయ్యబారిపోయాడు అవతలి వ్యక్తి.

"ఇంత టేలెంట్ పెట్టుకుని, ఇండియాలో పోలీసు ఉద్యోగం చేస్తావా?"

"అవును!"

"ఎందుకు?"

"అది నా జీవిత ఆశయం" అన్నాడు రాజా స్థిరంగా.

ఆ ఆశయం తనకి కలిగేటట్లు చేసిన వ్యక్తిని అతనెప్పుడూ మర్చిపోడు.

జేబులో నుంచి పర్సు తీశాడు రాజా.

అందులో ఉంది ఆ వ్యక్తి ఫోటో!

ఆ వ్యక్తి వైపు ఆరాధనా భావంతో చూశాడు.

✦ ✦ ✦

# ఆఖరి మలుపు

## అంతకు ముందు కొన్ని సంవత్సరాల క్రితం...
## ఒక రోజు మధ్యాహ్నం....

మండిపోతున్న ఎండలో, కట్టుకున్న పట్టుచీరె కంబళిలా గుచ్చుకుంటున్నట్లు అనిపిస్తోంది డయాస్ మీద కూర్చున్న మినిస్టర్ విజయకుమారికి.

నిజానికి ఈ మీటింగు పొద్దున పదిగంటలకే అయిపోయి ఉండాల్సింది. కానీ తను ఢిల్లీనుంచి వచ్చిన వెధవ ఫ్లయిట్ లేటయ్యింది. అయినా ఇప్పటి దాకా ఈ అలగా జనాన్ని ఆపి ఉంచగలిగాడంటే, అదంతా యూత్ లీడర్ అయిన తన కొడుకు సంజీవ్ ప్రతిభే అయి ఉండాలి.

గూండా గిరీ చేసి పనులు సాధించడంలో సంజీవ్‌కి సాటికారు ఎవరూ!

కానీ ఆ గూండాగిరీనే యిప్పుడు తన కొంపని ముంచేటట్లుంది.

సంజీవ్‌కి చిన్నా పెద్దా అని లేదు. వావీ వరసా అని లేదు. బీదా బిక్కీ అని లేదు.

తన పని పూర్తికావడానికి ఎవరినైనా సరే పాతాళానికి తొక్కెయ్యగలడు. సంజీవ్ ఏ క్లాస్ బ్లాక్‌మెయిలర్ కూడా! నిజం!!

ఇప్పుడు తనే తన కొడుకు సంజీవ్ బ్లాక్‌మెయిలింగ్‌కి టార్గెట్ అయిపోయింది.

ఏం చేశాడో, ఎట్లా దొరికిందో గానీ, సంజీవ్ చేతిలో పడింది ఒక వీడియో కేసెట్టు.

తనూ, మినిస్టర్ బలరామిరెడ్డి పడుకుని ఉండగా ఎవరో దొంగచాటుగా

తీశారు ఆ వీడియో ఫిల్ముని.

ఆ ఫిల్ము సంజీవే తీయించి ఉన్నా ఆశ్చర్యం ఏమీ లేదు. తనకు తెలుసు. సంజీవ్‌కి ఉచ్చం, నీచం లేవు.

ఆ కేసెట్‌ని గ్రిప్‌లో పెట్టుకుని, తననే బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు సంజీవ్! సర్కస్‌లో సివంగిని ఆడించినట్లు ఆడిస్తున్నాడు.

తనతో బాటే తన కొడుకు కూడా బాగుపడాలనుకుంది తను సహజంగానే.

కానీ తన బాగు తను చూసుకునే పద్ధతిలో ఉన్నాడు తన కొడుకు.

అదీ సహజమేగా!

ఏం చెయ్యగలదు తను?

దిసీజ్ లైఫ్!

నిట్టూర్చింది విజయకుమారి.

ఆమె చాలా యాంబిషస్.

తమిళనాడు చీఫ్ మినిస్టర్ జయలలితా జయరామ్, విజయకుమారి ఆదర్శం! తను అంత లెవెలుకి ఎదగాలన్నది ఆమె కోరిక.

జయలలిత ఒకప్పుడు సినిమా హీరోయిన్. యం.జి.ఆర్.తో చాలా చిత్రాల్లో నటించింది. యం.జి.ఆర్. ద్వారానే రాజకీయాల్లోకి వచ్చింది. రాజకీయంగా యం.జి.ఆర్.కి అత్యంత సన్నిహితం అయ్యింది. యం.జి.ఆర్ చనిపోగానే జయలలితని రాజకీయంగా తొక్కెయ్యాలని తీవ్రమయిన ప్రయత్నాలు జరిగాయి. యం.జి.ఆర్. అంత్యక్రియల సందర్భంలో జరిగిన ఊరేగింపులో, ఆయన శవం ఉన్న గన్ కేరేజ్ మీదకి జయలలితని ఎక్కనివ్వలేదు తక్కిన నాయకులు. కిందికి తోసేశారు. నానా దుర్భాషలాడారు. ఆ తర్వాత తమిళనాడు అసెంబ్లీలో కూడా ఆమెకి ఘోర పరాభవం ఎదురయ్యింది. డి.యం.కె. అధినేత కరుణానిధి అనుచరుడు ఒకడు దుశ్శాసనుడిలాగా జయలలితని నిండు శాసనసభలో వస్త్రాపహరణం చెయ్యాలని చూశాడు.

ఈ ఆటుపోట్లు అన్నీ నిబ్బరంగా తట్టుకుంది జయలలితా జయరాం.

ఇంతలో రాజీవ్ గాంధీ హత్య జరిగింది.

ఆ హత్యకు వెనక ఉన్న దుష్టశక్తి ఎల్.టి.టీ.ఈ. అనీ, వెన్నుతట్టి వాళ్ళకి తమిళనాడులో ఆశ్రయం ఇచ్చింది కరుణానిధి అనీ ప్రజల మనసులో బాగా పడిపోయింది.

దానితో ఎలక్షన్లలో డి.యం.కె.కి నామరూపాల్లేకుండా చేశారు ప్రజలు. మొత్తం డి.యం.కె. పార్టీ తరపున కరుణానిధి ఒక్కడే మద్రాసు హార్బరు సీటు గెల్చుకున్నాడు. తన పార్టీకి ఏకైక ప్రతినిధిగా శాసనసభలో కూర్చోవడం చిన్నతనం అనుకున్నాడో, లేకపోతే అంతమంది జయలలిత మద్దతుదార్ల మధ్య తన పరువు తీసేస్తారని భయపడ్డాడోగానీ, శాసనసభ సభ్యత్వానికి రాజీనామా ఇచ్చేశాడు.

ఇంక జయలలితకి తమిళనాడులో ఎదురనేది లేకుండా పోయింది. ఆమె కాళ్ళు పట్టుకునే లెవెలుకన్నా దిగజారిపోయి కాళ్ళు నాకే లెవెల్లో సెటిలయిపోయారు పార్టీలో తక్కిన నాయకులు. స్తోత్రాలూ, భజన కీర్తనలూ అందరికీ కంఠోపాఠం అయిపోయాయి. జయలలిత విశ్వరూపాన్ని ప్రజలకు తెలియబరుస్తూ తమిళనాడు అంతా "కట్ అవుట్లు" వెలిశాయి. యూనివర్శిటీలు ఆమెకి డాక్టరేట్లు యివ్వడానికి వంతులు పడ్డాయి. 'పురచ్చితలైవి' (విప్లవ నాయిక) అనే బిరుదు యిచ్చారు.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే, జయలలితకి జరిగిన "పట్టాభిషేకం" మరొక ఎత్తు.

ఈ "తమాషా" మొన్న మదురైలో జరిగింది.

మినిస్టర్ విజయకుమారి జయలలిత అభిమానిగా ఆ ఉత్సవానికి హాజరయ్యింది కూడా.

పేరుకి మాత్రం ఆ ఉత్సవం ఎ.ఐ.ఎ.డి.యం.కే. పార్టీ పవరులోకి వచ్చినందుకు జరిగిన విజయోత్సవం.

కానీ నిజానికి అది జయలలితని తమిళనాడుకి మహారాజ్ఞిగా అభిషేకిస్తున్నట్లు ప్రజలలో ఒక భావన కలిగించడానికి జరిగిన ప్రయత్నమే.

అందులో తప్పేముందీ?

రాజకీయాల్లో అలాంటి "షో" తప్పదని అందరికీ తెలుసు.

అందులో జయలలిత తనే స్వయంగా సినిమా హీరోయిన్. ఇంకో సినిమా హీరోకి రాజకీయ వారసురాలు.

పబ్లిసిటీ జిమ్మిక్కు ఆమెకి తెలిసినంతగా ఇంకెవరికి తెలుస్తాయి?

ఆ "పట్టాభిషేకం" కోసం జయలలిత భక్తుడు ఒకడు 113 కిలోల బరువు వున్న వెండి సింహాసనాన్ని కేవలం పదమూడు లక్షల రూపాయల ఖర్చుతో చేయించుకు వచ్చాడు. ఆ వెండి సింహాసనానికి ఎరుపు రంగు ముఖమల్ దిండ్లు అమర్చి వున్నాయి. వెండి ముఖమల్‌తో తయారుచేసిన మాచింగ్ పాదపీఠం కూడా ఉంది.

దానికి తోడు ఒక కిరీటం కూడా చేయించారు. బంగారు తాపడం చేసిన ఆ కిరీటంలో వజ్రవైఢూర్యాలు పొదిగారు. వంటిమీద "జయలలిత పచ్చబొట్లు" పొడిపించుకున్న వీర భక్తులూ, స్తోత్రపాఠాలు జపిస్తున్న మంత్రి పుంగవులూ క్యూలో నిలబడి ఆమెకి పాదాభివందనాలు చేశారు.

ఈ సందట్లో 150 అడుగుల ఎత్తున్న జయలలిత కట్ అవుట్ ఒకటి విరిగిపడి అనేకమందికి తీవ్రమైన గాయాలు తగిలాయి. అలాగే తమిళనాడులో యింకా చాలా చోట్ల కూడా "విప్లవ నాయిక" కట్ అవుట్లు విరిగిపడడమూ, జనం నడ్డి విరగడమూ జరిగింది.

ఇవాళ జయలలిత పేరు చెబితే అదిరిపడి, టాయిలెట్‌కి పరిగెత్తే స్థితిలో వున్నారు తక్కిన నాయకులు.

అలాంటి మిలిటరీ డిసిప్లిన్ మెయిన్‌టెయిన్ చేస్తోంది ఆమె.

జయలలితకి పార్లమెంటులో పట్టుమని పదిమంది మెంబర్లు కూడా లేరు. వాళ్ళని అడ్డం పెట్టుకుని సెంట్రల్ గవర్నమెంటుని ఒక ఆట ఆడించేస్తోంది. లెఖ్ఖ లేనన్ని ప్రాజెక్టులు జబర్దస్తీగా తన రాష్ట్రానికి శాంక్షన్ చేయించుకుంటోంది. ఆంధ్ర ప్రదేశ్‌లో సింగరేణీకాలరీస్‌ని కోల్ ఇండియాలో కలిపేసి దాన్ని కూడా తన రాష్ట్ర ప్రయోజనాలకే పరిమితం చెయ్యాలని చూస్తోంది. కావేరీ జలాలను గురించి కర్ణాటక రాష్ట్రంతో తమిళనాడుకి తరతరాలుగా ఉన్న తగాదాని గెలిచి, బంగారప్ప నీరుకారిపోయేటట్లు చేసింది.

ఆడదంటే జయలలిత!

నాయకురాలంటే జయలలిత!

మినిస్టర్ విజయకుమారికి జయలలిత సినిమా రోజులనుంచే అభిమాని!

ఇప్పుడు తనకి జయలలిత రాజకీయంగా కూడా ఆదర్శం!

ఆ లెవెలుకి ఎదగాలి తను.

త్వరగా...త్వరత్వరగా....

కానీ జయలలిత చెయ్యని తప్పూ, తను చేసిన తప్పూ ఒకటి ఉంది.

అదే.... పెళ్ళి.... పెళ్ళి చేసుకోవడమే తను చేసిన మేజర్ మిస్టేక్.

పెళ్ళీ, మొగుడూ, కొడుకూ....

అబ్బ! తన రాజకీయ జీవితానికి అడ్డంకులు.

రాజకీయాలన్న తర్వాత నలుగురితో కలిసి ఉండాలి. నానారకాలైన పనులు చెయ్యాలి. నానా గడ్డీ కరవాలి.

ఇవన్నీ చెయ్యకుండా సీతమ్మ తల్లిలా ఉండాలంటే ఈ ఫీల్డులో కుదుర్తుందా? ఇవి రాజకీయాలా? మజాకానా?

వేదికమీది కుర్చీలో అసహనంగా కదిలింది విజయకుమారి. మైకు దగ్గర ఎవడో కర్ణకఠోరంగా వాగుతున్నాడు. రొటీన్ వాగుడే! తను వినకపోయినా ఫర్వాలేదు. వినాల్సింది ఎప్పుడంటే....వాగేవాడు ఏదన్నా మెలిక పెట్టి తనని ఇరికించడానికి చూసినప్పుడు మాత్రమే.

ఇక్కడ అలాంటి డేంజర్ లేదు.

ఇక్కడందరూ తన మనుషులే.

తనముందు తోకాడించే సాహసం వీళ్ళలో ఎవడికీ లేదు. అట్లా కంట్రోల్లో పెట్టింది తను.

జయలలితలాగా తనకీ ఫుల్ పవర్స్ ఉంటేనా, ఒక్క సంవత్సరం తిరిగేలోగా

ఎర్రకోటలోనే పాగా వేసేస్తుంది.

ఢిల్లీకే రాణి అయిపోతుంది!

కానీ – వెధవది.... తనకి పక్కలో బల్లెంలాంటి మొగుడూ, కంటిలో నలుసు లాంటి కొడుకూ....

కుర్చీలో అసహనంగా కదిలింది విజయకుమారి.

దానికి తోడు....

చెవిలోని జోరీగలా ఇక్కడ వీడి వాగుడు.

ఏమిటి?

బాలల వికాసం.... వాళ్ళ అవసరాలు....ప్రభుత్వ పథకాలు.... నా బొందా.... నా బోలె! పన్లేదు వెధవలకి.

వేదిక మీద మాట్లాడాల్సిన వాళ్ళు ఇంకా అనేకమంది ఉన్నారు.

కింద ఉన్న జనంలో బాలలు తక్కువ. యువజన కార్యక్రమాలకు తెచ్చే రౌడీ మూకలనే ఈ బాలల కార్యక్రమాలకి కూడా తెచ్చేసినట్లున్నాడు సంజీవ్.

బాలల్లాగా లేరు వెధవలు....బడితెల్లాగా ఉన్నారు.

ఆ ఉన్న వాళ్ళ పిల్లల్లో....అదిగో....ఆ మూల....వెనగ్గా కూర్చుని ఉన్నాడే.... చిన్న పీటలాంటి బండి....నాలుగు చిన్న చిన్న ఇనప చక్రాలూ, ఆ చిన్న బండికే ఒక స్టీరింగూ....ఎవడు దయతలిచి పెట్టాడో మరి....బండికి ముందువైపు చిన్న రేకు ముక్క....దానికి నల్ల పెయింటు....దానిమీద తెల్ల పెయింటుతో వున్న "రాజా.... నెంబర్‌వన్" అనే అక్షరాలు....నోట్లో ఒక ప్లాస్టిక్ విజిలూ....

నవ్వొచ్చింది మినిస్టర్ విజయకుమారికి.

ఈ వెధవ ఆ పీటలాంటి బండినే మారుతీ కారు అని ఊహించుకుంటూ రోడ్ల మీద రయ్యిన తోసుకుంటూ, విజిలేస్తూ వెళతాడేమో!

ఆమెకి చటుక్కున ఒక ఆలోచన వచ్చింది.

ఇంత చిత్రంగా వున్న ఈ పిల్ల వెధవకి తనో పది రూపాయలు చేతిలో పెట్టి, ఒక స్నాపు లాగించేసి పేపర్లలో వేయించుకుంటే....?

అదిరిపోతుంది పబ్లిసిటీ.

మంత్రిగారి దాతృత్వం అదీ ఇదీ అని పేపర్లలో పడుతుంది.

వెంటనే తన పి.ఏ.ని పిలిచింది మినిస్టర్ విజయకుమారి.

ఆ పోరగాణ్ని పోకుండా ఆపి ఉంచమంది.

వినయంగా తల పంకించి పరుగులాంటి నడకతో వెళ్ళిపోయాడు పి.ఏ.

మళ్ళీ ఆలోచనలు గిర్రున తిరగడం మొదలయ్యాయి.

తన మొగుడికి తనంటే పడదు. డైవోర్సు కోసం అప్లయ్ చేస్తానంటాడు. మొన్నటికి మొన్న వీధిలో నిలబడి పెద్ద గొడవ....అప్పుడే ఆ గొడవంతా పేపర్లలో వచ్చేసింది....ఉన్నదానికి ఇంకాస్త మిర్చీమసాలా జోడించి....

తన పర్సనల్ లైఫ్ ఎట్లా అన్నా తగలడనీ....ప్రజల్లో మాత్రం మంచి ఇమేజి ఉండాలి...లేకపోతే ముందు ముందు తన అనుకున్నవన్నీ సాధించలేదు. తాళి అంటే మన ఆడోళ్ళకి పిచ్చి సెంటిమెంటు. తాళి కట్టిన వాడు విడాకులిచ్చాడంటే ఆడవాళ్ళ ఓట్లు తనకి పడవేమో అని భయం.

కానీ ఈ మొగుడు ఊరుకునేటట్లు లేదు.

విడాకుల దాకా పోయేలోగానే "యాక్సిడెంట్" చేయించి మొగుణ్ని చంపి పారేయిస్తే....

దెబ్బతో పీడా వదిలిపోతుంది.

కానీ మహా జాగ్రత్తగా వుండాలి తను.

మర్డర్ కేసులో ఇరుక్కుంటే మాత్రం మట్టిలో కలిసిపోతుంది తన రాజకీయ జీవితం.

మైకు ముందు వ్యక్తి మారాడు. ఓహో వీడా? వీడికి మైకుని చూస్తే మైకం

వచ్చేస్తుంది. వటవట వాగేస్తున్నాడు. మధ్య మధ్యలో పాటలు కూడా పాడేస్తున్నాడు.

సినిమా పాట!

"పిల్లలూ....దేవుడూ....చల్లనివారే....
కల్లకపట మెరుగనీ....
కరుణా మయులే!"

నీ పిండాకూడు! తొరగా ముగించరా! ఇంటికెళ్ళి పెగ్గేసుకు పడుకోవాలి. ఏ.సి. అలవాటయిపొయ్యాక ఈ మండుటెండలు భరించడం మహాకష్టంగా వుంది.

మళ్ళీ బుర్రలో ఆలోచన్లు....భయాలు....

తన ఢిల్లీ ట్రిప్పుకి ఫలితం ఉంటుందా? ఈ చెత్త శాఖలో నుంచి తనని మార్చి కల్పవృక్షం లాంటి మరేదయినా మంచి శాఖలో ఇస్తారా లేదా? హెూం మినిస్ట్రీనో, రోడ్స్ అండ్ బిల్డింగ్స్ శాఖనో, పవరూ, రాబడీ ఉండే శాఖ ఏదయినా సరే....

ఇన్నాళ్ళ నుంచి మినిస్టర్ బలరామిరెడ్డి తనకు మెయిన్ సపోర్ట్! ఈ మధ్య అతను కూడా ఎడమొహం పెడమొహంగా వుంటున్నాడు.

ఎందుకనీ?

తన మీద మోజు తీరిపోయిందేమో!

క్యాబినెట్లో కొత్తగా ఒక పాతికేళ్ళ పడుచుని తీసుకుంటున్నారు. అదెంత అర్భాటం చేస్తుందో! తన పొజిసన్ ఏమవుతుందో? జయలలితలా పట్టాభిషేకం చేయించుకునే యోగం తన జాతకానికి ఉందో లేదో! డైవోర్సు గొడవ ఏమవుతుందో? కొడుకు చేతిలో పడ్డ తన బ్లూ ఫిల్మ్ కేసెట్ చివరికి ఎవరి దగ్గరికి చేరుతుందో?

త్వరగా ఇంటికెళ్ళి కనీసం ఫుల్‌బాటిల్ ఖాళీ చేస్తేగానీ ఈ భయాలకు కాసేపు గ్యాప్ రాదు.

ఈలోగా సభ అధ్యక్షుడు ప్రకటించాడు.

"ఇంతసేపూ మనం ఎంతో ఆతృతగా ఎదురు చూసిన మంత్రిగారి ప్రసంగం ఇప్పుడు మొదలవుతుంది. బాలల సంక్షేమం కోసం ఆమె ధారాళంగా పథకాలు

శాంక్షను చేస్తారని ఆశిస్తున్నాను."

లేచి నిలబడింది విజయకుమారి.

మంచి ఒడ్డూ, పొడుగూ ఉన్న విగ్రహం ఆమెది. పుష్టిగా ఉన్న ఒంపులు, మత్తుగా ఉండే కళ్ళూ.

ప్రజల కోసం పాటుబడే మనిషిలా అసలు అనిపించనే అనిపించదు ఆమెని చూస్తే.

ఈ రోజుల్లో అనేకమంది నాయకులు అంతే! అప్పుడే జైల్లో నుంచి విడుదల అయి వచ్చిన మొహాల్లా వుంటారు. లేదా, పోలీస్‌స్టేషన్‌లో వుండే రౌడీషీటర్ల ఫోటోల్లా వుంటారు.

కానీ విజయకుమారి మాత్రం కేబరే డాన్సర్‌లా వుంటుంది.

సభకి నమస్కరించి ప్రసంగం మొదలెట్టింది.

"ప్రసంగం చేస్తాను కానీ అధిక ప్రసంగం చెయ్యను"

(సభలో నవ్వులు)

"నా ఆదర్శం ఒకప్పటి తమిళనాడు నాయకుడైన కామరాజనాడార్. ఎంత సింపుల్‌గా బతికే వాడాయన! ఆయన చచ్చిపోతే శవాన్ని తీసుకెళ్ళిపోయాక, ఇంటికి తాళం వెయ్యాల్సిన అవసరం కూడా లేకపోయింది. ఏం సంపాదించుకున్నాడని! ఏం దాచాడని తాళాలు వెయ్యాలి! ఇంట్లో కొన్ని పుస్తకాలు, రెండు లుంగీలూ, రెండు చొక్కాలూ తప్ప ఇంకేమీ లేవు! అలా వుండాలి మనం. ఆయనలా నిరాడంబరంగా అందరూ ఉండగలిగిననాడే మన దేశానికి నిజమైన స్వాతంత్ర్యం! దేశం క్లిష్ట పరిస్థితిలో వుంది. మీరందరూ నడుములు బిగించి, త్యాగాలు చేసి దేశమాతకు సేవచేయాలని అభ్యర్థిస్తున్నాను.

కామరాజనాడార్‌గారు తొందరపడి ఏమీ అనేవారు కాదు. అందరు చెప్పిందీ సావధానంగా విని "పార్కలాం!" అనేవారు. అంటే "చూద్దాం" అని అర్థం! తర్వాత వీలయినప్పుడు తగిన విధంగా సమస్యలని పరిష్కరించేవారు.

నేనూ అదే చెబుతున్నాను. మీ సమస్యలన్నీ విన్నాను. నేటి బాలలే రేపటి పౌరులని నాకు తెలుసు! చూద్దాం! ఏది సాధ్యమయితే అది చేద్దాం" అని సభకు నమస్కరించి, వేదిక దిగడం మొదలెట్టింది.

వెంటనే ఆమె చుట్టూ రక్షణ వలయంలో పోలీసులు చుట్టు ముట్టేశారు. 'నా ప్రజలు, నా ప్రజలు' అని నిమిషానికి నాలుగు సార్లు అంటుంది గానీ, మినిస్టర్ విజయకుమారికి ప్రజలంటే ప్రాణ భయం. పక్కన పోలీసులు లేకుండా ప్రజల మధ్యకి వచ్చే సాహసం ఏనాడూ చెయ్యదు ఆమె.

పోలీసులు అందరినీ అదిలించి, దారి చేస్తుండగా అందరికీ నమస్కరిస్తూ వెళ్ళి కారు దగ్గర నిలబడింది మినిస్టర్.

ఆ కారు హిందుస్తాన్ కౌంటెస్సా. అంతకు ముందు అంబాసిడర్ కారు వుండేది ఆమెకి. రచ్చచేసి, దాన్ని వదిలించుకుని, ఈ పెద్ద కౌంటెస్సాని వారం రోజుల క్రితమే శాంక్షన్ చేయించుకుంది మినిస్టర్ విజయకుమారి.

కారు ఎక్కబోతూ అప్పుడే ఆ రాజా అనే పిల్లాడినీ, పీటలాంటి వాడి బండినీ చూసినట్లు గొప్ప ఎక్స్‌ప్రెషన్ ఇచ్చి, హఠాత్తుగా ఆగిపోయింది.

మొహంలో భరించలేని బాధని ప్రదర్శిస్తూ, "పాపం! ఈ పిల్లాడికి అంగవైకల్యం వుందా?" అంది.

"రెండు కాళ్ళూ చచ్చుబడిపోయినాయమ్మా!" అన్నాడు రాజా అనే ఆ పిల్లాడు.

వెంటనే హాండ్‌బాగ్‌లో నుంచి పది రూపాయల నోటు తీసింది మినిస్టర్ విజయకుమారి. బొటనవేలూ, మధ్య వేలుతో ఆ నోటుని తడిమి, అది ఒక నోటేననీ, పొరబాటున తను రెండు నోట్లు ఇచ్చెయ్యడం లేదనీ తేల్చుకుని, నోటు పిల్లాడి చేతిలో పెట్టింది.

వెంటనే ఒక పది కెమెరాలు క్లిక్ మన్నాయి. ఆమె దాతృత్వాన్ని వీడియో టేపు మీదికి ఎక్కించాడు ఒక వీడియో గ్రాఫర్.

పబ్లిసిటీ ఏర్పాట్లు బాగానే జరిగాయని నమ్మకం కుదిరాక కారెక్కింది మినిస్టర్ విజయకుమారి.

మరుక్షణం కారు కదిలింది.

ఆ కారు వెనక ఇంకో డజను కార్లు పొదుపు ఉద్యమాన్ని పరిహాసిస్తూ పరిగెత్తాయి.

మీటింగుకి తేబడిన కిరాయి మూకలు లారీల్లోకి ఎక్కారు. లారీలు వెళ్ళి పోయాయి.

అంతా చల్లబడ్డాక –

అప్పుడు –

"వికలాంగుడు" రాజా, పీటలాంటి బండి మీద నుంచి ఛెంగున కిందికి దిగి, నిటారుగా నిలబడి బండిని ఎడం కాలితో అవతలికి నెట్టేశాడు.

అతని మొహంలో విజయగర్వంతో కూడిన నవ్వు కనబడుతోంది.

రాజా చేతిలో మినిస్టర్ విజయకుమారి తాలూకు హాండ్‌బాగ్ ఉంది. రెప్పపాటులో దాన్ని కట్ చేసేసి బండికింద దాచేశాడు అతను. మినిస్టర్ విజయకుమారి భుజం మీద హాండ్ బాగ్ తాలూకు బెల్టు మాత్రం మిగిలింది. బ్యాగ్ లేదన్న సంగతి ఆమె గమనించలేదు.

హాండ్‌బ్యాగ్ తెరిచి చూశాడు రాజా.

ఆ 'ప్రజా సేవకురాలి' హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న వస్తువులు అతనికి ఆశ్చర్యం కలిగించలేదు. కానీ నవ్వు తెప్పించాయి.

ముందుగా అతని దృష్టిని ఆకర్షించింది ఒక చిన్న పాకెట్టు. దాని మీద అర్ధనగ్నంగా ఉన్న ఒక అమ్మాయి బొమ్మ వుంది.

"ఫారిన్ నిరోధ్!" అనుకున్నాడు రాజా.

నిరోధ్ అని వినడమే గానీ, అదెట్లా ఉంటుందో అసలు అతనెప్పుడూ చూడలేదు.

కొనేంత వయసు లేదతనికి.

అతనికింకా పన్నెండేళ్ళే.

దాన్లో ఉందేమిటో తర్వాత వివరంగా చూడవచ్చునుకుని దాన్ని చటుక్కున

ఫ్యాంట్ జేబులో పెట్టేసుకున్నాడు రాజా.

మినిస్టర్ విజయకుమారి హాండ్‌బ్యాగ్‌లో నిరోధ్ ప్యాకెట్ కాక, విస్కీ క్వార్టర్ బాటిలు ఒకటి వుంది. చీట్లపేక ప్యాక్ వుంది. ఒక చిన్న రివాల్వర్ వుంది. ఎవరి సంతకాలో వున్న బ్లాంక్ స్టాంప్ పేపర్స్ వున్నాయి.

వాటితో బాటు ఒక సరికొత్త వందరూపాయల కట్ట కూడా ఉంది.

అప్పటిదాకా మీటింగు జరిగిన ఆ ప్రదేశంలోనే కటిక బీదవాళ్ళు వుండే ఒక బస్తీ వుంది. చిన్న గుడి ఒకటి కూడా వుంది అక్కడే.

మీటింగు అయిపోయిందని తెలియగానే, ఆ బస్తీలో ఉన్న బీదలందరూ త్వరత్వరగా వచ్చి ఆశగా రాజా చుట్టూ మూగారు.

వాళ్ళకు తెలుసు.

రాజా ఒక జూనియర్ రాబిన్‌హుడ్ లాంటివాడు.

అతనివల్ల అక్కడున్న ప్రతివాడూ, ప్రతినాడూ ఏదోరకం సహాయం పొందవలసిందే.

ఏ రోజు కారోజు రాజా ఏదో ఒక ఊహాతీతమయిన అడ్వంచరు చెయ్యడమూ, ఆ తర్వాత దానిని గురించి రోజుల తరబడి అందరూ వైనవైనాలుగా చెప్పుకోవడమూ చాలా మామూలే.

రాజా చేతిలో కనబడుతూ వున్న వందరూపాయల నోట్లకట్ట అందరికీ ఆశ కలిగించింది.

నవ్వుతూ కట్టలోనుంచి ఒక్క వందరూపాయల నోటు మాత్రం తీసి తన హిప్ ప్యాకెట్‌లో పెట్టుకున్నాడు రాజా.

ఇంకో నోటు తీసి, అక్కడే దేవుడి గుడి ముందు ఉన్న హుండీలో వేశాడు.

ఆ తర్వాత అక్కడున్న జనాలందరికీ ఒక్కొక్కరికీ ఒక్కొక్క నోటు చొప్పున త్వర త్వరగా పంచడం మొదలెట్టాడు.

ఉత్సాహంతో కూడిన మాటలూ, అరుపులూ, కేకలతో తిరనాళ్ళలాగా

అయిపోయింది అక్కడి వాతావరణం.

దేవానందం అనే ఒకతను, తన వంతుకి వచ్చిన నోటు అందుకుని అన్నాడు–

"అరే అల్లుడూ! ఆ విస్కీసీసా నీకెందుకురా! నాకిచ్చెయ్."

నవ్వుతూ విస్కీ సీసా దేవానందానికి అందించాడు రాజా.

పావుగంటలో నోట్లు పంచడం పూర్తయ్యింది దాదాపుగా.

ఇంక ఒకే ఒక్క నోటు మిగిలింది రాజా చేతిలో.

అక్కడే గోడకి ఆనుకుని కూర్చుని ఉన్నాడు ఒక ముసలి బిచ్చగాడు. లేచి వచ్చే ఓపిక కూడా లేనట్లుంది అతనికి.

అక్కడ నుంచే వణుకుతున్న చెయ్యి ముందుకు జాచాడు.

నెమ్మదిగా అతని దగ్గరికెళ్ళాడు రాజా.

"నోటు తీసుకోలేదా నువ్వు?" అన్నాడు మృదువుగా.

సమాధానంగా దగ్గాడు ముసలి బిచ్చగాడు. నోట్లో నుంచి మాట మాత్రం రాలేదు.

అతడికి ఆ వందరూపాయల నోటు అందించాడు రాజా.

వెంటనే....

రాజా చేతిని మొసలి పట్టుకున్నట్లు పట్టేసుకున్నాడు ఆ ముసలాడు. ధృఢంగా వుంది అతని చెయ్యి.

రెండో చేత్తో కప్పుకున్న చినుగుల దుప్పటిని లాగి అవతల పడేశాడు అతను.

అక్కడున్న అందరూ ఒక్కసారిగా శ్వాస లోపలికి తీసుకున్నారు.

అతను ముసలి బిచ్చగాడు కాదు.

మంచి దేహధారుఢ్యం వున్న పోలీసు ఆఫీసరు.

ఫుల్ యూనిఫారంలో వున్నాడు.

కరుగ్గా అన్నాడు ఆ పోలీసు ఆఫీసర్.

"రేయ్! నీ సంగతి నాకు తెలుసురా! నువ్వు కేడీలకి కేడీవి! పట్టుమని పదేళ్ళు లేవుగానీ, ఊళ్ళో ఉన్న యాంటీ సోషల్ ఎలిమెంట్స్‌లో నువ్వొకడివి! నీలాంటి వాళ్ళని పట్టుకోవడం కోసమేరా, ఇన్ని రకాల వేషాలు వేసేది నేనూ!"

క్షణంలో మారిపోయిన పరిస్థితి చూసి ఏమాత్రం చలించలేదు రాజా. స్థిరంగా నిలబడి అన్నాడు –

"మీరు పోలీసు ఆఫీసరని నాకు ముందే తెలుసు."

ఆశ్చర్యంగా రాజావైపు చూశాడా పోలీసు ఆఫీసర్.

"నేను పోలీసు ఆఫీసర్‌ని అని ముందే తెలుసా? ఎలాగ?"

అపహాస్యంగా అన్నాడు రాజా.

"మీరు ఎంత చిరుగుల దుప్పటి కప్పుకుని వణుకుతూ కూర్చున్నా మీ ఎక్సర్‌సైజు బాడీ తెల్సిపోవడం లేదా? మీరు కృష్ణాజీ! "టైగర్ కృష్ణాజీ" అని పిలుస్తారు మిమ్మల్ని అందరూ!"

రాజా వైపు అంచనా వేస్తున్నట్లు చూశాడు కృష్ణాజీ.

"మరి నేను పోలీసు ఆఫీసర్‌ని అని తెలిశాక కూడా పారిపోకుండా ఇక్కడే వుండిపోయావా?"

"దానికో చిన్న కారణం వుంది."

"ఏమిటది?"

"ఒక పోలీసు ఆఫీసర్ చెయ్యి దేహీ అంటూ కింద కావడం, ఒక పిక్‌పాకెట్‌గాడి చెయ్యి దాత లెవెల్లో పైన వుండడం ఎప్పుడో గానీ జరగదు. చిన్నప్పుడే నాకీ అవకాశం వచ్చేసింది. నేను ఈ అవకాశాన్ని వదులుకోదల్చుకోలేదు."

చటుక్కున తలెత్తి సూటిగా రాజా మొహంలోకి చూశాడు కృష్ణాజీ.

అప్పుడు మొదటిసారిగా అతను గమనించాడు....

రాజా మొహంలో కనబడుతున్న బ్రహ్మవర్చస్సుని!

ఏ తల్లి కన్న బిడ్డడు ఇతడు?

ఇంత అందం, ఇంత ధైర్యం, ఇంత తెగింపు, ఇంత సంస్కారం, ఇంత మంచితనం ఒక్కడిలోనే ఎలా చోటుచేసుకున్నాయి?

ఈ కొద్దిసేపటిలోనే -

తను రాజాలో ఉన్న ఎక్స్‌ట్రార్డినరీ క్వాలిటీస్ అన్నిటినీ గమనించాడు.

ఇతనికి ఉన్నంత హస్తలాఘవం మెజీషియన్స్‌కి కూడా ఉండదు నిజంగానే!

అంతమంది పోలీసుల మధ్య ఉన్న మినిస్టర్ విజయకుమారి హాండ్ బ్యాగ్‌ని ఎంత లాఘవంగా కొట్టేశాడు.

పోనీ ఆ కొట్టేసిన డబ్బుని తను సొంతానికి ఉంచుకున్నాడా అంటే అదీ లేదు.

ఒక్క నోటు మాత్రం తను వుంచుకుని, మిగతా డబ్బంతా ఇక్కడిక్కడే అందరికీ పంచిపెట్టేశాడు.

చిరుగుల దుప్పటి కప్పుకు కూర్చున్న తనెవరో కనిపెట్టేశాడు.

తను పోలీసు ఆఫీసర్‌ని అని కనిపెట్టినా కూడా పారిపోలేదు.

తనకి దానమిచ్చే ముచ్చట తీర్చుకోవడం కోసం ఇక్కడే ఉండిపోయాడు కూడా!

కారణజన్ముడంటే, ఇలాంటివాడు కాక, మరెవరవుతారు? లేచి, ఖడక్‌గా నిలబడ్డాడు కృష్ణాజీ. లేస్తూనే, రాజా జేబులో ఉన్న రివాల్వర్ తీసేసుకున్నాడు.

తీక్షణంగా ఒకసారి రాజావేపు చూసి, "కమాన్! నాతోరా!" అన్నాడు.

రాజా పోలీసులకి పట్టుబడడం అదే మొదటిసారి.

పోలీసుల చేతిలో పడితే ఏమవుతుందో అక్కడున్న చాలామందికి ప్రత్యక్షంగా అనుభవమే.

అక్కడున్న వాళ్ళలో ఆడవాళ్ళు శోకాలు పెట్టడం మొదలెట్టారు.

పొడుగ్గా, దిట్టంగా వున్న ఒక నల్లటి మనిషి వచ్చి దభేలుమని కృష్ణాజీ కాళ్ళమీద పడిపోయాడు.

"సార్! వాడు చిన్న పోరగాడు. వాణ్ణేం చెయ్యకండి. నన్ను తీసుకెళ్ళండి సార్! నేను నేరం ఒప్పేసుకుంటా!"

ఎవరో గుండెని గుప్పెట్లో పట్టుకు నొక్కేసినట్లయ్యింది కృష్ణాజీకి.

ఎవరో నేరం చేస్తే, ఇంకెవరో వచ్చి లొంగిపోవడం ఇది పోలీసు స్టేషన్లలో మామూలే.

డబ్బుకోసమో, మరెందుకోసమో....ఇలాంటి కేసులు చాలా తరచుగానే జరుగుతుంటాయి.

అయినా, ఎప్పటికప్పుడు విషాదంగానే అనిపిస్తుంది తనకి. పోలీసు డిపార్ట్‌మెంటులో చేరినా తన గుండె రాయిగా మారలేదు ఇంతవరకూ.

నిట్టూర్చి అన్నాడు కృష్ణాజీ.

"పద!"

"ఒక్కసారి మా ఇంటికి వెళ్ళి రావాలి" అన్నాడు రాజా.

"ఏం పని?"

"కొన్ని వస్తువులు తెచ్చుకోవాలి."

"సరే! తొందరగా రా!"

అక్కడే వున్న తన గుడిసెలోకి గబగబా వెళ్ళాడు రాజా.

అతని వెనకే వెళ్ళి, గుడిసెలోకి తొంగి చూశాడు కృష్ణాజీ.

పేరుకి గుడిసే అయినా, లోపల నాపరాళ్ళతో కచ్చా ఫ్లోరింగ్‌చేసి వుంది. మట్టి గోడలకి శుభ్రంగా సున్నం వేసి వుంది.

ఒక వైపున చిన్న బల్ల. దానిమీద ఆరంగుళాల ఎత్తే వున్న మినీసైజు టీ.వీ. చిన్న ట్రాన్సిస్టర్ రేడియో వున్నాయి.

గోడకి వంకె తగిలించి వుంది. దానికి రెండు హాంగర్లు. వాటికి జీన్సూ షర్టులూ తగిలించి వున్నాయి.

"దిస్ లిటిల్ ఫెలో ఈజ్ లివింగ్ కంఫర్టబుల్లీ" అనుకున్నాడు కృష్ణాజీ చిత్రంగా చూస్తూ.

గోడల నిండా అతికించి ఉన్న పోస్టర్లు కనబడ్డాయి కృష్ణాజీకి.

అమితాబ్‌బచ్చన్ పోస్టరు ఒకటి వుంది. సూపర్‌మాన్ పోస్టరు, రాబిన్‌హుడ్, రెజ్లర్ ధారాసింగ్, కండలు తిరిగి కనబడుతున్న మిస్టర్ యూనివర్స్ పోస్టర్లూ కనబడుతున్నాయి.

వాటితో బాటుగా పుష్టిగా ఉన్న వక్షంతో ఉన్న ఒక ఫారిన్ అందగత్తె తాలూకు బస్ట్‌సైజు పోస్టరు కూడా ప్రామినెంట్‌గా కనబడుతోంది.

ఆ బస్ట్‌కి ఎవరో రంగు పెన్సిళ్ళతో 'ఉండాల్సిన చోట' మరింత మెరుగులు దిద్దినట్లుగా కూడా కనబడుతోంది.

"లిటిల్ రాస్కెల్!" అని నవ్వుకున్నాడు కృష్ణాజీ.

ఇంకొక మూలగా కనబడుతున్నాయి ఎక్సర్‌సైజు చేసే పరికరాలు....డంబ్ బెల్స్, బుల్ వర్కర్ అవీ....ఇవీ!

ఆ మూలనే అతికించి ఉంది ఆంజనేయస్వామి బొమ్మ ఒకటి. దాని కిందగా గోడకి ఉన్న కన్నాలలో కాలిపోయిన అగరొత్తులు కనబడుతున్నాయి.

అయిదు నిమిషాల తర్వాత తిరిగి వచ్చాడు రాజా.

"నేను రెడీ!"

కృష్ణాజీ చేతులు ముందుకుజాచి, రాజా ఒంటిని తడిమి చూశాడు.

ఏదో గట్టిగా తగిలింది.

తీసి చూశాడు.

నవ్వాడు రాజా.

"వెపన్స్ ఏమన్నా పెట్టుకుని ఉంటాననా? అలాంటిదేమీ లేదు!"

ఒకసారి రాజావేపు నిశితంగా చూశాడు కృష్ణాజీ.

తర్వాత హఠాత్తుగా ఏదో స్ఫురించినట్లు అన్నాడు.

"నీ బెల్టు తియ్!"

"ఎందుకు?"

"చెబుతా!"

"ఛీప్ లెదర్ బెల్టు! మీకేం పనికి వస్తుంది?"

"మాటలు వద్దు. బెల్టు తియ్?"

తప్పదన్నట్లు బెల్టు తీశాడు రాజా. అయినా చివరి ప్రయత్నంగా ఒక్కమాట అని చూశాడు.

"మీకంతా ఉత్త అనుమానం!" అన్నాడు హేళనగా నవ్వుతూ.

అదేం పట్టించుకోకుండా బెల్టుని పరిశీలనగా చూశాడు కృష్ణాజీ. తర్వాత బకిల్ దగ్గర పట్టుకుని ఒడుపుగా లాగాడు.

తోలుతో చేసిన ఒరలో నుంచి బయటికి వచ్చినట్లు వచ్చింది పల్చగా బెల్టు షేపులోనే ఉన్న కత్తి.

చాలా షార్ప్‌గా ఉంది అది.

బెల్టుని చుట్టేసి, తన మోటార్ సైకిల్‌కి ఉన్న సైడ్‌బాక్సులో పడేశాడు కృష్ణాజీ.

గట్టిగా అన్నాడు రాజా –

"ఆ బెల్టు నన్ను నేను రక్షించుకోవడానికి."

"ఇప్పుడు నీకు వచ్చే డేంజరేమీ లేదు" అన్నాడు కృష్ణాజీ.

"పోలీసు లాకప్ డెత్స్ గురించి నాకు బాగా తెలుసు."

కళ్ళు చిట్లించి రాజావేపు చూశాడు కృష్ణాజీ.

"నీకు అంత భయంగా ఉంటే నీకు ఒక లాయర్‌ని అరేంజ్ చేస్తారులే!"

"నాకెందుకు లాయరు? నాకు క్రిమినల్ లా అంతా కంఠతా వచ్చు."

నవ్వాపుకున్నాడు కృష్ణాజీ.

అమ్మో! అదరగండంలాగా ఉన్నాడు వీడు.

"ఎన్నిసార్లు రిమాండులో ఉన్నావ్?"

"నన్ను రిమాండ్‌లో పెట్టడం ఎవరివల్లా కాదు సార్."

నదురూ బెదురూ లేకుండా మాట్లాడుతున్న పన్నెండేళ్ళ కుర్రాడు రాజాని చూస్తుంటే కృష్ణాజీకి మెచ్చుకోవాలో, కోపం తెచ్చుకోవాలో అర్థం కాలేదు.

ఎంత సెల్ఫ్ కాన్ఫిడెన్స్ ఈ పిల్లాడికి.

ఈ సెల్ఫ్ కాన్ఫిడెన్స్ ఇంకొక్క డిగ్రీ పెరిగితే, దాన్నే 'పొగరు' అంటారేమో.

ఇందాక మీటింగు జరిగిన షామియానా దగ్గర స్టాండు వేసి ఉంది కృష్ణాజీ మోటారు సైకిలు.

"రాయల్ ఎన్‌ఫీల్డు బుల్లెట్ అంటే ఏ వన్ మోటార్ సైకిల్ సర్! మోటారు సైకిలు పాతదయినా తళతళలాడేటట్లు మెయిన్‌టెయిన్ చేస్తున్నారే!" అన్నాడు రాజా.

"కూర్చో!" అన్నాడు రాజాతో.

రాజా కూర్చున్న తర్వాత అప్పుడే స్ఫురించినట్లు బేడీలు తీశాడు కృష్ణాజీ. రాజా కుడిచేతికీ, మోటారు సైకిలు పక్కన ఉన్న హుక్‌కీ కలిపి సంకెళ్ళు వేశాడు.

"లాక్ సరిగా పడిందా సర్?" అన్నాడు రాజా వ్యంగ్యంగా.

కృష్ణాజీ మాట్లాడకుండా గేర్ మార్చాడు.

మోటార్ సైకిలు ముందుకు పరిగెత్తింది.

రాజా నాన్‌స్టాపుగా మోటార్ సైకిళ్ళ గురించి ఏదేదో చెబుతూనే ఉన్నాడు తను నెక్స్ట్ ఇయర్ బ్రహ్మాండమైన "బండి" ఒకటి కొంటానన్నాడు. 350 సిసి కి తక్కువ పవర్ వున్న 'బళ్ళు' సెగ్మెంటు ఆడవాళ్ళు నడపాల్సినవి తప్ప మొగాళ్ళు

నడపాల్సినవి కావన్నాడు. రాయల్ ఎన్ఫీల్డు బుల్లెట్ మోడలు మంచిదనీ, ఇప్పుడొస్తున్న మోటార్ సైకిళ్ళు ఉత్తుత్తి బొమ్మల్లాంటివనీ అన్నాడు. కృష్ణాజీ ఎన్నాళ్ళకోసారి బుల్లెట్ని సర్వీసింగ్ చేయిస్తాడో వాకబు చేశాడు.

కృష్ణాజీకి కూడా మోటార్ సైకిళ్ళంటే చిన్నప్పటి నుంచి ఫాసినేషన్ ఉంది. అందుకని ఆసక్తిగా వింటున్నాడు రాజా మాటలు.

పైగా అతను అంత శ్రద్ధగా వినడానికి ఇంకో యాంగిలు కూడా ఉంది.

రాజా చేత అలా వాగిస్తుంటే, ఆ వాగుడులోనే అనుకోకుండా అతని పర్సనాలిటీ తాలూకు సెన్సిటివ్ విషయాలు కొన్ని బయటపడిపోవచ్చు.

కృష్ణాజీ ఇంట్రెస్టుగా వింటున్నాడని తెలిసి ఇంకా పుంజుకున్నాడు రాజా.

తను కొనబోయేది ఒక 'డ్రీం మెషిన్‌ట' తన స్పీడుకి బుల్లెట్ కూడా లాభం లేదుట చెప్పాడు.

ఫారిన్ బైక్ ఏదన్నా కొంటాడట తను.

అని, ఫారిన్ మోటార్ సైకిళ్ళ లిస్టు గబగబా చదివేశాడు రాజా. "విన్సెంట్, ఇండియన్, ఓరియెంట్, ఎక్సెల్ సియర్, మిలిటెయిర్, మాచ్‌లెస్, క్రోహర్, ఏరియల్, ఏ జె ఎస్, గిలెరా, పాంథర్, వెలోసెట్, బ్లాక్ షాడో, రాపైడ్.

ఇవి దొరక్కపోతే, ట్రయంఫ్‌గానీ హార్లే డేవిడ్ సన్స్, ఫారిన్ హోండా, సుజూకీ, యమాహా, కావసాకీ, బి.ఎమ్.డబ్ల్యు, బిమోటా, మోటో గుజ్జీ, లెవర్‌డాగానీ కొంటాడుట.

వీటిల్లో చాలా బైక్స్ గంటకు రెండొందల కిలోమీటర్ల స్పీడుతో వెళ్తాయట!

కృష్ణాజీ ఊ కొడుతుంటే, ఇంకా ఉత్సాహంగా డిటెయిల్స్‌లోకి వెళ్ళిపోయాడు రాజా.

"ఇప్పుడు ప్రపంచంలో ఉన్న బైక్స్‌లో టాప్ ఐదే ఉన్నాయ్ సార్! కావసాకీ నింజా జడ్ ఎక్స్ 11 దీన్నే 'కిల్లర్' అని ముద్దుగా పిలుస్తారు. ప్రపంచంలో దీన్ని మించి స్పీడుగాపోయే మోటార్ సైకిలు ఇంకోటి లేదు. గంటకు రెండొందల ఎనభై రెండు కిలోమీటర్ల స్పీడుతో పరిగెడుతుంది ఇది! సార్! ఇది అసలు మోటార్ సైకిలు

కాదు సార్. పాపం ఏదో శాపం వల్ల నేలమీదే పరిగెత్తే విమానం అన్నమాట. లేకపోతే దాని పవర్‌కి అది ఆకాశంలో ఎగరాల్సింది సార్! ఎక్కి కూర్చున్న వాడికి సత్తా లేకపోతే గాల్లోకి ఎగరేస్తుంది.  కాస్ట్ ఏడు వేల ఐదొందల తొంభై అమెరికన్ డాలర్లు సర్! అంటే ఇండియన్ కరెన్సీలో ఒక లక్ష ఎనభై తొమ్మిది వేల తొమ్మిది వందల డెబ్భై అయిదు."

జాగ్రత్తగా వింటున్నాడు కృష్ణాజీ.

మొదటి క్లూ దొరికింది.

వీడికి అమెరికన్ డాలర్ ఎక్ఛేంజి రేటూ, డాలర్ బ్లాక్‌మార్కెట్ రేటూ కూడా తెలుసు.

అంటే వీడి డీలింగ్స్ చాలా పెద్ద బ్రాకెట్‌లోనే ఉన్నాయి.

స్మగ్లింగా?

హవాలా రాకెట్టా?

వీణ్ణి ఇలాగే ఇంకాసేపు వాగనిస్తే ఇంకా విశేషాలు బయట పడవచ్చు.

ఎదుటివాడిని మాట్లాడనివ్వడం, అందులో నుంచే కావలసిన సమాచారాన్ని రాబట్టుకోవడం.  అదీ తన టెక్నిక్.

చెబుతూనే ఉన్నాడు రాజా.

"ఇంక నెంబర్ టూ యమాహా ఎఫ్.జెడ్.ఆర్.-1000 సర్! దీనికి నిక్ నేమ్ ది బ్యూటీ అండ్ ది బీస్ట్! మంచి పవర్‌ఫుల్ జెనిసిస్ ఇంజన్ సర్! ఈ మోడలు ఎన్ని రేసుల్లో గెల్చిందో చెప్పలేం! దీని బ్రేకులెంత పర్‌ఫెక్టు అంటే సార్, వంద కిలోమీటర్ల స్పీడులో వెళ్తున్నా సరే! బ్రేకు వేసీ వెయ్యగానే సడెన్‌గా ఆగిపోతుంది! ఎక్స్‌పీరియన్స్ లేనివాడైతే ఫిరంగి గుండులా ఎగిరిపోతాడు బ్రేక్ వెయ్యగానే! దీని కాస్ట్ ఏడువేలా తొమ్మిది వందల నలభై తొమ్మిది అమెరికన్ డాలర్లు సర్! అంటే ఒక లక్ష తొంభై ఎనిమిది వేల ఏడు వందల ఇరవై అయిదు రూపాయలు.

లిస్టులో నెక్స్‌ట్ సుజూకీ జి.ఎస్.ఎక్స్.-ఆర్ 1100 సర్! ఇది మహా హార్డ్‌గా వుంటుంది. కానీ ఎంత పవరో చెప్పలేం! దీని కాస్ట్ కూడా దాదాపు అదే రేంజ్‌లో వుంటుంది. రాంబో టైపు మొగాళ్ళు రైడ్ చెయ్యాల్సిన బైక్.

ఆ తర్వాత హోండా సి.బి.ఆర్-1000. ఇది నూట నలభై కిలోమీటర్ల స్పీడుతో వెళ్తున్నప్పుడు కూడా నేలమీద పడిపోయిందా అన్నంతగా పక్కకి వంచెయ్యచ్చు. టర్నింగ్స్‌లో భలే గ్రిప్పు వుంటుంది సర్! కాస్ట్ అదే రేంజ్.

ఇకపోతే ప్రపంచంలో అన్నిటికంటే కాస్ట్‌లియెస్ట్ బైక్ ఏదో తెల్సా సార్! బి.ఎమ్.డబ్ల్యూ.కె-1. జర్మన్ మోటార్ సైకిల్! ఒకసారి కొంటే ఇంక మనం పోయేదాకా సర్వీస్ చేస్తూనే వుంటుంది. 'ఖడ్గ మృగం' అని ముద్దుగా పిలుస్తారు దీన్ని! ఇంతకన్నా బరువైన బైక్ కూడా ఇంకోటి వుండదు. ఖరీదు పన్నెండు వేల తొమ్మిది వందల తొంభై అమెరికన్ డాలర్లు. అంటే మూడు లక్షల ఇరవై నాలుగు వేల ఏడు వందల ఏభై రూపాయలు.

ఇలాంటి సూపర్ బైక్ ఒకటి కొనుక్కుని, కంప్లీట్ లెదర్ రేసింగ్ బట్టలు తొడుక్కుని, రైడింగ్ బూట్లు వేసుకుని, ముప్ఫయ్ వేల రూపాయల ఖరీదు చేసే బెల్ అల్ట్రా హెల్మెట్ పెట్టుకుని, నక్క చర్మంతో చేసిన గ్లోవ్స్ తొడుక్కుని రైడ్ చేస్తుంటే.... సార్....సార్.... మీ పోలీస్‌స్టేషన్ ఇక్కడే...దాటేసి వెళ్ళిపోతున్నారు."

విని కూడా, ఏమీ మాట్లాడకుండా ముందుకు పోనిచ్చాడు కృష్ణాజీ.

హఠాత్తుగా అనుమానం వచ్చినట్లు అన్నాడు రాజా.

"ఊరి బయటకు తీసుకెళ్ళి ఫేక్ ఎన్‌కౌంటర్ చేసి నన్ను చంపేస్తారా?"

"షటప్! నీ ఇంపార్టెన్స్ గురించి నువ్వే అతిగా అంచనా వేసుకోకు" అన్నాడు కృష్ణాజీ చిరాగ్గా అని, హఠాత్తుగా ఏదో గుర్తువచ్చినట్లు సడెన్ బ్రేకు వేశాడు.

ఇందాక "పోలీస్‌స్టేషన్ ఇక్కడే!" అన్నప్పుడు రాజా తన కుడిచేతిని చూపించాడు.

అంటే....

చటుక్కున వెనక్కి తిరిగి చూశాడు కృష్ణాజీ.

నిజమే!

రాజా కుడి చెయ్యి ఫ్రీగా వుంది!

బేడీలు వదులుగా మోటార్ సైకిల్ పక్కన వున్న హుక్కుకి వేళ్ళాడుతున్నాయి.

అంటే....

ఈ లిటిల్ గాంగ్‌స్టర్ సంకెళ్ళని వదిలించుకున్నాడన్నమాట.

బ్లడీ ఫెలో!

తీవ్రంగా అన్నాడు కృష్ణాజీ.

"చాలా హుషారీ చూపిస్తున్నావు నువ్వు! ఆఁ! మంచిది కాదు" అని మళ్ళీ సంకెళ్ళు వేయబోయాడు.

మోటార్ సైకిల్ దిగి, దూరంగా జరిగాడు రాజా.

"భోజనం చేశాక ఒకేసారి వెయ్యండి సర్!"

"భోజనమా? ఎక్కడ?"

ఎదురుగా కనబడుతున్న బార్ అండ్ రెస్టారెంట్‌ని చూపించాడు రాజా.

"ఇక్కడ ఫుడ్ బాగుంటుంది!" అన్నాడు.

"రాజసానికేమి తక్కువ కాదు!" అనుకున్నాడు కృష్ణాజీ.

పైకి మాత్రం, "నా దగ్గర అంత డబ్బు లేదు" అన్నాడు.

"నా దగ్గర వుంది" అని జేబులో నుంచి వంద రూపాయల నోటు తీసి చూపించాడు రాజా.

"ఆ వంద రూపాయల నోటు దొంగ సొత్తు!" అన్నాడు కృష్ణాజీ.

"ఏది? ఇదా?" అన్నాడు రాజా, గుప్పిట మూసి, మళ్ళీ తెరుస్తూ.

ఆశ్చర్యం!

ఇప్పుడతని చేతిలో వంద రూపాయల నోటు లేదు.

పది రూపాయల నోట్లు పది వున్నాయి.

"ఓరి పిడుగా!" అనుకున్నాడు కృష్ణాజీ.

వీడికి ఇంద్రజాలం కూడా వచ్చా ఏమిటి?

"మీ పోలీసువాళ్ళు ఎట్లాంటి పురుగుల అన్నం పెడతారో, నాకు తెలుసు! అందుకని వెళ్ళేముందే చివరిసారిగా మంచి భోజనం చేస్తే బెటరు" అన్నాడు రాజా.

"వీడికి పోలీసులంటే బొత్తిగా భయం లేదు" అనుకున్నాడు కృష్ణాజీ.

చట్టాలు చిల్లుల జల్లెడలాంటివి! చట్టాలని రక్షించవలసిన పోలీసులేమో నేరస్తులకే చుట్టాల్లాగా ప్రవర్తిస్తుంటారు.

ఈ లెక్కన వీడు పోలీసులకి లంచాలు ఇవ్వడమో, తన 'సంపాదన'లో భాగం ఇవ్వడమో చేస్తూ పోలీసు డిపార్టుమెంటుకి సన్నిహితంగా ఉంటూ ఉండి వుండాలి.

లాకప్ మరణాలూ, లాఠీ దెబ్బలూ ఇవన్నీ నేరం చేసిన వాళ్ళకు కాదు కదా!

పోలీసులతో పేచీ పెట్టుకున్న వాళ్ళకే ఆ గతి పట్టేది!

మహా అయితే పన్నెండేళ్ళుంటాయి వీడికి.

అప్పుడే పోలీసు డిపార్టుమెంటు లొసుగులన్నీ కనిపెట్టాడన్నమాట!

గుడ్! గుడ్! గుడ్!

"రండి బాస్!" అన్నాడు రాజా! ఇంకాస్త చనువు పెంచుకుంటూ.

లోపలికి వెళ్ళారు ఇద్దరూ.

పోలీస్ ఆఫీసర్ అయిన తనని చూడగానే హోటల్ స్టాఫ్ ఎంత భయభక్తులు ప్రదర్శించారో, అంతకు మించిన ఆదరం రాజా మీద చూపించినట్లు అనిపించింది కృష్ణాజీకి. వచ్చినప్పుడల్లా బాగా టిప్పు ఇస్తూంటాడేమో! అందుకే ఈ స్పెషల్ ట్రీట్‌మెంటు అయి ఉంటుంది. పైగా పోలీసులతో కలిసి వస్తున్నందుకు అక్కడ ఎవరూ రాజావైపు సానుభూతిగా చూడలేదు.

వాళ్ళకిలాంటి సీన్లన్నీ అలవాటే అయినట్లున్నాయి.

కృష్ణాజీతో బాటు అభివాదాలు అందుకుంటూ దర్జాగా బార్‌లోకి నడిచాడు రాజా.

కృష్ణాజీ కూర్చున్నాడు.

"ఒన్ మినిట్!" అంటూ టాయిలెట్‌లోకి వెళ్ళి రెండు నిమిషాల తర్వాత వచ్చాడు రాజా.

హాంకీతో చెయ్యి తుడుచుకుంటూ కూర్చున్నాడు.

స్టివార్డ్ వచ్చి పక్కన వినయంగా నిలబడ్డాడు.

"ఏం తీసుకుంటారు?" అన్నాడు తను కృష్ణాజీకి సమవయస్కుడూ సమానమయిన ఫాయిలో ఉన్నవాడూ అయినట్లు గొంతు పెట్టి.

ఛుర్రుమన్నట్లయ్యింది కృష్ణాజీకి.

సో!

దిస్ ఫెలో ఈజ్ ట్రయింగ్ టూ కరప్ట్ మీ.

తక్కిన ఆఫీసర్లకు ఇట్లాగే పార్టీలు ఇస్తూ ఉంటాడా వీడు.

రాజా అన్నాడు –

"కమాన్ సార్! ఫుడ్ తర్వాత ఆర్డర్ ఇవ్వొచ్చు! డ్రింక్స్ ముందు చెప్పండి! విస్కీనా, వైనా?"

ఇంక టాలరేట్ చెయ్యదలుచుకోలేదు కృష్ణాజీ.

స్టీవార్డ్‌తో అన్నాడు –

"నాలుగు నాన్, రెండు మిక్స్‌డ్ వెజెటబుల్ కర్రీ. నాకు కాఫీ, వీడికి పాలు."

తనకోసం కృష్ణాజీ పాలు ఆర్డర్ చేసినందుకు స్టివార్డ్ దగ్గర తన ఇమేజ్ పోయిందేమో అని భయపడుతున్నట్లు స్టివార్డ్ వేపు ఓరగా చూశాడు రాజా.

స్టివార్డ్ వింతగా రాజావైపు చూస్తున్నాడు.

"నేను మిల్క్ బేబీని కాను!" అన్నాడు రాజా బింకంగా.

"అయితే కాఫీ తాగు!" అని స్టివార్డ్‌వేపు తిరిగాడు కృష్ణాజీ. నాలుగు నాన్ కర్రీ, రెండు కాఫీ క్విక్!"

కుర్చీలో చేరగిలబడి, కృష్ణాజీ వేపు పరీక్షగా చూశాడు రాజా.

"మీ మాటేమిటో చెప్పండి" అన్నాడు.

"మాటా? ఏం మాట?"

నవ్వాడు రాజా.

"ప్రతి మనిషికీ, ప్రతి పనికీ ఒక రేటు ఉంటుంది సార్! నన్నొదిలెయ్యడానికి మీరేం తీసుకుంటారు చెప్పండి."

"షటప్!"

"మొహమాట పడకండి! నా మామూలయితే పట్టుకున్నప్పుడల్లా వెయ్యి ఇస్తాను."

కృష్ణాజీ పెదిమలు సరళరేఖలా బిగుసుకుపోయాయి.

ది సర్వ్ ఆఫ్ దిస్ బ్రాట్....

"పదిహేను వందల కంటే ఎక్కువయితే నాకు గిట్టుబాటు కాదు" అన్నాడు రాజా.

ఇంక మెత్తమెత్తగా మాట్లాడి లాభం లేదని అర్థం అయ్యింది కృష్ణాజీకి.

కరుగ్గా అన్నాడు –

"ఇంకోసారి ఇట్లావాగావంటే కీళ్ళూడదీస్తాను."

చప్పున రాజా నోరు మూతబడింది.

అంచనా వేస్తున్నట్లు చూశాడు కృష్ణాజీవేపు.

తర్వాత నెమ్మదిగా అన్నాడు –

"మీ సత్యనారాయణగారు నా ఫ్రెండే!"

సత్యనారాయణగారంటే కృష్ణాజీ వాళ్ళ బాస్.

ఆగ్రహాన్ని అణుచుకున్నాడు కృష్ణాజీ.

"ఇది నీకు చివరి వార్నింగ్" అన్నాడు.

తనకు తెలిసిన బ్రహ్మాస్త్రం కూడా పని చెయ్యకపోవడంతో డల్‌గా అయిపోయింది రాజా మొహం.

అయితే అదీ తాత్కాలికమే.

రహస్యం చెబుతున్నట్లు ముందుకు వంగాడు రాజా చిన్న గొంతుతో అన్నాడు–

"జాస్మిన్ తెలుసాండీ మీకు! ఆంగ్లో ఇండియన్ పోరి! చాలా హైక్లాస్! నా మనిషే" అన్నాడు అర్థవంతంగా.

కృష్ణాజీ కళ్ళలో కనబడ్డ ఎర్రజీర రాజా నోరు మళ్ళీ మూత పడేటట్లు చేసింది.

కానీ అతని నాలుక స్ప్రింగులాంటిది.

కాసేపు తొక్కి పెట్టి ఉంచినా, పట్టు సడలించగానే మళ్ళీ పుంజుకుంటుంది.

రాజాకి తెలుసు.

ఏ రకమైన ప్రలోభానికీ కూడా లొంగని కొంతమంది కులగులకి మాత్రం గులాములై పోతారు.

అందుకని ఒక పాడివేసి చూశాడు రాజా.

"సార్! మీరు చౌదరీసా?"

తన మనసులో వచ్చిన వయొలెంట్ రియాక్షన్‌ని అతికష్టం మీద అణుచుకున్నాడు కృష్ణాజీ.

రాజా అంటూనే ఉన్నాడు.

"కాకపోతే మీరు రాజులయి ఉంటారండీ! మీ పర్సనాలిటీ అదీ చూసి అప్పుడే అనుకున్నా! క్షత్రియులంటే నాకు గొప్ప క్రేజ్‌సార్!"

కృష్ణాజీకి ఉవ్వెత్తున వచ్చిన కోపం అంత తొందరగానూ చప్పబడిపోయింది. కోపం స్థానంలో అదో రకమైన దిగులు చోటు చేసుకుంది.

ఎంతగా డీజెనరేట్ అయిపోయింది ఈ జెనరేషను.

తన చిన్నప్పుడయితే....

అప్పటికింకా గాంధీగారి ఆదర్శాలూ, కందుకూరి, గురజాడ వంటి వారి సంస్కార భావాలూ ఇంకా జనం మనసులోనుంచి దూరం కాలేదు. ఈ లైసెన్స్ కోటా పర్మిట్ రాజ్యం తాలూకు దుష్ప్రభావం, ఓట్ల బ్యాంకుల రాజకీయాలూ అప్పటికింకా ఆదర్శాలని అవుటాఫ్ ఫేషన్ చెయ్యలేదు.

అప్పట్లో ప్రతివాడికీ కూడా సొంత లాభం కొంత మానుకుని పదిమందికి పనికివచ్చే మంచి ఏదన్నా చెయ్యాలన్న తపన ఉండేది. కులం సంగతి మాట్లాడడం సభ్యత కాదనీ, కులాంతర, మతాంతర వివాహాలు చేసుకోవడం, లేదా, కనీసం ప్రోత్సహించడం కర్తవ్యమనీ భావన ఉండేది.

ఒక్క రెండు దశాబ్దాలలో ఎంత మార్పు.

కులాలూ, మతాలూ అన్న భేద భావాలు రూపుమాపి, వసుధైక కుటుంబం అన్న దృక్పథం అలవరుచుకోవాలన్న ఆరాటం అడుగంటి పోయింది.

కులాలూ, మతాలూ అంటూ కెలికి, కవ్వించి, పబ్బం గడుపుకోవడం చాలా మామూలయిపోయింది.

నాయకులు ఈ విషవృక్షాన్ని పెంచి పెద్దచేశారు, ప్రోత్సహించారు.

కులగజ్జి కాస్తా కాన్సరయ్యి కూర్చుంది ఇప్పుడు.

ప్రజల మనసులు ఎంతగా పాడయిపోకపోతే, ఇవాళ, ఈ పసివెధవ తన దగ్గర కులం గురించి మాట్లాడేటంత సాహసం చేస్తాడూ?

ఛీ ఛీ ఛీ ఛీ!

సీరియస్‌గా ఉన్న కృష్ణాజీ మొహం చూసి, ఇంక మాట్లాడడానికి జంకాడు రాజా.

ఇంతలో "ఫుడ్" వచ్చింది.

సగం రొట్టి తిని ఊరుకున్నాడు కృష్ణాజీ.

రాజా మాత్రం సుష్టుగా లాగించేశాడు.

కాఫీ వచ్చింది.

"ఎక్స్‌ట్రా సుగర్" వేసుకుని తాగాడు రాజా.

తర్వాత జేబులోనుంచి సిగరెట్ ప్యాకెట్ తీశాడు. ఒక సిగరెట్ తీసి పెదిమల మధ్య పెట్టుకున్నాడు. అతని చేష్టల్లో ధిక్కారం కనబడుతోంది.

అగ్గిపెట్టి తీసి, పుల్ల వెలిగించి, సిగరెట్ అంటించబోతూ, కృష్ణాజీ మొహంలోకి చూశాడు రాజా.

రాజా వేపే చూస్తున్నాడు కృష్ణాజీ.

కానీ ఏమీ అనలేదు.

కనీసం అతని మొహంలో కోపం, అభ్యంతరం కూడా కనబడటం లేదు.

కానీ....

కానీ....

కృష్ణాజీ కళ్ళలో కనబడుతున్న అంతుబట్టని భావం అదేదోగానీ, రాజాని కట్టిపడేసింది.

నెమ్మదిగా పెదిమల మధ్య ఉన్న సిగరెట్ తీసి, యాష్‌ట్రేలో పడేశాడు రాజా.

"అయ్యిందా?" అన్నాడు కృష్ణాజీ.

"నేను రెడీ"అని లేచి నిలబడ్డాడు రాజా. హఠాత్తుగా తిక్కరేగినట్లయింది అతనికి. పెద్ద గొంతుతో అరుస్తున్నట్లు మాట్లాడటం మొదలుపెట్టాడు.

"నన్ను పట్టుకోవడం వల్ల మీకు ఒరిగేదేం వుంది? నీతి, నిజాయితీ, న్యాయం, ధర్మం అని మీకు అంత పట్టింపు వుంటే మినిస్టర్లలో ముప్పాతిక మందిని జైల్లో పెట్టాల్సిందేగా! వాళ్ళందరినీ వదిలి నా బతుకు నేను బతుకుతున్న నన్ను పట్టుకుని

హరాస్ చేస్తారెందుకని? పెద్దవాళ్ళ మీదికెళ్ళడానికి మీకు దమ్ముల్లేకనా? మంచిగా బతకబోతే మంచి నీళ్ళు కూడా పుట్టవు ఈ లోకంలో. నేను ఛాలెంజ్ చేస్తున్నా. మీకే గనక మొగతనం వుంటే పొలిటీషియన్స్ మీదకిపోండి ముందు! కడుపు నిండిన వాళ్ళు చేసే దొంగతనాలు అవి. కాలే కడుపుకోసం చేసే చిన్నచిన్న దొంగతనాలు మావి. ఎందుకొచ్చిన న్యాయం ఇదీ" అన్నాడు గట్టిగా.

బార్‌లో ఉన్న వాళ్ళందరూ తిరిగి, వీళ్ళిద్దరినే చూస్తున్నారు.

రాజా ఒక పోలీసాఫీసరుతో అంత రూడ్‌గా మాట్లాడడం చూస్తున్న బార్ మేనేజరూ, స్టివార్డ్స్, బేరర్లూ అందరూ చేష్టలుడిగి చూస్తూ నిలబడిపోయారు.

పోలీసులతో పోట్లాట ఎక్కడికి దారి తీస్తుందో వాళ్ళకి తెలుసు.

రాజా అంటే వాళ్ళందరికీ అభిమానం వుంది.

రాజాకి ఏమన్నా జరిగితే వాళ్ళు భరించలేరు.

అలాగని, నేరుగా ఈ పోలీసాఫీసరుతో వైరం పెట్టుకోలేరు కూడా!

ఏం చెయ్యాలో పాలుపోక, అలాగే చూస్తూ వుండిపోయారు వాళ్ళందరూ.

లేచాడు కృష్ణాజీ.

అక్కడున్న అందరూ అనుకున్నారు.

ఇంక రాజా పని మూడింది.

ఈ 'టైగరు కృష్ణాజీ' రాజాని చావచితక కొట్టేస్తాడని!

మరుక్షణంలో రాజా నెత్తిమీదా, వీపు మీదా దబదబ గుద్దులు పడ్డాయి.

కానీ ఆ దెబ్బలు కృష్ణాజీ కొట్టలేదు.

శని దేవతకి సొంత తమ్ముడిలా కనబడుతున్న ఒక మనిషి, వీరావేశంతో రాజాని పిడి గుద్దులు గుద్దుతున్నాడు. కోపం చల్లారక మోచేత్తో రాజా డొక్కలో పొడిచాడు. పిడికిలి బిగించి, పళ్ళన్నీ రాలిపోయేటట్లు రాజా మొహం మీద కొట్టబోతుండగా, బలంగా అతని చేతిని పట్టుకుని ఆపేశాడు కృష్ణాజీ.

రొప్పుతూ, మొహానికి పట్టిన చెమటని మోచేత్తో తుడుచుకున్నాడు ఆ మనిషి.

"వదలండి సార్! ఈడ్ని ఇవాళ ఖూనీ చేసెయ్యాలి. అయ్య బాబోయ్! ఎన్ని గుండెలండీ ఈ నంజి కొడుక్కి! మిమ్మల్నే అన్ని మాటలంటాడా?" అని, కాలితో రాజాని ఒక్క తాపు తన్నాడు ఆ మనిషి.

ఆ దెబ్బకి తూలాడు రాజా. అతి కష్టం మీద టేబుల్ మీద చేతులు ఆనించి, తనని తాను బాలన్స్ చేసుకున్నాడు. కానీ ఆ ఇంపాక్ట్‌కి టేబుల్ మీద వున్న వాటర్ జగ్గూ, గ్లాసులూ, ప్లేట్లూ కిందపడి భళ్ళున పగిలిపోయాయి.

"ఇదిగో! ఓ మనిషీ!" అన్నాడు కృష్ణాజీ కోపంగా. "ఇంకొక్కసారి నీ చెయ్యిగానీ, కాలుగానీ ఆ కుర్రాణ్ణి తాకిందా, ఆ చెయ్యో కాలో నేను తీసేస్తాను."

అదిరిపడి ఆగిపోయాడు ఆ మనిషి.

"అయ్యబాబోయ్! అదేటండీ! వీడు మిమ్మల్ని పబ్లిక్ ప్లేసులో పబ్లిగ్గా అట్టా తిట్టేస్తుంటే నా గుండె మండిపోదండీ! ఈ నా కొడుక్కి..."

"నువ్వెవరు?" అన్నాడు కృష్ణాజీ కరుగ్గా.

"అయ్యబాబోయ్! నేనాండీ! నేను ఈడి బాబునండీ! నిజంగానే ఈడ్నా కొడుకండి!"

ఆశ్చర్యంగా వాళ్ళిద్దరినీ మార్చి మార్చి చూశాడు కృష్ణాజీ.

ఈ రాజా ఈ నికృష్టుడి కొడుకా?

తండ్రీ కొడుకుల్లో ఎంత తేడా?

రాజా మొహం చూస్తే దైవాంశ సంభూతుడిలాగా వున్నాడు.

రాజా తండ్రినని చెప్పుకుంటున్న ఈ మనిషి రాక్షసుల తాలూకు రిప్రజెంటేటివ్‌లాగా వున్నాడు.

"ఏమిటి? ఇతను చెబుతున్నది నిజమేనా?" అన్నాడు కృష్ణాజీ, రాజాతో.

"ఈయన మా నాన్న కాదు!" అన్నాడు రాజా.

అది వినగానే ఆ మనిషి అదిరిపడ్డాడు.

"ఏరా నా కొడుకా! ఏట్రా కూస్తున్నావ్? నేన్నీకు నాన్నని కానా? నువ్వు నాకు కొడుకువి కావా?" అన్నాడు ఆగ్రహంగా.

"నేన్నీకు కొడుకుని కావచ్చు. కానీ నువ్వు నాకు తండ్రివి కావు."

"ఎందుకనో?"

"తండ్రి అనిపించుకోవడానికి కనీసమయిన క్వాలిఫికేషన్లు కూడా నీలో లేవు"

"కన్నాను కదరా! అది చాల్దా?"

"పందులు కూడా కంటాయి. కానీ అవి తమ పిల్లల్ని ఇంతకన్నా ప్రేమగానే చూసుకుంటాయి."

ఉగ్రుడయిపోయి కృష్ణాజీ వైపు తిరిగాడు ఆ మనిషి.

"ఇన్నారా సార్ ఈడి వాగుడు! పర్మిషనివ్వండి! పీక పిసికేస్తా!"

"నీ పేరేమిటి?" అన్నాడు కృష్ణాజీ.

"అయ్యబాబోయ్! నా పేరు దాసు కదండీ! సారా దాసు! అండర్‌గ్రౌండ్‌లో అందరికీ తెలుసండీ!"

దాసుని ఎగాదిగా చూశాడు కృష్ణాజీ.

పేరుకి తగినట్లే వున్నాడు సారా దాసు. ఒంట్లో రక్తానికి బదులు సారానే ప్రవహిస్తున్నట్లు కంట్రోలులో లేకుండా వూగిపోతున్నాడు. తాగి తాగి కళ్ళు వుబ్బిపోయినట్లు అసహ్యంగా వుంది. చచ్చుబడిపోయినట్లు సన్నగా, పీలగా వున్నాయి చేతులు. తుఫానులో తిరిగివచ్చిన వాడి జుట్టులాగా పరమ అస్తవ్యస్తంగా వుంది జుట్టు. కొరివి దెయ్యాలు కాపురం వుంటున్నట్లు ఎర్రగా వున్నాయి కళ్ళు. జర్దా కిళ్ళీలు నమిలి నమిలి నలుపుకి తిరిగిన ఎరుపురంగులోకి మారాయి పళ్ళు. అతను మాట్లాడుతుంటే డ్రైనేజి గుంటలా వుంది నోరు.

సారా దాసు వాగుతూనే వున్నాడు.

"కన్న తండ్రంటే కూసింతయినా మమకారం లేద్సార్ ఈ నా కొడుక్కి! తెగ సంపాదించి, అంతా తనే తింటాడు గానీ తండ్రికేం పెట్టడు సార్! పైపెచ్చు, ఈ నా కొడుకు ఐదో ఏటే ఇంట్లో నుంచి పారిపోయాడ్సార్!"

"అవును! నువ్వు అమ్మని కిరసనాయిలు పోసి కాల్చేసి, నన్ను కూడా చంపెయ్యాలని చూస్తే పారిపోయా" అన్నాడు రాజా.

"అమ్మనీయమ్మ! అయితే ఇప్పుడు నామీద ఖూనీ కేసు పెట్టిస్తావేట్రా నంజ కొడకా! పోలీసు బాబు పక్కనున్నాడని పూరుకుంటున్నా గానీ పొడిచి పారేసి వుండేవోడ్ని నా కొడకా! పద!"

"ఎక్కడికి?"

"ఎక్కడికేట్రా! మనింటికే!"

"నేన్రాను."

"నువ్వొస్తావు. నువ్వు నేనూ కలిసి సారా వ్యాపారం చేస్తాం! దానికింక తిరుగు లేదుగానీ, నోర్మూసుకుని నడు."

"నేను రాను"

"అమ్మనీయమ్మ! ఇక్కడుండి లార్డులాగా సంపాదించుకుంటూ అంతా నువ్వే దిగమింగుదామనుకుంటున్నావా? పద కన్నా! పద! చూడు, నీ ముసల్తండ్రి ఎన్ని కష్టాలు పడుతున్నాడో. వయసొచ్చిన కొడుకుని పెట్టుకుని నాకిదేం ఖర్మరా! పద పద!"

"ముసలాడివైతే దాన్నెందుకుంచుకున్నావ్?"

"ఎవర్నీ?"

"అదే....రత్నాన్ని"

మళ్ళీ తిక్కరేగింది దాసుకి.

"నా ఇష్టంరా నంజి కొడకా! నేను మొగాణ్ణిరా నలుగుర్ని చేసుకుంటా, నలభై మందిని ఉంచుకుంటా! వేలెడంత లేవు నాలో తప్పులు ఎతికేంత వాడివయ్యావా?"

"ఇప్పుడే కదా అన్నావ్ నేను పెద్దాడినైపోయాను! పెట్టి పోషించాలని!"

"మీరే చెప్పండి పోలీసుబాబూ! న్యాయం చెప్పండి? నా కొడుకుని నాతో పంపెయ్యండి!" అన్నాడు దాసు.

రాజా కళ్ళలో అంతకు ముందు లేని భయం కనబడింది.

రాజా మొహంలో ఆ ఎక్స్‌ప్రెషన్ చూడగానే, అతనివిషయంలో ఏం చెయ్యాలో పూర్తిగా తేల్చుకోలేక అటూ యిటూ ఊగిసలాడుతున్న కృష్ణాజీ ఒక నిర్ణయానికి వచ్చేశాడు.

తన చేతిని బలంగా దాసు మెడమీద వేసి, గట్టిగా పట్టుకున్నాడు. తర్వాత నిదానంగా అన్నాడు –

"ఇదిగో చూడు దాసూ! విను! నీలాంటి పరమ భ్రష్టుడూ, పుండాకోరూ ఈ లోకంలో ఒకడు ఉన్నాడని యిప్పుడే నాకు తెల్సింది. రాజా సంగతి మర్చిపో! ఈసారి రాజాని గనక కలుసుకోవడానికి చూశావా ఆ తర్వాత అసలెందుకు పుట్టానా అని ఏడ్చే స్థితికి వస్తావ్. అర్థమయ్యిందా? మళ్ళీ చెప్పనా?"

చావు దెబ్బ తిన్న కుక్కలా తోక ముడిచాడు దాసు.

కానీ కుక్క మొరుగుతున్నట్లు ఇంకేదో అనబోయాడు.

"షటప్!" అన్నాడు కృష్ణాజీ కర్కశంగా.

బుర్రుమని ముక్కుతో భయంకరంగా ఒక శబ్దం చేసి, తర్వాత సైలెంటుగా అయిపోయాడు దాసు.

"కమాన్!" అన్నాడు కృష్ణాజీ, రాజాతో.

ఇద్దరూ బయటికి వచ్చారు.

ఇప్పుడు రాజా మొహంలో నిజంగానే భయం కనపడింది.

"చెప్పండి! పోలీసుస్టేషన్‌కి తీసుకెళ్ళకుండా ఎక్కడికి తీసుకెళ్తారు? ఎక్కడన్నా పడేసి కొడతారా?" అన్నాడు.

"తెలుస్తుందిగా! ఎక్కు!" అన్నాడు కృష్ణాజీ మోటార్‌సైకిలు స్టార్ట్ చేస్తూ.

నిదానంగా, స్థిరంగా అన్నాడు రాజా–

"సాబ్! పిల్లలతో ఎప్పుడూ పేచీ పెట్టుకోకు! డేంజరు!"

కృష్ణాజీ మాట్లాడకపోవడం గమనించి, మళ్ళీ అన్నాడు రాజా. "ఎందుకని అడుగు సాబ్! పెద్దాళ్ళతో పోట్లాట పెట్టుకున్నావనుకో! వాడెవడో, ఏం చేస్తున్నాడో, వాడి పవరెంతో నీకు తెలిసే ఉంటుంది. పిల్లలతో అట్లాకాదు. పెద్దాడయ్యాక ఎవడు నీ లెవెలుకి వెళ్తాడో, ఎంత పవర్‌ఫుల్‌గా మారతాడో నీకు ఇప్పుడే తెలీదు! అవునా! నాతో దుష్మనీ మంచిది కాదు" అన్నాడు.

మోటార్‌సైకిలు పోనిస్తూనే ఒక్కసారి వెనక్కి తిరిగి రాజా మొహంలోకి చూశాడు కృష్ణాజీ.

ఏం మాట్లాడలేదు.

అయిదు నిమిషాల తర్వాత ఒక యింటి ముందు ఆగింది కృష్ణాజీ మోటార్‌సైకిలు.

మోటార్‌సైకిలు దిగి, సంకెళ్ళు తీసేశాడు కృష్ణాజీ.

కిందకు దిగాడు రాజా.

కృష్ణాజీ మోటార్‌సైకిలుకి స్టాండు వేశాడు.

"పద!" అన్నాడు ముక్తసరిగా.

ఆ ఇంటివైపు చూశాడు రాజా. చిన్న ఇల్లు. నీటుగా, ఒక ఆశ్రమంలా కనబడుతోంది.

లోపలికి వెళ్ళారు.

లోపల ఉన్న అరుగుమీద కూర్చుని భారతం చదువుకుంటున్నాడు ఒకాయన. ఆయనకి యాభైఏళ్ళు ఉంటాయి. అయినా నిష్ఠగా, మంచి అలవాట్లతో జీవితం గడిపినవాడు కావడంవల్ల వయసు కనబడటం లేదు. ముప్ఫయ్ అయిదేళ్ళ వాడిలాగా ఉంటాడు. ప్రశాంతంగా ఉంది మొహం. నుదుట బొట్టు వుంది. ధోవతి కట్టుకుని,

పైన అంగవస్త్రం కప్పుకుని ఉన్నాడు.

కృష్ణాజీని చూడగానే, "రండి! కూర్చోండి!" అన్నాడు ఆదరంగా.

ఆయనకు నమస్కారంపెట్టి అరుగుమీదే పక్కగా కూర్చున్నాడు కృష్ణాజీ.

రాజా నిలబడే వున్నాడు.

రాజా ఎవరో ఆయనకి తెలియదు.

కానీ ఆయనెవరో రాజాకి తెలుసు.

ఆయన పేరు ఆనందరావుగారు. మునిసిపల్ హైస్కూల్లో టీచరు. మంచివాడని పేరు. సంఘసేవ ఆయనకు అత్యంత ప్రీతిపాత్రమైన పని. అమితమైన దైవభక్తి ఆయనకు.

ప్రతిరోజూ తెల్లవారు ఝామునలేవగానే ముందు స్నానం చేసేసి, ఒక ప్లాస్టిక్ బక్కెట్, మగ్గూ పట్టుకుని ఆ వీధి చివరన ఉన్న వేణుగోపాలస్వామి గుడికి వెళ్తాడు ఆయన. అక్కడే వున్న కొళాయిలో నుంచి బక్కెట్‌తో నీళ్ళు పట్టి, గుడి అంతా కడిగి శుభ్రం చేస్తాడు.

అలా మాధవసేవతో రోజు మొదలుపెట్టి, అనేక విధాలుగా మానవసేవ కూడా చేసిగానీ నిద్రపోడు ఆయన.

రాజావైపు ప్రసన్నంగా చూశాడు ఆయన.

"ఈ పిల్లాడు ఎవరు?" అన్నాడు చిరునవ్వుతో.

కృష్ణాజీ నవ్వాడు.

"వీడి కథంతా చెప్పాలంటే ఇంకో భారతం అవుతుంది. వినే టైం వుందా?"

"ఫర్వాలేదు! చెప్పండి" అన్నాడు ఆనందరావు.

చెప్పడం మొదలెట్టాడు కృష్ణాజీ.

"నన్ను మీరు గుర్తుపట్టే వుంటారనుకుంటాను. మీ స్కూలుకి చీఫ్ మినిస్టర్‌గారు వచ్చినప్పుడు బందోబస్తు ఏర్పాట్లు చూసింది నేనే! అప్పుడు కలిశాం మనం."

"ఎంత మాట! మిమ్మల్నెలా మర్చిపోతానూ? మీరు "టైగర్ కృష్ణాజీ"ట కదా! మా పిల్లలు చెప్పారు."

నవ్వాడు కృష్ణాజీ.

"దుర్మార్గులందరికీ మీరంటే సింహస్వప్నం అని అంటారు."

తనని గురించిన పొగడ్తలు వినడం ఇష్టం లేనట్లు మాట మార్చేశాడు కృష్ణాజీ.

"ఈ ఊళ్ళో యాంటీ సోషల్ ఎలిమెంట్స్‌గా రికార్డ్ అయిన వాళ్ళలో ఈ కుర్రాడు ఒకడు. పన్నెండేళ్ళ పిల్లాడు వీడేం చెయ్యగలడని అనుకోకండి! పాతికేళ్ళ వాళ్ళకి ఉండే శక్తీ, యుక్తీ వీడికి ఉన్నాయి. పిల్లవాడయినా పోలీసు డిపార్ట్‌మెంట్‌ని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించాడు. ఇంక తప్పనిసరై నేనే రంగంలోకి దిగి వీణ్ణి పట్టుకోవలసి వచ్చింది."

శ్రద్ధగా వింటున్నాడు ఆనందరావు.

కృష్ణాజీ అన్నాడు "తీరా పట్టుకున్న తర్వాత వీడు ఆఫ్టరాల్ ఒక యాంటీ సోషల్ ఎలిమెంట్ కాదనీ – కాకపోగా ఒక చిన్న సైజు రాబిన్‌హుడ్ లాంటి వాడనీ గ్రహించాను. వీడి వయసుకి వీడు చేస్తున్న పనులూ, దానధర్మాలూ, వీడి మంచితనం చూస్తుంటే మామూలు పిల్లాడు కాదనీ, అసాధారణమైన వ్యక్తిత్వం ఉన్నవాడనీ అర్థం అయ్యింది.

"అయితే?"" అన్నట్లు చూశాడు ఆనందరావు.

"వీడి మొహం వైపు చూడండి! జీనియస్ అనిపించడం లేదూ? ఇంత టాలెంట్ రాంగ్ ట్రాక్‌లో పడి వేస్టయి పోతోంది. సరైన దారిలో పెడితే నిజంగా సొసైటీకి పనికొచ్చే మనిషిగా మారతాడు వీడు! ఐ యామ్ వెరీ ష్యూర్!"

రాజా ఆశ్చర్యంగా చూస్తూ వింటున్నాడు కృష్ణాజీ చెప్పేదాన్ని.

కృష్ణాజీ అన్నాడు –

"సార్! నేను చాలా ఖడక్ మనిషిని అని డిపార్ట్‌మెంట్‌లో పేరు! ఈ రోజుల్లో అది చెడ్డపేరు కిందే లెఖ్ఖ అనుకోండి! అయినా ఎవరేమన్నా పట్టించుకోను నేను! నేను నా మనస్సాక్షికి మాత్రమే జవాబుదారీ. నాకు నా డ్యూటీ తర్వాతే ఇంకేదైనా కూడా.

అయినా సార్! నాలాగా నూటికొకడూ, కోటికొకడూ అక్కడక్కడా ఉంటే పరిస్థితులు మారవు. స్ట్రిక్టుగా ఉండదలుచుకున్న ప్రతివాడూ తనలాంటి శిష్యులను పదిమందినైనా తయారు చెయ్యగలిగితేనే చెడుకీ, మంచికీ జరిగే యుద్ధంలో బాలెన్స్ ఆఫ్ పవర్ మెయిన్‌టెయిన్ అవుతుంది. లేదా, మంచివాళ్ళు మరీ మైనారిటీ అయిపోయి, మొరటు మృగాల మెజారిటీ ఎక్కువైపోతుంది.

నేను తయారు చెయ్యదల్చుకున్న మంచి సిటిజెన్స్‌లో మొదటివాడు వీడే!"

కృష్ణాజీ చెప్పినది తనకు పూర్తిగా నచ్చినట్లు మెప్పుదలగా చూశాడు ఆనందరావు.

"అయితే ఇకనుంచి ఈ పిల్లవాడు మీ సంరక్షణలో ఉంటాడన్న మాట" అన్నాడు చిరునవ్వుతో.

"కాదు...." అన్నాడు కృష్ణాజీ.

"మరి....?"

"ఈ పిల్లవాడు....వీడి పేరు రాజా....ఇవాళ్టి నుంచి వీడు మీ సంరక్షణలో వుంటాడు."

ఆశ్చర్యపోయాడు ఆనందరావు.

"నా సంరక్షణలోనా? చిత్రంగా మాట్లాడుతున్నారే?"

కృష్ణాజీ అన్నాడు –

"మీలాంటి వ్యక్తులు ఎక్కడో అరుదుగా ఉంటారు. గురుకులంలో ఉంచినట్లు రాజాని మీ దగ్గర వుంచేస్తే వాడు సక్రమంగా పెరుగుతాడు. సొసైటీకి పనికివచ్చే సిటిజన్ అవుతాడు."

విని మౌనంగా ఉండిపోయాడు ఆనందరావు.

వెంటనే కృష్ణాజీ అన్నాడు –

"ఒక పిల్లవాడిని పోషించడం అంటే చాలా భారమని నాకు తెలుసు. అందుకని దానికి అవసరమయిన ఏర్పాట్లు కూడా నేనే చేస్తాను." అని జేబులో నుంచి పర్సు తీశాడు కృష్ణాజీ. అందులో ఒక చెక్ లీఫ్ వుంది.

ఆంధ్రా బ్యాంకు సేవింగ్స్ అకౌంట్.

త్వరత్వరగా ఇరవై వేల రూపాయలకి సెల్ఫ్ చెక్కు రాశాడు కృష్ణాజీ. చెక్కుని ఆనందరావుకి అందించబోయాడు.

ఆనందరావు ఆ చెక్కుని అందుకోలేదు.

"మాతోబాటు వాడికో ముద్ద పెట్టడం అంత కష్టం కాదు. కానీ అదికాదు విషయం! ఈ రాజా మీద మీకు అంత గురి ఏర్పడినప్పుడు అతని బాగోగులు మీరే స్వయంగా చూసుకోవడం మంచిది కదా!"

సంతోషం లేని నవ్వు నవ్వాడు కృష్ణాజీ.

"సార్! నా పొజిషన్ మీకు చెప్పినా అర్థం కాదేమో! నేను నిప్పులాంటి మనిషిని! అందుకే నా డిపార్ట్‌మెంట్‌లోనే నాకు లెఖ్ఖలేనంతమంది శత్రువులు వున్నారు. ఏ వూళ్ళో కూడా నన్ను ఏడాదికంటే వుంచరు."

వింటున్నాడు ఆనందరావుగారు.

కృష్ణాజీ చెప్పాడు –

"నేను ఇక్కడ ఎన్నాళ్ళుంటానో తెలియదు. మళ్ళీ ఎప్పుడు, ఎక్కడికి ఏ వంక మీద ట్రాన్స్‌ఫర్ చేస్తారో తెలియదు. ఎప్పుడు నన్ను యేం చేస్తారో తెలియదు. ఎన్నాళ్ళు బతుకుతానో, చివరికి ఎలా చస్తానో నాకే తెలియదు.

నాకు తెలిసిందల్లా –

సహజమైన చావు మాత్రం నాకు రాదని!

నేను ఒక్కడిని! శత్రువుల సంఖ్యం లెఖ్ఖకి అందదు.

నా ప్రాణాలు కాపాడుకోవడం మీద నాకు అంత శ్రద్ధ లేదు.... ఎక్కడో ఒకచోట, ఎవడో ఒకడు దొంగ దెబ్బ తీస్తాడు నా మీద!

ఈ కుర్రాడు కూడా నాతో ఉన్నాడనుకోండి. అప్పుడు వాడు కూడా అదే ప్రమాదంలో పడిపోతాడు.

అది నాకు యిష్టం ఉండదు.

అందుకే సార్! ఈ అబ్బాయిని మీ దగ్గరే ఉంచి వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. మీరే వీడిని పెంచండి. చదువు చెప్పండి. మంచి మనిషిగా తయారుచెయ్యండి. ఈ కుర్రాడిని మీ దగ్గర వుంచుకోవడం వల్ల మీకేం డబ్బు యిబ్బంది కలగకుండా నేను కొద్దో గొప్పో పంపుతూనే వుంటాను."

"డబ్బుదేముందిగానీ....సరే....మీరు చెప్పిన ప్రకారమే చేద్దాం. ఆ తర్వాత అన్నిటికీ దేవుడే వున్నాడు."

కృతజ్ఞతాపూర్వకంగా చూశాడు కృష్ణాజీ.

తన ప్రమేయం లేకుండానే తన భవిష్యత్తుని వాళ్ళిద్దరూ అలా నిర్ణయించేస్తూ వుండటం రాజాకి నచ్చలేదు.

"నేను ఈ మేష్టారి దగ్గర ఉండను" అన్నాడు దృఢంగా.

సీరియస్‌గా రాజా వేపు తిరిగాడు కృష్ణాజీ.

"ఏం? ఎందుకని?"

మనసులో అనుకున్నాడు రాజా–

"ఎందుకనా? ఇక్కడ ఉంటే నేను జైల్లో ఉన్నట్లే!"

అతని భావం గ్రహించినట్లు అన్నాడు కృష్ణాజీ–

"బలవంతం లేదురా! ఇక్కడ ఉండకపోతే జైల్లో ఉండొచ్చు! నీ ఇష్టం."

రాజా అనుకున్నాడు –

"వద్దులే! జైల్లో నుంచి పారిపోవడంకంటే ఇక్కడ నుంచి పారిపోవడమే సులభం"

"ఏమంటావ్?" అన్నాడు కృష్ణాజీ.

అయిష్టంగానే తల ఊపాడు రాజా.

"సో! దట్ సెటిల్స్ ఇట్!" అన్నాడు కృష్ణాజీ.

తర్వాత ఆనందరావుతో అన్నాడు –

"వీడికి కావలసిన బట్టలూ, సామాన్లు అవీ కొనిచ్చి, తర్వాత యిక్కడ వదిలేస్తా సార్!"

"సరే!" అన్నట్లు తల ఊపాడు ఆనందరావు.

"ఎక్కరా" అన్నాడు కృష్ణాజీ మోటారుసైకిలు స్టార్టు చేస్తూ.

మోటారుసైకిలు వెనక ఎక్కి కూర్చున్నాడు రాజా.

ముందుగా ఒక రెడీమేడ్ బట్టల షాపుకి తీసుకెళ్ళాడు కృష్ణాజీ రాజాని.

"మూడు జతల బట్టలు తీసుకో" అన్నాడు కృష్ణాజీ.

జాగ్రత్తగా అన్నిటినీ పరిశీలించాడు రాజా.

ఎరుపూ, నలుపూ పట్టా పట్టీల డిజైను షర్టు ఒకటీ, నేరేడు పండు రంగు షర్టు ఒకటీ, బెలూన్ షేపు జీన్స్ ఒకటీ, నల్ల కాటన్ గేబర్డిన్ ప్యాంటు ఒకటీ సెలెక్ట్ చేసుకున్నాడు రాజా.

కృష్ణాజీ వాటిని చూసి నవ్వాడు.

"ఇవి వేసుకుని వెళితే ఆనందరావు మేష్టారు బెత్తం పుచ్చుకు వెనకబడతాడు. ఆయనకి యిలాంటివన్నీ గిట్టవు. సాదాగా వుండే డ్రెస్సులు సెలెక్ట్ చేసుకో" అన్నాడు.

మాడిపోయిన బల్బులా అయిపోయింది రాజా మొహం.

'సాదా' అంటే ఏం సెలెక్టు చేసుకోవాలో అర్థంకాక అతను అవస్థపడుతుంటే, కృష్ణాజీనే సెలెక్టు చేసేశాడు. తెల్ల పైజమా, లాల్చీలు రెండు జతలు, బ్రౌన్ కలర్ ఫ్యాంటు ఒకటి, లేత క్రీం కలర్ షర్టు ఒకటి.

మూడు కర్చీఫులు కొన్నాడు.

అండర్‌వియర్ కొన్నాడు.

తర్వాత ఇంకో షాపుకి తీసుకెళ్ళాడు.

ఒక స్టీలు కంచమూ, గ్లాసూ కొన్నాడు.

ఇంకో షాపులో ఒక రెడీమేడ్ పరుపూ, దిండూ కొన్నాడు.

తన మోటార్ సైకిలు ఒక షాపు దగ్గర పార్క్‌చేసి, ప్యాక్ చేయించిన వస్తువులన్నీ ఆటోలో పెట్టుకుని, రాజాతో కలిసి ఆనందరావు ఇంటికి వచ్చేశాడు కృష్ణాజీ.

అప్పటికి బాగా చీకటి పడిపోయింది.

ఆనందరావు గారింట్లో అది భోజనాలవేళ.

ఆయనకి వేళ ప్రకారం పెందరాళే భోజనం చేసి, పదింటికల్లా పడుకోవడమూ, మళ్ళీ తెల్లవారు ఝామునే లేచెయ్యడమూ అలవాటు.

"భోజనాల టైముకి వచ్చారు. మీరు కూడా ఇవాళ్టికి మాతో కలిసి తినేస్తే మాకు సంతోషం!" అన్నాడు ఆనందరావు కృష్ణాజీతో.

ముందు వద్దన్నాడు కృష్ణాజీ.

కానీ ఆనందరావు బలవంత పెట్టడం మానలేదు.

తర్వాత ఒప్పుకున్నాడు కృష్ణాజీ.

ఇంకోటి కూడా అనిపించింది అతనికి.

తను ఇవాళ ఇక్కడే భోజనం చేస్తే, రేపటినుంచి రాజా తినబోయేది ఎట్లా వుంటుందో కూడా అర్థమైపోతుంది.

వాడు బార్లలో, రెస్టారెంట్లలో తినడానికి అలవాటు పడ్డవాడు. ఇక్కడ అసలు ఇమడగలడా?

భోజనాలు వడ్డించేలోగా కాసేపు లోకాభిరామాయణం మాట్లాడుకున్నారు.

ఆనందరావు విజ్ఞాన ఖని అని పూర్తిగా నమ్మకం కుదిరిపోయింది కృష్ణాజీకి.

మాటల సందర్భంలో ఆనందరావు అడిగాడు రాజాని.

"ఏరా బాబూ! పెద్దయ్యాక ఏం చెయ్యదలుచుకున్నావ్?"

"సుఖంగా బతకదలుచుకున్నాను" అన్నాడు రాజా తక్షణం.

"సుఖంగా బతకాలంటే ఏదో ఒకటి చెయ్యక తప్పదుగా! ఏం చేస్తావ్?"

తడుముకోకుండా జవాబు చెప్పాడు రాజా.

"గ్యాంగ్‌లీడర్‌ని అవుతా!"

కృష్ణాజీ తన నవ్వు ఆనందరావుకి కనబడకుండా మొహం పక్కకి తిప్పుకున్నాడు.

కొద్దిక్షణాలపాటు దిమ్మెరపోయినట్లు ఉండిపోయాడు ఆనందరావుగారు.

తర్వాత తేరుకుని అన్నాడు –

"గ్యాంగ్ లీడరా? అంటే?"

"తెలీదా? రౌడీలకి రౌడీ!"

"అంటే....నువ్వు పెద్దయ్యాక రౌడీవి అవ్వాలనుకుంటున్నావా?"

"కాదు! ఇప్పుడే నేను రౌడీని! పెద్దయ్యాక పెద్ద రౌడీని, అంటే రౌడీలకి రౌడీని అవుతాను."

"రౌడీగా బతికితే, రౌరవాది నరకాలు తప్పవు నాయనా!"

"రౌరవాది నరకాలు అంటే....టూ టౌన్ పోలీసుస్టేషన్ లాకప్ సెల్‌లాగా వుంటాయా?

ఏం చెప్పాలో తోచక, కృష్ణాజీవేపు చూశాడు ఆనందరావు.

"వాడినలాగే మాట్లాడనివ్వండి" అన్నట్లు సైగచేశాడు కృష్ణాజీ.

"నరకంలో పెట్టే బాధలతో పోలిస్తే, పోలీసుస్టేషన్‌లో పెట్టే హింసలు ఆటలో అరటిపండు లాంటివన్నమాట" అన్నాడ ఆనందరావు.

"అంటే అక్కడేం చేస్తారు?"

"అక్కడా....అక్కడ పాపం చేసిన వాళ్ళని సలసలకాగే నూనెలో వేయిస్తారు. ఇంకా మహా పాతకాలు చేసిన వాళ్ళనయితే, ఒంటికి గాట్లుపెట్టి దాన్లో ఉప్పు, కారం కూరి, మరీ వేయిస్తారు."

ఆయన ఊహించినట్లు రాజా భయపడలేదు.

పైపెచ్చు పడీపడీ నవ్వాడు.

"ఏమిటీ? మనిషిని కోసి ఉప్పు, కారం పెట్టి వేయిస్తారా? డీప్‌ఫ్రై అన్నమాట!"

"శూలం పాతి, దానిమీద కూర్చోబెడతారు."

నవ్వి నవ్వి, రాజా కళ్ళెంబడి నీళ్ళు తిరిగాయి.

"తమాషాగానే వుంది" అన్నాడు. అని యింకా అన్నాడు రాజా.

"ఇదేవుంది గానీ, యింతకంటే తమాషా జోకొకటి చెప్తా పైలోకం గురించి" అని చెప్పడం మొదలెట్టాడు.

"ముగ్గురు మనుషులు చచ్చి పైకెళ్ళారు. అక్కడ ఒక దేవదూత చిట్టా అంతా తిరగేసి మొదటి వాడితో అన్నాడు –

"నువ్వు చాలా పవిత్రంగా బతికావు! ఎప్పుడూ అమ్మాయిలతో వ్యవహారాలు పెట్టుకోలేదు. అందుకని నీకు ఖరీదయిన మెర్సిడెస్ బెంజ్ కారు ఇస్తున్నా. దీన్లో ఎక్కి షికార్లు కొడుతూ, తింటూ తాగుతూ కాలం గడిపెయ్" అని మెర్సిడెస్ బెంజ్‌కారు తాళాలు ఇచ్చాడు.

హుషారుగా కూనిరాగం తీస్తూ వెళ్ళి కారెక్కి వెళ్ళిపోయాడు ఆ పవిత్రుడు.

రెండో వాడివేపు తిరిగాడు దేవదూత.

"నువ్వు అంత పవిత్రుడివేం కాదు. అయినా అమ్మాయిలతో వ్యవహారాలన్నీ పెళ్ళికి ముందే కానిచ్చేశావ్! పెళ్ళయ్యాక పరాయి ఆడదానివేపు కన్నెత్తి చూడలేదు. అందుకని నీకు ఇదిగో ఈ ఇండియన్ అంబాసిడర్ కారు ఇస్తున్నా! దీన్లో షికార్లు కొట్టు" అని తాళం చెవులు ఇచ్చాడు.

రెండోవాడు అంబాసిడర్‌లో ఎక్కి వెళ్ళిపోగానే, మూడోవాడివేపు తిరిగాడు దేవదూత.

"నీ సంగతి ఇక్కడ రికార్డయి ఉంది. నువ్వు పెళ్ళికి ముందూ, పెళ్ళికి తర్వాత కూడా చెడుతిరుగుళ్ళు తిరిగావు. అందుకని నువ్వీ స్కూటర్‌తో తృప్తిపడు. వెళ్ళు" అన్నాడు.

బతుకు జీవుడా అంటూ మూడోవాడు స్కూటరెక్కి ఆకాశవీధుల్లో విహారాలు మొదలెట్టాడు.

కొంత దూరం వెళ్ళగానే పరమపవిత్రుడయిన మొదటివాడు కనబడ్డాడు స్కూటర్‌వాలాకి. తన ఖరీదయిన మెర్సిడెస్ బెంజ్ కారుని ఓ పక్కన ఆపి, స్టీరింగు మీద తల పెట్టుకుని దిగాలుపడి ఉన్నాడు.

"మంచివాడివని మెర్సిడెస్ బెంజ్‌కారు ఇచ్చారుగా! ఇంకా దిగులెందుకూ?" అన్నాడు స్కూటర్‌వాలా.

బెంజ్‌కారు అతను చెప్పాడు. "ఇప్పుడే నా భార్య కనబడింది. డొక్కు సైకిలు తొక్కుకుంటూ వెళ్తోంది తను" అన్నాడు కళ్ళనీళ్ళ పర్యంతమయి.

ఆనందరావుగారు ఏమనుకుంటాడో అని భయపడుతున్నట్లు ఆయన మొహంలోకి చూశాడు కృష్ణాజీ.

అతను ఊహించినట్లు ఆనందరావుగారికి కోపం రాలేదు. దయగా చూస్తున్నాడు ఆయన.

రాజాతో మృదువుగా అడిగాడు ఆయన.

"ఎవరు చెప్పారు ఈ జోకు నీకు?"

"జాస్మిన్!" అన్నాడు రాజా.

"జాస్మిన్ అంటే...."

చిన్నగా దగ్గాడు కృష్ణాజీ.

జాస్మిన్ ఎవరో చెబితే ఆనందరావుగారు పూర్తిగా భయపడిపోయి, రాజాని తన దగ్గర ఉంచుకోననే ప్రమాదం కూడా వుంది.

"జాస్మిన్ అంటే...." అన్నాడు రాజా మళ్ళీ.

మాట మార్చేశాడు కృష్ణాజీ.

"రాజా ఆప్షన్స్ ఇంకేం ఉన్నాయో కనుక్కోండి ఆనందరావుగారూ!"

"రౌడీలకు రౌడీవయ్యే అవకాశం రానివ్వంగానీ....అది కాకపోతే యింకేం అవుతావు?" అన్నాడు ఆనందరావు.

రకీమని చెప్పాడు రాజా.

"గ్రేట్ గాంబ్లర్! లేకపోతే కిల్లర్! లేకపోతే రెజ్‌లర్! ఏదీ కుదరకపోతే జాకీని అవుతా!"

నవ్వాడు ఆనందరావుగారు.

"చాలామంది నీ వయసు కుర్రాళ్ళు డాక్టరో, యాక్టరో అవ్వాలనుకుంటారు. అలాంటి ఆలోచన లేదా?"

"డాక్టర్ జాబ్ బోరు! యాక్టరంటారా? మొహానికి రంగేసుకోవడం అంటే నాకు నామర్దా!"

రాజా ఇంట్రెస్టుని తక్కిన విషయాలవేపు మార్చే అవకాశం దొరికినట్లనిపించింది ఆనందరావుకి. వెంటనే అన్నాడు –

"భాష ఎంత చిత్రంగా ఉంటుందో చూశావా? నామర్దా అంటే ఏమిటి?"

"చిన్నతనం! సిగ్గు లేకపోవడం."

"కాదు! నామర్దా అంటే నామరద్....మొగతనం లేకపోవడం.... అదే తెలుగు వాడకంలో నామర్దా అయిపోయింది. అలాగే యింకా ఎన్నెన్నో పదాలు ఉన్నాయి. ఉదాహరణకి చిన్న పిల్లలని ముద్దుగా "భడవా" అని తిడుతుంటారు. భడవా అనేదానికి ఎంత భయంకరమైన అర్థం వుందో వాళ్ళకి తెలియదు. 'భడవా' అంటే, "తార్పుడుగాడు" అని అసలు అర్థం."

"బ్రోకరన్నమాట!" అన్నాడు రాజా తనకు తెలిసిన పదాన్ని ప్రయోగిస్తూ.

రాజా ఇంట్రెస్టుని ఇంకొంచెం టెస్ట్ చెయ్యదలుచుకున్నాడు. ఆనందరావు చెప్పాడు. "అలాగే, నంగనాచి అని అంటుంటాం. దీనికి మూలం "నంగే నాచీ" అంటే బట్టలిప్పి డాన్సు చెయ్యడం! తెలుగులోకి వచ్చేసరికి "ఏమీ తెలియని" అని అర్థం వచ్చింది."

"భాషలు చాలా చిత్రంగా అభివృద్ధి చెందుతాయి. ఉదాహరణకి ఇంగ్లీషు వుంది. ఎన్ని భాషలనుంచో, ఎన్నెన్నో పదాలని అరువుకి తెచ్చుకుని, అది ప్రపంచ

ప్రసిద్ధమైన భాషగా రూపు దాల్చింది. తెలుగు పదాలు కూడా నాలుగైదు చేరాయి ఇంగ్లీషులో."

"ఏమిటవి?" అన్నాడు రాజా అప్రయత్నంగా.

"పందికొక్కు, పందికొక్కే ఇంగ్లీషులో బాండికూట్ అయ్యింది. అలాగే తప్పు; తప్పు అనే పదం "టాబూ" అయ్యింది. హిందీ నుంచి "జంగిల్" "పండిట్" "బజార్" మొదలయిన పదాలు ఇంగ్లీషులో చేరాయి. అలాగే తెలుగులో చేరిన ఇంగ్లీషు పదాలకి లెఖ్ఖలేదు. మనం నాలుగు మాటలు మాట్లాడామంటే, అందులో రెండు ఇంగ్లీషు పదాలే వుంటాయి" చెబుతూనే, రాజా వైపు చూశాడు ఆనందరావు.

కదలకుండా, మెదలకుండా, కూర్చుని కళ్ళూ, చెవులూ అప్పగించి ఆయన చెప్పేది వింటున్నాడు రాజా.

ఆనందరావు యింకా చెప్పడం మొదలెట్టాడు.

"ఇంగ్లీషు తర్వాత అంత అధికంగా తెలుగులో చేరిపోయినవి పర్షియన్ పదాలు. దీనికి కారణం వుంది. మనదేశం అనేక సంవత్సరాలపాటు మహమ్మదీయుల, ఆంగ్లేయుల పాలనలో ఉండిపోయింది. మహమ్మదీయులకు చాలా మందికి అప్పట్లో పర్షియన్, అంటే "పార్సీ" రాజభాష. రెవెన్యూ, న్యాయశాఖలలో ఉపయోగించబడిన పార్సీపదాలే యిప్పుడు మనకి నిత్యం వాడుకలో వుంటున్నాయి."

"ఏమిటవి?" అన్నాడు రాజా.

"జుల్మానా, వాయిదా, సిఫారస్, జమీన్‌దార్, తహసిల్దార్... ఇలా అనేకం వున్నాయి."

తనకు తెలియకుండా నోరు తెరిచి వింటున్నాడు రాజా.

సంతోషంగా కృష్ణాజీ వైపు తిరిగాడు ఆనందరావు.

"నాకిప్పుడు ధైర్యం వచ్చిందండీ! కుర్రాడికి యిన్నాళ్ళనించి సరైన పద్ధతిలో చెప్పేవాళ్ళు దొరకలేదు. ఇప్పుడు మీరున్నారు. నేనున్నాను. కొత్త విషయాలు తెలుసుకోవాలనే శ్రద్ధ వీడికి వుంది. ఇంకేం ఫర్వాలేదు."

కృష్ణాజీ మొహం వికసించింది.

అతనికి తెలుసు.

రాజా ఒక జీనియస్.

ఈ జనరేషన్‌లో యిలాంటి బాల మేధావులు అనేకమంది పుడుతున్నారు.

నిజంగానే ఇదివరకటికంటే ఇలాంటి బాలమేధావులు ఎక్కువగా పుడుతున్నారా?

లేదా, కమ్యూనికేషన్స్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్స్ ఎక్కువ కావడం వల్ల యిలాంటివాళ్ళ వివరాలు ఎక్కువగా బయటికి వస్తున్నాయా?

బహుశా బాల మేధావుల సంఖ్య ఎక్కువ అవుతూ ఉండడమే నిజం కావచ్చు! తరతరాల మానవుడి నాగరికత విజృంభణని తమలో యిముడ్చుకున్న జీన్స్, ఈ తరంలో పిల్లలని యిలా మారుస్తున్నాయేమో!

ఇలాంటి ఛైల్డ్ ప్రాడిజీల వివరాలు చెప్పుకోవాలంటే అనేకం! పేర్లు వెంటనే గుర్తు రావడం లేదుగానీ, ఒక పిల్లాడు మూడో ఏటే ఎక్స్‌పర్ట్ కెమేరామేన్ అయిపోయాడు. ఒక పిల్లాడు ఎనిమిదో ఏటే ఎక్స్‌పర్ట్ డ్రయివర్ అయిపోయి, కార్లో ఇక్కడి నుంచి బెంగుళూరు దాకా వెళ్ళిపోయాడు. అక్కడి పోలీసు అధికారులు ఆ పిల్లాడి ఫీట్‌కి మెచ్చుకుని అభినందించాలా, లేకపోతే డ్రయివింగ్ లైసెన్స్ లేకుండానే (మరీ చిన్నపిల్లాడు కదా. అందుకని లైసెన్స్ లేదు, రాదు కూడా!) డ్రయివ్ చేస్తున్నందుకు ఫైన్ వెయ్యాలా అన్న తర్జన భర్జనలో పడి, చివరికి తప్పనిసరై ఆ కుర్రాడికి ఫైన్ వేసి వసూలు చేశారు.

ఒక ఎనిమిదేళ్ళ కుర్రాడు పద్దెనిమిది వందల కిలోమీటర్లు సైకిల్ తొక్కుతూ ఒక నగరం నుంచి యింకో నగరానికి వెళ్ళాడు.

ఒక పిల్లాడు మూడో ఏటే సంగీతంలో రాగాలన్నీ కనుక్కోగలిగాడు.

ఒక ఆర్టిస్ట్ తన మూడో ఏటే “పర్‌ఫెక్ట్ సర్కిల్” గీయగలిగాడు.

మొన్నటికి మొన్న విదేశాల్లో వుంటున్న గణేష్ అనే ఒక శ్రీలంక కుర్రాడు పదమూడో ఏటే గ్రాడ్యుయేట్ అయి రికార్డు సృష్టించాడు.

పైగా, అతనికి మూడు నాలుగేళ్ళ వయసు ఉండగానే తనంతట తనే లెఖ్ఖల్లో ఒక విషయాన్ని కనిపెట్టాడు. ఒకరోజు వాళ్ళమ్మతో కలిసి కార్లో వెళుతూ తీవ్రమైన ఆలోచనలో పడిపోయాడు గణేష్. హఠాత్తుగా అన్నాడు "అమ్మా! నీకు తెలుసా? 1/8 +1/9 +1/7 +1/6 +1/4 +1/3 +1/5.... అలా ఎన్ని కలుపుకుంటూ వెళ్ళిపోయినా అది ఎప్పటికీ పూర్తిగా ఒకటి కాదు!" అని

ఆ విషయం అంత చిన్న పిల్లాడికి తోచటం అబ్బురమే!

అలా వుంది ఈ జనరేషన్!

ఆ కేటగిరీకే చెందుతాడు ఈ రాజా కూడా.

అయితే యిక్కడొక ప్రాధమిక వ్యత్యాసం వుంది.

పైన చెప్పిన పిల్లలందరూ అప్పర్ మిడిల్ క్లాస్‌కు, కాకపోతే ధనిక వర్గానికో చెందినవాళ్ళు.

అందుకే వాళ్ళ టాలెంటు పత్రికా ముఖంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

వాళ్ళ టాలెంట్ పూర్తిగా వికసించడానికి సరైన వాతావరణంలో పెరుగుతారు వాళ్ళు.

చాలా ఎత్తులు అందుకుంటారు కూడా.

ఈ రాజా అలా కాదు.

ఇతను నికృష్టమైన జీవితంలోకి నెట్టివేయబడ్డ అభాగ్యుడు.

ఇతను నివురుగప్పిన నిప్పు.

ఛుప్పారుస్తుం.

ఇతను తన కంట బడడం యితని అదృష్టం.

తనకి చాలా తృప్తిగా వుంది కూడా.

నిజంగా డిజర్వింగ్ కేసు రాజాది.

ఆ రాజాకి తను చేయూత యిస్తున్నాడు.

కొంచెం వుత్సాహం యిస్తేచాలు–

ఆ తర్వాత యితను అందుకోబోయే ఎత్తులు యిప్పుడే ఎవరు ఊహించగలరు?

ఇంతలో భోజనాలకి పిలుపు వచ్చింది.

అందరూ భోజనాలకి కూర్చున్నారు.

భోజనాలకి ముందు కాళ్ళు కడుక్కోవడం అనేది కొత్తగా తోచింది రాజాకి. అయినా అందరూ అలా చేస్తున్నారు కాబట్టి తను కూడా చెయ్యక తప్పలేదు.

కంచంలో వున్న అధరువులని చూడగానే రాజాకి నోరు చప్పబడి పోయినట్లయింది.

ఇట్లాంటి గడ్డి తను ఎప్పుడూ తినడు.

ఎంత ఆకలిగా వున్నా కూడా.

కంచంలో పెసర పచ్చడి, పొట్లకాయ కూర, అన్నం వడ్డించి వున్నాయి. పక్కనే గిన్నెలో చారుపెట్టి వుంది.

నిన్న ఒక పెద్దమనిషి పర్సు కొట్టేసి చైనీస్ హోటల్లో తను జల్సాచెయ్యడం గుర్తొచ్చింది రాజాకి.

అది ఒక ఫుడ్ ఫెస్టివల్!

ఇదీ....

ఇది కరువు బాధితులకు పెట్టే తిండి పొట్లాలలోని అన్నంలాగుంది.

ఈ గడ్డి తింటూ తను ఇక్కడే వుంటే మూడురోజుల్లో మంచినీళ్ళడక్కుండా చచ్చూరుకుంటాడు.

భోజనాలయ్యాక కృష్ణాజీ అన్నాడు.

“మాస్టారూ! నేను శెలవు తీసుకుంటాను. మళ్ళీ పొద్దున కనబడతాను.”

“మంచిది” అన్నాడు ఆనందరావుగారు.

రాజాని పక్కకి పిలిచి, జాగ్రత్తలు చెప్పి, వెళ్ళిపోయాడు కృష్ణాజీ.

రాజాని పక్కన కూర్చోబెట్టుకుని, ఇంకాసేపు అవీ ఇవీ ప్రశ్నలు అడిగాడు ఆనందరావు.

తర్వాత అన్నాడు రాజా.

"ఒక్కసారి బయటికి వెళ్ళి వస్తాను"

"ఎందుకు?"

చిటికెన వేలు చూపించాడు రాజా.

"లోపల బాత్‌రూం ఉంది"

"కొత్తప్లేస్‌లో నాకు రాదు"

నవ్వాడు ఆనందరావు.

"పారిపోయే ప్రయత్నం చెయ్యకు! కృష్ణాజీ ఇక్కడంతా కాపలాపెట్టే ఉంటాడు.

"అంత అవసరం వస్తే వెళ్ళిపోతా. పారిపోయే ప్రశ్నేలేదు" అని బయటికి వెళ్ళాడు రాజా.

సందు చివర్లో వుంది పాన్‌షాపు.

అక్కడికెళ్ళి, సిగరెట్ అంటించాడు రాజా.

సిగరెట్ కాలుస్తూ పరిశీలనగా అటూ ఇటూ చూశాడు.

అక్కడికి దగ్గరలోనే కనబడ్డాడు ఒక మనిషి. బలిష్టంగా ఉన్నాడు.

అతన్ని చూడగానే గుర్తు పట్టేశాడు రాజా.

అతను గోవిందరాజులు. టూ టవున్ పోలీసుస్టేషను కానిస్టేబులు.

అనుమానం లేదు. టైగర్ కృష్ణాజీ తన మీద కాపలా దిట్టంగానే ఉంచాడు.

నోరు సిగరెట్ వాసన రాకుండా పాన్ వేసుకుని, నమిలి ఉమ్మేసి ఆనందరావు ఇంటికి తిరిగి వచ్చాడు రాజా.

అతన్ని చూసీ చూడనట్లు వూరుకున్నాడు ఆనందరావు.

కాసేపటి తర్వాత అన్నాడు

"బయట నీ పడక! పడుకుని పొద్దున్నే లే! అర్థమయ్యిందా?"

తను ఇంకొకళ్ళకి ఆర్డర్స్ ఇవ్వడమే గానీ తను ఇంకొకళ్ళు చెప్పిన మాట వినడం అలవాటు లేదు రాజాకి. చిరాకు ఆపుకుంటూ చూశాడు.

తర్వాత ఏమనుకున్నాడోగానీ లేచి వెళ్ళి, మంచం మీద పడుకుని దుప్పటి ముసుగు తన్నాడు.

పడుకున్న అతనికి వెంటనే నిద్ర పట్టలేదు – గతం గుర్తొచ్చింది.

అయిదో ఏట తను ఇల్లొదిలి పారిపోయి వచ్చాడు.

ఆ రోజునుంచి తన చిన్న పొట్టని తనే పోషించుకోవడానికిగానూ ఒక బూట్ పాలిష్ కుర్రాడి దగ్గర అసిస్టెంటుగా చేరాడు. వాడిపేరు గురు. వాడికీ ఏడేళ్ళకంటే ఎక్కువ వయసు లేదు. వాడు సెంటర్లో నడుస్తున్న పాదాల మీదే దృష్టి కేంద్రీకరించి, "గిరాకీ" లని పట్టేస్తూ వుండేవాడు.

మనిషి తన ముందు ఆగగానే, ఒక అట్టని ముందుకు తోసేవాడు తను. గురుగాడు పుసులు పట్టిన కళ్ళతో బూటుని చూస్తూ బ్రష్ చేసి తనకి అందించేవాడు. తను వాటికి నీళ్ళు కలిపిన రంగు పట్టించేవాడు. రంగు ఆరగానే గురూగాడు పాలిష్ పట్టించేవాడు. బ్రష్ చేసేవాడు. చివరగా తను బూటుని తన గుండెకి ఆనించుకుని ఒక బట్టతో మెరుపు వచ్చేలా తుడిచేవాడు.

గురూగాడికి రూపాయి వస్తే తనకు పావలా వచ్చేది.

అదీ లెఖ్ఖ!

ఒక సంవత్సరం అలా అప్రెంటిస్‌గా పని చేశాక – తనే బ్రష్షూ, పాలిష్ డబ్బాలూ, రంగు సీసాలూ కొని సొంతంగా బిజినెస్ పెట్టుకున్నాడు. అవును మరి! ఎన్నాళ్ళని ఇంకొకడి మోచేతికింద నీళ్ళు తాగుతాడు తనూ? తను గురూగాడితో బాటు, వాడి పక్కనే తన సామగ్రి అంతా ముందు పెట్టుకుని, "పాలిష్, పాలిష్!" అని అరుస్తూ ఉండేవాడు. తన మొహం చూసో, తన మాటలకి ఇంప్రెస్ అయ్యోగానీ పుసులు కట్టిన కళ్ళతో వుండే గురుగాడి దగ్గరికంటే తన దగ్గరికే గిరాకీలు ఎక్కువమంది

వస్తూ ఉండేవాళ్ళు.

ఒకరోజు "అడ్డా" విషయంలో తనకీ గురూగాడికి తగువు వచ్చింది. వాడు పెద్దవాడు కాబట్టి తనని తన్ని తగిలేశాడు అక్కడ నుంచి.

అయితే లక్కీగా అప్పటికే తను అంతకంటే మంచి అడ్డా ఒకటి వెతికి వుంచుకున్నాడు. తనకి తెలుసు! గురూగాడికి తను కాంపిటీషన్‌గా అక్కడే వుండడం ఇష్టం వుండదని.

తన కొత్త అడ్డా ఒక పెద్ద హొటలు.

ఆ హొటల్‌కి తను పొద్దున్నే వెళ్ళేవాడు.

ప్రతి రూమూ బజర్ నొక్కి "బూట్ పాలిష్ సార్!" అని అరిచేవాడు.

నాలుగైదు రూములకి ఒక రూములో తనకి బేరం దొరికేది.

బూట్లన్నీ తీసుకెళ్ళి, మెట్లకింద కూర్చుని, ఛమకాయించేటట్లు పాలిష్ కొట్టి తెచ్చి ఇచ్చేసేవాడు.

తన మొహం తనకి పెద్ద వరం.

బూట్లు పాలిష్ చేసినందుకు కూలీతోబాటూ, టిప్పు కూడా బాగానే ముదుతుండేవి.

అట్లా కొన్నాళ్లు బాగానే గడిచింది.

ఒకరోజున మామూలుగానే తను హొటల్‌కి వెళ్ళాడు. రూముల బజర్ కొట్టి "పాలిష్ సార్" అని అరుస్తూ వుండగా....

హఠాత్తుగా ప్రత్యక్షమయ్యాడు మేనేజరు.

తన మెడ దగ్గర షర్టుని పట్టుకుని పైకి లేవదీశాడు.

'పటపటపట' చెంపలు కందిపోయేటట్లు కొట్టాడు.

"సార్! సార్! సార్! కొట్టకండి సార్!" అని తను ఆర్తనాదాలు చేస్తూ వుంటే....

ఉన్నట్లుండి ఒక రూము తలుపు తెరుచుకుంది.

నెమలి కంఠం రంగు పట్టుబట్టతో కుట్టిన లాల్చీ, చుడీదార్ పైజమా వేసుకున్న ఒక మనిషి గుమ్మం దగ్గర కనబడ్డాడు.

తీక్షణంగా చూసేకళ్లు, డ్రై చేసిన జుట్టు, కోరమీసం, పాన్‌ల మీద పాన్‌లు తింటూ వుండడం వల్ల గారపట్టిన పళ్లు, సన్నగానే వున్నా, దృఢంగా వున్న ఒళ్ళు.

అతను మాట్లాడుతుంటే సింహం శాసిస్తున్నట్లు వుంది.

"పురుషోత్తం! ఆ కుర్రాడ్ని వదిలెయ్!" అన్నాడు ఆ మనిషి.

వెంటనే భయభక్తులతో అతని మాటని శిరసావహించాడు మేనేజర్ పురుషోత్తమ్.

తర్వాత వినయంగా సంజాయిషీ చెప్పాడు.

"మాఫ్‌కర్నా సాబ్! ఇవాళ హొటల్లో దొంగతనం జరిగింది. ఈ వెధవే చేశాడని నాకు అనుమానంగా వుంది."

"ఏం పోయింది" అన్నాడు ఆ మనిషి.

"ఒక కస్టమర్‌ది – పర్సు"

"ఎంత వుంది అందులో?"

"రెండు వేలు!"

ఆ మనిషి నవ్వాడు. తర్వాత అన్నాడు మేనేజర్‌తో.

"దేఖో పురుషోత్తమ్! ఈ పోరగాడికి ఆరేళ్లు వుండవు. వీడు రెండు వేలు దొంగతనం చేస్తాడా? అనుమానమే! ఒకవేళ నిజంగానే చేశాడనుకో! వీడు పెద్ద ప్లేయర్ అవుతాడన్నమాట! నాకు పనికి వస్తాడు."

అప్పట్లో అతనెవరో తనకి తెలియదు గానీ, ఆ తర్వాత తెలిసింది.

అతని పేరు నర్సింగ్.

నర్సింగ్ ఒక పెద్ద దాదా.

హైదరాబాద్‌లో అతనికి ఎదురు లేదు.

హైదరాబాద్‌లో ఎక్కడ ఏ సంఘవ్యతిరేక కార్యకలాపం జరిగినా, దాని వెనక నర్సింగ్ అన్నా వుంటాడు. లేదా ఆ పని చేసిన వాళ్ళకి నర్సింగ్ ఆశీస్సులు వుండి వుంటాయి.

నర్సింగ్ అట్లా తన తరఫున మాట్లాడగానే, మేనేజర్ గాభరాగా తనని వదిలేశాడు.

"లోపలికి రారా" అని పిలిచాడు నర్సింగ్.

లోపలికి వెళ్ళాడు తను.

తన వివరాలు అన్నీ అడిగి తెలుసుకున్నాడు నర్సింగ్. ఆ పర్సు తనే కొట్టేశాడా అని మరీమరీ అడిగాడు.

భయంతో వణికిపోతూ చెప్పాడు తను – తను దొంగతనం చెయ్యలేదనీ తను దొంగని కాదనీ!

తన భయం చూసి నవ్వాడు నర్సింగ్. తర్వాత అన్నాడు.

"బేటా! దొంగతనం అంటే అదేదో తప్పని భయపడకు. బూట్లు పాలిష్ చేస్తూ వుంటే కాళ్ళ దగ్గరే పడివుంటావ్! అది ఒదిలెయ్! పైకి వచ్చే పద్ధతులు నేను చెబుతాను. అవి ప్రాక్టీస్ చేస్తూ వుండు. నీకు అవన్నీ ప్రాక్టీస్ అయ్యాక ఏదో ఒక మంచి రోజు చూసి 'జిప్' మని నిన్ను పెద్ద ప్లేయర్‌ని చేసేస్తా" అన్నాడు.

ఆ తర్వాత తనకి తను తినగలిగినంత టిఫిన్ పెట్టించాడు నర్సింగ్.

తనకి ఊహ తెలిసిన తర్వాత అలా పొట్ట పగిలేటట్లు తినడం అదే మొదటిసారి. మసాలా దోసె, వడా, పూరీ, డబల్ కర్రీ, డబల్ చట్నీ, డబల్ సాంబారు.... చివరగా కాఫీ.

తిన్న తర్వాత తనకి ఓ వందరూపాయల నోటు ఇచ్చాడు నర్సింగ్. తన గ్యాంగు మెంబరూ, కొన్ని ఏరియాలకి వస్తాద్ అయిన నజీర్‌కి అప్పగించాడు తనను.

వద్దనే సాహసం లేదు తనకి.

నజీర్ తనకి రకరకాల 'గేమ్స్'లో ట్రెయినింగ్ ఇచ్చాడు. తక్కిన 'ప్లేయర్ల'కి యింట్రడ్యూస్ చేశాడు.

తను చాలా చలాకీ!

అతి కొద్దికాలంలోనే పెద్ద 'ప్లేయర్' అయిపోయాడు తను కూడా.

చిన్న వయసులోనే పెద్ద ప్లేయర్.

ఒక స్టేజికి వచ్చాక నర్సింగ్ తనను పిలిపించాడు.

వినయంగా దణ్ణం పెట్టి నిల్చున్న తనతో అన్నాడు –

"దేఖోరే ఛోక్రా! నువ్వు కూడా ఇకనుంచి బిగ్‌లీగ్‌లోకి వచ్చెయ్యొచ్చు! నువ్వు గేమ్స్ ఆడుతున్న ఏరియాకి యికనుంచి నువ్వే ఇన్‌ఛార్జివి! సరేనా? ఇలాగే హుషారీ చూపించు. ఏడాది తిరక్కుండా మళ్ళీ ప్రమోషనిస్తా నీకు" అన్నాడు.

ఏడాది పూర్తయిపోయింది.

ఇవాళో రేపో తనకు మళ్ళీ ఇంకో 'ప్రమోషన్' రావాలి.

తన మీద తనకి బాగా నమ్మకం ఉంది.

ఇలా అంచెలంచెలుగా పైకి వచ్చేసి, ఏదో ఒకరోజున తను కూడా నర్సింగ్ అంతటి వాడయిపోతాడు.

నర్సింగ్‌కి రైట్‌హాండ్ అయిపోతాడు.

అలా రాకెట్‌లా దూసుకుపోతున్న ప్లేయర్‌ని పట్టుకొచ్చి, ఈ మేస్టారి దగ్గర పడేశాడు కృష్ణాజీ.

గురువంటే నర్సింగే గురువు.

అతని దగ్గర నేర్చుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి.

ఈ టీచరయ్య తనకు చెప్పేది ఏముంది? ఈన దగ్గర తను నేర్చుకునేది ఏముంది?

ఈయన చెప్పింది నేర్చుకుంటే, మహా అయితే తను పెద్దయ్యాక ఒక గుమాస్తా అవుతాడేమో!

నర్సింగ్ నేర్పించేది నేర్చుకుంటే, తనే పదిమంది గుమాస్తాలను పెట్టుకునే లెవెలుకి వచ్చేస్తాడు.

అవును మరి!

పెద్దయ్యాక తను బార్‌లు పెట్టాలి, లక్కీ గేమ్స్ నడపాలి, వడ్డీకి డబ్బులు

తిప్పాలి, తినిపించవలసిన వాళ్ళకి తినిపించాలి. హవాలా రాకెట్‌లో డాలర్ల బ్లాక్‌మార్కెటింగ్‌లో గంట గంటకీ మారే రేట్లు గమనిస్తూ వుండాలి.

వీటన్నిటికీ తనకి అవసరం అవుతారు గుమాస్తాలు.

ఈ టీచరుగారు తయారుచేసే రకం గుమాస్తాలు.

అరె! అట్లాంటి లెవెలుకి వెళ్ళే తనను పట్టుకుని తననే ఒక గుమాస్తాగా మార్చెయ్యాలని చూస్తారా?

పిచ్చోళ్ళు వీళ్ళు!

వీళ్ళు పిచ్చోళ్ళే!

కానీ తను పిచ్చోడు కాడు.

ఇప్పుడు తను అర్జెంటుగా నర్సింగ్‌ని కాంటాక్టు చెయ్యాలి.

బహుశా ఇప్పటికే నర్సింగ్‌కి తెలిసిపోయి ఉంటుంది జరిగింది అంతా!

ఇంద్రుడికి వళ్ళంతా కళ్ళే అంటారు.

నర్సింగ్‌కి ఊరంతా కళ్ళే!

ఊరంతా చెవులే!

ఎక్కడ ఏం జరిగినా, అది క్షణాల్లో తెలిసిపోతుంది నర్సింగ్‌కి.

తెలుస్తుంది నిజమే!

కానీ తెలియడం రెండు రకాలు!

ఒకటి! జరిగింది జరిగినట్లుగా తెలియడం.

రెండు! జరిగింది రంగూ, రుచీ మారి వేరే రకంగా తెలియడం.

నర్సింగ్‌కి జరిగింది జరిగినట్లే తెలియాలి. జరిగినదాన్లో తన తప్పేంలేదనీ, తను పోలీసు కుక్కలా మారిపోలేదనీ నర్సింగ్‌కి తెలియాలి.

లేకపోతే డేంజరు.

ఈ టైగర్ కృష్ణాజీ ఈ ఊళ్ళో ఇవాళ ఉంటాడు.

రేపు పోతాడు.

కానీ చచ్చేదాకా ఈ ఊరిని వదలంది నర్సింగే!

తను నర్సింగ్ మనిషి!

పోలీసు తొత్తుకాడు!

సాధ్యమైనంత త్వరలో ఈ డెవలప్‌మెంట్స్ అన్నీ నర్సింగ్‌కి చెప్పాలి. అర్జెంటు!

అలా ఒక నిర్ణయానికి వచ్చాక మంచం మీదనుంచి లేచాడు రాజా. రెండు దిండ్లు తీసి, మనిషి పడుకున్న ఆకారంలో పేర్చాడు. వాటి మీద దుప్పటి కప్పాడు.

"పడుకోరా నాయనా పడుకో!" అని ఆ దిండ్లకి చిచ్చికొట్టి, తర్వాత తను మంచం కింద దూరి పడుకున్నాడు.

ఆత్మరక్షణ కోసం నజీర్ నేర్పించిన శతకోటి ఉపాయాల్లో యిదొకటి!

కొత్త ప్లేస్‌లో పడుకున్నప్పుడు ఇంకోడు నిన్ను సర్‌ప్రయిజ్ చేసే ఛాన్స్ యివ్వకు.

నువ్వే ఇంకోడిని సర్‌ప్రయిజ్ చేసే పొజిషన్లో పడుకో.

మంచం కింద పడుకున్న రాజాకి మాగన్నుగా నిద్ర పడుతుండగా –

మాస్టారు అక్కడికి వచ్చాడు.

దుప్పటి తీసి రాజా వంటిని స్పృశించబోతుండగా –

చేతికి మెత్తగా తగిలాయి దిళ్లు!

షాకయిపోయాడు ఆయన!

ఏడీ వీడు. మనిషి పత్తాలేడు. దిళ్ళు పెట్టి, దుప్పటి కప్పి పారిపోయాడా?

ఇంతలో ఆయన కాళ్ళను మొసలి పట్టుకున్నట్లు పట్టేసుకున్నారు ఎవరో. తర్వాత బలంగా గుంజారు.

పట్టుతప్పి దభేలుమని కింద చతికిలపడ్డాడు ఆనందరావు.

అప్పుడు ఆయనకి కనబడ్డాడు మంచం కింద ఉన్న రాజా.

"ఏమిటిది?" అన్నాడాయన కోపంగా.

బద్ధకంగా కళ్ళు నులుముకుంటూ బయటికి వచ్చాడు రాజా.

"మీరా మేస్టారూ? ఎవడో నన్ను ఫినిష్ చెయ్యడానికి వచ్చాడనుకుని కాళ్ళు పట్టుకు గుంజా! ఇంకెప్పుడూ నన్ను యిట్లా సర్‌ప్రయిజ్ చెయ్యకండి. మీకే డేంజరు" అన్నాడు.

ఆనందరావుగారికి హఠాత్తుగా కోపం తగ్గిపోయి, దాని స్థానంలో ఉధృతమైన నవ్వు చోటు చేసుకుంది.

"ఓరి భడవా!" అన్నాడు మురిపెంగా.

వెంటనే అంటించాడు రాజా – "సార్....! నేను గ్యాంగ్ లీడర్‌ని కావచ్చు, రౌడీలకు రౌడీని కావచ్చు, కేటుగాడ్ని కావచ్చు, జగత్‌కిలాడీనీ, గ్రేట్ గాంబ్లర్‌నీ, కిల్లర్‌నీ కావచ్చు....కానీ డాఫర్‌నీ, బ్రోకర్‌నీ మాత్రం కాదు. మీరే చెప్పారుగా – 'భడవా' అంటే తార్పుడుగాడని అర్థమనీ...." అన్నాడు.

అవాక్కయిపోయాడు ఆనందరావుగారు.

వీడు పిల్లాడు కాదు! పిడుగు! నిజం!

"సరే! పడుకో. ఇంకెప్పుడూ ఇలా చెయ్యకు" అన్నాడు.

మళ్ళీ మంచం కింద దూరబోయాడు.

"పైన పడుకో" అన్నాడు ఆనందరావు.

"సార్....! నా ప్రాణాలు ఎలా రక్షించుకోవాలో నాకు తెలుసు.... ఈ విషయంలో నేనెవ్వరి మాటా వినను.... పాపం నా ప్రాణాలంటే నాకు పంచప్రాణాలు" అన్నాడు రాజా.

"సరే! నీ ఇష్టం" అని వెళ్ళిపోయాడు ఆనందరావు.

మంచం కింద దూరాడు రాజా.

అర్ధరాత్రి తర్వాత అతనికి నిద్రపట్టింది.

అది అతను మామూలుగా పడుకునే టైము.

పడుకున్న పావుగంటకే మళ్ళీ ఎవరో లేపేసినట్లు అనిపించింది.

బద్ధకంగా కళ్ళు తెరిచి చూశాడు.

ఇంకా తెల్లారినట్లు లేదు.

అయితే దీపాలు వెలుగుతున్నాయి.

మనుషులు మెదులుతున్న చప్పుడు.

కొద్ది నిమిషాల తర్వాత గణగణ గంట వాయిస్తున్న చప్పుడు వినబడింది. శ్లోకాలో, మంత్రాలో గాని చదువుతున్నారు ఆనందరావుగారు.

మంచం కింద నుంచి బయటికి వచ్చి, ఒళ్ళు విరుచుకున్నాడు రాజా.

హాల్లో అప్పటికే అరడజను మంది పిల్లలు వున్నారు.

వాళ్ళలో ఒకడు మహా మంచి బాలుడిలా కనబడుతున్నాడు.

వాణ్ణి పిలిచాడు రాజా.

"రేయ్ సత్రకాయ్!"

"ఎవరు? నేనా?" అన్నాడు 'సత్రకాయ్' అదిరిపడి.

"నువ్వే! సార్ అడిగితే నేను బయటికెళ్ళానని చెప్పు."

"అమ్మో! ఎక్కడికెళ్తున్నావ్?"

"టాయిలెట్‌కి!"

"లోపలుందిగా!"

"టాయిలెట్ కెళ్ళేటప్పుడు సిగరెట్ కాల్చాలి నేను. ఇక్కడ కాలిస్తే ఆయన గుండాగిపోతుంది"

నిలువు గుడ్లు పడ్డాయి 'సత్రకాయ్'కి. పిశాచపు పిల్లని చూసినట్లు చూశాడు రాజాని.

రాజా వెళ్ళిపోయాడు.

చాలాసేపటి తర్వాత తిరిగి వచ్చాడు.

వచ్చేటప్పుడు తాజ్‌మహల్ హొటల్లో సుష్టుగా తినేసి వచ్చాడు అతను.

ఎక్కడికి వెళ్ళావనీ ఏం చేసావనీ రాజాని అడగలేదు ఆనందరావు. పిల్లలని కూర్చోబెట్టుకుని పాఠం చెప్పడం మొదలెట్టాడు.

"ఇవాళ చరిత్ర పాఠం చెప్పుకుందాం! ప్రతి దేశానికీ, ప్రతి ప్రాంతానికీ ఒక చరిత్ర వుంటుంది. అలాగే, ప్రతి మనిషికీ కూడా ఒక చరిత్ర వుంటుంది.

అది మంచి చరిత్రా, దుష్ట చరిత్రా అన్నది వేరే సంగతి.

గొప్ప పనులు చేసినవాళ్ళు చరిత్రలో మిగిలిపోయి, చారిత్రక పురుషులు అవుతారు.

శ్రీకృష్ణదేవరాయలు అలాంటి యుగపురుషుల్లో ఒకడు.

శ్రీకృష్ణదేవరాయలు అనగానే సినిమాలో యన్.టి.ఆర్. పోషించిన పాత్రా, పైన వంపు తిరిగిన మీసం, ముత్యాల కిరీటం, ఇవి గుర్తొస్తాయి.

కానీ చరిత్రని పరిశోధిస్తే, శ్రీకృష్ణదేవరాయలు అంత అందగాడు కాదనీ, కాస్త పొట్టిగా, పీలగా ఉండేవాడనీ, మొహాన స్ఫోటకపు మచ్చలుండేవనీ తెలుస్తుంది. ఆయన ముత్యాల కిరీటం పెట్టుకునేవాడో లేదో గానీ, అప్పట్లో దర్బారు డ్రస్సులో "కుళ్ళాయి"కి చాలా ప్రాముఖ్యం ఉండేది. అంటే, మూరెడు ఎత్తున టోపీలాంటిది అందరూ తప్పనిసరిగా పెట్టుకునే వాళ్ళు. ఈ టోపీ ఎలా వుంటుందీ, న్యూస్‌పేపరుని పొట్లాంలా మడిస్తే ఎట్లా ఉంటుందో, అట్లా ఉంటుందన్నమాట! తిరుపతి వెళ్ళారా మీరెప్పుడన్నా?"

అక్కడున్న పిల్లలందరూ "వెళ్ళాం వెళ్ళాం" అన్నారు ఉత్సాహంగా.

అక్కడున్న వాళ్ళలో రాజా ఒక్కడే తిరుపతి వెళ్ళనిది.

ఆనందరావు చెప్పాడు –

"తిరుపతి గుళ్ళోకి వెళ్ళగానే ద్వారం పక్కనే కృష్ణదేవరాయల విగ్రహం

వుంటుంది. శ్రీకృష్ణదేవరాయలూ, ఆయనకి చెరోపక్కా ఆయన భార్యలు ఇద్దరూ –

ఆ విగ్రహాన్ని చూసినా, శ్రీకృష్ణదేవరాయలు కుళ్ళాయే పెట్టుకునేవాడని మనకు అర్థం అవుతుంది."

అలర్టుగా వింటున్నాడు రాజా.

అతనికి చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది ఆనందరావు చెబుతోంది. అనుభవం వున్న కథకుడు మంచి ఇంటరెస్టింగ్‌గా వున్న విషయం దగ్గర కథని మొదలెట్టినట్లు, ఏ పాఠం చెప్పినా, ముందు పిల్లలని ఆకట్టుకునే అంశంతో మొదలెడతాడు ఆనందరావు.

కృష్ణదేవరాయల కథ పూర్తికాకుండానే కృష్ణాజీ వచ్చాడు.

వస్తూనే అక్కడ జరుగుతున్న తతంగాన్నీ రాజా శ్రద్ధగా వినడాన్నీ గమనించాడు. అతని మొహంలో తృప్తి కనబడింది.

తర్వాత అన్నాడు ఆనందరావుతో.

"మాస్టారూ! నిన్ననే కదా అన్నాను. ఏ ఊళ్ళో ఎన్నాళ్ళు ఉంటానో తెలీదని. అది ఇవాళే నిజమయిపోయింది. మళ్ళీ ట్రాన్స్‌ఫర్ వచ్చేసింది నాకు" అన్నాడు.

"ఎక్కడికీ? ఎందుకూ?" అన్నాడు ఆనందరావు ఆశ్చర్యంగా.

"ఈ ఊళ్ళో నర్సింగ్ అనే గ్యాంగ్‌స్టర్ ఉన్నాడు. వాడు నేను ఈ ఊరికి వచ్చిన మొదటిరోజునే ఛాలెంజ్ చేశాడు. నేను మారకపోతే మూడు నెలలు తిరక్కుండా ఇక్కడ నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించేస్తానని – నేను మారలేదు. వాడు మాట నిలుపుకున్నాడు" అన్నాడు. తనకి ఇలాంటివి నిత్యకృత్యాలే అన్నంత తేలిగ్గా.

ఏమీ మాట్లాడడానికి తోచక మౌనంగా వుండిపోయాడు ఆనందరావు.

మాస్టారి దగ్గర శెలవు తీసుకున్నాడు కృష్ణాజీ.

తర్వాత రాజాని పక్కకి పిలిచాడు.

అనుమానంగా వెళ్ళాడు రాజా.

అనునయంగా చెప్పాడు కృష్ణాజీ. “చూడు రాజా! ఎవరినీ ఏమీ అడగను. నాకు ఎప్పుడూ ఎవరితో ఏ అవసరమూ రాదు. కానీ ఇవాళ నిన్ను ఒకటి అడుగుతున్నాను. చేస్తావా?” అన్నాడు.

ఎటూ చెప్పకుండా చూశాడు రాజా.

“నువ్వు చిన్నపిల్లాడివి! అయినా నిన్ను అడుగుతున్నాను. నిన్న నువ్వు ఒక మాట అన్నావే – అది చాలా కరెక్టు! పిల్లలు పెద్దాళ్ళయ్యాక ఏమవుతారో చెప్పలేం! కానీ నువ్వు పెద్దయ్యాక మంచివాడివి కావాలి. మంచి మనిషివి కావాలి! పదిమందికి పనికి వచ్చే పని ఏమన్నా చెయ్యాలి. నీ జీవితం దేశానికి ఉపయోగపడాలి.”

“చాదస్తపు గోల!” అన్నట్లు మొహం చిట్లించాడు రాజా.

ఒక్కక్షణం అతని మొహంలోకి చూశాడు కృష్ణాజీ.

“నీకెప్పుడు ఏ అవసరం వచ్చినా నీ కోసం నేను ఉన్నాను. ఉత్తరం రాస్తే వచ్చి వాలతాను. ఓకే? మే గాడ్ బ్లెస్ యూ! గుడ్‌లక్” అని భుజం తట్టి వెళ్ళిపోయాడు కృష్ణాజీ.

‘మంచిగా బతకడం’ అంటే సాయంత్రానికల్లా మొహం మొత్తేసింది రాజాకి.

మామూలుగా అయితే ఈపాటికి పది అడ్వెంచర్లు చేసి ఉండేవాడు తను. సేఠ్ బాబూలాల్ పని ఒకటి పెండింగ్ వుంది. అది చేస్తే కాస్త డబ్బొస్తుంది. కానీ ఏమీ చెయ్యడానికి లేకుండా తను ఇక్కడ ఇరుక్కుపోయాడు.

కానీ కొంతలో కొంత నయం!

ఈ టైగర్ కృష్ణాజీకి ట్రాన్స్‌ఫర్ అయ్యింది.

అది కూడా తన ఉస్తాద్ నర్సింగ్ ఇన్‌ఫ్లుయెన్స్ వల్ల!

బహుశా రేపు ఈయన ఊరొదిలి వెళ్ళిపోతాడు. ఆ వెంటనే తను ఈ చప్పిడి మెతుకుల జైల్లో నుంచి బయటపడి పోతాడు! ష్యూర్!

రాత్రికి పథ్యం భోజనం లాంటిది తిని పడుకున్నాడు రాజా.

తన పద్ధతి ప్రకారమే పైన దిళ్ళూ, మంచం కింద తనూ!

అలవాటు ప్రకారం అర్థరాత్రి అవుతుండగా నిద్రపట్టింది.

మగత నిద్రలోనే తెలుస్తోంది మనిషి నడుస్తున్న చప్పుడు.

వస్తున్నాడు మంచి మాష్టారు.

చాదస్తపు పీనుగ! చంపుతాడు ఇప్పుడు.

అడుగుల చప్పుడు దగ్గరయ్యింది.

మరుక్షణంలో....

మంచం పైకి లేచిపోయింది.

ఇద్దరు మనుషులు తనని కాళ్ళూ చేతులూ కదలకుండా పట్టేసుకున్నారు.

పెనుగులాడుతూ వాళ్ళ మొహాల్లోకి చూశాడు తను.

వాళ్ళలో ఒకడు ఆనందరావు మాస్టారు.

ఆయన మొహంలో ఎగ్జయిట్‌మెంటు కనబడుతోంది. మంచితనం కనబడటం లేదు.

ఆశ్చర్యంగా రెండో మనిషి వేపు చూశాడు రాజా.

అతను దాసు!

సారా దాసు!!

తన తండ్రి!!!

జేబులో నుంచి ప్లాస్టిక్ వైరు తీశాడు దాసు.

చాకచక్యంగా రాజా కాళ్ళూ, చేతులూ బిగించి కట్టేశాడు.

జేబులోనుంచి ప్లాస్టర్ తీసి, రాజా నోటికి అడ్డంగా అతికించాడు.

"మాస్టారూ! ఒక గోతం వుంటే తీస్కురా" అన్నాడు దాసు.

మాస్టారు పరిగెత్తుకెళ్ళి ఒక గోనె సంచీ తెచ్చాడు.

గోనె సంచీలోకి రాజాని కుక్కాడు దాసు.

గోనె సంచీ మూతి బిగించి కట్టేశాడు.

"వస్తా మాస్టర్జీ"

"నా సంగతి కనిపెట్టి వుండు"

"అయ్యబాబోయ్! ఎంతమాట! నువ్వు నన్ను మర్చిపోకు. నేను నిన్ను మర్చిపోను. అదే మన యండర్ స్టాండింగు. సరేనా?" అన్నాడు దాసు.

బయట రిక్షా నిలబడి వుంది. రిక్షా అతని సాయంతో బస్తాని సాయంపట్టి, రిక్షాలో కాళ్ళు పెట్టుకునే చోట కుదేశారు.

రిక్షా కదిలింది. యమ బాధ కలిగింది రాజాకి.

బస్తాని రిక్షాలో సరిగా వుంచలేదు వాళ్లు. సగం రిక్షాలో వుంది. సగం కిందికి జారుతున్నట్లు వుంది. రాజా తల రిక్షా టైరుకి తగులుతోంది.

పైగా, రాజా వున్న బస్తా మీద కాళ్లు పెట్టుకుని కూర్చున్నాడు దాసు.

కాసేపయ్యాక, శక్తి కూడదీసుకుని అడిగాడు రాజా.

"ఎక్కడికి తీసుకెళ్తున్నావ్ నన్ను?"

"అమ్మనీయమ్మ! నిన్నెక్కడికి తీసుకెళ్ళాలో నాకు తెల్దా? నోరు ముయ్యహే!"

తిరుగుతున్న టైరు తలకి తగులుతూ వుంటే, తలని కొబ్బరి తురిమే పీటకి వేసి రాస్తున్నట్లు అనిపిస్తోంది రాజాకి.

గబగబా ఆలోచిస్తున్నాడు రాజా.

ఎక్కడికి తీసుకెళ్తున్నాడు తనని?

ఏం చేస్తాడు?

ఏవో వెధవ పనులే చేయిస్తాడు.

వెధవ పనుల్లో కూడా రెండు రకాలు వుంటాయి.

దర్జాగా చేసే వెధవ పనులు!

డ్రైనేజీ గుంటలో చేపలు పట్టే లెవెలు వెధవ పనులు.

తను మొదటి రకంవి చేస్తాడు. ఈయన రెండో రకం.

ఆ పిచ్చిపిచ్చి పనులన్నీ తనచేత చేయిస్తాడు కాబోలు!

అయినా ఈయనకీ ఆ మాస్టారికీ ఎట్లా కుదిరింది లంకె!

అరె ఉస్కీ....భలే చాలూగాడే ఆ మాస్టారు!

అందర్‌సే బడే దాలిమ్....బాహర్ సే బడే భోలే....

ఒప్ఫో! బహుత్ ఘాయల్‌కీ ఆద్మి!

చుప్పారుస్తుం! తీస్‌మార్ ఖాన్!

మొత్తానికి భలే మోసపోయాడు టైగర్ కృష్ణాజీ.

అయ్యో పాపం! అయ్యయ్యో పాపం!

బిచారా! ఉల్లూ బన్‌గయా!

తన దారిన తనని బతకనివ్వక ఆ బడిపంతులి దగ్గర చేర్చాడు.

అయ్యగారికి తిక్క తిన్నగా కుదిరింది ఇప్పుడు.

ఇలా ఆలోచిస్తున్నంతసేపూ రాజా వేళ్ళు గోనె సంచీని గీకుతూనే వున్నాయి.

అతని ఎడం చేతి గోళ్ళలో ఇమిడి వున్నాయి పదునుగా వున్న కొత్త బ్లేడు ముక్కలు అతను అనుక్షణం అలర్టుగా వుంటాడు.

రిక్షా ఆగేసరికి గోనె సంచికి సుమారైన కంత పడింది.

దాసూ, రిక్షా అతనూ కలిసి రిక్షాలో నుంచి గోనె సంచిని దింపబోతుండగా – ఊహాతీతంగా అందులో నుంచి అతి వేగంగా బయటికి వచ్చేశాడు రాజా! రపారపా ఇద్దరి నెత్తినా రెండు చరుపులు చరిచి, మరుక్షణంలో మాయమైపోయాడు.

అరగంట తర్వాత అతను ఒక పాసింజరు రైల్లో ఒక మూల నక్కి కూర్చున్నాడు.

మాస్టారు అంత నమ్మకద్రోహం చేసినందుకు రాజా ఆశ్చర్యపడలేదు. తడి

గుడ్డలతో గొంతులు కోసే మనుషుల మధ్య పెరిగినవాడు అతను. ఈ ప్రపంచంలో ప్రతివాడూ ఒక కేటుగాడని చెపితే అతను అసలు ఆశ్చర్యపోడు.

కానీ ఫలాని మనిషి నిజంగా మంచివాడని ఎవరయినా నమ్మించబోతే నమ్మడు అతను. నవ్వుతాడు.

అందుకే రాజా ఆనందరావు కపటాన్ని గురించి పట్టించుకోలేదు.

పైగా....

"ఇదీ ఒకందుకు మంచిదే" అనుకున్నాడు.

ఆ చప్పిడి మెతుకుల జైల్లోనుంచి బయటపడ్డానికి మంచి కారణం దొరికింది తనకి.

టైగర్ కృష్ణాజీ గనక మళ్ళీ కలిసి అడిగితే తను ధైర్యంగా చెప్పవచ్చు.

తన తప్పు కాదని....

పైగా....

ఆయన్నే అదరగొట్టొచ్చు.

తనని అక్కడ నుంచి ఆయనే తప్పించేశాడని!

తను కిలాడీ నా కొడుకు కాబట్టి సరిపోయింది గానీ....లేకపోతేనా అమ్మో!

ఆలోచనల్లో నుంచి బయటపడ్డాడు రాజా.

టిక్కెట్ కలెక్టరు వస్తున్నట్లున్నాడు.

తను పారిపోయి వచ్చే తొందరలో టిక్కెట్టు కొనలేదు.

అంటే ప్రతిసారీ టిక్కెట్టు కొనడం తనకి అలవాటని కాదూ....అయినా కూడా...

టిక్కెట్ కలెక్టర్ దగ్గరి కొచ్చేస్తున్నాడు.

అయినా భయపడలేదు రాజా. ప్రతి మనిషికీ, ప్రతిదానికీ రేటుంటుంది. ఎవర్నయినా, ఏదో ఒక రేటుకి కొనెయ్యవచ్చు అదీ అతని ఫిలాసఫీ!

వీడేం టైగర్ కృష్ణాజీనా? డబ్బుకి లొంగకపోవడానికి?

పైసా=లోనే పరమాత్మ వుంది. వీడికి నాలుగు పైసలు పారేస్తే వీడే కుక్కలాగా తోక వూపుకుంటూ తను చెప్పినట్లు చేస్తాడు.

జేబులో చెయ్యి పెట్టాడు రాజా.

పర్సు లేదు.

ఏమయ్యింది?

వెంటనే అతనికి తట్టింది.

తనని కట్టేసే టైంలోనే తన తండ్రి తన పర్సు కొట్టేసి వుంటాడు.

టిక్కెట్ కలెక్టర్ రాజా ముందే నిలబడ్డాడు.

"టిక్కెట్?"

"పోయింది" అన్నాడు రాజా తేలిగ్గా.

టిక్కెట్ కలెక్టర్ తాగి వున్నాడు.

నమ్మడం కష్టమే గానీ నిజం అదే!

ఈ మధ్యే జరిగింది ఒక సంఘటన!

తప్ప తాగి వున్న ఒక టీ.సీ. టిక్కెట్ లేదన్న నెపం మీద, ఒక స్త్రీనీ, పిల్లల్నీ కదులుతున్న రైల్లోనుంచి కిందికి తోసేశాడు.

దారుణం జరిగిపోయింది.

అలాంటి గతి తనకు పడుతుందేమోననిపించింది రాజాకి. ఇతను తోసేస్తే తను కింద పడడం కంటే, తను దూకెయ్యడమే మంచిది.

అలా అనిపించగానే, రేచు కుక్కలాగా లేచి, తలతో ఒక్కసారి టిక్కెట్ కలెక్టర్ కడుపులో పొడిచి, అడ్డంగా వున్న వాళ్ళని ఒడుపుగా తప్పించుకుంటూ తలుపు దగ్గరికి వెళ్ళిపోయి, ఆగి, కొద్ది క్షణాలపాటు రైలు వేగాన్ని గమనించి, తర్వాత లాఘవంగా రైలు పరిగెడుతున్న వేపే దూకేశాడు.

తాగి వున్న టిక్కెట్ కలెక్టర్ దెబ్బకి కిందపడి, మళ్ళీ లేవకుండా అట్లాగే మత్తుగా పడి వుండిపోయాడు.

రైలు ట్రాక్ పక్కన వున్న కంకర రాళ్ళమీద పడిపోయి అలాగే వుండిపోయాడు రాజా. కొద్దిక్షణాల తర్వాత రైలు అతన్ని దాటేసి వెళ్ళిపోయింది.

నెమ్మదిగా లేచి నిలుచున్నాడు రాజా.

ఒళ్ళంతా నొప్పులుగా వుంది.

చుట్టూతా చూశాడు.

అప్పుడే చీకటి విరుగుతోంది. పల్చటి వెలుగు వ్యాపిస్తోంది.

మోచేతి దగ్గర చల్లగా అనిపించింది.

తడిమి చూసుకున్నాడు.

జీన్సు మోకాళ్ళ దగ్గర చిరిగింది. అక్కడంతా రక్తం.

తల పంకించి కుంటుతూ ముందుకు నడిచాడు రాజా.

అలా నాలుగైదు కిలోమీటర్లు నడిచేసరికి దాదాపుగా తెల్లారిపోయింది. అక్కడక్కడ మనుషులు కనబడుతున్నారు.

దగ్గర్లోనే ఏదో ఊరు ఉందని గ్రహించాడతను.

అక్కడే కనబడింది చిన్న వాగు.

అక్కడ ఆగి, బట్టలు విప్పి వాగులోకి దూకాడు రాజా.

అలా అరగంట ఈదాక శరీరం పూర్తిగా స్వాధీనంలోకి వచ్చినట్లనిపించింది.

ఈదగానే ఆకలి మొదలవుతోంది రాజాకి.

ఒకవేళ ఊళ్ళోకి వెళ్ళినా జేబులో పైసా లేదు.

పరగడుపునే ఎవరి జేబన్నా తడమాలి తను.

అడుక్కు తినటం ఇష్టం లేదు తనకు!

ఒళ్ళు ఆరాక బట్టలేసుకుని మళ్ళీ నడక మొదలెట్టాడతను.

నలభై నిమిషాల తర్వాత ఊళ్ళోకి వచ్చాడు.

అప్పుడు కనబడ్డాడు ఆయన....

చూడడానికి అంతా ఆనందరావు మాస్టారిలాగే ఉన్నాడు. దాదాపు అదే వయసుంటుంది. ముతక ఖద్దరు పంచె, షర్టూ, ఉత్తరీయం, పొట్టిగా కత్తిరించబడిన వెంట్రుకలు పూర్తిగా తెల్లబడిపోయి వెండిలా మెరుస్తున్నాయి. మనిషి బక్కపలచగా వుండటం వల్ల చకచక నడుస్తున్నాడు.... కాళ్ళకి హవాయి చెప్పులు వున్నాయి.

ఆయన్ని చూడగానే తిక్కకోపం వచ్చింది రాజాకి.

ఆనందరావు మీద కలిగిన కసి అంతా ఈయన మీద తీర్చుకోవాలనిపించిది.

చటుక్కున ఆయన పక్కన చేరిపోయాడు రాజా.

పొరపాటున తగిలినట్లు ఆయనకి తగిలాడు.

ఉహుఁ! లాభం లేదు.

ఈయన దగ్గర పర్సేమీ లేదు.

విడిగా నోట్లు కూడా ఉన్నట్లు లేవు.

దానితో ఆయన మీద అకారణంగా కలిగిన కోపం పదింతలు పెరిగింది రాజాకి.

"వీడికి టోకరా వెయ్యకుండా వదలకూడదు" అనుకుంటూ ఆయన వెనకే నడిచాడు రాజా. కోపంలో ఆకలి కూడా తెలియడంలేదు అతనికి.

ఊరికి ఈ చివర నడక మొదలుపెట్టినవాడు, ఊరికి ఆ చివరిదాకా నడుస్తూనే వున్నాడు ఆయన. అక్కడొక చిన్న యింటి ముందు ఆగాడు.

చిన్న పెంకుటిల్లు అది.

అందులో సగం పడిపోయి ఉంది.

మిగిలి ఉన్న భాగంలో ఆయన ఉంటున్నట్లున్నాడు.

ఒక కుర్రాడు తననే అనుసరిస్తూ వస్తూ ఉండటం ఆయన గమనించలేదు. ఇంట్లోకి వెళ్ళి కండువా వంకీకి తగిలించి, కుర్చీలో కూర్చున్నాడు.

ఒక నిమిషం ఆగి అక్కడికి వెళ్ళాడు రాజా.

"సార్! కాసిని మంచినీళ్ళిప్పిస్తారా?" అన్నాడు మర్యాదగా.

ఆయన ఒకసారి రాజా వేపు చూసి, లోపలికి తిరిగి పెద్దగా అన్నాడు.

"అమ్మాయ్ అర్పితా! ఈ పిల్లాడికి కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టు" అన్నాడు.

"వస్తున్నా నాన్నా....!" అని ఒక అమ్మాయి గొంతు వినబడింది. చాలా సౌమ్యంగా వుంది ఆ గొంతు. వెంటనే ఒక పదహారేళ్ళ అమ్మాయి బయటికి వచ్చింది. వంటి మీద చౌకరకం గుడ్డలు. కానీ మొహంలో మాత్రం అదో రకమైన అహంభావం కనబడుతోంది. కొద్ది క్షణాల క్రితం వినబడిన సౌమ్యమైన గొంతుకీ, ఈ అమ్మాయి మొహంలో కనబడుతున్న భావానికి ఏ మాత్రం సంబంధం లేదు.

ఈ అమ్మాయి చేతిలో మంచినీళ్ళ గ్లాసు లేదు. రాజా వేపు ఒకసారి ఎగాదిగా, తృణీకారంగా చూసింది ఆ పిల్ల. తర్వాత గూట్లో నుంచి అచ్చనగాయలు తీసుకుని ఆడుకోవడానికి బయటికి వెళ్ళిపోయింది.

ఆ వెంటనే వంటింట్లో నుంచి బయటికి వచ్చింది ఇంకో అమ్మాయి. ఇందాక వినబడిన గొంతు తాలూకు ఓనరు యీ పిల్లే అయి వుంటుందని తక్షణం అర్థమైపోయింది రాజాకి.

ఈ అమ్మాయి చేతిలో ఉంది మంచినీళ్ళ గ్లాసు.

ఈ అమ్మాయి కూడా చాలా సాదాగా ఉన్న పరికిణీ, జాకెట్టు వేసుకుని వుంది. పెద్ద పెద్ద కళ్ళు, నవ్వుతూండే పెదిమలు.

"ఇదిగో" అని గ్లాసు రాజాకి అందించింది ఆ పిల్ల. ఆ అమ్మాయి పేరే అర్పిత.

గ్లాసు అందుకోవడానికి చెయ్యి జాచాలని కూడా తోచలేదు రాజాకి. చేష్టలుడిగినట్లు ఆ అమ్మాయి వేపు చూస్తూ వుండిపోయాడు.

మనసులోనే అనుకున్నాడు రాజా.

"ఇన్షాల్లా! లవ్ చేస్తే ఇట్లాంటి అమ్మాయినే లవ్ చెయ్యాలి.

అతనికి అంత పెద్ద ఆలోచన రావడం అదే మొదటిసారి.

ఆ ఆలోచన రావడంతోబాటే, ఆ పెద్దమనిషికి టోకరా ఇవ్వాలనే ఆలోచన రాజా మనసులోనుంచి మాయమైపోయింది.

మంచినీళ్ళు తాగి, గ్లాసు అందించేటప్పుడు కావాలని వేళ్ళు తాకించాడు రాజా.

కానీ ఆ అమ్మాయికి రాజాకున్నంత లోకానుభవం ఎక్కడిది?

దయగా నవ్వింది తను.

ఫ్యాంటు జేబులో చేతులు పెట్టుకుని బయటికి వచ్చేశాడు రాజా. ఆ అమ్మాయి యింకా అక్కడే నిలబడి కుతూహలంగా అతన్ని చూస్తోంది.

ఆ అమ్మాయి అటెన్షన్‌ని అలాగే ఆపెయ్యాలనిపించింది రాజాకి. తన హీరోయిజం ఆ అమ్మాయి ముందు ప్రదర్శించాలనిపించింది.

అర్జెంటు పనున్నట్లు ఆ దార్నే పోతున్న ఒక కుక్కని అదిలించాడు రాజా.

అది పళ్ళు బయటపెట్టి గుర్రుమంది.

"కొడతా" అన్నట్లు దాన్ని బెదిరించి, రాయి ఒకటి అందుకున్నాడు అతను.

అది బెదిరి కుయ్యోమంటూ పారిపోయింది.

గేదెల మంద ఒకటి వెళ్తుంటే, ఒక గేదె తోక పుచ్చుకుని మెలిపెట్టి "అహెయ్! ఠుర్! ఠుర్!" అన్నాడు.

గేదె ఆక్వార్డ్‌గా పరిగెత్తడం మొదలెట్టింది.

"నాకు భయమే లేదు చూశావా?" అన్నట్లు ఆ పిల్లవేపు చూశాడు రాజా.

నున్నగా గుండు చేయించుకున్న పిల్లాడు ఒకడు అటే వస్తుంటే –

"తిరుపతి గుండు, తిన్నంగుండు, బజారుకొస్తే భద్రంగుండు...." అని ఫెడీమని వాడి నెత్తిన కొట్టాడు.

వాడు అంతదూరం పరిగెత్తి, తర్వాత తిట్లు లంకించుకున్నాడు.

అర్పిత వేపు చూశాడు రాజా.

ఆమె నవ్వుతోంది.

అర్పిత వాళ్ళ ఇంటికి ఎదురుగా ఒక చిన్న షెడ్డు లాంటిది ఉంది. అరుగు, దాని మీద గోడలు.... పైన రేకులు....

"అంజన్ వ్యాయామశాల" అని రంగుల అక్షరాలతో రాసి ఉంది గోడ మీద.

రాజాకి చదవడం రాదు.

కానీ అతని సిక్స్త్ సెన్స్‌కి అర్థం అయ్యింది.

అది ఒక వ్యాయామశాల అని.

మామూలుగా వ్యాయామశాలలు ఉస్తాద్‌ల కంట్రోల్లో, ఒక్కోసారి రౌడీల కంట్రోల్లో వుంటాయి.

దీనికి ఉస్తాద్, రౌడీ ఎవరన్నా కాదుగదా!

అరుగు మీదికి ఎగిరి గబగబా నాలుగు పల్టీలు కొట్టాడు అతను.

తర్వాత ఓరగా అర్పిత వేపు చూశాడు.

గోడకీ, రేకుకీ మధ్య ఉన్న ఖాళీలో నాలుగు రోజుల క్రిందటి పేపరు గుచ్చి వుంది.

దాన్ని తీశాడు రాజా.

పేపరుతో అరుగు ఒక మూల దులిపి శుభ్రం చేశాడు.

పేపరు మధ్య షీటు తెరిచి, దాన్ని నేల మీద పరిచి, కూర్చోబోతూ వుండగా–

పేపర్లో ఉన్న ఒక ఫోటో అతనికి కనబడింది.

పేపరు మీద కూర్చోకుండా, మోకాళ్ళ మీద ప్రక్కన కూర్చుని, పేపరు ఎగిరిపోకుండా చేతులు ఆనించి చూశాడు రాజా.

అది కృష్ణాజీ ఫోటో.

ప్రెసిడెంట్‌చే గోల్డ్‌మెడల్ అందుకుంటూ ఉండగా తీసిన ఫోటో అది.

చాలాసేపు అతని ఫోటో వేపు చూస్తూ ఉండిపోయాడు రాజా.

తర్వాత ఆ ఫోటో ఉన్న పేపరు షీట్‌ని చింపి, జాగ్రత్తగా మడతపెట్టి, తన జేబులో పెట్టుకున్నాడు.

తర్వాత అర్పిత ఉన్న వేపు తిరిగాడు.

ఆమె లేదు అక్కడ.

అటే చూస్తూ కూర్చుండిపోయాడతను.

అరగంట గడిచింది.

అప్పుడు మళ్ళీ కనబడింది అర్పిత. ఆమె ప్రక్కనే ఆ గర్విష్టి అమ్మాయి. బహుశా అక్క అయి వుండాలి. ఇద్దరూ దాదాపు ఒకే పోలికలతో వున్నారు. స్కూలుకి బయలుదేరారేమో, ఇద్దరి చేతుల్లోనూ పుస్తకాలు వున్నాయి.

అక్క గుమ్మం దగ్గరికి వచ్చేసింది.

చెల్లెలు అర్పిత మాత్రం వచ్చేముందు వంగి, తండ్రి కాళ్ళకు దణ్ణం పెట్టి మరీ వచ్చింది.

ఎందుకో తెలియదుగానీ ఆ సీన్ అతడిని హఠాత్తుగా అప్‌సెట్ చేసేసింది.

ఆ అమ్మాయికి తండ్రి అంటే అంత భయభక్తులు ఉన్నాయన్నమాట!

తనకీ ఒక తండ్రి ఉన్నాడు.

కానీ కాళ్ళకి దణ్ణం పెట్టాల్సినంత గొప్పవాడు కాడు.

తను పుట్టిన తరువాత ఎవరి కాళ్ళకీ దణ్ణం పెట్టలేదు. అసలు అటువంటి మనిషి ఎవరూ తనకి తగల్లేదు కూడా.

దిగులంటే తెలీదు అతడికి. కానీ ఆ రోజు, అప్పుడు, మొదటిసారిగా దిగులనిపించింది. తను గడిపే జీవితం అంటే హఠాత్తుగా విసుగనిపించింది.

మళ్ళీ అర్పితవేపు చూశాడు.

అర్పితని వాళ్ళ నాన్న దగ్గరికి తీసుకుని, నుదుటిమీద ముద్దుపెట్టుకుని, ఆప్యాయంగా ఏదో అడుగుతున్నాడు.

ఆయన ఆ అమ్మాయిని అడుగుతున్నదేమిటో వినబడలేదు రాజాకి.

కానీ ఊహించడానికి ప్రయత్నించాడు.

"అన్నం తిన్నావా అమ్మా? పుస్తకాలన్నీ తీసుకున్నావా? డబ్బులున్నాయా? జాగ్రత్తగా వెళ్ళేం! మధ్యాహ్నం అన్నం తినడం మర్చిపోకూ! సాయంత్రం ఆడుకునేటప్పుడు జాగ్రత్తేం! వెళ్ళిరా తల్లీ! జాగ్రత్త నాన్నా!"

సరిగ్గా అవే మాటలు అంటున్నాడు ఆ పెద్దమనిషి తన కూతురు అర్పితతో. ఆయన పేరు సదాశివ బ్రహ్మం. పెద్దకూతురు అంకిత వేపు చూశాడాయన. ఆ అమ్మాయికి తనంటే అంత లక్ష్యం లేదు. తనంటేనే కాదు– ఎవరన్నా కూడా లక్ష్యం లేదు ఆ అమ్మాయికి. పెడసరి స్వభావం.

ఇంకోసారి అర్పిత తల నిమిరి, సాగనంపాడు ఆయన.

వెళ్తూ వెళ్తూ రాజావేపు చూసి నవ్వింది అర్పిత.

చెయ్యి ఊపాడు రాజా.

తర్వాత చాలాసేపు అలాగే కూర్చుండిపోయాడు.

ఆ తర్వాత జేబులోనుంచి పేపరు కట్టింగ్ తీశాడు. ధర్మదేవతకి దత్తపుత్రుడిలాంటి కృష్ణాజీ ఫోటో వేపు చూస్తూ ఉండిపోయాడు.

క్రమంగా, అతనికి తెలియకుండానే అతని చేతులు ఆ ఫోటోలోని అతని మొహం దగ్గరికి తీసుకొచ్చాయి.

అప్రయత్నంగానే ఫోటోని కళ్ళకి అద్దుకున్నాడు రాజా.

వెంటనే అతనికి అపారమైన రిలీఫ్ కలిగినట్లయ్యింది.

తనకి తెలిసిన వాళ్ళలో గొప్పవాళ్ళు లేకపోవడమేం?

టైగర్ కృష్ణాజీని మించిన గొప్పవాడు ఈ ప్రపంచంలో ఎవరుంటారు?

ఇదిగో.... ఈయన గొప్పోడే కావచ్చు.

కానీ సొంత కూతురి మీద ప్రేమ చూపించడం అంటే అదేమంత గొప్ప!

ఒక కిలాడీ నాకొడుకుని చేరదీసి, వాడికి చదువు చెప్పించడానికి పాతికవేలు యిచ్చిన వాడిది కదా గొప్పతనం అంటే!

వీళ్ళందరి గొప్పతనమూ, ఆ మాటకొస్తే ప్రపంచంలో వున్న గొప్పోళ్ళందరి గొప్పతనమూ కలిసి కృష్ణాజీ కాళ్ళ ముందు కుప్పపోసినా ఆయన మంచితనంలో మూడోవంతు వుండదు!

ఒక్కసారిగా అర్థం అయ్యింది రాజాకి.

కృష్ణాజీ గొప్పతనం, మంచితనం, నిజాయితీ, దేశభక్తి....

తనకు తెలియకుండానే రాజా కళ్ళెంబడి నీళ్ళు తిరిగాయి. ఆయనతో తను రూడ్‌గా మాట్లాడిన మాటలన్నీ గుర్తొచ్చాయి.

అన్నిట్లోకీ కూడా రాజా తలుచుకుని సిగ్గుపడేటట్లు చేసిన విషయం

ఆయన ముందు తను సిగరెట్ కాల్చడానికి ట్రై చేయడం.

దానికి ఆయనేమీ అనకుండా, కేవలం ఒక్క చూపు చూశాడు.

అబ్బ.... ఆ చూపులో బాధ.... ఆరోపణ....

ఫోటో ఉన్న పేపరుని నేల మీద పెట్టాడు రాజా.

కృష్ణాజీ తాలూకు ఫుల్‌లెంగ్త్ ఫోటో అది. కాళ్ళు కనబడుతున్నాయి.

వంగి, నుదుటిని కృష్ణాజీ కాళ్ళకి ఆనించాడు రాజా. అతని కళ్ళలో నుంచి రెండు నీటి చుక్కలు రాలి ఫోటోని తడిపాయి.

అలా ఒక్క నిమిషం పాటు వున్నాడు రాజా.

తర్వాత చటుక్కున లేచాడు. అతని కళ్ళలో ఒక నిశ్చయం కనబడుతోంది యిప్పుడు.

లేచి నిలబడ్డాడు.

కృష్ణాజీ ఏ ఊరికి ట్రాన్స్‌ఫర్ అయ్యి వెళ్తున్నాడో తనకి తెలుసు.

తనూ అర్జెంటుగా అక్కడికి వెళ్ళాలి.

జరిగినదంతా ఆయనతో చెప్పాలి.

ఆనందరావు తన తండ్రితో కలిసి చేసిన మోసం గురించి వివరంగా చెప్పాలి.

అసలు విషయం తెలియకపోతే, కృష్ణాజీ తనని గురించి చాలా చెడ్డగా అనుకుంటాడేమో!

అలా అనుకోగానే మనసుని మెలేసినట్లయ్యింది రాజాకి.

పది నిమిషాల్లో హై రోడ్డు మీద వున్నాడు రాజా.

పది నిమిషాల్లో పది లారీలు కనబడ్డాయి. రాజా చేతులు ఊపుతున్నా ఒక్క లారీ కూడా ఆగలేదు.

ఇలా కాదని, తను వేసుకున్న ఎర్ర చొక్కా విప్పాడు రాజా. ఊపడం మొదలెట్టాడు.

ఈసారి వచ్చిన మొదటి లారీనే సడెన్ బ్రేకుతో ఆగింది.

"ఏమయ్యిందిరా ఛోక్రే?" అన్నాడు లారీ డ్రైవర్.

"ఓవర్ లోడింగు లారీలని పట్టుకుంటున్నారు" అన్నాడు. రాజా మొహంలో భావాలు బయటపడకుండా స్ట్రెయిట్ ఫేస్ పెట్టి. అంతా ఉత్తదే.

లారీడ్రయివర్‌కి నిలువుగుడ్డు పడ్డాయి "అరె! తౌబా! తౌబా! ఇదీ ఇప్పుడే రావాలా?" అన్నాడు. ఈ ట్రిప్పులోనే అతని బ్యాక్ టైరు బరస్ట్ అయ్యింది. యాక్సిల్ విరిగింది. అతను డిస్పరేట్‌గా వున్నాడు.

"బైపాస్ రోడ్‌లో వెళ్తే చెకింగ్ గోల ఉండదు" అన్నాడు రాజా.

"సరే!" అన్నాడు డ్రైవరు.

"ఎందాకా?" అన్నాడు రాజా.

చెప్పాడు లారీ డ్రైవరు.

"నన్ను ప్రక్క టవున్లో దింపుతావా?"

"అసలే ఓవర్‌లోడ్ అంటున్నావు. నువ్వు కూడా ఎక్కితే?"

"వాళ్ళకి దొరకంగా!"

"సరే ఎక్కు!"

లాఘవంగా కమ్మీ పట్టుకుని లారీలోకి ఎక్కాడు రాజా.

"థాంక్స్!" అన్నాడు జేబులోనుంచి సిగరెట్ ప్యాకెట్ తీసి డ్రైవర్‌కి అందించాడు.

"కాలుస్తావా?"

డ్రైవర్ ఒక సిగరెట్ అందుకుని, ప్యాకెట్ రాజాకి తిరిగి ఇచ్చెయ్యబోయాడు.

"వద్దు! ఇవాళ్టినుంచే నేను సిగరెట్లు మానేశా!" అన్నాడు రాజా అగ్గిపెట్టి కూడా అందిస్తూ.

✦ ✦ ✦

సరిగ్గా ఆ టైంలోనే....

మాస్టారు ఆనందరావు గారింటికి వెళ్ళాడు కృష్ణాజీ.

నిజానికి అతను ఆ పాటికి కొత్త ఊరికి వెళ్ళిపోయి పోస్టింగ్ తీసుకుని వుండాల్సింది. టెలిఫోనిక్ ఆర్డర్సు వచ్చాయి....అతన్ని ఇప్పుడు వున్న పోస్టులో నుంచి రిలీజ్ చెయ్యమనీ, కొత్త ప్లేస్‌కి అర్జెంటుగా పంపెయ్యమనీనూ!

కానీ ఒక్కరోజు టైం అడిగాడు కృష్ణాజీ.

వెళ్ళే ముందు యింకొక్కసారి రాజాని చూసి, ఇంకొన్ని జాగ్రత్తలు చెప్పాలనిపించింది.

అందుకే ఆనందరావుగారి ఇంటికి వచ్చాడు.

అక్కడ కనబడిన సీన్ అతన్ని ఆశ్చర్యచకితుడిని చేసింది.

మాస్టారి మొహానికంతా కట్లే!

ఆయన కుడికాలుకి బాండేజ్ చేసి వుంది. చేతిలో ఒక కర్రని ఊతం కోసం పట్టుకుని వున్నాడు ఆయన.

నుదురు చిట్లించి అడిగాడు కృష్ణాజీ –

“మాస్టారూ! ఏమయ్యింది?”

వేదాంతంగా నవ్వాడు ఆనందరావు.

“చెప్తాను. కానీ మీరు నాకొక మాట ఇవ్వాలి.”

ప్రశ్నార్థకంగా చూశాడు కృష్ణాజీ.

“అసలు సంగతి తెలిసిన తర్వాత రాజాని ఏమీ అనకూడదు. వాడు పసి గుడ్డు! తప్పులు పసివాళ్ళు కాక పెద్దలు చేస్తారా? మనం మనసులో పెట్టుకోకూడదు”

కృష్ణాజీ మొహం జేవురించింది.

“ఏమిటి? మిమ్మల్ని ఈస్థితికి తెచ్చింది ఆ కుర్ర వెధవా?” అన్నాడు.

“ఏం చేశాడు?” అన్నాడు మళ్ళీ.

“అదిగో! అప్పుడే కోపం వస్తోంది మీకు! అందుకే ముందే అన్నాను. రాజాని ఏమి అనకూడదని!”

ఆగ్రహాన్ని అదుపులో పెట్టుకుంటూ, నిదానంగా అన్నాడు కృష్ణాజీ–

“మాస్టారూ! మీది మెతక మనసు. ఈ ప్రపంచంలో మంచి తప్ప మరేదీ లేదనుకునే మృదుస్వభావం. క్రిమినల్సు సంగతి మీకేం తెలుస్తుంది? ఆ విషయాలు నాకొదిలెయ్యండి. ఎవరితో ఎలా ఉండాలో నాకు తెలుసు. ఏం జరిగిందో చెప్పండి!”

బాధని నటిస్తూ అన్నాడు మాస్టారు. ఆయన అభినయంలో ఆస్కార్ అవార్డు అందుకోవలసినవాడు.

“కృష్ణాజీగారూ! పసిపిల్లాడి గురించి పొరబాటు అభిప్రాయం ఏర్పరుచుకోవద్దని ముందే చెప్పాను. మనం ఈ ప్రస్తావన యింతటితో మానెయ్యడం మంచిది.

దెబ్బలదేముంది దేవుడి దయ వుంటే వారం తిరిగేలోగా తగ్గిపోతాయి."

"మాస్టారూ...."

"ఇంక ఈ విషయంలో మనం మాట్లాడుకునేది ఏమీ లేదు."

కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయాడు కృష్ణాజీ.

తర్వాత అన్నాడు –

"ఒక్క విషయం చెప్పండి....దాన్ని బట్టి నేను అంతా గ్రహిస్తాను. రాజా పోషణ కోసం నేను మీకు యిచ్చిన డబ్బు....

మళ్ళీ వేదాంతంగా నవ్వాడు ఆనందరావు.

"మీకు ఆ డబ్బు ముఖ్యం కాదనీ, నా గురించే మీరు బాధపడుతున్నారనీ నాకు తెలుసు! కానీ మీ డబ్బుని నేను భద్రంగా ఉంచలేకపోయాను. తల తాకట్టు పెట్టి అయినా ఆర్నెలల్లో మీ డబ్బు మీకు అప్పగించేస్తాను" అన్నాడు.

అవసరం లేదన్నట్లు తల ఆడించాడు కృష్ణాజీ.

అతనికి అంతా అర్థం అయినట్లే ఉంది.

మాస్టారి తల పగలగొట్టి, డబ్బు తీసుకుపారిపోయి ఉంటాడు రాజా.

కనకపు సింహాసనమున శునకమును కూర్చుండబెట్టినా దానికి కుక్క బుద్ధి పోతుందా?

ఈ మాస్టారు మంచివాడు కాబట్టీ, మానవత్వం ఉన్నవాడు కాబట్టీ రాజాని ప్రొటెక్ట్ చెయ్యాలని చూస్తున్నాడు. తప్పు తన మీదే పెట్టుకుంటున్నాడు.

మళ్ళీ అన్నాడు మాస్టారు.

"నేనే యింకొంచెం జాగ్రత్తగా ఉండి వుండవలసింది. చాక్లెట్ల పొట్లాం తెచ్చి పిల్లవాడి ఎదురుగా పెట్టి తినొద్దురా అంటే ఊరుకుంటాడా? డబ్బు సంగతీ దాదాపు అంతే."

నిట్టూర్చాడు కృష్ణాజీ.

"సర్! అర్థమయ్యింది! అపాత్రదానం చెయ్యబోయాను. అందువల్ల మీకు

యిబ్బంది కలిగింది. సిగ్గు పడుతున్నాను. నన్ను క్షమించండి." అన్నాడు.

చల్లగా నవ్వాడు ఆనందరావు.

"నేను సాయంత్రం వెళ్ళిపోతున్నాను సర్! మనస్ఫూర్తిగా నన్ను క్షమించమని కోరుకుంటున్నాను" అన్నాడు కృష్ణాజీ.

"వెళ్ళిరండి బాబూ! మీలాంటి మంచివాళ్ళని దేవుడు చల్లగా కనిపెట్టి వుండాలి. నన్ను గురించి మీరేం బాధపడకండి" అన్నాడు ఆనందరావు.

కృష్ణాజీ వెళ్ళిపోగానే మాస్కు తీసేసినట్లయింది మాస్టారి మొహం.

కృష్ణాజీ వెళ్ళినవైపే పరిశీలనగా చూస్తూ ఉండిపోయాడాయన.

బయటకు వచ్చిన కృష్ణాజీకి వంట్లో రక్తం సలసల కాగిపోతున్నట్లయ్యింది.

'బాస్టర్డ్' అనుకున్నాడు ఆగ్రహంగా. "బ్లడీ బాస్టర్డ్!" ఎంత ధైర్యం వీడికి. వీణ్ణి బాగుచేద్దామని తను చూస్తే తనకే టోకరా యిస్తాడా? గురువుకి పంగనామాలు పెట్టి పారిపోతాడా! పోతూ పోతూ బుర్రపగలగొట్టి వెళ్ళిపోతాడా?

బ్లడీ ఫెలో! ఈసారి వీడు తన కంట బడాలి. కాళ్ళూచేతులూ విరగ్గొట్టేస్తాడు తను. సున్నంలోకి ఎముక లేకుండా చితక్కొడతాడు.

పోలీసులతో లాలూచీ పడి పెరుగుతున్న వెధవ వీడు.

పోలీసుల థర్డ్‌డిగ్రీ మెథడ్స్ అంటే ఏమిటో వీడికి తెలిసి ఉండవు.

చూపిస్తాడు తను.

పోలీసు బ్రూటాలిటీ అంటే తనకు అలర్జీ.

కానీ వీణ్ణి మాత్రం నరికి పోగులు పెట్టినా తప్పులేదేమో!

మనసు మండిపోతుంటే, యాంత్రికంగా పనులు ముగించుకుని, కొత్తప్లేస్‌కి వెళ్ళాడు కృష్ణాజీ.

ఆ రాత్రికి పోలీస్ క్లబ్‌లోనే ఉండిపోయాడు అతను.

✦ ✦ ✦

కృష్ణాజీని కలుసుకోవడానికి వచ్చాడు రాజా.

కానీ ఆయన యింకా అప్పటికి ఇంకా డ్యూటీలో జాయిన్ కాలేదని తెలిసింది.

ఓపిగ్గా కాచుకున్నాడు రాజా. కడుపులో ఆకలి మండిపోతోంది. జేబులో డబ్బుల్లేవు. ఇంకెవరి జేబన్నా తడమొచ్చుగానీ, అలా చెయ్యడానికి మనసు రావడం లేదు. దేవుడిలాంటి మనిషిని చూడడానికి వచ్చాడు తను. ఇక్కడ దయ్యపు చేష్టలు చేయకూడదు.

రాత్రికి కృష్ణాజీ వచ్చాడు. తనకోసం టెంపరరీగా ఒక గెస్ట్‌హౌస్‌లో రూం బుక్ చేయించుకున్నాడు.

వెళ్ళీ వెళ్ళగానే లాన్‌లో కూర్చున్నాడు కృష్ణాజీ. విస్కీ ఆర్డర్ చేశాడు.

పెగ్గు మీద పెగ్గు తాగడం మొదలెట్టాడు.

"హలో ఓల్డ్‌బాయ్!" అంటూ అతని దగ్గరికి వచ్చాడు దివాకర్‌రెడ్డి. దివాకర్‌రెడ్డి కృష్ణాజీకి కొలీగ్. వాళ్ళిద్దరూ కొన్నేళ్ళ క్రితం కడపలో కలిసి పని చేశారు. రెడ్డి చేతిలో కూడా గ్లాసు ఉంది.

కుశల ప్రశ్నలు అడిగాడు రెడ్డి.

కృష్ణాజీ అంటీ ముట్టనట్లు సమాధానాలు చెప్పాడు.

అది గమనించి ఆశ్చర్యంగా అడిగాడు రెడ్డి.

"కృష్ణాజీ! ఏమయింది నీకు? యు ఆర్ నాట్ యువర్ యూజువల్ సెల్ఫ్! అన్నాడు నిశితంగా చూస్తూ. సాధారణంగా అయితే కృష్ణాజీ మిన్ను విరిగి మీద పడినా చలించనట్లు ఉండే రకం మనిషి. మనసులో ఏమున్నా పైకి మాత్రం కనబడనివ్వని మనిషి.

అలాంటి కృష్ణాజీ ఇవాళ యింత అన్యమనస్కంగా వున్నాడు. చిరచిరలాడుతున్నాడు. ఎందుకని?

"ఏమయ్యింది కృష్ణాజీ?" అన్నాడు రెడ్డి మళ్ళీ. అతని గొంతులో అభిమానం ధ్వనిస్తోంది.

బ్రహ్మాండమైన ఆనకట్ట బద్దలైపోయినట్లు యింక చెప్పడం మొదలెట్టాడు కృష్ణాజీ.

తను వెదికి వెదికి ఒక అప్రాచ్యపు వెధవని చేరదీశాననీ, వాడిని ఉద్ధరిస్తున్నా ననుకుని పాతిక వేలు తగలేసుకున్నాననీ, అదంతా అపాత్రదానంలాగా అయిపోయిందనీ, అన్ని వివరాలూ చెప్పాడు.

సరిగ్గా అతను అలా చెబుతున్న టైంలోనే –

అక్కడికి చేరుకున్నాడు రాజా.

లాన్‌లో కృష్ణాజీ కూర్చున్న టేబులు కాంపౌండ్‌వాల్‌కి దగ్గరిగా వుంది. ఆ టేబులు వెనకే ఒక చెట్టు ఉంది.

ఆ చెట్టు కొమ్మమీద కూర్చుని వున్నాడు రాజా. కృష్ణాజీ చెబుతున్నది అతనికి స్పష్టంగా వినబడుతోంది. దృశ్యం కూడా స్పష్టంగానే కనబడుతోంది. జేవురించిన మొహంతో, కోపంతో వణుకుతున్న గొంతుతో చెబుతున్నాడు కృష్ణాజీ –

"రెడ్డీ! నా గుండె ఎంత మండిపోతుందంటే, ఈసారి ఆ కుర్రవెధవ గనక కనబడ్డాడంటే చాలు, కర్ర విరిగేటట్లు కొడతా, సున్నంలోకి ఎముక మిగలకూడదు. అంత కసిగా ఉంది. ఇంతగా నేనెప్పుడూ నమ్మి మోసపోలేదు" అన్నాడు.

సానుభూతిగా తల పంకిస్తున్నాడు రెడ్డి. కృష్ణాజీ యింత బాడ్ మూడ్‌లో వుండడం అతనెప్పుడూ చూడలేదు.

కృష్ణాజీ ఆగ్రహంతో ఇంకా అంటూనే ఉన్నాడు.

"పోలీసు బ్రూటాలిటీ, థర్డ్‌డిగ్రీ ట్రీట్‌మెంటూ, టార్చరూ....వీటికి నేను వ్యతిరేకం అని నీకు తెలుసు కానీ, ఇవాళ అనిపిస్తోంది నాకు. ఇలాంటి కేడీ వెధవల మీద అలాంటి మెథడ్సు ప్రయోగించినా తప్పులేదని"

కృష్ణాజీకి అడ్డు రాకుండా సావధానంగా వింటున్నాడు దివాకర్‌రెడ్డి. కడుపులో ఉన్న కోపాన్ని యిలా మాటల రూపంలో కక్కేస్తే కృష్ణాజీ మళ్ళీ మామూలు మనిషయి పోతాడని అతనికి తెలుసు.

ఆపకుండా అయిదు నిమిషాలపాటు రాజాను తిడుతూనే ఉన్నాడు కృష్ణాజీ.

తిట్టితిట్టి "బ్లడీ షిట్!" అని తుపుక్కున ఉమ్మేసాడు.

చెట్టుమీద కూర్చుని వింటున్న రాజా గుండె గొంతుకి అడ్డుపడినట్లు అయ్యింది. కృష్ణాజీ ఇలా ఉగ్రనరసింహావతారంలాగా ఉంటాడని అనుకోలేదు అతను.

ఆనందరావు కృష్ణాజీకి ఇంతగా బ్రెయిన్‌వాష్ చేసి, తనపట్ల ఇంత తీవ్రమైన వ్యతిరేకత సృష్టించగలడని కూడా ఊహించలేదు అతను.

ఈ లెఖ్కన, ఆ ఆనందరావు తలలు తీసి తలలు పెట్టగలిగినంత తెలివి గలవాడన్న మాట.

తర్వాత అర్ధరాత్రి దాకా ఆ చెట్టుమీదే కూర్చున్నాడు రాజా. అర్ధరాత్రి తరువాత లాన్‌లో సందడి తగ్గింది.

జనం వెళ్ళిపోయారు.

లైట్లు ఆరిపోయాయి.

అప్పుడు నెమ్మదిగా చెట్టు దిగి, గోడ దూకి రోడ్డు మీదికి వచ్చాడు.

అతని మెదడు మొద్దుబారిపోయినట్లయ్యింది. ఉత్సాహం చచ్చిపోయినట్లయ్యింది.

అప్పుడు హఠాత్తుగా వచ్చింది రాజాకి ఆ ఆలోచన.

చచ్చిపోవాలని తీవ్రంగా అనిపించింది.

ఇంక ఆ విషయాన్ని గురించి ఎక్కువగా ఆలోచించ లేదు అతను.

తక్షణం చచ్చిపోవాలనే నిశ్చయాని కొచ్చేశాడు.

ఆ నిర్ణయాన్ని అప్పటికప్పుడే ఆచరణలో పెట్టెయ్య దలుచుకున్నాడు కూడా.

అదే సమయంలో....

యముడి వాహనంలా దూసుకు వచ్చేస్తోంది ఒక లారీ.

లారీ దగ్గరవగానే, దానికి అడ్డంగా పడ్డాడు రాజా.

✦ ✦ ✦

మళ్ళీ కళ్ళు తెరిచేసరికి, హాస్పిటల్ బెడ్ మీద వున్నాడు.

అయితే తను ఇంకా బతికే వున్నాడా? చావలేదా?

మొండి ప్రాణం! తొందరగా పోదన్నమాట!

అంతలోనే, ఎడమ చెయ్యి జివ్వున లాగినట్లయ్యింది. కుడికాలుని కత్తులతో పొడుస్తున్నంత నొప్పి కలిగింది.

అతి కష్టం మీద తల వంచి చూశాడు రాజా.

తన వళ్ళంతా బాండేజీలే!

ఎన్ని ఎముకలు విరిగాయో?

రాజాకి మెలకువ రావడం గమనించింది అక్కడే వున్న ఒక నర్సు. ఆమె మొహంలో ఎగ్జయిట్‌మెంటు కనబడుతోంది. పరిగెత్తుకెళ్ళి డాక్టర్‌తో చెప్పింది.

"ఓహ్! కళ్ళు తెరిచాడా? అయితే ఇది మెడికల్ హిస్టరీ అవుతుంది!" అన్నాడు డాక్టర్ కూడా అంతకు మించిన ఎగ్జయిట్‌మెంటుతో.

వాళ్ళ ఎగ్జయిట్‌మెంటుకి కారణం వుంది.

ఇరవై రెండు చోట్ల ఫ్రాక్చర్ అయ్యింది రాజాకి.

అంత చిన్న వయసులో అంత పెద్ద గాయాలని తట్టుకుని బతికి బయట పడడం అంటే మామూలు సంగతి కాదు.

పరుగులాంటి నడకతో వార్డుని చేరుకున్నాడు డాక్టర్.

అప్పటికి రాజా కళ్ళు అలసటతో మళ్ళీ మూతలు పడిపోయాయి.

అతన్ని కంప్లీట్‌గా టెస్ట్ చేశాడు డాక్టర్. తరువాత అన్నాడు తృప్తిగా.

"నో ప్రాబ్లం! దిస్ ఫెలో ఈజ్ అవుటాఫ్ డేంజర్! కానీ ప్రాపర్ ట్రీట్‌మెంటూ, ఆ తరువాత కరెక్టు ఫిజియోథెరపీ అవన్నీ చేయిస్తేనేగానీమామూలు మనిషి కాడు. లేకపోతే ఏదో బతికి బయటపడినా కూడా, కాలూ చెయ్యీ సరిగ్గా వుండవు. వీడికి నా అన్న వాళ్ళెవరూ వున్నట్లు లేరే!"

నర్సు అంది.

“ఇందాక వచ్చి బయట కూర్చుని వున్నాడు ఒక మనిషి. వీళ్ళ నాన్నట.”

రిలీఫ్‌గా చూశాడు డాక్టర్.

“వీళ్ళ నాన్నా! అయితే ఫర్వాలేదు. వీడి అదృష్టం” అన్నాడు.

పదినిమిషాల తరువాత డాక్టర్ రవుండ్స్ ముగించుకుని వెళ్ళిపోయాక–

అప్పుడు వార్డులోకి వచ్చాడు దాసు.

మట్టి రంగుకి తిరిగి వున్నాయి బట్టలు. వదులుగా వున్న షర్టూ, పైజమా.

షర్టు మీద బహుశా సాంబారు మరక కాబోలు – ఒకటి ప్రముఖంగా కనబడుతోంది.

కొత్త వాసన పసికట్టినట్లు కళ్ళు తెరిచాడు రాజా.

అతనివైపే తదేకంగా చూస్తున్నాడు దాసు.

“నొప్పిగా వుందా?” అన్నాడు జాలిగా.

అవునన్నట్లు తల వూపాడు రాజా.

“ఇరవై రెండు చోట్ల బొమికెలు ఇరిగాయంట!”

మాట్లాడకుండా చూస్తున్నాడు రాజా.

దాసు అన్నాడు.

“మందులకీ మాకులకీ శానా కరుచవుద్దంట! నా దగ్గర పదిహేను వేలున్నాయి. పోలీసుబాబు మాస్టారికిచ్చిన డబ్బు తాలూకు.”

రాజా ఏదో అనేటంతలోనే దాసు కఠినంగా అన్నాడు.

“కానీ దాన్లో నుంచి పైసా కూడా ఇవ్వను నీకు! దొంగనాకొడకా! కన్న తండ్రి కడుపు కొడతావురా! కాపు సారా కాద్దామంటే కాదు కూడదని కూర్చుంటావుట్రా! దేవుడు లేడూ! అందుకే నువ్వు మళ్ళీ మనిషిలా తిరగలేకుండా మక్కెలిరిగేటట్లు

చేశాడు. చావరా చావు! తింగిరి నా కొడకా!"

అని చేతులు ఊపుకుంటూ వెళ్ళిపోయాడు దాసు.

తండ్రి వెళ్ళిన వైపే చూస్తూ వుండిపోయాడు రాజా.

అప్పుడు స్క్రీన్ చాటునుంచి బయటికి వచ్చాడు డాక్టర్. అతని మొహంలో కనబడుతున్న భావం చిత్రంగా వుంది.

"ఇప్పుడు వచ్చిన వాడు నీ తండ్రేనా?" అన్నాడు అపనమ్మకముగా.

అవునన్నట్లు తలాడించాడు.

తరువాత నర్సు వైపు తిరిగాడు డాక్టర్. ఉద్వేగంగా అన్నాడు.

"ఇలాంటి లుచ్చాగాడు ఒకడు ఈ ప్రపంచంలో వున్నాడంటే నేను బహుశా నమ్మేవాడిని కాదేమో! కానీ ఇవాళ కళ్ళారా చూసి, చెవులారా విన్నాను కాబట్టి నమ్మక తప్పడం లేదు. నిజంగా ఈ కుర్రాడి మీద జాలి పడుతున్నాను. ట్రీట్‌మెంట్‌కి ఖర్చవుతుంది. అయినా ఫర్వాలేదు. నేను భరిస్తాను. వీడి తండ్రి వీడిని పగవాడిలా చూడడం ఒక ఎత్తయితే, ఇన్ని దెబ్బలు తగిలినా వీడు బతికి బయట పడడం ఇంకో ఎత్తు." అని అతని వైపు తిరిగాడు డాక్టర్.

"పిల్లగా! దేవుడికి నువ్వు అప్పుడే చచ్చిపోవడం ఇష్టం లేనట్లుంది. బతుకు! బతికి ఏదన్నా సాధించు" అన్నాడు.

నవ్వడానికి ప్రయత్నం చేశాడు.

కానీ పెదిమలు కూడా స్వాధీనంలో లేనట్లు అనిపించింది.

అయితే అదే సమయంలో....

పోయిన శక్తిలో సగం తిరిగి వచ్చినట్లు కూడా అనిపించింది అతనికి.

డాక్టర్ చెప్పిందీ నిజమే!

అంత స్పీడుగా వస్తున్న లారీకింద పడ్డా తను చావలేదంటే? ఇరవై రెండు చోట్ల ఎముకలు విరిగినా తను బయట పడ్డాడంటే? కన్న తండ్రి కసాయివాడిలా

మాట్లాడినా ఈ డాక్టర్‌కి మాత్రం దయ కలిగిందంటే?

ఆ జై వీరహనుమాన్ తనవైపే ఉన్నాడు.

నిజంగానే!

ఆ క్షణంలో ఒక నిశ్చయానికొచ్చేశాడు అతను.

తను చావడు!

బతికి సాధిస్తాడు!

ఇప్పుడర్థమౌతోంది తనకి!

ఈ ప్రపంచంలో అందరూ తన తండ్రిలాంటి, లేకపోతే ఆనందరావులాంటి లంగాగాళ్ళే ఉండరు.

కృష్ణాజీ లాంటివాళ్ళూ, ఈ డాక్టర్ లాంటివాళ్ళూ కూడా ఉంటూనే ఉంటారు– అక్కడక్కడ!

లేకపోతే పాపం పండిపోయి ఈపాటికి భూమి మధ్యకి పగిలిపోయి ఉండదూ!

ఇన్నాళ్ళూ తన ఖర్మకొద్దీ రాంగ్ ట్రాక్‌లో వెళ్ళాడు. ఆ రూట్‌లో అంతా అలగా వెధవలే తగిలారు తనకి.

కృష్ణాజీ దయవల్ల ఇప్పుడు కరెక్ట్ రూట్‌లోకి వచ్చాడు.

ఈ రూట్‌లో కొత్త మనుషుల్ని చూస్తున్నాడు తను! నిజంగానే!

అంటే మనం వెళ్ళే దారిని బట్టి, మనకు తగిలే మనుషులు కూడా వుంటారన్న మాట!

ముళ్ళ డొంకల్లోకి వెళ్తూ అక్కడ మంచి గంధం చెట్లు కనబడలేదని ఏడిస్తే ఎట్లా కుదుర్తుందీ?

బతకాలనే కోరికే బలాన్ని త్వరలోనే తిరిగి వచ్చేలా చేసింది రాజాకి. అందులో లేత ఎముకలు కావడంవల్ల త్వరగానే అతుక్కున్నాయి.

రెండు నెలల్లో హాస్పిటల్ నుంచి బయటికి వచ్చాడు రాజా.

వచ్చేటప్పుడు ఒక వందరూపాయలు చేతిలో పెట్టాడు డాక్టర్. అంతకు మించి అతను రాజా బాధ్యతని నెత్తిన పెట్టుకోవడానికి సిద్ధంగా లేడు.

చాలు! ఎవరికి చేతనయినంత మంచి వాళ్ళు చేస్తే చాలు! ఈ ప్రపంచంలో ఇన్ని కష్టాలుండవు. మొత్తం మంచీ ఒకళ్ళే చెయ్యాలనుకోవడం మనల్ని మనం మోసగించుకోవడమే అవుతుంది. అది అసహజం కూడా.

వంట్లో ఆరోగ్యంతో, మనసులో ధైర్యంతో, జేబులో వంద రూపాయలతో రోడ్డు మీది కొచ్చాడు రాజా.

వచ్చీరాగానే అతనికి కనబడింది ఒక దృశ్యం.

రోడ్డుమీదే దొమ్మరి ఆట ఒకటి జరుగుతోంది.

అప్రయత్నంగానే ఆటవేపు నడిచాయి రాజా కాళ్ళు. ఆ గుంపులోకి తనుకూడా జొరబడి, ఆసక్తిగా చూడడం మొదలెట్టాడు.

గోడమీద నిలబడి వుంది ఒక చిన్న పాప.

తాడు మీద బాలన్సు చేస్తూ ఉంది ఒక అమ్మాయి.

కింద పల్టీలు కొడుతున్నాడు ఒక పిల్లాడు.

ఒక స్త్రీ డోలు వాయిస్తోంది.

ఒక మొగతను రన్నింగ్ కామెంటరీలా చెబుతూ, తను కూడా కొన్ని ఫీట్స్ చేస్తున్నాడు.

ఆ ప్రదర్శనని కాసేపు చూశాక, హఠాత్తుగా స్ఫురించింది రాజాకి తను భవిష్యత్తులో చెయ్యవలసింది ఏమిటో!

తనొక కమెండో కావాలి.

కనీసం పోలీసు ఆఫీసరు కావాలి! అదేగా కృష్ణాజీ కోరిక కూడా!

పోలీసు డిపార్ట్‌మెంట్‌లో కమెండోనే అవుతాడు తను.

కానీ ఎట్లా ?

పోలీసు డిపార్ట్‌మెంట్‌లో చేరాలంటే బాగా చదువుకుని వుండాలి.

స్ట్రాంగ్ బాడీ వుండాలి. మంచి ఛెస్ట్ వుండాలి.

మంచి కంటిచూపూ అదీ వుండాలి.

పోలీసు డిపార్ట్‌మెంట్ గురించి చాలానే తెలుసు రాజాకి.

ఇదివరకటి పోలీసాఫీసర్లు అసలు సిసలైన మొగాళ్ళలా ఉండేవాళ్ళు.మంచి పర్సనాలిటీ, మంచి ఆరోగ్యం, తెలివితేటలూ, ఉన్నవాళ్ళే సెలెక్టు అయ్యేవాళ్ళు.

ఇప్పుడేముంది! లక్షో, రెండు లక్షలో పారేస్తే అర్ధనాకారపు మనుషులూ, అంగుష్టమాత్రులూ, ఆడంగివాళ్ళూ కూడా సెలెక్టయిపోతున్నారు.

పైసాలోనే కదా పరమాత్మ ఉంది!

తన దగ్గర పైసా లేదు. అందుకని తను పర్సనాలిటీ డెవలప్ చెయ్యాలి. కరాటే, జూడో, కుంగ్‌ఫూ, కర్రసాము, రైడింగ్, షూటింగ్.... అన్నీ ప్రాక్టీస్ చెయ్యాలి.

దానితోబాటు....

కళ్ళు పేలిపోయేలా చదువుకోవాలి.

యూనివర్శిటీ ఫస్టు రావాలి.

గోల్డ్‌మెడలు కొట్టేయ్యాలి.

యూనివర్శిటీ డిగ్రీ పట్టుకుని, గోల్డ్‌మెడలు షర్టుకి పిన్‌చేసి, ఇన్ని విద్యల్లో ప్రావీణ్యం పెట్టుకుని ఇంటర్వ్యూకి వెళ్తే లంచంగాళ్ళూ, కంచంగాళ్ళూ, మంచంగాళ్ళూ ఎందుకు పనికొస్తారూ?

చిన్నప్పటినుంచి చెడు పద్ధతులని బాగా అబ్జర్వ్ చేసి ఉండడం వల్ల రాజాకి తెలుసు. ఈ రోజుల్లో పనులు కావాలంటే లంచం అన్నా తినిపించాలి, డిన్నర్లు అన్నా ఇచ్చి తినిపించి తాగించాలి, లేదా, అమ్మాయిల్ని తీసుకొచ్చి అప్పచెప్పాలి.

తను పూర్తిగా ట్రైనింగ్ అయిపోయి, రెడీమేడ్ ఆఫీసర్‌లాగా ఇంటర్వ్యూకి వెళ్తాడు.

అయినా కూడా సెలెక్టు చెయ్యరా ?

సెలెక్టు చెయ్యకపోతే ఐ.జీ.పీ.ని పట్టుకుని అదరగొట్టేస్తాడు.

ఇంకాసేపు దొమ్మరి ఆటని పరిశీలనగా చూశాడు రాజా.

కాదు! అతని ఆలోచన వాళ్ళతో చేరిపోవాలని కాదు.

పాపం వాళ్ళు ఎంత హీనంగా బతుకుతారో, వాళ్ళు ఎంతమంది చేత ఎలాంటి హరాస్‌మెంటుకి గురి అవుతారో రాజాకి తెలుసు.

తను మళ్ళీ ఆ ట్రాక్‌లో పడిపోకూడదు!

ఇంకో చక్కటి రాజ మార్గం ఉంది దానికి.

సర్కస్‌లో చేరిపోవడం!

సర్కస్ అంటే కొద్దో గొప్పో పద్ధతిగా ఉంటుంది కాస్తో కూస్తో గౌరవం వుంటుంది. అక్కడ బోలెడంత డిసిప్లిన్ కూడా వుంటుంది.

అదే తన రూటు!

కానీ సర్కస్ ఇప్పుడెక్కడ వుంటుందీ? అసలు దానిలో చేర్చుకుంటారా తనని?

దొమ్మరి ఆట అయిపోయేలోగా వందరూపాయల నోటు మార్చాడు రాజా. ఒక యాభై ఆ కుటుంబానికి ఇచ్చాడు.

తనకి దారి చూపించారు. వీళ్ళకి కృతజ్ఞుడయి ఉండాలి తను.

ఒక బస్సు క్యాచ్ చేశాడు రాజా. అర్పిత వాళ్ళ ఊరు చేరుకున్నాడు.

ఆ షెడ్డు అలాగే ఉంది. అయితే కొత్తగా పులిజూదం ఆటతాలూకు గళ్ళు గీసి వున్నాయి షెడ్డులో.

అర్పిత వాళ్ళ ఇంటివేపు చూశాడు రాజా. ఆ అమ్మాయి కనబడలేదు.

సదాశివబ్రహ్మంగారు మాత్రం కూర్చుని రాట్నం వడుకుతున్నాడు.

చాలాసేపు అక్కడే కూర్చున్నాడు రాజా. అలాగే నిద్రపట్టేసింది. గోడకి ఆనుకునే కాసేపు జోగాడు. తర్వాత లేచి ఒళ్ళు విరుచుకుని, బట్టలు దులుపుకుని, బయలుదేరాడు. అర్జెంటుగా టీ తాగాలనిపించింది.

కానీ అంతలోనే ఇంకో విషయం గుర్తొచ్చింది.

ఇవాళ నుంచి....ఇవాళ నుంచే....ఒంటిని ఇనప ముక్కలా చెయ్యడం మొదలెట్టాలి తను. ఈ కాఫీలూ, టీలూ....ఇవన్నీ ఉత్త ఫ్యాన్సీ! తాగిన కొద్దీ తాగాలనిపిస్తుంది. డబ్బు వేస్టు! ఒంటికి మంచిది కాదు!

అప్పటికప్పుడే ఇంకో నిర్ణయం కూడా తీసుకున్నాడు రాజా.

ఇవాల్టినుంచి.... తను తినేదీ....తాగేదీ....ప్రతీదీ కూడా వంటికి బలాన్ని ఇచ్చేదిగానే వుండాలి. నానా గడ్డీ తినకూడదు.

అలా ఆలోచిస్తూ, తనకి తెలియకుండానే మునిసిపల్ స్కూలు దగ్గరికి వచ్చాడు రాజా.

స్కూలుకి దగ్గరలోనే ఒక సన్నటి సందు వుంది. సాధారణంగా నిర్జనంగా వుంటుంది అది. సందులోకి రాగానే రాజాకి కనబడింది ఒక దృశ్యం.

అర్పిత ఒక్కతే వస్తోంది. ఆ అమ్మాయి పక్కన వాళ్ళ అక్క అంకిత లేదు. ఆసందులోనే దుర్గంధ భూయిష్టంగా వున్న యూరినల్స్ వున్నాయి.

వాటి వెనక నుంచి హఠాత్తుగా బయటికి వచ్చాడు ఒక మనిషి. అతన్ని చూసీ చూడగానే అతనేం చేయబోతున్నాడో గ్రహించేశాడు రాజా.

అతను ఊహించినట్లే, ఆ మనిషి చటుక్కున వచ్చి అర్పిత ముందు నిలబడ్డాడు.

"ఏయ్ పిల్లా! చెవులకి వున్న రింగులు తీసి ఇవ్వు!" అన్నాడు.

అర్పిత మొహంలో భయం కనబడింది.

"ఊఁ" అన్నాడు ఆ మనిషి.

వణుకుతూ చెవిదగ్గర చెయ్యి పెట్టింది అర్పిత.

క్షణంలో ఆ వ్యక్తి దగ్గరికి చేరాడు రాజా.

"ఊరికే గొడవొద్దు! ఆ అమ్మాయిని వదిలెయ్ రాదూ!" అన్నాడు బోర్‌గా చూస్తూ.

ఆ మనిషి మొహంలో ఎగతాళి కనబడింది.

అతను ఏదో అనబోయేంతలోనే ఛక్‌మని రాజా చేతిలో ప్రత్యక్షమయ్యింది బటన్ నైఫ్.

"వెళ్ళిపో!" అన్నాడు రాజా.

అతను ముందర స్టన్ అయి, తర్వాత ఎగాదిగా రాజావేపు చూశాడు.

రాజా చేతిలోని కత్తి కంటే, రాజా కళ్ళలో కనబడుతున్న కాఠిన్యం అతనికి భయం కలిగించింది. ఏం మాట్లాడకుండా అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

దిగ్భ్రాంతురాలయిపోయి ఇదంతా చూస్తోంది అర్పిత.

"ఇంటికెళ్ళగలవా? నేను రావాలా?" అన్నాడు రాజా.

కష్టంమీద గొంతు స్వాధీనంలోకి తెచ్చుకుని అంది అర్పిత.

"నీ దగ్గర ఎప్పుడూ కత్తి వుంటుందా?"

"ఉంటుంది"

"ఎందుకూ?"

"జామకాయలూ అవీ కోసుకోవడానికి!"

కొంచెం తృప్తిపడినట్లు చూసింది అర్పిత.

"నువ్వే స్కూలు?" అంది.

"ప్రైవేట్‌గా చదువుతున్నా!"

"ఎన్నో క్లాసు?"

"బి.ఏ."

అదిరిపడింది ఆ అమ్మాయి.

"నువ్వు బియ్యేనా?"

"అవును! ఒకేసారి బియ్యేకి అప్పియర్ అవుతా!"

"ఇప్పుడేం నేర్చుకుంటున్నావ్? ఆరోక్లాసు పుస్తకాలు చదివేశావా?"

"అక్షరాలు నేర్చుకోగానే చదివేస్తా!"

"ఏమిటీ? నీకు అక్షరాలు కూడా రావా?"

"ఉహుఁ! నువ్వు రాసిస్తావా?"

"మా నాన్నగారు నేర్పిస్తారు. నేర్చుకో"

"నువ్వు రాసిస్తేనే నేర్చుకుంటా"

హఠాత్తుగా గుర్తొచ్చినట్లు అంది అర్పిత.

"నువ్వు మా ఇంటెదురుగా వ్యాయామశాలలో ఉన్నావ్ కదూ?"

"అవును...."

"అయితే రేపు రాసిస్తా"

"సరే!"

ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

అర్పిత వెళ్ళిన వేపే హీరోలా చూస్తూండిపోయాడు రాజా.

మర్నాడు ఏబిసీడీలూ, తెలుగు గుణింతాలూ ఉన్న ఛార్టులు రెండు తెచ్చిచ్చింది అర్పిత. అక్షరాలను ఒకసారి తను పలికి చూపించింది.

అప్పటికే ఫ్రేం కట్టించి ఉంచాడు రాజా కృష్ణాజీ ఫోటోని. ఫోటోని గోడకి ఆనించి, రెడీగా వుంచుకున్న అగరొత్తులు వెలిగించాడు.

ఫోటోకి సాష్టాంగ నమస్కారం పెట్టి తరువాత అక్షరాలను పరిశీలించటం మొదలెట్టాడు.

సాయంత్రం ఆ అమ్మాయి స్కూలు నుంచి వచ్చేటప్పుడు వాటిని తిరిగి యిచ్చేశాడు రాజా.

"ఏం! నేర్చుకోవా?" అంది అర్పిత.

"నేర్చేసుకున్నా" అన్నాడు రాజా.

అపనమ్మకంగా చూసింది అర్పిత.

"అప్పుడే?"

"మధ్యాహ్నానికే వచ్చేశాయ్"

"ఆc!" అంది నమ్మనట్లు.

"నీ పుస్తకం ఇవ్వు" అన్నాడు.

తెలుగు పుస్తకం ఇచ్చింది అర్పిత. కూడబలుక్కుంటూ ఒక పేజీ చదివాడురాజా.

"నీకు ఇంతకు ముందే చదవడం వచ్చు" అంది అర్పిత.

"నన్ను నమ్ము అర్పిత! ఆ భగవంతుడి సాక్షిగా నేను నిజమే చెబుతున్నాను. నేను అక్షరాలు చదవడం మొదలెట్టింది యివాళే....!" అన్నాడు.

అతని మాటల మీద సినిమా డైలాగుల ప్రభావం స్పష్టంగా కనబడుతోంది.

అది అర్థం కాలేదు అర్పితకి.

అతని వేపు మెరుస్తున్న కళ్ళతో చూసింది అర్పిత.

"అయితే నువ్వు చాలా ఇంటలిజెంట్‌వి అన్నమాట" అంది.

నవ్వాడు రాజా.

ఇంగ్లీషు కూడబలుక్కుంటూ చదవడానికి అతనికి వారం రోజులు పట్టింది.

అది మొదలుకుని ప్రతిరోజూ ఒకే రకం షెడ్యూల్ అతనిది.

పొద్దున్నే లేవడం....

అక్కడికి దగ్గర్లోనే ఉన్న టీ కొట్టులో ఒక బన్ను తినడం.

తర్వాత ఊరి బయట ఏటిలో ఈత.

తిరిగి రాగానే కృష్ణాజీ ఫోటోకి సాష్టాంగ నమస్కారం చెయ్యడం, చదువు మొదలెట్టడం.

అక్షరాలను అతను చూడడం అది మొదలు కాదు.

అంతకుముందు వాటికో అర్థం ఉన్నట్లు అనిపించేదికాదు అతనికి. అక్షరాలను, వాక్యాలనూ చూస్తే ఏవో చిత్రమైన పురుగులు నిశ్శబ్ద భాషలో ఏదేదో చెబుతున్నట్లు అనిపించేది.

కానీ ఇప్పుడు హఠాత్తుగా....

ఆ రహస్య సంకేతాల తాలూకు కోడ్‌ని తను డీకోడ్ చేసినట్లు అయిపోయింది.

నిక్షిప్త నిధి తాలూకు రహస్యం దొరికినట్లే అయిపోయింది.

అది మొదలు....

ఆ రోజు నుంచి చదవడం ఒక వ్యసనం అయిపోయింది రాజాకి.

కొంతమంది ఒకసారి మద్యం తాగగానే దానికి బానిసయిపోతారు. కొంతమంది జూదానికి గులాములైపోతారు. కొందరు మగువల వశీకరణానికి లొంగిపోతారు.

కానీ చదువు అనేది వీటన్నిటికంటే పెద్ద వ్యసనమైపోయింది అతనికి.

ఆ రోజు నుంచి అతనికి పగలంతా చదువే! రాత్రిళ్ళూ చదువే!

అర్పితకి మాత్రం ఇదంతా అంత నమ్మదగ్గ విషయంగా తోచలేదు. అతనికి అంతకుముందే చదువు వచ్చునీ, తనను ఫూల్ చేస్తున్నాడనీ ఆ అమ్మాయికి గట్టిగా నమ్మకం ఏర్పడిపోయింది. అందుకని యిక ముందు అతనితో జాగ్రత్తగా వుండాలన్న నిశ్చయానికి వచ్చేసింది కూడా!

ఆ మర్నాడు అర్పిత అతనికి కనబడలేదు.

కానీ అంతకంటే ఆసక్తికరమైన పోస్టరు ఒకటి కనబడింది అతనికి.

నేడే చూడండి!! నేడే చూడండి!!

**ఫేమస్ సర్కస్**

కనీ వినీ ఎరగని

కొత్త కొత్త ఫీట్స్‌తో

మిమ్మల్ని ఉర్రూతలూగించడానికి

మీ ఊరికి వచ్చేసింది

**ఫేమస్ సర్కస్**

వెంటనే అతనికి తెలియకుండానే అతని కాళ్ళు సర్కస్ టెంటు వేపు నడిచాయి.

ఈ లోకంలో భాగమే అయినా, పూర్తిగా వేరే లోకంలాగా వుంటుంది సర్కస్ ప్రపంచం. వాళ్ళ బతుకు వేరు....వాళ్ళ బంధాలు వేరు, బాంధవ్యాలు వేరు.

సినిమాలూ, టెలివిజన్ పాపులర్ కాకముందు పిల్లలనీ, పెద్దలనీ కూడా అలరించడంలో సర్కస్‌ని మించిన సాధనం యింకోటి వుండేది కాదు. పిల్లలకి మాత్రం సర్కస్ ఊరికి వచ్చిందంటే పండగే! ఏనుగులు, ఒంటెలు, గుర్రాలు, పులులు, సింహాలు, కోతులు, ఎలుగుబంట్లు, రింగ్ మాస్టర్లు, బఫూన్లు....ఉత్సాహం....ఉద్వేగం....

సర్కస్ ఊరికి వచ్చినట్లు ప్రతి రాత్రీ అందరికీ గుర్తుచేసేలా ఆకాశంలో కాంతి స్థంభం లాంటి సెర్చ్‌లైటు, టెంటు దగ్గరికెళితే వెలిగి ఆరిపోతుండే సీరీస్ లైట్లు....వాటిని పిల్లలు "వచ్చే పోయే లైటు" అనేవాళ్ళు. టెంటు బయట రకరకాల తినుబండారాల బళ్ళు, "రంగు" సోడాల బళ్లు!

ఓహ్! తిరనాళ్ళలాగా ఉండేది ఆ వాతావరణం.

ఊళ్ళో పిల్లల్లో సగంమంది అక్కడే ఉండేవాళ్లు.

ఇప్పుడు ఈ రోజుల్లో సర్కస్‌కి అంత ఆదరణ లేదు.

సర్కస్ టెంటు దగ్గరికెళ్ళాడు రాజా.

అక్కడి కెళ్ళగానే అన్ని రకాల జంతువుల వాసనా కలిసి చిత్రంగా వుంది వాతావరణం.

టెంటు లోపలికి వేసి ఉంది రెడ్ కార్పెట్. ద్వారానికి ప్రక్కన ముఖమల్ పరదాలు కట్టి వున్నాయి.

ఆ ప్రక్కనే సపరేట్‌గా చిన్న ఎన్‌క్లోజర్‌లాగా చేసి ఉంది గొలుసులతో. అక్కడే ఒక టేబులూ, రెండు సోఫాలూ వేసి వున్నాయి....

టేబుల్ దగ్గర నిలబడి ఉన్నాడు మాస్టర్ గోపాలన్.

నల్లటి మనిషి. బాగా పొడుగ్గా ఉన్నాడు. తెల్లటి ఫ్యాంటూ, షర్టూ టక్ చేసి టై కట్టుకుని వున్నాడు.

అతను ఆ సర్కస్‌కి యజమాని! గోపాలన్‌ది కేరళలోని టెల్లిచెర్రి.

ఎందుకోగానీ సర్కస్ ప్రొఫెషన్‌లో చేరేవాళ్ళలో ముప్పాతిక మూడొంతులమంది కేరళలోని టెల్లిచెర్రి నుంచే వస్తారు.

టెల్లిచెర్రిలో కూడా 'తియ్యా' అనే కులంవారే ఎక్కువగా సర్కస్‌లోకి రావడానికి యిష్టం చూపిస్తారు.

అక్కడి పిల్లలను సర్కస్ యజమానులు కాంట్రాక్టుకి కుదుర్చుకుని తల్లిదండ్రులకు యింత డబ్బు మాట్లాడుకుని యిచ్చేసి, పిల్లలను తమ దగ్గరే వుంచుకుని ట్రైనింగ్ యిస్తారు.

ఇదంతా అప్పట్లో తెలియదు రాజాకి. ఆ తరువాత తెలిసింది.

గోపాలన్ దగ్గరికి వెళ్ళి నిలబడి విష్ చేశాడు రాజా.

"ఏమిటి?" అన్నాడు గోపాలన్ హిందీలో.

హిందీలోనే చెప్పాడు రాజా.

"నాకు సర్కస్ ట్రూప్‌లో చేరాలని ఉంది."

"నీకేం వచ్చు?"

"ఏమీ రావు! నేర్పితే నేర్చుకుంటాను. తెలివి వుంది ధైర్యం వుంది" అన్నాడతను నిజాయితీగా.

అసహనంగా అన్నాడు గోపాలన్ "ఏం చెయ్యగలవు నీ ధైర్యముతో?"

"పులి నోట్లో తల పెట్టగలను" అన్నాడతను.

ఆ ఒక్క మాటతో పడిపోయాడు గోపాలన్. రాజా వేపు అంచనా వేస్తున్నట్లు చూశాడు.

"నీ తల్లిదండ్రులు ఎక్కడున్నారు?"

"నాకెవరూ లేరు. దేవుడే దిక్కు!"

"అదీ ఒకందుకు మంచిదే! ఇకనుంచి నువ్వు నా దగ్గరే ఉండిపోవచ్చు. అయితే ఒక విషయం చెప్పు....ఎందుకు చేరుతున్నావ్ నువ్వు సర్కస్‌లో? తిండి కోసమా?"

"కాదు! తిండి ఎక్కడయినా సంపాదించుకోగలను. ఫీట్సు నేర్చుకోవడానికి చేరుతున్నాను.... జీతం డబ్బులతో చదువుకోడానికి చేరుతున్నాను...."

ఆశ్చర్యంగా చూశాడు గోపాలన్.

"చదువుకుని?"

"పోలీసు డిపార్ట్‌మెంట్‌లో చేరతా! చేరి కమెండోని అవుతాను."

భుజాలు చరిచాడు గోపాలన్.

"పెద్దయ్యాక ఏమవుతావో నీ ఇష్టం. కానీ నా దగ్గర ఉన్నన్నాళ్లూ ఒళ్ళు దగ్గర పెట్టుకుని వుండాలి. నా డిసిప్లిన్ అంటే మాటలు కాదు."

తల ఊపాడు రాజా.

రాత్రికి అతను జోకర్స్ టెంటులో పడుకున్నాడు.

తెల్లారుఝామునే లేపేశారు అతన్ని.

గోపాలన్ అన్నాడు రాజాతో –

"ఒక్క వారం రోజులపాటు నువ్వు అన్నిటినీ చూస్తూ ఉండు. నేను నిన్ను చూస్తూ వుంటా. వారం గడిచాక చెప్తా నిన్ను ఏ ట్రైనింగ్‌లో పెట్టాలో."

వారం రోజుల తరువాత డిసైడ్ చేశాడు గోపాలన్.

రాజాకి షూటింగ్‌లో ట్రైనింగ్ ఇవ్వాలని.

మొదటగా అతనికి ఒక ఎయిర్ గన్ ఇచ్చారు. దానిలో బుల్లెట్స్ వుండవు. చిన్న సీసం ముక్కలు వుంటాయి. కాలిస్తే దెబ్బ తగులుతుంది కానీ ప్రాణాపాయం వుండదు.

"తుపాకిని అందుకోబోయేముందు గురువుగారి కాళ్ళకి దణ్ణం పెట్టు" అన్నాడు జోకర్ అరవిందన్.

"అదెట్లా మర్చిపోతాను...." అంటూ జేబులో నుంచి పర్సు తీశాడు రాజా. దానిలో నుంచి కృష్ణాజీ ఫోటో తీశాడు. దాన్ని కళ్ళకద్దుకున్నాడు.

రాజా ఇంకా గోపాలన్‌కి దణ్ణం పెడతాడని ఊహిస్తున్న జోకరు అరవిందన్ ఆశ్చర్యపడ్డాడు.

"అదెవరు?" అన్నాడు అనుమానంగా.

"ఆయన నా తొలి గురువు!" అన్నాడు రాజా. "ఆయన తరువాత వచ్చిన వాళ్ళందరూ మలి గురువులు. తొలి గురువు మాత్రం ఆయనే...." అని అప్పుడు గోపాలన్ కాళ్ళకి దణ్ణం పెట్టాడు.

ఆ విధంగా మొదలయ్యింది అతని ట్రైనింగ్.

✦ ✦ ✦

ఆ తరువాత తొమ్మిదేళ్ళు ఎలా గడిచిపోయాయో రాజాకే తెలియదు.

తను పెట్టుకున్న లక్ష్యం సాధించడానికి సర్కస్‌లో చేరడం సరైన పనే అని అతనికి ఆ తరువాత నమ్మకం ఏర్పడింది. సర్కస్ మాస్టర్ గోపాలన్‌కి రాజా అంటే మంచి గురి కుదిరింది. అభిమానం ఏర్పడింది. అలాంటి శిష్యులు దొరకడం విద్య నేర్పించే గురువులకి కూడా అదృష్టమే!

అతి త్వరలోనే షూటింగ్ ఎక్స్‌పర్ట్ అయిపోయాడు రాజా.

చీకట్లో వెలుగుతున్న కొవ్వొత్తిని వెనక్కి తిరిగి అద్దంలో నుంచి చూస్తూ అతను షూట్‌చేసి ఆర్పేస్తుంటే, మత్స్యయంత్రాన్ని ఛేదించిన అర్జునుడే గుర్తు వచ్చేవాడు గోపాలన్‌కి.

అందరికీ సంవత్సరాలు పట్టే ట్రైనింగ్ రాజా ఆరునెలల్లోనే కంప్లీట్

చెయ్యగలిగాడు. ఆ తర్వాత ట్రెపీజ్ ఫీట్స్‌లోకి వెళ్ళాడు. అతి త్వరలోనే కింద రక్షణ కోసం ఉంచే నెట్ కూడా లేకుండా, ఉయ్యాలల మీద ఒళ్ళు గగుర్పొడిచే ఫీట్స్ చెయ్యడం నేర్చుకున్నాడు. ఆ తర్వాత విలువిద్య, ఆ తర్వాత హార్స్ రైడింగ్, రెండు గుర్రాల మీద చెరోకాలూ పెట్టి స్పీడుగా సవారీ చెయ్యడం, కత్తులు విసరడం....

రెండేళ్ళు గడిచి మనిషి పొడుగయ్యాక అప్పుడు మోటార్ సైకిల్ ఫీట్స్ మొదలెట్టాడు రాజా. కళ్ళు తిరిగేంత వేగంతో అతను గ్లోబులాంటి దాన్లో రైడ్ చేస్తూ వుంటే కళ్ళార్పకుండా చూసేవాళ్ళు ప్రేక్షకులు.

తర్వాత జీపుని వేగంగా నడుపుతూ వచ్చి జంప్ చేయించడం నేర్చుకున్నాడు. పులుల్ని ఆడించడం నేర్చుకున్నాడు.

అవి ప్రేక్షకులు చేసి మెచ్చుకునే ఫీట్సు.

ఇవే కాకుండా....

అవసరమైతే ఆర్కెస్ట్రాలో కూర్చుని గిటార్ వాయించేవాడు.

వంటవాళ్ళలో ఎవరైనా వంట్లో బాగుండక పడక వేస్తే వాళ్ళ ప్లేస్‌లోకి తను వెళ్ళేవాడు.

అందుకని సహజంగానే సర్కస్ యజమాని గోపాలన్‌కి రాజా అంటే అంత అభిమానం కలిగింది.

గోపాలన్ అభిమానాన్ని గుర్తుంచుకున్నాడు రాజా. సహచరుల అసూయని అలక్ష్యం చేశాడు.

తన పనేదో తను చూసుకున్నాడు.

అక్కడ నేర్చుకోదగ్గ విద్యలన్నీ నేర్చుకున్నాడు.

సర్కస్ ఓనర్ గోపాలన్‌తో తను కుదుర్చుకున్న అగ్రిమెంటు పిరియడ్ ముగియడంతో సర్కస్‌కి గుడ్‌బై చెప్పేశాడు రాజా.

అన్ని సంవత్సరాలలో ఏనాడూ కూడా అతను తన తొలి గురువు ఫోటోని కళ్ళకద్దుకోకుండా కళ్ళు తెరవలేదు.

ఆయన చేసిన హితోపదేశం ఏ క్షణం కూడా మరవలేదు.

ఏం చెప్పాడు కృష్ణాజీ?

"రాజా! నీ దేహం ఈ దేశం కోసమే అంకితం కావాలి. నా కోరిక తీరుస్తానని మాట యివ్వు"

అది ఆయన కోరిన కోరిక.

తను ఇవ్వవలసిన గురుదక్షిణ కూడా అదే.

దేశసేవకే తన జీవితం అంకితం చెయ్యాలి.

దేశసేవ చెయ్యాలంటే అసలు దేశం ఎట్లా ఉందో తెలుసుకోవాలి. అందుకుగానూ దేశాటనం చెయ్యాలి. నలు చెరుగులా తిరగాలి. దేశమంటే ఈ రాష్ట్రమే కాదు, ఈ మనుషులే కాదు, ఈ భాషే కాదు.

ఊళ్ళు తిరగటం మొదలెట్టాడు రాజా.

వారానికో ఊరు చూడడం.

ఏ పని దొరికితే ఆ పని చెయ్యడం.

తన కళ్ళు అనే కెమేరాలతోనే దృశ్యాలని రికార్డు చేసుకోవడం. మెదడు అనే డైరీలో పాయింట్స్ నోట్ చేసుకోవడం.

ఎవరో కామెంట్ చేసినట్లు –

బహుశా దైవాంశ సంభూతుడేనేమో ఈ రాజా.

ఎక్కడికెళ్తే అక్కడి భాష పట్టుబడేది అతనికి. ఏ ఊరికెళితే ఆ ఊరి యాస అంటుకునేది.

తిరిగాడు తిరిగాడు....

చూశాడు చూశాడు....

విన్నాడు విన్నాడు....

ప్రతి రోజూ ఒక కొత్త అనుభవం!

ప్రతి రోజూ ఒక కొత్త అడ్వెంచరు!

రకరకాల మనుషులు! రకరకాల మనస్తత్వాలు!

పవిత్రులు, పతితులు, పర్వర్టెడ్ మెంటాలిటీ ఉండేవాళ్ళు...

అందరితో అంటీ ముట్టనట్లు ఉండేవాడు రాజా.

కానీ ఒక్కడితో మాత్రం అలా నిర్లిప్తంగా ఉండడం కుదరలేదు.

అతనే కీర్తి! కీర్తికుమార్!

రాజా వెళ్తున్న సర్క్యూట్‌లో చాలాసార్లు తగిలాడు అతను.

మిల్టన్ "పారడైజ్ లాస్ట్"లో రాశాడు సైతాన్ గురించి. సైతాన్ దేవుడికి ప్రత్యర్థి. దేవుడితో తగువు పెట్టుకోగలిగినంత తాఖత్ ఉన్నవాడే సైతాన్ కూడా. అతను కూడా ఒక ప్రిన్సే! ప్రిన్స్ ఆఫ్ డార్క్‌నెస్. చీకటి రాజ్యానికి అధిపతి.

కీర్తి కూడా సైతాన్ లాంటివాడే అతనిదీ అన్నిటిలోనూ రాజాకి వ్యతిరేకమైన స్వభావం.

రాజా మంచివాడయితే కీర్తి చెడ్డవాడు.

రాజా అందగాడయితే కీర్తి కురూపి.

రాజా పరోపకారి. కీర్తికి పరపీడనం అంటే ప్రమోదం.

రాజాది పాజిటివ్ థింకింగ్. కీర్తిది పూర్తిగా నెగెటివ్ థింకింగ్.

అతన్ని ఇగ్నోర్ చెయ్యాలనీ, మర్చిపోవాలనీ చాలా ట్రై చేశాడు రాజా. కానీ అది కుదరలేదు. చాలా తరచుగా కీర్తి గుర్తు వస్తూనే ఉంటాడు రాజాకి.

ఈ కీర్తిని గురించి ముందు ముందు....

తను నేర్చుకున్న విద్యలని ఒలింపిక్స్‌లో టెస్ట్ చేసుకోదలుచుకున్నాడు రాజా.

ఒలింపిక్స్‌కి వెళ్ళడానికి నానా తిప్పలూ పడవలసి వచ్చింది అతనికి. అతనిలో ఉన్న అద్భుతమైన, అనితర సాధ్యమైన టాలెంటుని చూసీచూడగానే గుర్తుపట్టేశారు సెలెక్టర్లు.

కానీ రాజా సెలెక్ట్ కాలేదు.

సెలెక్టు కావాలంటే లాబీయింగ్ చెయ్యాలి.

ఎన్నో ఎన్నెన్నో లాబీలు అక్కడ.

పంజాబీ లాబీ.... మహారాష్ట్రియన్ లాబీ.... తమిళ లాబీ.... మళయాళ లాబీ....

ఎవరి కాండిడేట్లని వాళ్ళు పుష్ చేసుకోవడానికి ప్రయత్నాలు, పంతాలు, పట్టింపులు....వంచన.

కానీ తెలుగువాళ్ళకి మాత్రం ఏ ఫీల్డులోనూ లాబీ ఉండదు.

పైగా....పొరబాటున పైవాడు గనక తెలుగువాడు అయి ఉంటే, వాడు ఇంకో తెలుగువాడు వెలుగులోకి రాకుండా తొక్కెయ్యాలని చూస్తాడు.

చిలిపి బుద్ధి!

తెలుగువాడి తత్వం బాగా తెలుసు రాజాకి. అతను ఎంతో లోకం చూశాడు.

తెలుగువాడు చాలా నిష్పక్షపాతంగా ఉంటాడు.

నిష్పక్షపాతంగా ఉండడంలో మళ్ళీ రెండు రకాలు.

తనవాళ్ళూ, పరాయివాళ్ళూ అని లేకుండా అందరిపట్లా ఒకే సమభావంతో ప్రవర్తించడం.

తను నిష్పక్షపాతి అనిపించుకోవాలనే కుతితో తన వాళ్ళని తొక్కేసి ఎదుటివాళ్ళని అందలం ఎక్కించడం.

తెలుగు వాళ్ళంటే ఎట్లాంటివాళ్ళు?

రెండేళ్ళక్రితం కాబోలు. ఢిల్లీలో కొందరు కలిసి ఒక ప్రయత్నం మొదలెట్టారు. ఢిల్లీలో వున్న తెలుగు ప్రముఖులందరి వివరాలూ సేకరించి ఒక డైరెక్టరీగా వెయ్యాలని.

దానికి తెలుగువాళ్ళ రెస్పాన్సు ఎలా ఉందీ? ముప్పాతిక మూడొంతుల మంది మేము తెలుగు వాళ్ళమని ఒప్పుకోవడానికి ఇష్టపడలేదు. పేపర్లలో వ్యంగ్యంగా రాశారు ఈ విషయం గురించి.

అట్లాంటివాళ్ళు తెలుగువాళ్ళు.

ఒలింపిక్స్ సెలెక్షన్ కమిటీలో అలాంటి "తెగులు" వాడే ఒకడు తగిలాడు రాజాకి. అతని వల్ల తన ఛాన్సెస్ మట్టికొట్టుకు పోతాయని ముందే గ్రహించాడు రాజా.

అందుకని సీదా ఆయనింటికి వెళ్ళిపోయాడు ఆ రాత్రి.

అతను అక్కడ ఉన్నది ఒక్క నిమిషమే, చెప్పిందీ ఒక్కమాటే!

"చూడు గురూ! నీకు చిత్రమైన భావాలు ఉండొచ్చు! కానీ ఆ భావాలవల్ల నాకు చిత్రవధ జరిగితే బావుండదు కదా! రేపు సెలెక్షన్స్‌లో నాకు ఫేవర్ చెయ్యమని అడగడం లేదు. అన్యాయం చెయ్యొద్దని హెచ్చరిస్తున్నాను."

అంతే!

ఆ మాటలు చెప్పి తిరిగి వచ్చేశాడు రాజా.

తన సొంత "బ్రాడ్‌మైండ్‌నెస్" గురించి అప్పటిదాకా ఎవరితోనో గప్పాలు కొట్టి వున్న ఆ తెలుగు వీరుడు నోరు మూతబడి, నిలువుగుడ్లుపడి, నిశ్చేష్టుడై చూస్తూ ఉండిపోయాడు.

మొత్తానికి సెలెక్షన్స్‌లో రాజాకి అన్యాయం జరగలేదు.

ఒలింపిక్స్‌కి వెళ్ళాడు అతను.

ఎనభైకోట్ల మంది జనం ఉండే ఈ దేశంలోని పౌరుడు ఒక్కడు కూడా ఇన్నాళ్ళనుంచీ సాధించలేనిది, తను సాధించాడు.

మూడు మెడల్సు – గోల్డ్ మెడల్సు – తను ఒక్కడే సాధించాడు.

అక్కడ నుంచి మొదలవుతుంది అసలు కథ.

✦ ✦ ✦

ఇండియాకి తిరిగి వచ్చే ఎయిర్ ఇండియా ఫ్లయిట్‌లో విండో సీట్లో కూర్చుని ఉన్నాడు రాజా. ఉల్లాసంగా ఉంది అతని మనసు. మూడు రంగుల భారత జాతీయ

పతాకం అతని రొమ్ముమీద వుంది. దానికి తగిలించి వున్నాయి మూడు మెడల్సు.

తన పర్పస్ సర్వ్ అయ్యింది.

తనేమిటో ప్రూవ్ చేసుకున్నాడు.

ఇంక తన డ్యూటీ మొదలెట్టాలి.

అందుకు మొదటి మెట్టు....పోలీసు ఆఫీసర్ కావాలి.

పోలీసు ఆఫీసరుగా ఉంటే తప్ప తను దేశసేవ చెయ్యలేడని కాదు.

కానీ పోలీసు ఆఫీసరయి కృష్ణాజీ కోరిక తీర్చాలి.

బహుశా తను వెళ్ళేటప్పటికి ఇంటర్వ్యూ కాల్ కూడా వచ్చెయ్యవచ్చు.

రాజా అంత ఆనందంగా వున్నాడు గానీ ఆ ఫ్లయిట్‌లో ఉన్న ఇండియన్స్‌లో ఎవరూ అతని ఉత్సాహాన్ని షేర్‌చేసుకుంటున్నట్లు లేదు.

నిజం చెప్పాలంటే, ఇండియన్స్‌కి స్పోర్ట్స్ అంటే అంత అభిమానం లేదు.

ఇండియన్స్ వేలం వెర్రిగా చూసే గేమ్ క్రికెట్ ఒక్కటే!

క్రికెట్ ప్లేయర్స్‌కి సినీ స్టార్స్‌ని మించిన క్రేజ్ వుంది ఈ దేశంలో. కోట్లు సంపాదించగలుగుతున్నారు క్రికెట్ ప్లేయర్స్.

క్రికెట్ తరవాత ఇండియన్స్‌కి అంత అభిమాన పాత్రమైన స్పోర్ట్స్ బహుశా రాజకీయాలే అయి ఉంటాయి.

తక్కిన గేమ్స్ అన్నీ, స్పోర్ట్స్ అన్నీ చిన్న చూపే ఇండియన్స్‌కి.

ఆ ఫ్లయిట్‌లో ఎక్కువమంది ఇండియన్సే ఉన్నారు. వాళ్ళలో ఎవరూ అసలు రాజాని గమనించలేదు కూడా.

అయితే ఇంతలో ఒక అమెరికన్ అమ్మాయి తన సీట్లో నుంచి లేచింది.

రాజా దగ్గరికి వచ్చింది.

"ఆర్ యూ రాజా ఆఫ్ త్రీ మెడల్స్ ఫేమ్?" అంది ఎగ్జయిటెడ్‌గా.

తల పంకించాడు.

వంగి, తమకంగా అతని పెదిమల మీద గట్టిగా ముద్దుపెట్టింది ఆ అమ్మాయి.

ఆ అమ్మాయి అలా ఆర్భాటం చెయ్యగానే అప్పుడు తెలిసింది తక్కిన ఇండియన్స్‌కి అతని విలువ!

అప్పుడందరూ అతన్ని చుట్టేశారు.

ఆటోగ్రాఫులు కావాలనీ....

అడ్రెసు కావాలనీ....

అప్పుడు గమనించాడు రాజా - అతన్ని.

అతనే....

కీర్తి....

ఎందుకొస్తున్నాడు ఈ ఫ్లయిట్‌లో.

ఏమన్నా అఘాయిత్యం చేస్తాడా?

కీర్తివైపే కళ్ళార్పకుండా చూస్తూ వుండిపోయాడు కానీ అతను ఊహించినట్లు కీర్తి ఏమీ చెయ్యలేదు.

బాంబేలో లాండ్ అయింది ఫ్లయిట్. లగేజ్ కలెక్ట్ చేసుకోవడం కోసం నిలబడ్డాడు రాజా.

లగేజ్ వచ్చింది.

కీర్తి ఒక పెద్ద ట్రంక్ పెట్టెని పట్టుకుని కస్టమ్స్ కౌంటర్ దగ్గరికివచ్చాడు.

"చెక్ చేస్తే చెయ్యండి. నేను అర్జెంటుగా వెళ్ళాలి" అన్నాడు అదో రకమయిన గీర కలిసిన గొంతుతో.

ఒకసారి అతని మొహంలోకి చూసి, ట్రంకు తెరిచాడు కస్టమ్స్ అధికారి. లోపలంతా తడిమి చూశాడు.

ఏమీ లేదు.

విజయగర్వంతో నవ్వాడు కీర్తి.

"అయ్యిందా?" అన్నాడు అపహాస్యంగా.

ఇంకోసారి అతని మొహంలోకి చూసి, "వెళ్ళొచ్చు" అన్నట్లు తలపంకించాడు అధికారి.

"థాంక్స్!" అని వ్యంగ్యంగా బయటికి నడిచాడు కీర్తి.

అతన్నే పరిశీలనగా చూస్తున్నాడు రాజా.

దిస్ బగర్ ఈజ్ ఆఫ్ టూ సమ్ మిస్చీఫ్!

అకారణంగా తనే అడిగాడు కస్టమ్స్ వాళ్ళని – తనని చెక్ చెయ్యమని.

వీడు పెద్ద యాంటీ నేషనల్! ఇంటర్నేషనల్ క్రూక్.

ఇవాళేమిటి ఇంత జెంటిల్మాన్‌లాగా కస్టమ్స్ వాళ్ళకి తనే ఆఫర్ యిస్తున్నాడు – తనని చెక్‌చెయ్యమని.

అంటే కస్టమ్స్ వాళ్ళ కళ్ళలో దుమ్ము కొట్టొచ్చని అంత నమ్మకంగా ఉన్నాడన్న మాట.

ఏమయి ఉంటుంది వీడి గేమ్?

చేతిలో ట్రంకుపెట్టి ఉంది. దాన్ని థరోగా చెక్ చేసేశారు కస్టమ్స్ వాళ్ళు.

అందులో ఏమీ లేదు.

కీర్తి జేబులు కూడా వెదికారు వాళ్ళు.

ఏం దొరకలేదు.

మరి....మరి....

ఇందులో ఏదో హిచ్ వుంది. కీర్తిగాడి మొహంలో భావం చూస్తుంటే ఆ అనుమానం మరీ బలపడుతోంది.

హఠాత్తుగా ఏదో స్ఫురించింది రాజాకి. గబగబా ముందుకి నడిచాడు. రాష్‌గా వెళ్ళి కీర్తికి డాష్ కొట్టాడు.

ఆ ఇంపాక్ట్‌కి కీర్తి చేతిలోని ట్రంక్ పెట్టె ధనాలుమని కింద పడిపోయింది. పడగానే దానికి వేసి వున్న పెయింటు కొద్దిగా గీరుకుపోయింది.

వంగి, ఆ రంగుపోయిన చోట చూశాడు రాజా. తరవాత కస్టమ్స్ అధికారి వైపు తిరిగి అన్నాడు –

"సర్! మీరు ఇతన్ని అరెస్ట్ చెయ్యొచ్చు. ఈ పెట్టెలో ఏమీలేదు. కానీ పెట్టె మొత్తం ప్రపంచంలోని అతి ఖరీదయిన లోహం ప్లాటినంతో చేసి వుంది. సాలిడ్ ప్లాటినమ్! ప్లాటినమ్ స్మగుల్ చేస్తున్నాడు ఇతను."

కస్టమ్స్ ఆఫీసర్ వచ్చి అభిమానంగా రాజా భుజం తట్టాడు.

"స్మార్ట్! వెరీ స్మార్ట్! థాంక్స్ బడ్డీ!"

నవ్వి, డొమెస్టిక్ టెర్మినల్‌లో వున్న హైదరాబాద్ వెళ్ళే ఫ్లయిట్ వైపు నడిచాడు రాజా.

✦ ✦ ✦

పోలీస్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగానికి అప్లయ్ చేస్తూ కేరాఫ్ పోస్ట్ మాస్టర్, జనరల్ పోస్ట్ ఆఫీస్, హైదరాబాద్ అని అడ్రసు యిచ్చాడు రాజా.

ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా పోస్టాఫీసుకి వెళ్ళాడు.

అతను ఊహించినట్లే అక్కడ అతని కోసం ఎదురు చూస్తోంది ఇంటర్వ్యూ లెటరు.

ఇంటర్వ్యూ తతంగం న్యాయంగానే గనక జరిగితే, తనకి సెలెక్షన్ తప్పదని రాజాకి తెలుసు. చాలా నిబ్బరంగా వెళ్ళాడు ఇంటర్వ్యూకి.

అతని టర్న్ వచ్చింది.

ఖడక్‌గా నడుస్తూ లోపలికి వెళ్లాడు.

లోపలికి వెళ్ళీవెళ్ళగానే అతను గమనించాడు.

ఇంటర్వ్యూ బోర్డు మెంబర్లలో ముఖ్య స్థానంలో కూర్చుని వున్నది....

ఇంకెవరో కాదు....

కృష్ణాజీ!

అవును కృష్ణాజీనే!

తన గురువు! తన దైవం!

తనకి తెలియకుండానే రెండు చేతులూ జోడించాడు అతను.

ఎన్నాళ్ళకెన్నాళ్ళకు చూస్తున్నాడు యీయనని.

రాజా కళ్ళలో తడి!

రాజా అభివాదాన్ని అందుకున్నట్లు తల పంకించాడు కృష్ణాజీ. కానీ అతను రాజాని గుర్తుపట్టలేదు.

అదీ సహజమే కదా!

తొమ్మిదేళ్ళ క్రితం చూశాడు రాజాని అతను.

అప్పట్లో రాజా చిన్నపిల్లవాడు!

ఇప్పుడు ఎదురుగా ఉన్న రాజా సూపర్‌మాన్‌లా కండలు తిరిగి వున్న యంగ్‌మాన్!

“నీ పేరు....” అన్నాడు కృష్ణాజీ.

“రవిరాజ్ కుమార్” అన్నాడు రాజా.

అంతేగానీ తను ఫలానా అని చెప్పి గుర్తు చెయ్యలేదు కృష్ణాజీకి.

కృష్ణాజీకి తనెవరో తెలిస్తే రెండు రకాలుగా వుండవచ్చు పరిస్థితి.

ఒకటి....

కృష్ణాజీకి ఇంకా తన మీద కోపం పోయి వుండకపోవచ్చు.

ఆనందరావు మాటల ఎఫెక్ట్ ఇంకా ఆయన మనసులో ఉండి తనంటే వ్యతిరేకత ప్రకటించవచ్చు.

ఆయనకు తెలియకుండానే, ఆయన మనసులో ఉన్న వ్యతిరేకత వర్క్‌చేసి, అది తను పోలీసు డిపార్ట్‌మెంటులో చేరే ఛాన్సెస్‌ని దెబ్బతియ్యవచ్చు.

అలా కాకపోతే....

కృష్ణాజీకి తనపట్ల ఉన్న అపోహలు ఈ మధ్యకాలంలో తొలిగిపోయి వుండవచ్చు.

ఆయన ఎప్పటిలాగా తనంటే వాత్సల్యం చూపించి, తనకు అనవసరంగా ఫేవర్ చెయ్యాలని చూడవచ్చు.

అది కూడా సంభవమే!

అలా ఒకరి దయాదాక్షిణ్యాల మీద సెలెక్షన్ రావడం తనకి ఇష్టం లేదు.

తనకి సెలెక్షన్ అంటూ వస్తే, అది కేవలం తన ప్రతిభ వల్లే రావాలి అంతే!

మరో కారణం వల్ల....అది ఏదయినా సరే.... వస్తే తనకి నచ్చదు! దానికి మాత్రం తిరుగు లేదు.

పెద్దవాడయిన రాజాని కృష్ణాజీ గుర్తుపట్టలేదు – సహజంగానే.

కృష్ణాజీ కూడా మారాడు.

అయితే గుర్తు పట్టలేనంతగా మాత్రం కాదు. మనిషి దృఢంగానే ఉన్నాడు గానీ జుట్టు చెంపల దగ్గర నెరిసింది. ముందు వైపు జుట్టు కాస్త పలచబడి, బట్టతల రాకని సూచిస్తోంది.

తన ముందు వున్న పేపర్స్ కాసేపు పరికించి, తరవాత ప్రశ్నలు అడగడం మొదలుపెట్టాడు కృష్ణాజీ.

ముందుగా రొటీన్ క్వశ్చన్స్.

ఆ తరవాత రాజా వ్యక్తిత్వాన్నీ, మనస్తత్వాన్నీ ప్రోబ్ చేస్తూ....డీప్‌గా, తరచి తరచి చూస్తున్నట్లు ప్రశ్నలు!

గుర్రానికి పై పళ్ళు ఎన్ని?

గాడిద తోకలో ఉండే వెంట్రుకలు ఎన్ని? అన్న వెకిలి పద్ధతిలో అనవసరమైన "జనరల్ నాలెడ్జి" ప్రశ్నలు కాకుండా.

నిజంగా మనసు లోతులని త్రవ్వి చూసే ప్రశ్నలు!

ఈ ఉద్యోగం అంటే ఎందుకు అభిరుచి కలిగింది?

పొట్ట కూటికా?

కమిట్‌మెంట్ కోసమా.

పెడదారుల్లో సంపాదన కోసమా?

సాటి మనుషుల కోసం, దేశం కోసం ఏం చెయ్యాలని ఉంది?

ఏం చెయ్యగలవు?

ఇంతవరకూ ఏం చేశావు?

నిప్పులాంటి నిజాయితీపరుడు మాత్రమే నిస్సంకోచంగా అడగగలిగిన ప్రశ్నలు అవి!

కృష్ణాజీ వరసబెట్టి అడుగుతున్న ప్రశ్నలన్నిటికీ తడుముకోకుండా, మెషిన్‌గన్‌తో రాపిడ్ ఫైరింగ్ చేసినట్లు గబగబా జవాబులు చెప్పేస్తున్నాడు రాజా.

అరగంట సేపు అలా అడిగాక, అప్పుడు తృప్తిగా అన్నాడు కృష్ణాజీ.

"దిస్ ఈజ్ రియల్లీ ఎక్స్‌ట్రార్డినరీ! నీ లక్ష్యం గురించీ, ఆ లక్ష్యం సాధించడానికి అనుసరించవలసిన మార్గం గురించీ నీకు పూర్తిగా అవగాహన ఉంది. ఎక్కడా, ఏ విషయంలోనూ ఏ మాత్రం కన్‌ఫ్యూజన్ లేదు నీకు. కమిట్‌మెంటూ, క్లియర్ థింకింగూ రెండూ కలిస్తేగానీ ఇలాంటి వ్యక్తిత్వం ఏర్పడదు! వెల్‌డన్ యంగ్‌మాన్!"

"థాంక్యూ సర్!" అన్నాడు అతను చిరునవ్వుతో.

కొద్ది క్షణాలపాటు అతని వైపు తదేకంగా చూశాడు కృష్ణాజీ.

తరవాత అన్నాడు.

"నీకు చాలా రకాలయిన ఎక్స్‌ట్రా కర్రిక్యులర్ యాక్టివిటీస్‌లో ఇంట్రెస్టూ, ప్రవేశమూ ఉన్నాయని రికార్డ్ చేసి వుంది ఇక్కడ....నౌ.... వెయిటే మినిట్! నువ్వెవరో గుర్తొచ్చింది యిప్పుడు...." అన్నాడు ఎగ్జయిటెడ్‌గా.

గుర్తుపట్టాడా తనని?

బిగుసుకుపోయినట్లు ఉండిపోయాడు రాజా.

చాలా ఎగ్జయిటెడ్‌గా అన్నాడు కృష్ణాజీ.

"వెధవది....ఇంతసేపు ఎదురుగా కూర్చున్నా గుర్తుపట్టలేకపోయాను....యూ ఆర్ రాజా ఆఫ్ త్రీ ఒలింపిక్ మెడల్స్! ఇండియా పరువు నిలబెట్టిన స్పోర్ట్స్‌మేన్‌వి! అవునా!" అంటూ లేచి నిలబడి షేక్‌హాండ్ కోసం చెయ్యి జాపాడు కృష్ణాజీ.

కృష్ణాజీ లేచి నిలబడడంతో తను కూడా లేచి నిలబడ్డాడు అతను. అతని చేతిని ఆప్యాయంగా నొక్కాడు కృష్ణాజీ.

"యువజనుల పాలిటి ఆశాజ్యోతి అని వాళ్ళనీ వీళ్ళనీ గురించి అంటుంటామే... అదంతా బుల్‌షిట్! ఇతనండీ నిజంగా యువజనుల పాలిటి ఆశాజ్యోతి అంటే.... బకప్ యంగ్‌మాన్! కీపప్!"

"థాంక్స్" అన్నాడు రాజా సగౌరవంగా.

అక్కడున్న ఆఫీసర్స్‌లో ఒకతను అన్నాడు.

"ఒలింపిక్స్‌లో మెడల్సు వచ్చాయా? మాకు తెలిసిన ఒకబ్బాయి కూడా వాళ్ళ స్కూలు తరపున బాట్‌మింటన్ ఆడుతూ వుండేవాడు!" అన్నాడు తనకు తెలిసిన స్పోర్ట్స్ పరిజ్ఞానాన్ని వెళ్ళబెడుతూ.

"బాట్‌మింటన్ కాదు! బాడ్ మింటన్!" అన్నాడు కృష్ణాజీ అసహనంగా.

అతనికి అనిపించింది మనుషులు ఇట్లా వుంటే ఇంక స్పోర్ట్స్ ఎట్లా డెవలప్ అవుతాయి?

తనవైపు తిరిగాడు కృష్ణాజీ.

"నీకు ఇంట్రెస్టు ఉన్న మిగతా ఎక్స్‌ట్రా కర్రిక్యులర్ యాక్టివిటీస్...."

త్వరత్వరగా చెప్పాడు రాజా.

"హార్స్ రైడింగ్, బాడీ బిల్డింగ్, కరాటే, కుంగ్‌ఫ్యూ, తైక్‌వాన్‌దో, బాక్సింగ్, రెజ్లింగ్, స్పీడ్ రైడింగ్, యానిమల్ ట్రైనింగ్...."

విస్మయంగా అతని వైపు చూశాడు కృష్ణాజీ.

"దిసీజ్ ఫాంటాస్టిక్! యంగ్‌మాన్! ఇలాంటి వాటిలో కొన్ని మాత్రమే మేం సర్వీసులో చేర్చుకున్న కేండిడేట్స్‌కి ట్రైనింగ్‌లో నేర్పిస్తాం! నువ్వు ఏమిటీ? రెడీమేడ్ ఆఫీసర్‌లాగా అన్నీ నేర్చుకుని వచ్చేశావే?"

నవ్వాడు రాజా.

"సర్! చిన్నప్పటినుంచీ నాకు ఒకే ఒక్క కోరిక! పోలీసు డిపార్ట్‌మెంట్‌లో చేరాలని! అందుకే నాకు నేనే ట్రయినింగ్ ఇచ్చుకున్నాను."

తన సహచరులతో అన్నాడు కృష్ణాజీ

"నూటికి రెండొందల మార్కులు ఇవ్వవలసిన కేండిడేటు! అవునా?" అన్నాడు ఆనందంగా.

తక్కిన వాళ్ళు నసుగుతున్నట్లు మొహం పెట్టారు.

అయినా కృష్ణాజీ కేర్ చెయ్యలేదు. రాజావైపు తిరిగి అన్నాడు.

"ఓకే! నువ్వు ఇంక వెళ్ళవచ్చు! అపాయింట్‌మెంట్ గురించి ఒకటి రెండు రోజుల్లో నీకు కమ్యూనికేషన్ వస్తుంది. ఇమీడియెట్‌గా చేరిపోగలవా?"

"కబురందిన అరగంటలో వచ్చి వాలతాను" అన్నాడు అతను.

"ఆల్ ద బెస్ట్ మై బాయ్!"

మామూలుగా అయితే, ఇలాంటి ఇంటర్వ్యూలలో సెలెక్ట్ అయిందీ లేనిదీ అప్పటికప్పుడు తేల్చి చెప్పరు. ఇంటర్వ్యూ తర్వాత జరిగే తతంగం ఇంకా చాలా వుంటుంది.

కృష్ణాజీ అలా నాన్చలేదు. పరోక్షంగానే చెప్పినా కూడా, 'నీకు ఉద్యోగం

ఖాయం' అన్నంత నిబ్బరంగా చెప్పాడు.

అయితే....కృష్ణాజీలో ఏదో మార్పు కనిపించింది రాజాకి.

శారీరకమైన మార్పు సరే....మానసికంగా కూడా చాలా మార్పు వచ్చింది కృష్ణాజీలో.

తను యిదివరకు చూసినప్పుడు ఆయన అధికార యంత్రాంగానికీ, వ్యవస్థకు వ్యతిరేకంగా పోట్లాడుతూ సతమతమై పోతున్నట్లు ఉండేవాడు.

ఇప్పుడు అలా లేదు ఆయన. డిపార్టుమెంటులో తనేం చెబితే అది జరిగి తీరుతుందన్న కాన్ఫిడెన్సుతో ఉన్నట్లు వున్నాడు. చాలా రిలాక్స్‌డ్‌గా కనబడుతున్నాడు మనిషి! ప్రపంచాన్ని షేపు మార్చెయ్యగలనన్న ధైర్యం అతని మొహంలో కనబడుతోంది. యిదివరకటిలాగా గోడకి అంటుకుపోయి, నిస్సహాయంగా, నిరాయుధుడిగా, శక్తివంతమయిన శత్రువుతో పోట్లాడుతున్నట్లు లేడాయన. శత్రువుని చావుదెబ్బ తీసే సమయం చేరువలోనే వున్న వాడిలాగా ఊగిపోతున్నాడు.

ఇదంతా నిజమా? లేకపోతే తన భ్రమా?

ఇది గనక నిజమే అయి వుంటే కృష్ణాజీకి డిపార్ట్‌మెంట్‌లో వెనక ఎవరిదో పవర్‌ఫుల్ బాకింగ్ దొరికిందన్నమాట!

లేకపోతే, ఇవాళ ఈయన ఈ సెలెక్షన్ కమిటీలోనే అసలు వుండి వుండేవాడు కాదు.

రాజా మనసులో ఉన్న ఊహలని కన్‌ఫర్మ్ చేస్తున్నట్లు అప్పుడే కాల్ వచ్చింది కృష్ణాజీకి –

హోమ్ మినిస్టర్ దగ్గర్నుంచి!

లైన్‌లోని అవతలి వ్యక్తితో కృష్ణాజీ మాట్లాడుతున్న దానిని బట్టి గ్రహించాడు రాజా. ఆయన హోం మినిస్టర్ అయ్యి ఉంటాడని.

గౌరవంతో కూడిన చనువుతో మాట్లాడుతున్నాడు కృష్ణాజీ.

తర్వాత మామూలు మర్యాదలు వదిలేసి, హోం మినిస్టర్‌తో అన్నాడు కృష్ణాజీ–

"సర్! ఇవాళ ఇక్కడే ఒక అద్భుతం జరిగింది....! ఒలింపిక్స్‌లో మూడు మెడల్సు గెల్చుకున్నాడే....ఓ కుర్రాడు.... అతను కూడా వచ్చాడు ఇవ్వాళ ఇంటర్వ్యూకి. వెరీరేర్ బట్ పర్‌ఫెక్ట్ స్పెసిమన్! సర్....టాస్క్‌ఫోర్సా....అవును....కమెండో యూనిట్.... అవును....అవును సర్....నాకూ అదే అనిపించింది."

తక్కిన ఆఫీసర్లు మింగలేక కక్కలేక చస్తున్నట్లు ఫీలవుతూ, సంతాపసభలో శ్రోతల్లాగా ఏడుపు మొహాల్తో కూర్చున్నారు.

వాళ్ళ ఏడుపుకి కారణం ఉంది.

పోలీసు డిపార్ట్‌మెంట్‌లో....పోలీసు డిపార్ట్‌మెంటే ఏమిటి....ప్రభుత్వం తాలూకు ఏ డిపార్ట్‌మెంట్‌లోనయినా సరే....ఇంటర్వ్యూలూ, అపాయింట్‌మెంట్ల టైంఅంటే రైతులకు పంటకోతల టైం లాంటిదన్న మాట! వసూళ్ళూ, పంపకాలతో కళకళ్ళాడిపోతూ ఉంటారు ఆఫీసర్లు ఆ టైంలో.

ఈ కృష్ణాజీ వచ్చి వారం రోజులు కాలేదు.

బంగారం పండే పొలాల్ని బంజరు భూములుగా మార్చేసినట్లు చేసి, ఎవరికీ ఎక్కడా ఒక్కపైసా పుట్టకుండా చేసేస్తున్నాడు.

"మాదే రాజ్యం!" అన్నట్లు చెలరేగిపోతున్నాడు ఈ కృష్ణాజీ. రోజులన్నీ తనవే అనుకుంటున్నాడు గానీ రేపేం జరగబోతోందో అతనికే తెలియదు.

కానీ యిక్కడున్న వాళ్ళలో యిద్దరు ముగ్గురికి తెలుసు రేపేం జరగబోతుందో, రేపు కృష్ణాజీ ఎక్కడుంటాడో?

సమయం కోసం ఓపిగ్గా కాచుకుని ఉన్నారు వాళ్ళు.

"వెల్ యంగ్‌మాన్! వి విల్ మీట్ ఎగెయిన్!" అన్నాడు కృష్ణాజీ సాదరంగా.

శెలవు తీసుకుని బయటికి వచ్చేశాడు రాజా.

అతను రోడ్డు మీదికి వచ్చేసరికి అక్కడొక గొడవ జరుగుతోంది. అక్కడే వుంది ఒక బార్.

ఆ బార్ ముందు రాంగ్ పార్కింగ్ చేసి వుంది ఒక మారుతీ 1000 కారు.

రాంగ్ పార్కింగ్ చేసినందుకు డ్రైవర్‌ని మందలిస్తున్నాడు పోలీసు కానిస్టేబుల్ ఒకతను.

కానిస్టేబుల్ తిడుతున్నా డ్రైవరు నదరలేదు, బెదరలేదు. కారుని అక్కడ నుంచి కదల్చలేదు.

పైగా, అతని మొహం జేవురించింది.

"నీకు కళ్ళున్నాయా లేదా? ఈ కారెవరిదో తెలియదా? మినిస్టర్ విజయకుమారి గారి కొడుకుది" అన్నాడు.

"అయితే రాంగ్ పార్కింగ్ చేస్తావా?" అన్నాడు కానిస్టేబులు.

"ఏందిబే! పెద్ద మాట్లాడుతున్నావ్?" అని కార్లోనుంచి కిందికి దిగాడు డ్రైవరు.

అతను కిందికి దిగగానే అతని భుజం మీద చెయ్యేశాడు కానిస్టేబులు.

"పద!"

"ఎక్కడికి?"

"పోలీసుస్టేషన్‌కి"

"మతి ఉండే మాట్లాడుతున్నావా?"

"తెలుస్తుంది నడు!"

"నీకు మూడింది నా కొడకా!" అన్నాడు డ్రైవర్.

అతన్ని గట్టిగా ముందుకు నెట్టాడు కానిస్టేబులు.

పోలీసు డిపార్ట్‌మెంటులో కాస్తోకూస్తో నిజాయితీ ఉన్న వాళ్ళందరికీ కృష్ణాజీ వచ్చాక దమ్ము వచ్చినట్లయ్యింది.

కృష్ణాజీ వాళ్ళకు ఆర్డర్స్ ఇచ్చాడు కూడా.

"ఈ రౌడీ వెధవలు ఉన్నారే....వాళ్ళెవరైనా....వాళ్ళకి వున్న కనెక్షన్స్ ఎలాంటివైనా సరే....తోకాడిస్తే చాలు....కుక్కల్ని కొట్టినట్లు కొట్టండి. దెబ్బకి దయ్యం వదలాలి వెధవలకి" అని.

డ్రైవర్‌ని దాదాపు ఈడ్చుకుంటూ పక్క సందులోనే ఉన్న పోలీస్‌స్టేషన్‌కి తీసుకెళ్ళాడు కానిస్టేబులు. చోద్యం చూస్తున్నట్లు వాళ్ళిద్దరి వెనకే నడిచారు కొంత మంది మనుషులు. వాళ్ళలో ఒకమ్మాయి కూడా ఉంది.

సాదా చీరే కట్టుకుని వున్నా, చాలా స్మార్ట్‌గా కనబడుతోంది ఆ అమ్మాయి.

ఇదంతా చూస్తున్న రాజా వాళ్ళ వెంటే తను కూడా వెళ్ళాడు.

"నీకు మూడింది నా కొడకా!" అంటున్నాడు డ్రైవరు ఇంకా.

పోలీసుస్టేషన్లో వున్నాడు సబ్ ఇన్‌స్పెక్టర్ బాబూరావు. కానిస్టేబుల్నీ, డ్రైవర్నీ చూశాడు.

"ఏమయ్యింది?" అన్నాడు.

చెప్పాడు కానిస్టేబులు. "రాంగ్ పార్కింగ్ చేశాడు సార్! కారు అక్కడి నుంచి తియ్యమన్నాను. మినిస్టరుగారి కారన్నాడు. కదల్చడానికి వీల్లేదన్నాడు."

"ఏ మినిస్టరు?"

"విజయకుమారి గారండీ!"

మౌనంగానే ఒక బూతు మాట ఉచ్ఛరించాడు సబ్ ఇన్‌స్పెక్టర్ బాబూరావు.

"బొక్కలోకి తొయ్ నా కొడుకుని!"

డ్రైవర్‌ని సెల్‌లోకి నెట్టాడు కానిస్టేబులు.

అప్పుడు –

హఠాత్తుగా –

సుడిగాలిలా –

ఉగ్రనరసింహంలా పోలీస్‌స్టేషన్‌లోకి వచ్చేశాడు సంజీవ్. మినిస్టర్ విజయ కుమారి కొడుకు.

వస్తూనే సబ్ ఇన్‌స్పెక్టర్ బాబూరావు షర్టు కాలర్ పట్టుకున్నాడు.

"ఏమ్‌రా! బలిచిందా?" అన్నాడు మొరటుగా.

"మర్యాదగా షర్టు వదులు! లేకపోతే విచారిస్తావ్?" అన్నాడు బాబూరావు.

ఇంక అప్పుడు అక్కడ ఆ మినిస్టర్‌గారి పుత్రరత్నం చేసిన ఆగం, అల్లరీ వర్ణనాతీతం! సబ్ ఇన్‌స్పెక్టర్‌ని అడ్డూ ఆపూ లేకుండా బూతులు తిట్టాడు. ఇంతలో అతని ఫ్రెండ్స్ యింకో యిద్దరు యువ కార్యకర్తలు అతనికి సపోర్టుగా వచ్చారు.

"కారు అక్కడ పార్క్ చెయ్యమని చెప్పింది నేనే! మొగాడివైతే నన్ను అరెస్ట్ చెయ్యరా నా కొడకా!" అన్నాడు సంజీవ్ సబ్ఇన్‌స్పెక్టర్ బాబూరావుతో తనే వెళ్ళి ఒక లాకప్ సెల్‌లో బైఠాయించాడు. ఈ లోపల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వచ్చాడు.

ఎగిరి లంఘించి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కాలర్ పట్టుకున్నాడు. "లంజా కొడకా! ఏం ట్రైనింగ్ ఇస్తున్నావ్‌రా నీ సబార్డినేట్స్‌కి! నా కారుకి ట్రాఫిక్ రూల్సు పెడతారట్రా! నా డ్రైవర్‌నే అరెస్ట్ చేస్తారుట్రా! నీ...." అంటూ చెయ్యెత్తి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చెంప పగల గొట్టబోయాడు సంజీవ్.

తను జోక్యం కలగజేసుకోక తప్పదనిపించింది రాజాకి.

అతను కదలబోయాడు.

కానీ అంతలోనే –

ఆ జనంలో వున్న అమ్మాయి హఠాత్తుగా ముందుకు వచ్చింది.

మరుక్షణంలో సంజీవ్ చెంప ఛెళ్ళుమనేటట్లు బలంగా కొట్టింది.

ఊహాతీతమైన ఆ సంఘటనకి అదిరిపడ్డాడు మినిస్టర్ విజయకుమారి కొడుకు సంజీవ్.

ఇన్‌స్పెక్టర్‌ని వదిలేసి, చెంప తడుముకుంటూ ఆ అమ్మాయి వైపు చూశాడు.

అతని కళ్ళలో కసి కనబడుతోంది.

"ఓహో! హోం మినిస్టర్‌గారి కూతురు గారా! ఏం! మీ నాన్న దమ్ము చూసుకుని మిడిసిపడుతున్నట్లున్నావే?" అన్నాడు.

"అమ్మ చాటునా, అబ్బ చాటునా దాక్కుని ఆ ధైర్యంతో పిచ్చి పనులు చెయ్యడం నీకే తగింది. నాకేం అవసరం. నేను రెస్పాన్సిబుల్ సిటిజెన్‌ని. ఒక పోలీసాఫీసర్ని నువ్వు కొట్టబోతుంటే చూస్తూ ఊర్కోవాలా?" అంది ఆ అమ్మాయి.

చెంప తడుముకుంటూ అన్నాడు సంజీవ్.

"ఇది ఇంతటితో పోదు! హైకమాండ్‌దాకా పోతుంది.

"నీకు దిక్కున్నచోట చెప్పుకో!" అంది ఆ అమ్మాయి.

అతను ఇంకేదో అనబోయి, తమాయించుకుని అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

"థాంక్స్ అమ్మా!" అన్నాడు ఇన్‌స్పెక్టరు కృతజ్ఞతగా చూస్తూ.

చిన్నగా నవ్వి, పోలీసుస్టేషన్‌లో నుంచి బయటికి వచ్చింది ఆ అమ్మాయి.

వచ్చి ఆటో కోసం చూస్తూ నిలబడింది.

ఆమె పక్కకి వెళ్ళి నిలబడ్డాడు రాజా.

"వెల్‌డన్ అర్పితా!"

చటుక్కున అతనివైపు తిరిగింది అర్పిత. అనుమానంగా చూసింది అతన్ని.

"మీరు....?"

"నేన్నీకు తెలుసు! కానీ గుర్తుపట్టలేవు"

అతన్ని పరిశీలనగా చూస్తూనే ఉంది అర్పిత.

"చిన్నప్పుడు నీ చెవి రింగులు ఒకడు లాక్కోబోతే...."

"ఓహ్! రాజా!" అంది అర్పిత. "రాజానా? నువ్వు రాజావేనా?"

నవ్వాడు రాజా.

"యస్! ఇన్‌ఫ్లెష్ అండ్ బ్లడ్!"

"చాలా తమాషాగా ఉంది!" అంది అర్పిత సంతోషంగా. "హఠాత్తుగా మాయమైపోయావు నువ్వు! 'ఏమైపోయావా?' అనుకున్నాను నేను."

"నేను మాత్రం నీ గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నా. మీ నాన్నగారు పూర్తిగా ప్రజాసేవలో మునిగిపోవడం, ఏ పదవీ ఆశించకుండా ప్రజల కోసమే తన జీవితం అంకితం అన్నట్లు నడుచుకోవడం, ఒక రోజున ఊళ్ళో జనమంతా

మీ ఇంటికి రావడం, మీ నాన్నగారు ఎలెక్షన్‌కి నిలబడి తీరాలని ప్రజలే బలవంతం చెయ్యడం....అంతే!"

చిరునవ్వుతో వింటోంది అర్పిత.

ఆ రోజు బాగా గుర్తే తనకి.

ఓ రోజు

తెల్లవారు ఝామున తను వీధి వాకిలి ముందు చిమ్ముతోంది.

అప్పుడు హఠాత్తుగా సందు తిరిగి ప్రత్యక్షమయ్యింది ఒక గుంపు. దాదాపు వందమంది ఉంటారు అందులో.

వాళ్ళంతా వచ్చి తమ ఇంటి ముందు ఆగారు.

అంతమంది జనం ఒక్కసారిగా ఇంటి ముందు వచ్చి నిలబడటంతో తనకు ఆందోళన కలిగింది.

ఏమయ్యింది? ఏం జరిగింది?

వీళ్ళు వచ్చిన పని తమకి వ్యతిరేకంగా ఏదీ అయి ఉండదని మనసులో అనిపిస్తూనే ఉన్నా, మళ్ళీ అంతలోనే ఏదో తెలియని జంకు.

వచ్చినవాళ్ళలో సూర్యారావు అందరికంటే ముందు ఉన్నాడు.

కలకలం విని వచ్చారు నాన్నగారు.

ప్రశ్నార్థకంగా అందరినీ పరికించి చూస్తూ, సూర్యారావుని అడిగారు.

"సూర్యారావూ? ఏమిటి విశేషం?"

"మీతో మాట్లాడాలని వచ్చాం!" అన్నాడతను.

సావధానంగా విని అన్నారు నాన్నగారు –

"చెప్పండి!"

"ఎలెక్షన్లు వస్తున్నాయి."

"అవును గదా!"

"ఈసారి మీరు నిల్చోవాలి ఎలెక్షనుకి."

"నేనా?"

"మీరే!"

నవ్వారు నాన్నగారు.

"కనకపు సింహాసనం మీద శునకాన్ని కూర్చోబెట్టినట్లు ఉంటుంది గదా!"

"కాదు! కుక్కలూ, నక్కలూ, గాడిదలూ కుర్చీలెక్కి రాజ్యం చేస్తున్నాయి. ఇప్పుడంతా లఫంగు, లుచ్ఛాగాళ్ళ రాజ్యమై పోయింది. మీలాంటి మంచివాళ్ళు రాజకీయాలకి దూరంగా ఉండిపోతున్నారు. వీళ్ళేమో ఇష్టారాజ్యంగా దోచుకు తింటున్నారు. అందుకని మేమందరం కలిసి ఒక నిర్ణయానికొచ్చాం. అభ్యర్థుల కులాన్నీ, మతాన్నీ, అంగబలాన్నీ, అర్థబలాన్నీ చూసి టిక్కెట్లు యిస్తాయి పార్టీలు. రొచ్చు రాజకీయాలు యివి. మాకు ఆ రాజకీయాలు వద్దు. మీరు కావాలి మాకు. మీరు నిలబడండి. రికార్డు మెజారిటీతో మిమ్మల్ని గెలిపించకపోతే మమ్మల్ని మారు పేరు పెట్టి పిలవండి" అన్నాడు సూర్యారావు నిజాయితీ ధ్వనిస్తున్న గొంతుతో.

"నేను చెయ్యగలిగింది ఏదో ఇప్పుడు ఇలా చేస్తూనే వున్నాకదా?" అన్నారు నాన్నగారు.

"ఇలా చేస్తున్నారు కాబట్టే మిమ్మల్నే ఎన్నుకోవాలని నిశ్చయించుకున్నాం"

"ప్రజాసేవ చెయ్యడం నా తత్వం. అలాగని రాజకీయాల్లోకి రాలేను. నన్నిలా ఉండనిస్తే నాకు సంతోషం."

సూర్యారావు స్థిరంగా అన్నాడు –

"మేమందరం మీ మనుషులం. మీకు ఇష్టమైనా కష్టమైనా మా మాట మన్నించి తీరాల్సిందే సదాశివబ్రహ్మంగారూ! మమ్మల్ని నిరాశపరచకండి"

తన పంతొమ్మిదేళ్ళ జీవితంలో యిలాంటి విడ్డూరం చూడలేదు తను ఎప్పుడూ, కనీసం వినలేదు కూడా.

జనం తమంతట తాముగా వచ్చి ఒక పెద్దమనిషిని దాదాపు నిలదీస్తూ, 'మీరే మా అభ్యర్థి! మీరే ఎన్నికలకు నిలబడి తీరాలని' అభిమానంతో నిర్బంధించడం.

అంటే ఈ కుహనా రాజకీయవేత్తలతో విసిగి పోయారన్నమాట జనం.

నాన్నగారు వద్దంటూనే ఉన్నారు.

సూర్యారావుతో బాటు తక్కిన జనమంతా కూడా కాదు కూడదని బలవంతం చేస్తూనే ఉన్నారు.

ఒక్కరోజు టైం ఇవ్వమనీ, ఆలోచించుకుని చెబుతాననీ అన్నారు నాన్నగారు.

జనంలో యివాళ ఉన్న వేడి రేపటికి ఉండక పోవచ్చనీ, రేపటికి వాళ్ళ ఆలోచనలు మారిపోతాయనీ ఆయన అభిప్రాయం.

ఇదంతా అక్కయ్య అంకితకి మాత్రం బొత్తిగా నచ్చలేదు.

"అవునూ! వాళ్ళందరూ వచ్చి ఎలెక్షన్‌కి నిలబడమంటుంటే బెట్టు చేస్తారేమిటీ? రేపటి దాకా వాళ్లీ మాట మీదే ఉంటారా? మనసు మార్చుకుంటే!" అంది తనతో నిష్ఠూరంగా.

"మనసు మార్చుకోవాలనే గదా నాన్నగారి కోరిక."

"ఏం! పదవంటే అంత చేదా?"

"ప్రజాసేవ చెయ్యాలంటే పదవులు అనవసరం అనీ!"

"పిలిచి పదవులిస్తామన్నా, పట్టం గడతామన్నా వద్దనే మనిషి ఇంక తనేం సంపాదిస్తాడూ? మనకేం పెడతాడూ. ఇట్లా అయితే నీకూ, నాకూ పెళ్ళీ, పేరంటం అయినట్లే!" అంది అంకిత.

"మనిషికి పెళ్ళేనా ముఖ్యం?" అంది తను.

"నీక్కాదేమో! నాకు ముఖ్యమే. పెళ్లీ పెటాకులు చెయ్యకుండా నన్ను దేశానికి అంకితమిచ్చేసి, నిన్ను దేశానికి అర్పించేస్తాడనుకుంటా. అందుకే పెట్టాడేమో ఆ పేర్లు."

"అక్కా!" అంది తను అసహనంగా.

"ఉన్నమాటంటే ఉలుకెందుకూ? నువ్వు ఆయనకి తోడుబోయిన దానివే! చాదస్తపు మేళం!" అని విసవిసా వెళ్ళిపోయింది అక్క అంకిత.

తిరిగి చూసింది తను.

నాన్నగారు వెనకే నిలబడి ఉన్నారు.

ఆయన మొహంలో ఏ భావమూ లేదు.

ఆయనకి ఇలాంటివన్నీ అలవాటే! అక్క తత్వం ఆయనకి కొత్త కాదు.

రేపు చెబుతానన్నారుగానీ వారం రోజులపాటు ఎటూ తేల్చలేదు నాన్నగారు.

కానీ జనం కూడా ఆయన్ని వదిలి పెట్టలేదు.

సాధారణంగా ప్రజలలో అలాంటి చైతన్యం ఒక్కసారిగా ఉప్పొంగడం అరుదు. ఎన్ని యాతనలు పెడుతున్నా సహిస్తూ పడివుండడం ప్రజలకి అలవాటు.

కానీ ఎప్పుడో ఒక రోజున....

ఏదో ఒక కారణంవల్ల....

జనంలో జాగృతి కలుగుతుంది.

"అలుగుటయే ఎరుంగని మహామహితాత్ముడు.... ఆ ధర్మజుడే అలిగిననాడు.... సాగరమ్ములన్నియూ ఏకము కాకపోవు...." అని ఒక పద్యం వుంది. బహుశా "ఉద్యోగ విజయాలు" నాటకంలోదేమో! చాలా రోజుల క్రితం చూసింది తను ఆ నాటకాన్ని.

"పరమశాంత స్వభావుడయిన ధర్మరాజుకి అలకా, కోపం అంటేనే తెలియవు. అలాంటి ధర్మరాజుకే కోపం వస్తే.... ఇంక సముద్రాలన్నీ ఒకటయిపోయినట్లు ప్రళయం తప్పదు" అని రాయబారం సీన్లో శ్రీకృష్ణుడు దుర్యోధనుడిని హెచ్చరిస్తాడు.

ధర్మరాజు స్వభావం లాంటిదే ప్రజల స్వభావం కూడా!

ఎన్నెన్ని కష్టాలపాలు చేసినా మెత్తమెత్తగా ఊరుకుంటారు.

కానీ ఒకరోజున ఉవ్వెత్తున లేచే తరంగంలా ఎగసి పడుతుంది ప్రజల అసంతృప్తి.

"ఈ పిచ్చి ప్రజలు ఒక లెక్కా!" అనుకునే మదాంధులు అందరూ ఆ ఉప్పెనలో వూపిరాగినట్లు ఉక్కిరిబిక్కిరవుతారు.

ప్రజలని ఆంజనేయుడితో కూడా పోల్చవచ్చేమో.

ఆంజనేయుడు అజేయుడు....అపార శక్తిమంతుడు.

కానీ ఆయనకు తన శక్తి తనకే గుర్తుండదు. ఎవరయినా గుర్తు చెయ్యాలి. ఎగదొయ్యాలి. అప్పుడే తన ప్రతాపం చూపిస్తాడు ఆయన!

అలాంటి పరిస్థితి ఇవాళ వచ్చినట్లుంది.

తమ అసంతృప్తి వల్ల తమకే తోచిందో, లేక సూర్యారావులాంటి వాళ్ళు బ్రెయిన్‌వాష్ చేస్తే బుర్రకెక్కిందోగానీ, ఇవాళ, ఈ జనం అంతా తిరుగులేని నిర్ణయంతో వున్నారు. సదా తమ హితవు కోరే సదాశివబ్రహ్మంగారే ఎన్నికల్లో తమ అభ్యర్థి కావాలని.

ఆ ఊళ్ళోనే ఒక చిత్రమైన మనిషి ఉన్నాడు. అతని అసలు పేరు ఏమిటోగానీ అందరూ బైరాగి అని పిలుస్తారు. ఖద్దరు బట్టలేసుకుని వుంటాడు. ఊళ్ళో ఏ ఎలెక్షన్ జరిగినా తను తప్పకుండా పోటీకి నిలబడి తీరతాడు. అరడజను ఓట్లూ దజను ఓట్లూ అట్లా పడుతుంటాయి. అతనికి పిచ్చి వుందని చాలామందికి అనుమానం.

ఇప్పుడు వచ్చిన జనంలో బైరాగి కూడా ఉన్నాడు.

అతనన్నాడు –

"సార్! ఎప్పుడు ఏ ఎలెక్షన్ జరిగినా నేను నిలబడి తీరతా! గెలుస్తానని కాదు. పోటీలో మనుషులు కుళ్ళిన, మెదడు పుచ్చిన ఈ రాజకీయవేత్తలేకాక మామూలు మనుషులు కూడా ఒకడు ఉండి తీరాలని! గెలుస్తాననే ఆశతో కాదు....రాజకీయాల్లోకి మంచివాళ్లు రావడం లేదనే అపవాదు నిజం కాకుండా వుండాలని ఎన్నికల్లో నిలబడుతూ వుంటానండీ! మీరే గనక పోటీ చేశారనుకోండి! ఈ ఊరి ఎలెక్షన్ల చరిత్రలో మొదటిసారిగా యీ బైరాగి పోటీ చెయ్యడు. నా ఓటు కూడా మీకే! నిలబడండి మీరు" అన్నాడు.

జనం నవ్వారు.

కానీ నాన్నగారి మీద మాత్రం అతని మాటలు అపరిమితమయిన ప్రభావం చూపించాయి.

రంకుబొంకుల రాజకీయాల్లోకి మంచివాళ్ళెవరూ రావడంలేదు!

అందుకని సింబాలిక్‌గా ప్రతిసారీ కంటెస్ట్ చేస్తున్నాడు ఈ బైరాగి! ఓడిపోతానని తెలిసీ, పట్టు వదలకుండా పోటీ చేస్తూనే వున్నాడు.

అలాంటప్పుడు జనం తమంతట తామే వచ్చి నిలబడమని అడుగుతుంటే తను తప్పించుకు తిరగడం కరెక్టేనా?

ఇంక ఎక్కువ ఆలోచించలేదు ఆయన!

"మీ ఇష్టమే నా యిష్టం! నేను పోటీకి నిలబడతాను" అన్నారు.

హర్షధ్వానాలు చేశారు జనం.

ఆ తరువాత జరిగింది అంతా ఇప్పుడు అందరికీ తెలిసిన చరిత్రే.

నాన్నగారు నిలబడ్డారు.

ఒక్క దొంగ ఓటు పడనివ్వలేదు జనం. ఒక్క బూత్‌ని కాప్చర్ చెయ్యనివ్వలేదు ప్రత్యర్థులను! ఒక్క సెగ్మెంటులో కూడా రిగ్గింగు జరగలేదు.

అన్నిటికన్నా విశేషం....

ఒక్క పైసా కూడా ఖర్చు కాలేదు ఎలెక్షన్‌కి!

అవును! ఎందుకు కావాలీ అసలు?

అసెంబ్లీ ఎన్నికలకు ఒక్కొక్క అభ్యర్థీ అరవై లక్షలు ఖర్చు పెడతాడా? అదంతా ప్రజల కోసమే ఖర్చుపెడతాడా ఎవరన్నా? అరవై లక్షలు ఖర్చు పెట్టినవాడు కనీసం ఆరుకోట్లు వెనక్కి రాబట్టుకోగలం అన్న ధీమా లేకపోతే ఎందుకు ఖర్చుపెడతాడసలు? రోజులు బాగుండి మంత్రివర్గంలో స్థానం దొరికితే, రాబడి అంతకంటే ఎక్కువే ఉండొచ్చు కదా!

అదొక ఆశ! ఇదొక వ్యాపారం!

నాన్నగారి కోసం ఎవరూ ఖర్చుపెట్టలేదు.

ఊరికే నోటిమాటగా ప్రచారం అయిపోయింది ఆ విషయం!

అంతే!

సదాశివబ్రహ్మంగారు పార్టీ అభ్యర్థిగా కాకుండా, ప్రజల కోరిక మీద ప్రజల మనిషిగా, స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికలకు నిలబడుతున్నారు.

మీ అభ్యర్థిని గెలిపించుకోవడం మీ బాధ్యత.

ఇంతకంటే చెప్పాల్సింది ఏమీ లేదు!

అంతే!

కరపత్రాలు లేవు.

పంచవన్నెల పోస్టర్లు లేవు.

గోడల మీద నినాదాల వదంతులు లేవు.

మైకులు లేవు. జీపులు లేవు.

సభలు లేవు, సమావేశాలు లేవు.

సవాళ్ళు లేవు, సమర్థింపులు లేవు.

బేరాల్లేవు సారాల్లేవు.

ముఖ్యంగా సారా లేదు!!

ఎలెక్షన్ల ఫార్ములాకి వ్యతిరేకంగా వుంది సదాశివబ్రహ్మంగారి ప్రచారం.

ఆయన పద్ధతి ఒక్కటే!

కనిపించిన వాళ్ళని కాసేపు ఆపుతాడు. జరుపుతున్న లోపాలేమిటో, జరగవలసిన కార్యక్రమం ఏమిటో వివరంగా, సులభమైన మాటలతో చెప్తాడు.

అర్థం చేసుకున్న జనం అది ఇంకో పదిమందికి చెబుతారు.

వాళ్ళు ఒక్కొక్కళ్ళు మళ్ళీ తలో పదిమందికి....

అలా....అలా....అలా అంచెలంచెలుగా అందుకుంటున్నారు జనం ఆయన సందేశాలని.

గాంధీగారు చేసింది అదేకదండీ!

ఈ గాంధీ వారసుల్లాగా ఆయన గోలగోలగా ప్రచారం చేశాడా తన భావాలని.

వాల్‌పోస్టర్లు వేయించుకున్నాడా?

పత్రికల్లో ఫుల్‌పేజీ అడ్వర్‌టైజ్‌మెంట్లు ఇచ్చుకున్నాడా?

మంచి అన్నది మొదలుపెడితే చాలు. దానంతట అదే మందికి తెలుస్తుంది.

దొంగమాటలు ప్రచారం చెయ్యాలనుకున్నప్పుడే దగుల్బాజీ పనులన్నీ చెయ్యాల్సి వస్తుంది.

ఈ ప్రచార సరళి ప్రత్యర్థులకు హడలు పుట్టించింది.

ప్రత్యర్థులంటే ఒక పార్టీవాళ్ళని కాదు.

అన్నిరంగుల జెండాలవాళ్ళ మొహాలు నల్లబడ్డాయి.

ఇంకోమనిషి–ఇంకోమనిషీ అయితే సదాశివబ్రహ్మంగారిని ఏ బాంబులేసో, గొడ్డలివేటుతోనో పైకి పంపించేసి వుండేవాళ్ళు. కానీ....

ఈయన సదాశివబ్రహ్మం అయిపోయాడు.

ప్రజల మనిషి అయిపోయాడు.

ఆయనకేమన్నా జరిగితే –

జనం అంతా ఒక్కటై, పరశురాముడు పద్ధెనిమిదిసార్లు ప్రపంచమంతా చుట్టి, పరశువుతో రాజు అనేవాడు లేకుండా నరికి చంపినట్లు, రాజకీయాల్లో వున్న ప్రతివాడినీ నరికి పోగులుపెట్టేటట్లు వున్నారు.

ఆ విధంగా – ప్రజల అసంతృప్తి, ప్రజల అసహనం ఉధృతమైన ఒక శక్తిగా మారి, అది ఓట్లరూపంలోకి తర్జుమా అయి, సదాశివబ్రహ్మంగారిని రికార్డు మెజార్టీతో

గెలిపించింది!!

ఎమ్మెల్యేగా ఎన్నుకోవడంతో ఊరుకోలేదు ప్రజలు.

ఆయనకి మంత్రివర్గంలో స్థానం యిచ్చి తీరాలన్నారు.

ప్రజలే తమ ఇష్టాన్ని ఇంత స్పష్టంగా చెప్పడం చూసి ఆదిరి పడ్డారు పార్టీ పెద్దలు.

తప్పనిసరి పరిస్థితుల్లో సదాశివబ్రహ్మంగారిని హోం మినిస్టర్‌ని చేశారు.

ఆయన కుర్చీలో కూర్చోగానే ముందు కృష్ణాజీ ఫైలు తెప్పించాడు. అతనికి అన్నాళ్లూ ఎందుకింత అన్యాయం జరిగిందో వివరించమని నోట్ రాశారు.

వారం తిరిగేలోగా కృష్ణాజీ రికార్డు సెట్‌రైట్ అయిపోయింది.

"కృష్ణాజీ! నువ్వు ఎవరో నాకు తెలుసు. నువ్వేం చేస్తావని నేను అడగను. నువ్వేం చేయాలో నీకే బాగా తెలుసు. ఏం చెయ్యాలో కూడా నీకే తెలిసి వుండాలి. చెయ్యదలుచుకున్నది చేసెయ్. నేనున్నాను. పిచ్చి రూల్స్ పట్టించుకోకు. ఏం చేస్తావో నాక్కూడా చెప్పాల్సిన అవసరంలేదు. కానీ, రిజల్టు మాత్రం చూపించు అర్థమయింది కద! ఈ జీవితమే క్షణభంగురం అన్నప్పుడు, ఈ పదవి ఎన్నాళ్ళు? ఉన్నంతలో మంచి చేద్దాం. ప్రొసీడ్!" అన్నారు.

"అఖల్‌మంద్‌కో ఇషారా కాఫిర్ హై అన్నారు.

"తెలివయినవాడికి సైగచేస్తే చాలు, అర్థం చేసుకుని అల్లుకుపోతాడు. అలాంటివాడే కృష్ణాజీ"

అతను విశ్వరూపం చూపించడం మొదలుపెట్టాడు యింక.

"ఆలోచనలో పడిపోయావే!" అన్నాడు రాజా నవ్వుతూ.

తెప్పరిల్లుకున్నట్లు చూసింది అర్పిత.

"అయితే మమ్మల్ని గురించి అంతా ఎంక్వయిరీ చేస్తూనే ఉన్నావన్నమాట" అంది.

"ఆహా! నువ్వు బియస్సీ పాసయ్యావు. ఎమ్మెస్సీకి అప్లయ్ చేస్తున్నావు. మీ అక్క అంకిత ఆరోక్లాసుతోనే చదువు మానేసింది. ఆ అమ్మాయికి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు"

నవ్వింది అర్పిత.

"ఇంటికొస్తావా? నాన్నగారిని మీట్ అవచ్చు!"

"వై నాట్!" ఆటో పిలిచాడు రాజా.

పదినిమిషాల్లో ఆటో హోం మినిస్టర్‌గారి యింటి ముందాగింది.

గవర్నమెంటు బంగళా కాదది.

రెండు బెడ్ రూములు వున్న చిన్న యిల్లు.

ఆటో ఆ యింటి సందు తిరగ్గానే యింటి ముందు జనం కనబడ్డారు.

ఎప్పుడూ వుంటారు జనం.

కానీ యివాళ ఇసక వేస్తే రాలనంతమంది వున్నారు.

ఏమయింది?

ఆటో దిగారు యిద్దరూ.

వెంటనే జనంలోనుంచి సూర్యారావు వచ్చి గుండెలు బాదుకుంటూ అన్నాడు–

"అయిపోయింది తల్లీ! అందర్నీ అన్యాయంచేసి వెళ్ళిపోయారు సదాశివబ్రహ్మం గారు"

"ఏమయింది?" అన్నాడు రాజా అలర్టుగా అయిపోతూ.

"బాత్‌రూంలో షాక్ కొట్టింది. తడినేలకదా! వెంటనే ప్రాణం పోయింది" అన్నారు యింకెవరో.

సోలిపోతున్న అర్పితని తన చేతులతో ఆపాడు రాజా.

అర్పిత ఏడవడంలేదు. కానీ నోటివెంబడి మాటరాక, చేష్టలుడిగిపోయినట్లు వుండిపోయింది.

ఆమెను ఒక కుర్చీలో కూర్చోపెట్టాడు రాజా.

సదాశివబ్రహ్మంగారి పెద్దకూతురు అంకిత మాత్రం నేలమీదపడి దొర్లుతూ ఇల్లు ఎగిరిపోయేలాగా శోకాలు పెడుతోంది.

ఆమె వేపు పరిశీలనగా చూశాడు రాజా.

అదే టైంకి అక్కడికి చేరుకున్నాడు కృష్ణాజీ.

అతని మొహం మాడిపోయి వుంది. తనకి అండగా నిలిచి, తను అనుకున్నవన్నీ ఆచరణలో పెట్టమని ఆదేశించిన ఉక్కుమనిషి సదాశివబ్రహ్మంగారు అంత హఠాత్తుగా చనిపోవడం అతనికి ఆక్రోశాన్ని కలిగించింది.

అది గమనించాడు రాజా.

రాజాకి తెలుసు.

ఈ జనాలని పాలించేది ఎప్పుడూ పిశాచగణాలే!

మధ్యమధ్యలో మంచివాళ్ళు కొన్నాళ్ళు అధికారానికి వచ్చినా అది పిశాచాల పాలనలో కాస్త అంతరాయం లాంటిదే! అలాంటివాళ్ళను నెగ్గనివ్వవు పిశాచాలు. బతకనివ్వవు.

శాంతి అంటే ఏమిటో చెప్పాడు ఒకరు.

శాంతి అంటే రెండు యుద్ధాల మధ్య కాస్త గ్యాప్‌లాంటిదట!

అలాగే మంచివాళ్ళ పాలన కూడా!

అంతేకదా!

ఒకసారి ఒక రాముడు, ఒక అశోకుడు, ఒక అక్బరు, ఒక కృష్ణదేవరాయలూ తప్ప....

మిగతా రాజుల చరిత్ర ఏమయిందీ?

పరపీడన పరాయణత్వం, పొరుగు రాజ్యాలమీద యుద్ధాలూ తప్ప....

రాజాకి యింకో అనుమానం కూడా వచ్చింది.

అసలు ఈ సోకాల్డ్ మంచి రాజులుకూడా మంచివాళ్ళేనా? ప్రజలను దయతో పాలించిన ప్రభుత్వాలేనా?

లేకపోతే చరిత్రని తమకు అనుకూలంగా రాయించుకుని కీర్తి సంపాదించుకున్న గొప్ప పబ్లిసిటీ ఎక్స్‌పర్టులా?

అయినా కావచ్చు.

పాతకాలపు రాజశాసనాలు చదివాడు రాజా తనకు సహజమైన కుతూహలం కొద్దీ. వాటిలోని చిత్రమైన విశేషాలను గుర్తు పెట్టుకున్నాడు.

ఆ శాసనాలవల్ల తేలింది ఏమిటంటే....

ప్రజలు భరించలేనన్ని పన్నులని వేసేవాళ్ళు రాజులు.

పండిన పంటలో మూడోవంతు శిస్తుగా వసూలు చెయ్యడమే కాకుండా, వృత్తిపన్ను, అమ్మకపు పన్ను, రహదారి పన్ను.... చివరికి పెళ్ళిళ్ళు జరిగితే పన్ను.

ఇంతే కాదు.

వంట చెరకు, ఎండుగడ్డిమీద కూడా పన్ను.

వృత్తిపన్ను ఎలా వసూలు చేసేవారంటే –

కుమ్మరివృత్తి చేసుకునే వాడిమీద కుమ్మరి వృత్తి చేస్తున్నందుకు పన్నే కాక, అతను ఉపయోగించే చక్రానికి కూడా పన్నే.

రజకులు బట్టలు ఉతకటానికి పన్ను, ఉతికే బండకు పన్ను.

గీతపనివాడి వృత్తికి పన్ను, చెట్టు ఎక్కటానికి ఉపయోగించే నిచ్చెనకు పన్ను.

చివరికి వేశ్యలమీద పన్ను.

వారు మొహం చూసుకోవడానికి ఉపయోగించే అద్దాల మీద పన్ను.

మూడవ కుళోత్తుంగ చోళుడి ఒక శాసనం ప్రకారం కొంత మంది ప్రజలకు మహారాజులుంగారు దయతలిచి ఇచ్చిన హక్కుల వివరాలు ఇలా వున్నాయి.

ఆ శాసనం రాయించిన తారీఖు నుంచి వారి ఇళ్ళలో తటస్థించే శుభా శుభ

కార్యాలు (పెళ్ళిళ్లూ, చావులూ) రెండిటికిన్నీ జంట బాకాలు ఊదవచ్చనీ, మద్దెల మ్రోగించవచ్చనీ, పాదుకలు ధరించవచ్చనీ, యింటి గోడలకు సున్నం వేయించుకో వచ్చుననీ ప్రభువులు ఉదారంగా అనుమతించారు.

అంటే, కాళ్ళకు చెప్పులు వేసుకోవడానికీ, యింటి గోడలకి సున్నం వేసుకోవడానికీ కూడా రాజుగారి మెహర్బానీ కావలసి వచ్చేది కొన్ని వర్గాల ప్రజలకు!

ఇలాంటి పీడనల మధ్య ఒకటవ కుళోత్తుంగ చోళుడు రహదారి పన్ను రద్దుచేసినంత మాత్రాన ప్రజలు అతనికి బ్రహ్మరథం పట్టడంలో ఆశ్చర్యమేముందీ?

ఆలోచనల్లోనుంచి బయటపడి, కొంకర్లు తిరిగిపోయి వున్న హోం మినిస్టర్ సదాశివబ్రహ్మంగారి శవంవేపు చూశాడు రాజా. గుండె పగిలిపోయిన దానిలా కూలబడిపోయి ఉన్న అర్పితని చూశాడు.

పొర్లుతూ, పొలికేకలు పెడుతూ దుఃఖిస్తున్న పెద్దకూతురు అంకితని చూశాడు.

అతనికి ఆమె ఏడుపులో ఏదో అసహజత్వం కనబడింది.

నార్త్‌లో కొన్ని ఊళ్ళలో అంతే!

మహాధనికులు చనిపోయినప్పుడు, వాళ్ళ బంధువులు “ఏడ్చేవాళ్ళని” కిరాయికి తీసుకొస్తారు.

మనసులో దుఃఖం లేకుండానే, గుండెలు బాదుకుంటూ, జుట్టు పీక్కుంటూ, బట్టలు చింపుకుంటూ, కడవలకొద్దీ కన్నీళ్ళు కార్చడంలో ఎక్స్‌పర్ట్స్ వాళ్ళు.

వాళ్ళ ఏడుపుని గుర్తుకి తెస్తోంది ఈ అంకిత ఏడుపు.

తనకోసం కాక, ఊళ్ళో వాళ్ళు చూడడం కోసమే ఏడుస్తున్న వైనం కనబడుతోంది.

కృష్ణాజీ కూడా బహుశా గ్రహించే ఉండాలి యిది.

కృష్ణాజీ వేపు చూశాడు రాజా.

కృష్ణాజీ మొహంలో ఏ భావం కనబడటం లేదు. అతను పరిసరాలన్నిటినీ తీక్షణంగా పరికించి చూస్తున్నాడు.

ఆలోచించడం మొదలెట్టాడు రాజా.

డెత్ బై కరెంట్ షాక్.

ఎలెక్ట్రోక్యూషన్.

సాధారణంగా ఇంట్లో వైర్లని ముట్టుకున్నప్పుడు షాక్ కొట్టొచ్చు. కానీ అది ప్రాణాలు తీసేంత తీవ్రంగా ఉండదు.

కానీ బాత్‌రూంలో గనక షాక్ కొడితే, కింద నేలంతా తడిగా ఉంటుంది గనక, తీవ్రమయిన ప్రమాదం జరగవచ్చు.

కరెంట్ షాక్ తగిలితే వంట్లోని రక్తనాళాలన్నీ ఒక్కసారిగా ముడుచుకుపోతాయి.

దానికి తోడు సదాశివబ్రహ్మంగారిది పెద్ద వయసు. ఆయన ఈ అఘాయిత్యానికి తట్టుకుని ఉండలేకపోవచ్చు.

అతనికి హఠాత్తుగా కీర్తి గుర్తొచ్చాడు.

ఇలాంటి పద్ధతుల్లో మనుషుల్ని చంపడం కీర్తికి యిష్టం. సహజమైన చావు అని భ్రమకలిగేటట్లు చంపడం అతనికి ఫేవరెట్ టెక్నిక్!

లేదా....

యాక్సిడెంట్స్ తనే స్టేజ్ మేనేజ్ చేస్తాడు కీర్తి.

అతని విక్టిమ్ యాక్సిడెంట్‌లో చనిపోయినట్లే ఉంటుంది గానీ అది హత్య అని ఎవరూ అనుమానించరు.

హఠాత్తుగా రాజాకి యింకొకటి కూడా స్ఫురించింది.

తనొచ్చిన ఫ్లయిట్‌లోనే వచ్చాడు కీర్తి కూడా.

కీర్తి ఇక్కడే వున్నాడు.

దొంగ ఏడుపు ఏడుస్తున్న ఈ అంకిత యిక్కడే వుంది. అంటే....

చాలా వైల్డ్ గెస్ యిది!

ఈ ఊహకి ఆధారం లేదు.

కానీ హాంచ్ అంటారే! సిక్స్‌సెన్స్ చెప్పడం.... అలా అనిపిస్తోంది తనకు.

సదాశివబ్రహ్మంగారి చావుకి యింట్లో ఈ అంకితా, బయట ఆ కీర్తి కారణం అయ్యి వుండవచ్చు.

అవును.

ఇది ఊహే!

కానీ ఆలోచించిన కొద్దీ అది కరెక్టే అయ్యి వుండచ్చనిపిస్తోంది.

ఈ అంకిత అంతగా ఏడుస్తూ ఉండకపోతే తనకి అసలు అనుమానమే రాకపోవునేమో!

ఇదివరకు జరిగిన ఒక సంఘటన గుర్తువచ్చింది రాజాకి.

తను సర్కస్‌లో పనిచేస్తున్నప్పుడు అక్కడ ఒక ట్రెపీజ్ ఆర్టిస్టు ఒకమ్మాయి యింకో ట్రెపీజ్ ఆర్టిస్టుతో ప్రేమలో పడింది.

అది ఎవ్వరూ గ్రహించలేదు.

తను మాత్రం వాళ్ళు ప్రేమలో పడిన రెండో రోజునే ఆ విషయం కనిపెట్టేశాడు.

వాళ్ళ విషయం తనకి తెలిసిపోయిందన్న సంగతి ఆ అమ్మాయికి తెలిసింది.

"ఎట్లా కనిపెట్టావ్?" అంది చిరుకోపంగా. "మేం అతి జాగ్రత్తగా వున్నామే" అంది.

"మీరు అంత అతి జాగ్రత్తగా ఉండి, ఒకళ్ళవేపు ఒకళ్ళు పొరబాటున కూడా చూసుకోకూడదు, మాట్లాడుకోకూడదు, యిద్దరూ కలిసి ట్రెపీజ్ ఫీట్సు చెయ్యకూడదు అన్నట్లు ప్రవర్తించడం వల్లే నాకు అనుమానం వచ్చింది. వీళ్ళిద్దరూ కలిసి అందరినీ పల్టీ కొట్టించాలని చూస్తున్నారని! మీరూ అందరిలాగా మామూలుగానే ఉండి ఉంటే నాకు అనుమానమే వచ్చేది కాదు. యార్! షాదీ ముబారక్! మంచి చాక్లెట్ తినిపించు" అన్నాడు తను!

"అమ్మో! నువ్వు దొంగలకి దొంగవి....!" అని నవ్వేసింది ఆ అమ్మాయి.

ఈ అంకిత ఏడుపు కూడా అలాగే అసహజంగా వుంది.

పైగా, అంకిత తత్వం తనకి చిన్నప్పటి నుంచి తెలుసు.

తక్షణం కృష్ణాజీ దగ్గరకి వెళ్ళిపోయాడు రాజా.

ఏమిటన్నట్లు చూశాడు కృష్ణాజీ.

"సర్! నేను యింకా పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పూర్తిగా చేరినట్లు కాదు. అయినా కూడా చొరవ తీసుకుని చెబుతున్నాను క్షమించండి."

ఆశ్చర్యంగా చూశాడు కృష్ణాజీ.

"ఒక్క నిమిషం మీరు పక్కకి వస్తే నా అభిప్రాయాలు చెప్పాలి" అన్నాడు రాజా.

ఎటూ తేల్చుకోలేనట్లు చూసి, తర్వాత రాజాతో బాటు పక్కకి నడిచాడు కృష్ణాజీ.

తన అనుమానాన్ని కృష్ణాజీతో చెప్పాడు రాజా.

అంత విచారంలోనూ కృష్ణాజీ పెదిమల మీద చిరునవ్వు మెదిలింది.

"పోలీసు డిపార్ట్‌మెంట్‌లో చేరకుండానే కేసులు సాల్వ్ చేసేద్దామని చూస్తున్నావా యంగ్‌మాన్!" అన్నాడు అభిమానంగా.

రాజా ఏం మాట్లాడలేదు.

కృష్ణాజీ అన్నాడు. "ఆల్‌రైట్! నువ్వు చెప్పింది కూడా మనసులో పెట్టుకుంటాను. వాడెవడన్నావూ? వాడి పేరు...."

"కీర్తి....సర్! యూ కెన్ కాల్ హిమ్ ది ప్రిన్స్ ఆఫ్ డార్క్‌నెస్ సైతాన్‌లాంటి వాడు!"

"నేను సైతాన్‌ల పాలిటి సైతాన్ లాంటివాణ్ణి. అది మర్చిపోకు" అన్నాడు కృష్ణాజీ.

"అది నేనెప్పుడూ మర్చిపోను సర్" అన్నాడు రాజా.

తర్వాత అర్పిత దగ్గరికి వెళ్ళాడు రాజా.

దిగాలుపడి కూర్చుని ఉంది అర్పిత.

మృదువుగా అన్నాడు రాజా. "అర్పితా! నేను ఎంత సానుభూతి చూపించినా నీకు జరిగిపోయిన నష్టం తీరేది కాదని తెలుసు! మీ నాన్నగారంటే నీకు ఎంత భక్తీ, అభిమానం ఉన్నాయో కూడా నాకు తెలుసు. కానీ జరగకూడనిది జరిగిపోయింది. జరగవలసింది చూడాలి మనం."

మౌనంగా వింటోంది అర్పిత.

రాజా అన్నాడు.

"ముందు ఈ తంతు అంతా సజావుగా జరిగిపోవాలి. ఆ తర్వాత, జరిగిందేమిటో బయటికిలాగి, హంతకులని పట్టాలి."

ఆశ్చర్యంగా అతనివేపు చూసింది అర్పిత.

"అంటే....నాన్నగారు హత్య చేయబడ్డారంటావా?"

"అనే నేను గట్టిగా నమ్ముతున్నాను."

అసలే తండ్రిపోయిన షాక్‌లో ఉంది అర్పిత.

తండ్రి చావు సహజ మరణం కాదనీ, అది హత్య అయి వుంటుందనీ వెయ్యి ఓల్టుల షాక్ లాంటి వార్తని రాజా చెప్పడంతో, ఆమె మొదటి షాక్ నుంచి బయటపడింది. అలర్టుగా అయిపోయింది ఆమె మనసు. లేచి నిటారుగా నిలుచుంది.

ఆ తర్వాత రాజా సాయంతో అక్కడి పరిస్థితిని తన కంట్రోల్‌లోకి తెచ్చుకుని, ఏ మాత్రం కన్‌ఫ్యూజన్ లేకుండా అందరికీ ఆదేశాలు ఇవ్వడం మొదలెట్టింది.

అదే టైంలో ఒక కానిస్టేబుల్ వచ్చి కృష్ణాజీకి సెల్యూట్ కొట్టి చెప్పాడు –

"సార్! వైర్‌లెస్‌లో మీ కోసం మెసేజ్ వచ్చింది."

"వస్తున్నా!" అంటూ బయట ఉన్న జీపు దగ్గరికి వెళ్ళాడు కృష్ణాజీ.

కొద్ది నిమిషాల తర్వాత రాజా కోసం కబురంపాడు కృష్ణాజీ.

బయటికి వెళ్ళాడు రాజా.

అతన్ని చూడగానే అన్నాడు కృష్ణాజీ –

"యంగ్‌మాన్! యువర్ గెస్ మే బీ కరెక్ట్"

ప్రశ్నార్థకంగా చూశాడు రాజా.

కృష్ణాజీ అన్నాడు –

"నెంబర్ వన్ : కీర్తి అనే ఒక క్రూక్ సిటీలో ప్రవేశించాడు."

"నెంబర్ టూ: మినిస్టర్ విజయకుమారికి హెూం పోర్ట్‌ఫోలియో యిచ్చారు."

"మినిస్టర్ విజయకుమారి.... అంటే?"

సంతోషంలేని నవ్వు నవ్వాడు కృష్ణాజీ.

"విజయకుమారి తాలూకు తొమ్మిదేళ్ళ తాపత్రయం యివ్వాళ ఓ కొలిక్కి వచ్చింది" అన్నాడు కృష్ణాజీ. "ఆమె తొమ్మిదేళ్ళ పాటు తాపత్రయ పడింది పవర్‌ఫుల్ పోర్ట్‌ఫోలియో కావాలని. హెూమ్ గానీ, రోడ్స్ అండ్ బిల్డింగ్స్ గానీ కావాలని కోరుకుంది. నిరంతరం కృషి చేసింది. ఇవాళ సాధించగలిగింది."

నిర్లిప్తంగా వింటున్నాడు రాజా.

రాజకీయాల్లో వున్న ఈ జాడ్యం గురించి అతనికి బాగా తెలుసు.

ప్రజాసేవ అన్నది మర్చిపోయారు రాజకీయవేత్తలు.

కావలసినదంతా పదవులూ, ప్రమోషన్లూనూ.

ప్రజాసేవ పేరు పెట్టుకుని పబ్లిక్ లైఫ్‌లోకి రావడం.

అల్లర్లు చేయించో, బందులు చేయించో, బస్తీల్లో గూండాగిరీ చేసో....

ఏదో ఒక విధంగా రాజకీయాల్లోకి రావడం.

ఇంక అప్పటి నుంచి తాపత్రయం!

దేనికో దానికి ఎన్నిక కావాలి.

ముందు మునిసిపల్ ఎలెక్షన్లు.

తర్వాత శాసనసభకి ఎన్నిక కావాలి.

శాసనసభకు ఎన్నికైన మరుక్షణం నుంచి మంత్రిపదవి మీద ఆశ! దాని కోసం నానా రకాల ప్రయత్నాలు.

మంత్రిపదవి రాకపోతే మరుక్షణం నుంచీ అసమ్మతి.

మంత్రిపదవి వచ్చినా, మంచి శాఖ రాకపోతే అసమ్మతి.

మంచి శాఖ వచ్చినా, ముఖ్యమంత్రి పదవి రానందుకు అసమ్మతి. అసంతృప్తి! అసహనం! ఆరాటం!

ఈలోగా చేతనయినంత సంపాదిస్తూ ఉండాలి.

కనీసం ఏడు తరాలపాటు కూర్చుని తినేటట్లు సంపాదించాలి.

ఒకవైపు అది చేస్తూనే –

పిల్లల సంగతి చూడాలి.

వాళ్ళని రాజకీయాల్లోకి తీసుకు రావాలి.

వాళ్ళని ఎమ్మెల్యేలని చెయ్యాలి.

ఆ తర్వాత వాళ్ళకి మంత్రి పదవులు వచ్చేలా రాజకీయం నడపాలి.

ఈ సొంత సంసారం జంఝాటం రాజకీయవేత్తలకు ఉన్నంతగా యింకెవరికీ ఉండదు. నిజం!

విజయకుమారి కొంతమంది లీడర్లతో "ఫ్రెండ్‌షిప్" చేసి రాజకీయాల్లోకి వచ్చింది.

రాజకీయాల్లోకి రాగానే మంత్రిపదవి కోసం పాకులాడింది.

మంత్రి అయ్యింది.

ఆ తర్వాత మంచి శాఖ కోసం వెంపర్లాడింది.

ఇప్పుడదీ సాధించింది.

కృష్ణాజీ అన్నాడు "మెడికల్ ట్రీట్‌మెంటు కోసం ప్రభుత్వం ఖర్చు మీద అమెరికా

వెళ్ళింది విజయకుమారి. మంచం మీద నుంచి లేచేస్థితిలో లేదుట. అందుకని గవర్నరే అమెరికా వెళ్ళి అక్కడ ఆమెచేత ప్రమాణ స్వీకారం చేయిస్తాట్ట"

"ఎందుకంత తొందర?" అన్నాడు రాజా.

"పార్టీ పెద్దల దయ తను తిరిగి వచ్చే వరకూ ఉంటుందో లేదో అని భయమను కుంటాను. ముద్దొచ్చినప్పుడే చంకనెక్క మన్నారు కదా!"

వాళ్ళు ఇద్దరూ అసహనంగా ఉన్నారు.

విజయకుమారి హెూమ్ మినిస్టర్ కావడం వల్ల కృష్ణాజీకి యింకో ఎక్స్ట్రా ప్రాబ్లెం ఉంది.

అతను సదాశివబ్రహ్మంగారి కేండిడేటు.

విజయకుమారి ప్రమాణ స్వీకారం చెయ్యగానే, మొదటగా టాకిల్ చెయ్యబోయేది కృష్ణాజీనే!

అది అతనికి తెలుసు.

"ఆల్‌రైట్! నువ్వెళ్ళు!" అన్నాడు కృష్ణాజీ.

అభివాదంచేసి మళ్ళీ లోపలికి వెళ్ళాడు రాజా. అర్పితతో మాట్లాడి, అవసరమైన ఏర్పాట్లు చెయ్యడంలో బిజీ అయిపోయాడు.

✦ ✦ ✦

చాలా తొందరగానే వచ్చేశాయి రాజాకి ఆర్డర్సు. ఆర్డర్సు వచ్చిన వెంటనే డ్యూటీకి రిపోర్ట్ చేశాడు కూడా.

అతనికి తక్కిన కేండిడేట్స్‌కి ఇచ్చినట్లు ట్రైనింగ్ ఇవ్వాలా అఖ్ఖర్లేదా అన్న ధర్మ సందేహం వచ్చింది ఒక ఆఫీసర్‌కి.

నవ్వాడు కృష్ణాజీ.

నవ్వి అన్నాడు. "అందరితో బాటు ట్రైనింగ్ తప్పదు. లేకపోతే తక్కినవాళ్ళు కోర్టుకి పోతారు"

అన్నీ వచ్చినా కూడా, ఫార్మల్‌గా మళ్ళీ ట్రైనింగ్ కాక తప్పలేదు రాజాకి.

ట్రైనింగ్‌కి వెళ్ళే ముందు అర్పితను కలుసుకున్నాడు రాజా. ఇంట్లో అక్క అంకిత కూడా వుంది. అందుకని అర్పిత అంది.

"ఇక్కడ వద్దు! బయటికి వెళ్దాం."

"సరే!" అన్నాడు రాజా.

బయటికి వచ్చారు. అతని దగ్గర మోటార్ సైకిల్ వుంది. లేటెస్ట్ మోడల్ కావసాకీ,ఇంపోర్టెడ్.

మోటార్‌సైకిల్ స్టార్ట్ చేశాడు రాజా.

ఇరవై నిమిషాల్లో మేడ్‌చల్ రోడ్డు పట్టి ఊరుదాటింది.

చాలా దూరం వెళ్ళాక అక్కడ రోడ్డు పక్కకి టర్న్ చేశాడు మోటార్ సైకిల్‌ని.

అక్కడొక గ్రేప్ గార్డెన్ ఉంది. దాన్లో కూర్చున్నారు ఇద్దరూ.

రాజా ఏదో అనడానికి నోరు తెరిచేటంతలో అర్పితే అంది.

"ఇదిగో! సానుభూతి వచనాలు మాత్రం వల్లించకు! నా గుండెలో మంట మాటలతో చల్లారేది కాదు గానీ, కాసిని కబుర్లు చెప్పు! చాలా ప్లేసెస్ తిరిగి వుంటావుగా! విశేషాలు చెప్పరాదా ఏం?"

ప్రతి వాక్యం చివరా "ఏం?" అని ఒక ప్రశ్నార్థకం తగిలించడం ఆ అమ్మాయికి అలవాటు.

"నీకు ఓపిక ఉండాలే గానీ, వంద చెబుతా!" అని మొదలెట్టాడు రాజా.

"కలకత్తా లాంటి డర్టీసిటీ ఇంకెక్కడా ఉండదు. నేను అక్కడున్నా కొన్నాళ్ళు. చిన్న కొంప ఏదన్నా అద్దెకి దొరుకుతుందేమోనని చూశా! చివరికి ఒక బ్రోకరు తగిలాడు. అతనొక ఇల్లు చూపించి, ఇదిగో! నేను చాలా నిజాయితీపరుణ్ణి! ఈ ఇంట్లో వున్న ప్లస్ పాయింట్లూ, మైనస్ పాయింట్సూ అన్నీ ఉన్నవి ఉన్నట్లుగా కక్కేస్తా" అన్నాడు.

చెప్పమన్నాను.

బ్రోకరు గబగబా చెప్పడం మొదలెట్టాడు."కలకత్తా అంతా కుళ్ళు పేరుకుపోయి వుంటుంది కదా! ఎవరూ శుభ్రం చెయ్యరు. అందుకని ఎప్పుడూ ఈ ఇంటి ఎదురుగా పెద్ద చెత్తకుప్ప పేరుకుపోయి ఉంటుంది. ఇంటికి అటుపక్క చేపల దుకాణం ఉంది. రెండో పక్క ఆయుర్వేదం మందుల షాపు ఉంది. ఇంటి వెనకాలే మురుక్కాలవ వుంది" అన్నాడు.

"మరి ఇంక ప్లస్ పాయింట్స్ ఏమున్నాయ్?" అన్నాను నేను.

బ్రోకరు ఉత్సాహంగా చెప్పాడు. "రాత్రయినా, పగలయినా సరే, గాలి ఎట్నుంచి వీస్తోందో ఈజీగా చెప్పెయ్యొచ్చు" అని.

నవ్వింది అర్పిత.

వెంటనే అన్నాడు రాజా. "అలాగే ఢిల్లీలో ఉన్నాను కొన్నాళ్ళు. ఏదైనా చిన్న వ్యాపారం చేద్దామని చూశాను. ఢిల్లీ కొత్త కొత్త వ్యాపారాలకీ, ఘరానా మోసాలకీ పెట్టింది పేరు.

ఒక ఢిల్లీ కంపెనీ గాయాలకి అతికించే కొత్తరకం బాండేజెస్ తయారుచేసింది.

వెయ్యి బ్యాండేజెస్ పది రూపాయలే! కారు చౌక.

ఆ ఏజన్సీ తీసుకోమని నా చుట్టూ తిరిగారు వాళ్ళు.

నేనడిగాను. "వెయ్యి బాండేజెస్ పదిరూపాయల రేటైతే నేను ఎన్ని అమ్మగలనూ, ఎంత కమీషన్ వస్తుందీ, నాకు లాభం ఎంత మిగుల్తుందీ?" అని.

కంపెనీ అతను కులాసాగా నవ్వాడు.

"లాభం బాండేజెస్ మీద రాదు. ఈ బాండేజ్ ఒకసారి అతికిస్తే పిశాచంలా పట్టుకుంటుంది. పీకినా రాదు. దాన్ని పీకే మందు కూడా మనమే తయారుచేస్తాం. అది బాటిలు వందరూపాయలు. లాభాలు దాన్లో వస్తాయి" అన్నాడు.

నవ్వుతూ తలూపింది అర్పిత.

రాజా పుంజుకుని ఇంకా చెప్పడం మొదలెట్టాడు.

"ఇదీ ఢిల్లీలోనే జరిగింది. ఓ రోజున నేనూ, నా ఫ్రెండ్ ఒకడూ కలిసి నడిచి వెళుతున్నాం. రోడ్డు పక్కన ఒక నాటువైద్యుడు కూర్చుని వున్నాడు. అతని ముందు పంచరంగుల్లో వున్న మందుల సీసాలు పేర్చి వున్నాయి.

నా ఫ్రెండ్ ఊర్కోక ఒక బాటిల్ కొన్నాడు"

వచ్చెయ్యబోతూ ఏదో అనుమానం వచ్చి వైద్యుణ్ణి అడిగాడు.

"ఈ మందు నువ్వెప్పుడన్నా తాగావా?"

"జన్మలో తాగలేదు" అన్నాడు వైద్యుడు.

"మరి నేను తాగాక నాకు వికటిస్తే?"

తొణక్కుండా అన్నాడు నాటువైద్యుడు –

"గ్యారంటీ వుందిగా! నువ్వు చస్తే మీ వాళ్ళకి మందు డబ్బులో సగం వాపసిస్తాం" అని.

చెయ్యి నోటికి అడ్డంపెట్టుకుని రాజావేపే చూస్తోంది అర్పిత. ఆమె కళ్ళు నవ్వుతున్నాయి.

"ఇంకోసారి ఇంకో అద్భుతం జరిగింది" అన్నాడు రాజా.

ఏమిటన్నట్లు చూసింది అర్పిత.

"ఓసారి ఆఫ్రికా వెళ్ళాను. అడవులలో తిరుగుతున్నాను. అక్కడ నరభక్షకులు వున్నారు. నన్ను పట్టుకున్నారు. ఒక కుండలో కూర్చోబెట్టారు. కింద మంటపెట్టారు. అప్పుడన్నాను నేను –

ఆగండి ఆగండి! నన్ను తినే ముందు నా వంట్లో నుంచి కొంచెం ముక్కకోసి తిని రుచి చూడటం మంచిదికదా!" అని.

సరేనన్నాడు వాళ్ళ నాయకుడు.

వెంటనే చాకుతో నా కాలిని కాస్త కోసి ఆ ముక్క అందించాను.

నాయకుడు అది తిని తుపుక్కున ఉమ్మేశాడు.

"ఛీ! దరిద్రం! వీణ్ణి వదిలేయండి" అన్నాడు.

"బతుకుజీవుడా! అని బయటపడ్డాను" అని మళ్ళీ అన్నాడు రాజా – "నన్ను పెళ్ళిచేసుకున్న తర్వాత ఎప్పుడూ కొరకాలని చూడకేం! నరభక్షకుల నాయకుడికయినట్లు అవుతుంది"

కోపంగా అతనివేపు చూసింది అర్పిత.

"నేను నిన్ను పెళ్ళిచేసుకుంటానని ఎందుకు అనుకుంటున్నావ్?" అంది.

"అర్థమైపోవట్లేదూ?"

"భలే అర్థాలు తీస్తావే" అంది ఆరోపణగా.

కానీ ఆమె కళ్ళు నవ్వుతూనే వున్నాయి.

"ఇంతకీ నేను చేసిన ట్రిక్కేమిటో అడగవేం!" అన్నాడు రాజా.

"ఏముందీ? రౌడీరకంకదా మనం! అంతకుముందే ఎక్కడో, ఏ కొట్లాటలోనో దెబ్బలు తగిలించుకుని వుంటావ్! కాలికి ప్లాస్టర్ వేసి వుండి వుంటుంది. ఆ ప్లాస్టర్‌లో నుంచి ఓ ముక్కకోసి వాడికి పెట్టి ఉంటావ్! ఛీ ఛండాలం అని ఉమ్మేసి వుంటాడు."

"అయినా ఈ జోకులన్నీ నేను చదవలేదా ఏం? నీకే జరిగినట్లు చెపుతున్నావ్ గానీ" అంది.

నవ్వేశాడు రాజా.

"పోనీ....నీ విశేషాలు చెప్పరాదూ?" అన్నాడు.

"మేం కూడా చిన్నఫారమ్ ఒకటి పెట్టాలని చూశాం యిక్కడ కొన్నాళ్ళపాటు. మరి రోజులు గడపాలిగా" అంది అర్పిత. "ఆ ఫారంలో ఆవులూ, గేదెలూ అవీ వుండేవి. వాటిని చూడటానికి నీలాంటివాడినే ఒకడిని పెట్టుకున్నాం. వాడొక రోజున ఒక సలహా చెప్పాడు – మన గేదెలూ అవీ మారుపడిపోకుండా ఉండాలంటే వాటికి అచ్చువెయ్యాలని. సరే అన్నాం. వాడు పని మొదలెట్టాడు. నెలరోజులయినా యింకా హడావిడిగానే వుండడం చూసి అడిగాం. "ఏం? యింకా పని పూర్తి కాలేదా?" అని.

వాడు ఏడుపు మొహంపెట్టి చెప్పాడు.

"గేదెలకీ, ఆవులకీ  అన్నిటికీ అచ్చువేశానుగానీ మనం పెంచే తేనెటీగల్ని పట్టుకుని వాటి వీపుమీద అచ్చెయ్యడం కుదరటం లేదండీ!" అని.

"నన్ను వెక్కిరించి నువ్వు చేస్తున్నదేమిటి? ఇదీ కాపీ జోకే" అన్నాడు రాజా.

"అలాగా! అయితే చెల్లుకి చెల్లుకాదా ఏం?" అని నవ్వేసింది అర్పిత.

ఆమె నవ్వుని మింగేస్తూ పెద్దగా వినబడింది ఒక పేలుడు శబ్దం. వెంటనే వందలకొద్దీ పక్షులు అలజడిగా ఆకాశంలోకి లేచాయి.

వెంటనే అలర్టుగా అయిపోయాడు రాజా. అతనితోపాటే అర్పిత కూడా.

లేచి నిలబడ్డాడు రాజా.

"అర్పితా! కమ్"

మోటార్‌సైకిల్ స్టాండు తీసి, దాన్ని గుబురుగా వున్న చెట్లచాటున వుంచాడు రాజా.  లాక్ చేశాడు.

"నువ్విక్కడే వుంటావా? నేను అదేమిటో చూసి వస్తా" అన్నాడు రాజా.

"నేనూ వస్తాను" అంది అర్పిత.

"సరే పద" అన్నాడు రాజా.

ఇద్దరూ కలిసి ఆ శబ్దం వినబడిన వైపు నడవడం మొదలెట్టారు.

ఫైర్ ఆర్మ్సలో ఎక్స్‌పర్ట్ రాజా.

ఆ పేలిన ఆయుధం కలాష్నికోవ్ అయి వుంటుందని అతనికి అనిపించింది.

అక్కడొక పెద్ద ప్రహరీ గోడ ఉంది.  కొత్తగా కట్టినట్లు ఉంది అది. కొన్ని వేల ఎకరాలని ఎన్‌క్లోజ్ చేస్తూ వుంది ఆ గోడ.

గోడమీదికి ఎవరూ ఎక్కటానికి లేకుండా గాజుముక్కలు గుచ్చి వున్నాయి.

అంతటితో అయిపోలేదు.

ఖైదీలు పారిపోకుండా జైలు గోడల మీద కరెంటు ప్రవహిస్తుండే వైర్లు

బిగించినట్లు హైటెన్షన్ వైర్లు కనబడుతున్నాయి.

గోడ బాగా ఎత్తుగా వుంది.

ఒక్క క్షణం ఆలోచించాడు రాజా.

అక్కడికి దగ్గరలోనే ఒక తాటిచెట్టు వుంది.

మామూలుగా అయితే చెట్టుకీ, నడుముకీ కలిపి బంధం వేసుకోకుండా తాటిచెట్టెక్కడం కష్టం.

కానీ రాజా విషయం వేరు. అతనిది ఒలింపిక్స్ లెవెలు.

అతి లాఘవంగా తాటిచెట్టు ఎక్కేశాడు రాజా.

అక్కడ సెటిలయి, ఆ కాంపౌండులోకి చూశాడు.

అతని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

యూనిఫారంలో వున్న సోల్జర్లు డ్రిల్లు చేస్తున్నారు అక్కడ. పీటీడ్రెస్సులో వున్న కొంతమంది ఎక్సర్‌సైజులు చేస్తున్నారు. కరాటే డ్రెస్సులో వున్న కొంతమంది మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీసు చేస్తున్నారు.

జేబులోనుంచి, పాకెట్‌సైజు బైనాక్యులర్స్ తీశాడు రాజా.

చూశాడు.

యూనిఫారం వేసుకుని డ్రిల్లు చేస్తున్న సోల్జర్ల చేతుల్లో సోఫిస్టికేటెడ్ ఆయుధాలు వున్నాయి. అయితే అందరి దగ్గరా ఒకే రకం ఆయుధాలు లేవు. కొంతమంది దగ్గర ఏ.కే.47 రైఫిల్స్ వున్నాయి. కొంతమంది దగ్గర కార్బయిన్స్ వున్నాయి. ఆటోమాటిక్ గన్స్, స్మిత్ అండ్ వెస్సన్ సర్వీస్ రివాల్వర్స్, మెషిన్ పిస్టల్స్, స్టెన్‌గన్స్ వున్నాయి.

కొంతమంది చేతులలో నాటుతుపాకులు కూడా వున్నాయి.

అంతదూరానికి అవన్నీ స్పష్టంగా కనబడటం లేదు.

కానీ కొంచెం కొంచెం కనబడుతున్న దానిని బట్టి చాలా గ్రహించగలిగాడు రాజా. అతనివి శిక్షణ పొందిన కళ్ళు.

అక్కడి సందడి చూడగానే రాజాకి ఒకే మాట గుర్తు వచ్చింది.

ఇదొక ఆర్మీ!

కానీ యిది భారతదేశపు సైన్యంకాదు.

ఆ మాటకి వస్తే ఇది నిజంగా సైన్యం కూడా కాదు.

కానీ సైన్యంలాంటిదే!

ఇర్రెగ్యులర్ ఆర్మీ!

కిరాయి గూండా మూకలని కూడగట్టి, వాళ్ళకి మిలిటరీ ట్రైనింగ్ ఇస్తున్నారు!

వాళ్ళు వేసుకున్న యూనిఫారం కూడా ఆలివ్ గ్రీన్ కాదు.

నల్ల ఫ్యాంటూ –

నల్ల షర్టూ!

సైతాన్ సైనికుల్లాగా ఉన్నారు వాళ్ళు!

సైతాన్!

ఉలిక్కి పడ్డాడు రాజా.

సైతాన్! ది ప్రిన్స్ ఆఫ్ డార్క్‌నెస్.

సైతాన్‌కి రిప్రజెంటేటివ్ లాంటివాడు కీర్తి.

ఈ ప్రయివేట్ ఆర్మీ తాలూకు ఓనరు కీర్తి కాదు కదా?

ఎందుకు కాకూడదూ?

ఇలాంటి ఎక్జోటిక్ ఐడియాలు కీర్తికే వస్తూ ఉంటాయి.

ఈ మిలిటరీ శిక్షణ గురించి చెప్పాలంటే...

తీవ్రవాదులే వున్నారు.

పంజాబ్ తీవ్రవాదులకీ, కాశ్మీర్ తీవ్రవాదులకీ, పాకిస్తాన్ తన భూభాగం మీద ట్రెయినింగ్ కాంప్స్ పెట్టి సైనిక శిక్షణలాంటిది ఇస్తోంది.

ఉల్ఫా లాంటి తీవ్రవాద సంస్థలకి బర్మా అండదండలు ఉన్నాయని ఒక టాక్.

తమిళ తీవ్రవాద సంస్థ ఎల్.టి.టీ.ఈ.కి ఒరిజినల్‌గా ట్రెయినింగ్ యిచ్చింది ఇజ్రేలీ సంస్థ మొస్సాద్ అని అంటారు.

తీవ్రవాద సంస్థల సంగతి ఇట్లా ఉండగా, అక్కడ బీహార్‌లో యింకో కొత్త పద్ధతి మొదలయ్యింది.

అక్కడ బొగ్గు గనుల దగ్గర వుండే డాన్‌లతో మొదలయ్యాయి మాఫియా గ్యాంగులు.

క్రమక్రమంగా బీహార్‌లో మాఫియా ఇన్‌ఫ్లుయెన్స్ అన్ని రంగాలకీ పాకింది.

ఇప్పుడు అక్కడ చాలా రౌడీ గ్యాంగులకి సొంత సైన్యాలు వున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లో డి.పి.యాదవ్ అనే మాజీ మంత్రికి పదివేలమంది రౌడీలతో కూడిన సొంత సైన్యం వుంది.

అయితే ఆ సైన్యాలు కిరాయి గూండా మూకలే గానీ వాటికి తీవ్రవాదులకు లభిస్తున్న లెవెల్లో పక్కామిలిటరీ ట్రైనింగు దొరుకుతున్నట్లు లేదు.

కానీ యిప్పుడు వీళ్ళెవరోగానీ దాదాపు ఆర్మీ ట్రైనింగ్ లాంటిదే తీసుకుంటున్నారు.

అయితే యిది యింకా ప్రారంభదశలోనే వున్నట్లు వుంది.

ఆ ఆయుధాలని చూస్తేనే ఆ సంగతి అర్థం అవుతుంది.

వాళ్ళ దగ్గర ఉన్న వాటిలో అనేకమయినవి అత్యంత ఆధునికమైన ఆయుధాలే!

కానీ అన్నీ ఒక్క రకంకాదు.

అందరి దగ్గరా ఒకే రకంవి లేవు.

ఎక్కడ ఏ ఆయుధం దొరికితే అది కొనుక్కొచ్చి, ఈ సైనికులకు యిచ్చినట్లుంది.

ఆఫ్ఘనిస్తాన్‌లో మొన్న మొన్నటి దాకా సులభంగా దొరికేవి ఆయుధాలు.

అక్కడొక బజారు వుంది!

అది తను చూశాడు కూడా.

ఆ బజార్లో దొరికేది కేవలం ఆయుధాలే!

మళ్ళీ బజారంటే పక్కా బజారు కూడా కాదు.

టెంట్లు, సీనారేకులతో తయారుచేసిన బడ్డీలు....

వాటిల్లో మారణాయుధాలు.

రష్యన్‌లతో యుద్ధంలో దొరికించుకున్నవి–

పాకిస్తాన్ నుంచి స్మగుల్ చేసినవి.

దొంగతనం చేసినవి.

రకరకాలు –

పుష్తే భాషలో బేరసారాలు.

అంచులు పగిలిన చౌకరకం కప్పుల్లో టీ తాగుతూ – అత్యంత ఆధునికమయిన ఆయుధాల గురించి బేరసారాలు.

ఇప్పుడా బజారు మూతబడినట్లుంది.

కానీ అలాంటి బజారులు యింకా కొన్ని వున్నాయి.

అక్కడ నుంచి ఆయుధాలు కొనుక్కురావడమూ, యిక్కడ గూండాలని ఒక ఆర్మీగా....రెగ్యులర్ ఆర్మీగా కాకపోయినా కనీసం ఇర్రెగ్యులర్ ఆర్మీగా....తయారు చెయ్యాలనుకోవడమూ.

బహుశా ఈ ప్రాజెక్ట్‌కి వెనక ఉన్న మాస్టర్ మైండు కీర్తే అయి వుంటాడు.

కీర్తి సిటీలోనే ఉండడం కూడా తన ఊహకి బలాన్ని ఇస్తోంది.

అయితే యిది కీర్తి ఇప్పటికిప్పుడు అనుకుని మొదలెట్టిన ప్రాజెక్టు అయి వుండక పోవచ్చు.

చాలా లాంగ్‌టర్మ్ ప్లానే అయ్యి వుంటుంది యిది.

ఎప్పటి నుంచో ఉన్న ఆలోచనలని ఇప్పుడు ఆచరణలో పెడుతూ ఉండవచ్చు కీర్తి.

మేబీ!

చూడవలసింది చూశాడు రాజా.

చెట్టుదిగి వచ్చేశాడు.

సీరియస్‌గా ఉంది అతని మొహం.

"ఏమయ్యింది?" అంది అర్పిత ఆతృతగా.

తను చూసింది చెప్పాడు రాజా.

తర్వాత అన్నాడు –

"ఇదొక కొత్త ట్రెండు అనుకుంటాను. మన స్టేట్‌లో యిప్పటి దాకా రౌడీలూ, గూండాలూ వున్నారు. గ్యాంగులు వున్నాయి. గ్యాంగ్‌స్టర్స్ ఉన్నారు.

కానీ, ఇంత పకడ్బందీగా, ప్రైవేట్ ఆర్మీని తయారు చెయ్యడం యింతవరకూ జరగలేదేమో!" అన్నాడు సాలోచనగా.

"ప్రైవేట్ ఆర్మీ" అంటే.... "ఏం చెయ్యడానికి?" అంది అర్పిత అనాలోచితంగా.

అంతలోనే అనిపించింది తనకు.

ఇది అనవసరమైన ప్రశ్న!

ప్రైవేట్ ఆర్మీ దేనికేమిటి?

రౌడీలు ఎందుకు?

గూండాలు ఎందుకు?

గ్యాంగులు ఎందుకు?

గ్యాంగ్‌స్టర్స్ ఎందుకు?

గ్యాంగులు ఎందుకో, ప్రైవేట్ ఆర్మీలు కూడా అందుకే!

చేసే సంఘ వ్యతిరేక చర్యలు యింకా భారీ ఎత్తున చెయ్యడానికి, జనంలో భీభత్సం కలిగించడానికీ.. ఎవరికైనా తమ "సేవలు" అవసరమైతే, పెద్ద ఎత్తున

ఫీజులు వసూలు చేసి పంపడానికీ....

అందుకు తప్ప ఎందుకు పోషిస్తారు ప్రైవేట్ ఆర్మీని.

ఇది గనక యిలా చూస్తూ వదిలేస్తే....

ఇంక అతికొద్ది కాలంలోనే....

బలం ఉన్న ప్రతివాడికీ ఒక సొంత సైన్యం ఉండడం....

ఆ సైన్యాల మధ్య యుద్ధాలు....

ఫలితంగా చిన్న చిన్న "రాజులూ, రాజ్యాలూ...."

దేశం ముక్కలు చెక్కలయిపోవడం....

ఇవన్నీ నిజమయ్యే దౌర్భాగ్యపు రోజులు ఈ దేశానికి రానున్నాయా?

"ఏం చేద్దాం ఇప్పుడు?" అంది అర్పిత.

"తొందరపడకూడదు. ఆలోచించి చెయ్యాలి ఏం చేసినా!" అన్నాడు రాజా. "ఇంక వెళ్దామా?"

"నన్ను మా ఇంటి దగ్గర దింపెయ్!" అంది అర్పిత.

మరునిమిషంలో మోటార్ సైకిల్ స్టార్ట్ అయ్యింది.

✦ ✦ ✦

అర్పిత రాజాతో కలిసి వెళ్ళినప్పుడే, ఆమె కోసం యింటికి వచ్చాడు పార్టీ తాలూకు ఒక మనిషి. అతని పేరు రాజలింగం. మధ్యవర్తిత్వం నడపడంలో అతన్ని మించిన వాడు లేడు. కిందివేపు అంచులు వంకర కత్తుల్లా పొడుచుకు వచ్చే లాల్చీ, కాళ్ళని బిగుతుగా అంటిపెట్టుకుని ఉండే చుడీదార్ పైజమా, ఛడావులూ అతని ట్రేడ్‌మార్క్ డ్రెస్సు.

అతను వచ్చేసరికి యింట్లో అర్పిత లేదు. పెద్దమ్మాయి అంకిత ఒక్కతే ఉంది.

నిజం చెప్పాలంటే, రాజలింగం రాకకోసం చాలా ఆత్రంగా ఎదురు చూస్తున్నట్లు కనబడుతోంది అంకిత.

అతను ఏ క్షణాన ఇంటికి వస్తాడో అన్నట్లు ఇల్లంతా ఎప్పటికప్పుడు శుభ్రంగా వుంచింది. గేటు చప్పుడయితే చాలు, రాజలింగమే వచ్చాడేమో అన్న ఆతృతతో చటుక్కున తలెత్తి చూస్తోంది.

చివరికి రాజలింగం వచ్చేసరికి, వరండాలోని పేము సోఫాల్లో వేసి వున్న దిండ్లమీద పర్ఫ్యూమ్ స్ప్రే చేస్తోంది అంకిత.

కొంచెం స్ప్రే చేసింది.

సువాసన ఏమీ వస్తున్నట్లు అనిపించలేదు.

ఈసారి ధారాళంగా బాగా ఎక్కువగా స్ప్రే చేసేసింది.

ఇంక ఒక నిమిషం తరువాత విజృంభించింది సువాసన. తలనొప్పి వచ్చేటంత ఎక్కువగా ఆ ఘాటు పరిమళం వరండా అంతా స్ప్రెడ్ అయ్యింది.

అప్పుడు వచ్చాడు రాజలింగం.

స్ప్రే బాటిలు పక్కన పెట్టేసి, సంతోషంగా అతని వైపు చూసింది.

అతను చెప్పబోయే శుభవార్త ఏమిటో తనకి తెలుసు.

కానీ ఎలాంటి పదాల కలయికతో, ఆ శుభవార్త తన చెవిలో పడుతుందనేదే కొద్దిగా సస్పెన్సు!

అంతే!

రాజలింగం అన్నాడు.

"కంగ్రాచులేషన్స్! మీ నాయన సీటు ఖాళీ అయ్యింది కదా! బై ఎలెక్షన్‌లో ఈ సీటు నీకు యివ్వాలని డెసిషన్‌కి వచ్చాం. బై ఎలెక్షన్‌లో పార్టీ టిక్కెట్టు నీకే!"

రాజలింగం గొంతు సవరించుకున్నాడు.

క్షణికమైన ఊహలో నుంచి బయటపడింది అంకిత.

రాజలింగం చెప్పడం అంతా తన భ్రమే! అతను యింకా నోరు తెరవనేలేదు.

టెన్షన్‌తో అతని వైపు చూసింది అంకిత.

హఠాత్తుగా అన్నాడు రాజలింగం.

"మీ చెల్లెలు అర్పిత లేదా?"

అంకిత మొహంలో కాంతి తగ్గింది.

"బయటికి వెళ్ళింది" అంది. "ఏం? ఎందుకు?"

"ఎలెక్షన్ విషయం మాట్లాడాలి!"

అంకిత మొహంలో అసహనం కనబడింది.

"దాని మొహం! దానితో మాట్లాడేది ఏముంది!" అంది.

రాజలింగం అన్నాడు.

"పార్టీ టికెట్ అర్పితకి యివ్వాలని డిసైడ్ చేశాం."

తను, తన తండ్రికి తగిలేలా చేసిన షాక్‌కి రెట్టింపు షాక్ తనకే తగిలినట్లయ్యింది అంకితకి!

రెండు క్షణాలు నిశ్చేష్టురాలయి ఉండిపోయి, తరువాత గొంతు కూడదీసుకుంటూ అంది.

"ఇది అన్యాయం!"

"పాలిటిక్స్‌లో అన్నీ న్యాయమే!" అన్నాడు రాజలింగం నవ్వుతూ.

"నన్ను నమ్మించి మోసం చేశారు"

రాజలింగం పదునుగా అన్నాడు.

"నువ్వు నమ్మదగ్గ మనిషివి కావు. అందుకే నమ్మించి మోసం చెయ్యాల్సి వచ్చింది."

కోపంతో ఒణుకుతున్న గొంతుతో అంది అంకిత.

"ఎంత నాటకం! నాన్న పోతే సీటు ఖాళీ అవుతుందనీ, ప్రజల్లో సానుభూతి పవనాలు బాగా వీస్తుంటాయనీ, బై ఎలెక్షన్‌లో టిక్కెట్ నాకే యిస్తాననీ, నేను నాన్నని మించిన రికార్డు మెజారిటీతో గెలుస్తాననీ ఆశ పెట్టారు. అంతా దగా!"

"సీటు ఖాళీ చేయించడానికి కన్న తండ్రినే చంపడానికి రెడీ అయ్యావు. అవునా?"

రోషంగా అంది అంకిత.

"నాన్నని చంపమని సలహా యిచ్చింది ఎవరు? నువ్వు కాదూ? ఆ కీర్తి అనేవాడిని తీసుకొచ్చి పరిచయం చేసి, వాడిచేత నాన్నని చంపడానికి ప్లాన్ వేయించింది నువ్వు కాదూ? దీనికి బదులుగా నాకు టిక్కెట్ యిస్తానని ప్రామిస్ చేసింది నువ్వు కాదూ? కడుపుకి అన్నం తింటావా? గడ్డి తింటావా?"

"పొలిటీషియన్స్ అందరూ తినేది గడ్డే" అన్నాడు రాజలింగం తేలిగ్గా. కానీ నువ్వు పెంటకుప్పని కెలికి తినే పంది కంటే హీనం! మీ నాన్నని చంపే ప్రపోజల్‌ని నువ్వు ఒప్పుకుంటావని మేం అనుకోలేదు అసలు. సొంత తండ్రినే చంపడానికి రెడీ అయిన దానివి రేపు మాకే ఎసరు పెట్టవని గ్యారంటీ ఏముందీ! విషప్పురుగువి నువ్వు. ఈ సీటు పార్టీకి కావాలి. మీ నాన్న చావు వల్ల ప్రజల్లో లేచిన సానుభూతి పవనాల్ని కాష్ చేసుకోవాలి. మీ చెల్లెలు అర్పితది మంచి కేరక్టరు. చదువుకుంది, సోషల్ సర్వీసు చేస్తుంది. జనం రెండో ఆలోచన లేకుండా ఆ అమ్మాయికి ఓట్లు వేస్తారు."

కోపంతో వణకడం మొదలెట్టింది అంకిత.

"అంటే....నన్ను మీ ప్లాన్‌కోసం ఊరికే యూస్ చేసుకున్నారన్న మాట! దేవుడిలాంటి తండ్రిని చంపించారు. నేను ఊర్కోను. పెద్దగోల చేస్తా."

"ఏం చేస్తావ్? నువ్వే మీ నాన్నని చంపావని ఒప్పుకుంటావా?"

ఒక్కసారిగా అంకితకి నోరు పడిపోయినట్లయ్యింది. నిప్పులు కురిపిస్తూ చూసింది రాజలింగం వైపు.

తేలిగ్గా నవ్వి, సున్నం, కాచూ, పొగాకు కలిపి ఉన్న చిన్న పొట్లం జేబులోంచి తీసి, ఆ పొడిని నోట్లో వేసుకున్నాడు రాజలింగం.

అదే టైంలో గేటు చప్పుడయ్యింది.

తల తిప్పి చూశాడు.

అర్పిత లోపలికి వస్తోంది.

వస్తూనే రాజలింగాన్ని చూసింది. అతనెవరో ఆమెకి తెలియదు. అతన్ని చూడగానే రాజకీయ రాబందు అని మాత్రం వెంటనే గ్రహించగలిగింది.

ఆమె నొసలు ముడిపడ్డాయి.

చరచర లోపలికి వెళ్ళిపోబోయింది.

"దా బేటీ! నీకు మంచి శుభవార్త చెబుదామని వచ్చా" అన్నాడు రాజలింగం, ఉద్ధరిస్తున్న వాడిలాగా గొంతుపెట్టి.

ఆగి అనుమానంగా చూసింది అర్పిత.

"ఏమిటి?"

"నాయన పోయాడు కదా! సీటు ఖాళీ అయ్యింది. బై ఎలెక్షన్లు దగ్గరికి వస్తున్నాయ్! టిక్కెట్ నీకే వచ్చేలా మానేజ్ చేశా! మీ నాయన అంటే ప్రజలకి చాలా గౌరవం కదా! ఆయన మీద సానుభూతి పవనాలు బాగా వీస్తాయ్! రికార్డు మెజార్టీతో నువ్వు గెలుస్తావు!"

సంతోషం లేని నవ్వు నవ్వింది అర్పిత.

"చితి మీద శవం తగలబడుతుంటే, దాని మీదే రొట్టెలు కాల్చుకోవాలని చూస్తున్నట్లు ఉంది మీ ఆరాటం!"

"ఇయన్నీ వేదికల మీద చెప్పాల్సిన మాటలు. ఇళ్ళలో మాట్లాడుకోవాల్సినవి కావు. కొత్తోణ్ణికాను! నాతో స్ట్రెయిట్ ఫార్వర్డ్‌గానే మాట్లాడొచ్చు!" అన్నాడు రాజలింగం.

"అంటే చెంప పగలగొట్టినట్లు చెప్పమంటావా! ఈ శవ రాజకీయాలంటే నాకు పరమ అసహ్యం."

తెల్లబోయాడు రాజలింగం.

అర్పిత దగ్గర నుంచి యిలాంటి నెగెటివ్ రియాక్షన్ ఊహించలేదు అతను. బై ఎలెక్షన్లో పార్టీ టిక్కెట్ ఇస్తామనగానే ఆ అమ్మాయి చాలా సంతోషిస్తుందనుకున్నాడు.

అది సహజం!

తన పార్టీ ఇప్పటికి ఎంత మందికి అలా టిక్కెట్ ఇవ్వలేదు.

ఎంతమంది ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని బాగుపడలేదు?

అదే అన్నాడు రాజలింగం.

"ఇది మన పార్టీ సాంప్రదాయం! మన పార్టీనే ఏంటిలే! రాజకీయాల్లో సాంప్రదాయం. తండ్రి పోతే ఆ సీటు కూతురికి దక్కకపోతే ఎలా?"

"అంటే అదేమన్నా వంశపారంపర్యమైన హక్కా?"

రాజలింగం ఏదో అనబోయాడు.

అతన్ని కట్ చేస్తూ అర్పితే అంది.

"వంశపారంపర్య హక్కులు ఉండకూడదనేగా రాజులకి భరణాలు, కరణాలకి కరణీకాలూ అవన్నీ తీసేసింది. రాజకీయాల్లో మాత్రం ఇంట్లో ఒక శవం లేచిందంటే ఆ సీటు మళ్లీ ఆ యింటి వాళ్ళకే అనే ఈ పద్ధతేమిటి? ఎందుకిలా వుండాలీ?"

రాజలింగానికి కూడా కోపం వచ్చింది. గండుపిల్లిలా గుర్రుగా చూస్తూ వుండిపోయాడు.

ఇంకా అంటోంది అర్పిత.

"ఇంతమంది కార్యకర్తలు ఉన్నారు, ఇంతమంది ప్రజలు ఉన్నారు. ఇంతమంది పెద్ద మనుషులు ఉన్నారు. వాళ్ళలో ఒక్కళ్ళూ మీ కంటికి ఆనడం లేదా? నాలో ఏముంది స్పెషాలిటీ – పోయిన సదాశివబ్రహ్మంగారి కూతుర్ని కావడం తప్ప!" అంది పదునుగా.

రాజలింగం అన్నాడు –

"అట్లా అనుకోకు! నీకు మంచి ఇమేజ్ ఉంది జనంలో"

"నాకంటే మంచి ఇమేజ్ మీ కార్యకర్త వెంకటేశ్వరరావుకి ఉంది. అతనికెందుకు యివ్వకూడదూ టిక్కెట్టు?"

తీవ్రంగా అన్నాడు రాజలింగం. "నువ్వు కాంటెస్ట్ చేస్తావా లేదా అది చెప్పు! ఎవరికి టిక్కెట్ యివ్వాల్సిందీ చెప్పాల్సినంత వి.ఐ.పి. వి కావు నువ్వు."

"నాకు ఈ పద్ధతి నచ్చదు"

"సరే! నీ ఖర్మ! మాకు కేండిడేట్లే దొరకరా?"

లోపలికి వెళ్ళిపోయింది అర్పిత.

పెద్దమ్మాయి అంకిత అక్కడే నిలబడి, జరుగుతున్నదంతా జాగ్రత్తగా గమనిస్తోంది.

ఆమె మొహంలోకి పోయిన కళ తిరిగి వచ్చింది.

ఇప్పుడు యింక జరగబోయేది ఏమిటో అంకితకు తెలుసు.

నాన్నగారు పోయారు. సానుభూతి వెల్లువలో సీటు దక్కించుకోవాలి పార్టీ, దాని కోసం ఆయన సంతానంలో ఎవరో ఒకరు ఎలెక్షన్‌కి నిలబడాలి. తన చెల్లెలు ఉత్త మొద్దు మొహం, టిక్కెట్ విలువ ఏమిటో దానికి తెలీదు, తనకి గీర అని అందరూ అంటారు గానీ ఈ అర్పితకి ఉన్నంత గీర అసలు ఏ ఆడదానికీ ఉండదు.

మహా మిడిసిపడిపోతూ నీతి సూత్రాలు వల్లిస్తోంది చెల్లి.

ఇదీ మంచిదే!

ఇప్పుడింక ఈ రాజలింగంగాడు తన కాళ్ళు పట్టుకోక తప్పదు.

అంకిత ఊహ కరెక్టే అయ్యింది.

చావుదెబ్బ తిన్న కుక్క తోక ముడిచినట్లు అయిపోయాడు రాజలింగం. ఆసరా కోసం అన్నట్లు అంకిత వైపు తిరిగాడు.

"నీ చెల్లికి నీల్గుడు ఎక్కువే!" అన్నాడు హేళనగా.

"నెత్తికెక్కించుకుందా మనుకుంటిరిగా!" అంది అంకిత అంటిస్తున్నట్లు.

"మంచి పనయ్యింది! ముందే తెలిసిపోయింది. ఇంక ఆమె మెహర్బానీ మనకొద్దులే! నీకే టిక్కెట్టు ఖాయం."

కసిని దాచుకుంటూ అంది అంకిత

"ఇప్పుడు నేనొప్పుకోవద్దూ?"

ఆశ్చర్యంగా చూశాడు రాజలింగం.

"నీకేం తెగులు?"

"అవసరమొస్తే కాళ్ళు పట్టుకోవడం, అవసరం తీరితే జుట్టు పట్టుకోవడం నీకు బావుందేమో గానీ, నాకు నచ్చలేదు."

నిశితంగా అంకిత వైపు చూశాడు రాజలింగం.

ఎత్తులూ, పై ఎత్తులూ అతనికి కొత్తకావు. కానీ అంకిత వేస్తున్న కొత్త ఎత్తేమిటో మాత్రం అతనికి అర్థం కాలేదు.

"మతలబుగా మాట్లాడతావెందుకూ? మనసులో ఉన్నది కక్కేయ్" అన్నాడు.

ఇంక నాన్చలేదు అంకిత.

"రాజలింగం! నేనేం మెచ్యూర్‌కాని పిల్లననుకున్నావా? (ఈ మాట అనడంలోనే ఆమె కల్చరు బయటపడిందనుకున్నాడు రాజలింగం) లేకపోతే మెడ మీద తలకాయ లేని దాన్ననుకున్నావా? బస్తీమే సవాల్! అంకిత మైదానంలోకి దిగిందంటే ఆగలేరు ఎవ్వరూ! నా దగ్గర ఈ హుషారీ చూపించొద్దు!"

"అసలు సంగతి చెప్పరాదూ!" అన్నాడు రాజలింగం చిరాగ్గా.

అంకిత చెప్పడం మొదలెట్టింది.

"మీది మైనారిటీ మినిస్ట్రీ అయిపోయింది. అసమ్మతివర్గం వాళ్ళంతా తిరుగుబాటు చేసే మూడ్‌లో ఉన్నారు. ఇప్పుడు శాసనసభలో ప్రతి ఎమ్మెల్యే, ప్రతి ఓటూ మీకు ముఖ్యమే! ఎందుకంటే, ఎప్పుడో ఒకప్పుడు రాబోయే అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవాలి. అవునా?"

మౌనంగా వింటున్నాడు రాజలింగం.

అతనికి తెలుసు.

దీనికంతా కారణం సదాశివబ్రహ్మంగారూ.

ఆయన తయారు చేసిన ఒక ఫైలూనూ!

సదాశివబ్రహ్మంగారు ప్రజల కోరిక మీద, ప్రజల కేండిడేట్‌గా ఎలెక్షన్‌కి నిలబడ్డాడు.

ప్రజల పట్టుదలవల్లే ఆయనకి మంత్రి పదవి. అందులోనూ పవర్‌ఫుల్ పోర్ట్ ఫోలియో అయిన హోం మినిస్ట్రీ అప్పచెప్పాల్సి వచ్చింది.

దానితో, పేనుకి పెత్తనమిచ్చినట్లయ్యింది.

ఇంక తలంతా తెగ కొరికి పెట్టడం మొదలెట్టాడు.

క్రమంగా బయటపడింది ఒక విషయం.

ప్రజలు కోరినా కూడా ఆయన మంత్రి వర్గంలో చేరడానికి పెద్దగా ఇష్టపడలేదుట.

కానీ అప్పుడు నచ్చచెప్పాడు ఆయనకెంతో విశ్వాసపాత్రుడయిన సూర్యారావు.

"అన్యాయాలూ, అవినీతీ అని అందరూ చెబుతూనే ఉంటారుగానీ, అవి సరిగ్గా ఎక్కడ, ఎలా జరుగుతున్నాయో చెప్పేవాళ్ళు మాత్రం ఎవరూ లేరండీ! మీరు మంత్రివర్గంలో చేరి కొన్నాళ్ళపాటు ఆ దొంగల్లో ఉంటే తప్ప, కోట రహస్యానికి బీట పడదు. అందుకని మీరు మంత్రివర్గంలో చేరి తీరాలి! మీ కోసం కాదు! మా కోసం!" అని.

అది కరెక్టే అనిపించింది సదాశివబ్రహ్మంగారికి.

ఆయన మంత్రివర్గంలో చేరాడు.

చేరినప్పటినుంచి కుమ్మరి పురుగు దొలిచినట్లు ఒకే త్రవ్వడం.

పాతకేసులు అన్నీ తిరగదోడాడు. కొత్తకేసులు అన్నీ కూలంకషంగా పరిశీలించడం మొదలెట్టాడు.

తన దృష్టికి వచ్చిన అవక తవకలన్నిటినీ ఒక సీక్రెట్ ఫైల్లో రాయడం మొదలెట్టాడు.

ఆ సీక్రెట్ ఫైలు సంగతి చాలారోజుల పాటు పార్టీలో పెద్ద తలకాయలకి తెలియలేదు.

తెలిశాక అందరికీ శివాలెత్తాయి.

ఈయన శవంగా మారితే తప్ప మనం బ్రతకలేమనే నిశ్చయానికొచ్చారు అందరూ.

ఆయన చావే తమకి లాభం అని తేల్చుకున్నారు గానీ....

అక్కడే వచ్చింది అసలు సమస్య!

ఆయనకి అపూర్వమైన, అపారమయిన ప్రజాదరణ ఉంది!

గాంధీగారికీ, నెహ్రూ, ప్రకాశంగారికీ వున్నంత కాకపోయినా ఉన్నంతలో ఆయనా గొప్ప నాయకుడే.

చాలా సచ్చరితుడే!

అతి నిజాయితీపరుడే!

ఆయన్ని చంపడం అంటే ఎవరో ఒక రౌడీ మినిస్టర్‌ని సఫా చేసేసినంత సులభం కాదు.

అది వికటిస్తే....

ప్రజలు తిరగబడవచ్చు!

ప్రభుత్వం పునాదులే కదిలిపోవచ్చు.

మరి ఎలా? ఎలా? ఎలా.

ముందుకెళ్తే గొయ్యి!

వెనక్కెళ్తే నుయ్యి!

అందరూ యిలా తలలు బద్దలు కొట్టుకుంటూ ఉండగా –

అప్పుడు రంగప్రవేశం చేశాడు కీర్తి.

కీర్తి....ది క్రిమినల్!

కీర్తి....ది క్రూక్!!

కీర్తి చెప్పాడు ఒక ఐడియా!

యాక్సిడెంట్‌లో చనిపోవాలి సదాశివబ్రహ్మంగారు.

ఆ యాక్సిడెంట్‌ని పార్టీ పెద్దలే "అరేంజ్" చెయ్యాలి!

సదాశివబ్రహ్మంగారు తన ఇంట్లోనే, తన సొంత మనుష్యుల మధ్యే చచ్చిపోవాలి.

అప్పుడు జనానికి అనుమానం రాదు.

బాత్‌రూంలో ఎలెక్ట్రిసిటీ తీగెలు లూజ్ కనెక్షన్‌తో ఉంచి, బ్రహ్మంగారికి షాక్ తగిలేలా చూడడం అనే అయిడియా కీర్తికి వచ్చిన బ్రెయిన్ ఛెయిల్డే!

ఆ ప్లానుకి యింటి దొంగ అంకిత తోడయ్యింది.

చాలా స్మూత్‌గా, ఎవరికీ ఏ అనుమానం రాకుండా, జరిగిపోయింది మొత్తం వ్యవహారం!

పార్టీకి సదాశివబ్రహ్మంగారి పీడ సులభంగా వదిలిపోయింది.

కానీ యింకో కొత్త సమస్య ఎదురయ్యింది.

అనుకోకుండా, పార్టీలో అసంతృప్తి బయలుదేరి ప్రభుత్వం పడిపోయే స్థితికి వచ్చింది. అసంతృప్తి సదాశివబ్రహ్మంగారు చనిపోయినందుకు కాదు. పంపకాలు కుదరనందుకు!

అందుకని యిప్పుడు ప్రతి ఓటూ వంద ఓట్ల కింద లెఖ్ఖ.

అందుకనే, ఈ బై ఎలెక్షన్‌లో ఈ సీటు పార్టీకి దక్కి తీరాలి!

అందరూ కలిసి ఆ బాధ్యత తన మీద పెట్టారు.

"ఏదో ఒక పద్ధతిలో వ్యవహారం సెటిల్ చేసుకోకుండా మాత్రం తిరిగిరాకు!" అని తరిమారు తనని!

ఈ అడ్డగాడిద అది గ్రహించినట్లుంది!

కాదు కాదు....అడ్డగాడిద కాదు....ఈ ఆడగాడిద!

ఇప్పుడు ఈ గాడిద కాళ్ళు పట్టుకోవాలా తను? తప్పదా?

పాలిట్రిక్స్‌లో ఇలాంటివన్నీ మామూలే అని కూడా రాజలింగానికి తెలుసు!

అందుకని సాధ్యమైనంత సౌమ్యంగానే అడిగాడు.

"ఊర్కే వంద మాటలెందుకు? కంటెస్ట్ చేస్తావా? చెయ్యవా? అది చెప్పు!"

"చెబుతున్నాగా! చేస్తావా చెయ్యవా అని అడిగే పరిస్థితిలో ఇప్పుడు నువ్వు లేవూ! నీ పార్టీ కూడా లేదు. పదినిమిషాల క్రితం అది వేరే మాట!"

"మరి ఇప్పుడేం అంటావ్?"

"నేను పార్టీని గెలిపిస్తే నాకు పదవి ఇస్తారా?"

"ఏం పదవి?"

"హెూం మినిస్ట్రీ!" అంది అంకిత ఓరగా చూస్తూ.

తన పక్కనే బాంబు పేలినట్లు ఉలిక్కిపడ్డాడు రాజలింగం.

"ఏమిటీ?" అన్నాడు తన చెవులని తనే నమ్మలేనట్లు.

మళ్ళీ స్పష్టంగా చెప్పింది అంకిత.

"అవును! నాకు హెూం మినిస్ట్రీ ఇచ్చే మాటయితేనే నేను కంటెస్ట్ చేసేది!"

కోపంతో ఊగిపోతూ అన్నాడు రాజలింగం. "నువ్వు మాట్లాడుతున్నదేమిటో నీకు తెలిసే మాట్లాడుతున్నావా?"

సమాధానంగా నవ్వింది అంకిత.

"నేను వెళ్లొస్తా!" అన్నాడు రాజలింగం లేచి నిలబడి, బెదిరింపుగా.

అతను వెళ్ళలేదని అంకితకి తెలుసు. అందుకే మాట్లాడకుండా ఊరుకుంది.

ఆమె ఊహించినట్లే రాజలింగం విసవిసా గేటు దాకా వెళ్ళాడు.

తను ఇంట్లోకి వెళ్ళిపోబోతున్నట్లు అభినయించింది అంకిత.

అప్పుడు తగ్గాడు రాజలింగం.

వెనక్కి తిరిగి, నెమ్మదిగా వచ్చాడు. అచ్చం చేపల బేరం లాగే ఉంది ఆ తంతు.

"హెూం మినిస్ట్రీ అంటే అయ్యేపని కాదులే. ఇంకో మాట చెప్పు" అన్నాడు రాజలింగం.

అంకిత అంది –

"నా నోట్లో నుంచి ఒక మాట వచ్చిందంటే ఇంక వెనక్కి తీసుకునేది లేదు."

ఆగ్రహాన్ని ఆపుకున్నాడు రాజలింగం.

అప్పుడు అనిపించింది అతనికి.

కొత్తతరం వచ్చేస్తోంది రాజకీయాల్లోకి.

ఈ కొత్తతరం రాజకీయాలకి ప్రతినిధి ఈ అంకితే!

ఇది జెట్ యుగం!

రాకెట్‌లాగా దూసుకెళ్ళిపోవాలనే దురాశ ఈ తరంవాళ్ళకి.

తమకీ ఆశలున్నాయి.

కానీ వాటికీ అర్థం వుంది.

దాదాపు తన బతుకంతా రాజకీయాల్లోనే గడిచిపోయినా తను ఇంకా మధ్యవర్తి పనులే చేస్తున్నాడు.

మినిస్టర్ విజయకుమారి తొమ్మిదేళ్ళు తాపత్రయపడితేగానీ హెూం మినిస్ట్రీ అందుకోలేకపోయింది.

ఇవాళ ఈ పిల్లకు మాత్రం నేరుగా హెూం మినిస్ట్రీ కావాలట!

అంత తేలికా!

కొద్దిక్షణాలపాటు మౌనంగా వుండిపోయి, తర్వాత అన్నాడు రాజలింగం

"హెూం మినిస్టర్‌గా మొన్నేగా విజయకుమారి ప్రమాణ స్వీకారం చేసిందీ! ఇప్పుడప్పుడే మార్పులు చెయ్యడం కుదరదు. కావాలంటే హెూం మినిస్ట్రీలోనే సహాయమంత్రిగా వేయిస్తా! సరేనా?"

అంకిత మొహం వికసించింది.

తను ఈ మాత్రం కూడా నిజంగా దొరుకుతుందని ఆశించలేదు.

ఊరికే ఒక "పొడి" వేసి చూసింది.

దానికే వీళ్ళు పడిపోయారు.

ఈ లోకంలో ముఖ్యంగా రాజకీయాల్లో దబాయింపు సెక్షనే ఎప్పుడూ నెగ్గుకొచ్చేది. నిజం!

"మళ్ళీ మాట తప్పరని గ్యారంటీ ఏమిటి?" అంది తెలివిగా.

"మాట దక్కించు! బాండ్ పేపర్ మీద రాసిస్తా" అన్నాడు రాజలింగం. అని మళ్ళీ అన్నాడు "అయితే ఒక జరూర్ విషయం వుంది"

ఏమిటన్నట్లు చూసింది అంకిత.

"మీ నాయన తయారు చేశాడే సీక్రెట్ ఫైలు, అదెక్కడ దాచాడో గానీ కనబట్టల్లా! బహుశా మీ చెల్లి అర్పితకు తెలిసి వుండొచ్చు. ఆ ఫైలు గనక చూడకూడని వాళ్ళ చేతిలో పడిందనుకో! ఇంక మినిస్ట్రీ వుండదు. ను వ్వు మంత్రివీ కాలేవు" అన్నాడు.

"ఫైలు సంగతి అర్పితకు తెలిసి వుంటుందా? అయితే అట్టే కష్టం కాదులే" అంది అంకిత నిబ్బరంగా.

✦ ✦ ✦

బై ఎలక్షన్‌లు జరిగాయి.

పోయిన ఎలక్షన్‌లలో సదాశివబ్రహ్మంగారు పోటీ చేసినప్పటికీ యిప్పటికీ వెయ్యివిధాలుగా తేడా కనబడుతోంది.

ఆ ఎన్నికలలో ప్రజలే వచ్చి ఓట్లేశారు.

ఈ ఎన్నికలలో ప్రజలని పశువులని బందెలదొడ్డికి బలవంతంగా తోలుకెళ్ళినట్లు పోలింగ్ బూత్‌లకి తరలించాల్సి వచ్చింది.

అప్పుడు నోటిమాటలతోనే ఓట్ల వర్షం కురిసింది.

ఇప్పుడు  నోట్ల మూటలు విప్పితేగానీ ఓట్లు పడలేదు.

అప్పుడు యువకులే వాలంటీర్లుగా నిలబడి, రౌడీమూకలని బూత్ కాప్చరింగ్ చేయకుండా అడ్డుకున్నారు.

ఇప్పుడు కొన్ని బూత్‌లలో రౌడీమూకలే పోలింగ్ ఆఫీసర్లుగా ప్రవర్తించడం మొదలెట్టారు.

అప్పుడు జనం మనసారా ఓట్లు వేశారు.

ఇప్పుడు సారాకి మనసు అమ్ముకుని ఓట్లు వేశారు.

అప్పుడు అతి న్యాయం! ఇప్పుడు అంతా అన్యాయం!

బూత్‌కాప్చరింగ్, రిగ్గింగ్, దౌర్జన్యం, బస్తీ నాయకులకి లంచాలు, ఓటర్లకి నోట్లు, అమాయకజనానికి సారా....ఇలా యిన్ని విధాలుగా వికృతమైన చేష్టలుచేసి, మొత్తానికి సీటు గెల్చుకుంది అంకిత.

ఆమె చాలా తెలివైనది.

అందుకే కేవలం "సానుభూతి పవనాల" మీద ఆశపెట్టుకుని ఎలక్షన్ నావని నట్టేట ముంచేసుకునే తప్పు చెయ్యలేదు.

ఆమె హెూం మినిస్ట్రీలో సహాయమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే టైంకి విజయకుమారి పరిపూర్ణమైన ఆరోగ్యంతో అమెరికా నుంచి తిరిగి వచ్చింది.

వస్తూనే ఎయిర్‌పోర్టులోనే ప్రెస్‌మీట్ పెట్టిందామె.

ఇండియాని ఎగతాళి చేసింది.

ఇండియాని ఎగతాళి చేస్తూ అమెరికాని తెగమెచ్చుకుంది.

అక్కడి రోడ్లు యిక్కడి బెడ్‌రూమ్స్‌కంటే నీటుగా వుంటాయి అంది.

అమెరికా గురించి ఐదు గంటలసేపు అనర్గళంగా ఉపన్యసించేటంత ఆవేశంతో వుంది ఆమె. (అప్పుడే కాదు, ఆ తర్వాత ఆర్నెల్ల వరకూ ఆమె అమెరికా భ్రాంతిలో నుంచి బయటపడలేదు)

విలేఖర్లు ఏ ప్రశ్న అడిగినా విజయకుమారి జవాబు మాత్రం అమెరికా విశేషాలతో ముగుస్తోంది.

అది చూసి ఒక విలేఖరి జనాంతికంగా యింకో విలేఖరితో అన్నాడు –

"అందుకే అన్నారండీ! కొత్తగా యిల్లుకట్టుకున్న వాళ్ళింటికీ, కొత్తగా పిల్లలు పుట్టిన వాళ్ళింటికీ వెళితే వివరాలు చెప్పి చెప్పి బోర్‌కొట్టి చంపుతారని! ఇప్పుడు ఆ లిస్టుకి కొత్తగా అమెరికా వెళ్ళొచ్చిన వాళ్ళను కూడా కలపొచ్చు! ఏవంటారు?"

రెండో విలేఖరి నవ్వాడు.

తర్వాత విజయకుమారి వేపు తిరిగి అన్నాడు రెండో విలేఖరి.

"మీరు అమెరికా వెళ్ళి అక్కడొక ముసలం పుట్టించి వచ్చారుట!"

"నేనా?" అని మొహం చిట్లించి చూసింది విజయకుమారి.

"మీరెళ్ళి అక్కడుంటున్న తెలుగువాళ్ళలో కులగజ్జిని గోకి, ఎక్కువచేసి వచ్చారని అనుకుంటున్నారు."

"తెలుగువాళ్ళు ఎక్కడున్నా వాళ్ళలో వాళ్ళే కొట్టుకు ఛస్తుంటారు. నేను వెళ్ళి చేసింది ఏమిటి? మనవాళ్ళలో యూనిటీ వుండదు. అందుకే అన్నారు 'మనవాళ్ళు వుత్త వెధవాయలోయ్' అని" అంది విజయకుమారి విట్టీగా రిప్లయ్ యిస్తున్నా ననుకుంటూ.

ఆమె "జోక్" కి అందరూ నవ్వారు.

కానీ అక్కడున్న వాళ్ళలో తెలుగంటే నిజంగా ప్రాణంపెట్టే విలేఖరి ఒకతను వున్నాడు. అలాంటివాళ్ళు తెలుగువాళ్ళలో చాలా చాలా అరుదు.

అతను ఈ వెకిలిహాస్యం భరించలేక కడుపుమండి అన్నాడు

"మనవాళ్ళు ఉత్త వెధవాయలోయ్" అనే దాన్లోనే మన "తెగులుతనం" కనబడుతుంది. "మనవాళ్ళు ఉత్త వెధవాయలోయ్" అంటాంగానీ "మనం ఉత్త వెధవలం" అనుకోం. "ఎందుకో తెలుసాండీ?"

సీరియస్‌గా అతనివేపు చూసింది విజయకుమారి.

"ఎందుకంటే, ప్రతి తెలుగువాడూ తనొక మహామేధావిననీ, యుగపురుషుడిని అనుకుంటాడు. అంతటితో వూరుకోకుండా తక్కిన తెలుగువాళ్ళందరూ ఉత్త వెధవాయలని అనుకుంటాడు. ఈ సూత్రం ప్రకారం తను కూడా తక్కిన తెలుగువాళ్ళ దృష్టిలో ఒక వెధవాయే అవుతున్నాడని ఏ మాత్రం గ్రహించడు. మీ పరోక్షంలో మేం నలుగురం కూర్చుని ''మనవాళ్ళుత్త వెధవాయలోయ్'' అని అనుకున్నామనుకోండి. "విజయకుమారిగారుతప్ప" అని.

"మీకు మినహాయింపు యివ్వంకదా! అందుకని అప్పుడు మీరు కూడా ఆటోమాటిక్‌గా వెధవల్లోనే లెక్క. అర్థమయిందాండీ?"

"నేను విధవను కాను. నా మొగుడు బతికే వున్నాడు" అంది విజయకుమారి అతనికి తెలివిగా అంటిస్తున్నాననుకుని.

"అది ఆయన ఖర్మ" అన్నారెవరో తగ్గు స్వరంతో.

విజయకుమారి మొహం కందిపోయింది.

ప్రెస్‌మీట్ అనుకోకుండా సైడ్‌ట్రాక్ అయిపోయి హాట్‌హాట్‌గా మారిపోవడం గమనించాడు యింకో విలేఖరి.

వాతావరణాన్ని చల్లబరచడానికి యింకో ప్రశ్న అడిగాడు.

"ఈ ప్రెస్‌మీట్‌లో మీరు ప్రత్యేకంగా చెప్పేదేమన్నా వుందా?"

హఠాత్తుగా చిరునవ్వు నవ్వింది విజయకుమారి!

"ఆఁ! ఒక్కవిషయం స్పష్టం చెయ్యదలచుకున్నాను. నాకు ముఖ్యమంత్రి పదవి మీద వ్యామోహం వుందని అనుకుంటున్నారు జనం. నాకు పదవులు ముఖ్యంకాదు. ప్రజాసేవే ముఖ్యం. ముఖ్యమంత్రి పదవి మీద నాకు ఏమాత్రం వ్యామోహం లేదు" అంది విజయకుమారి.

"అమ్మ! కొత్త యుద్ధం మొదలవుతోందిరా!" అన్నాడు ఒక విలేఖరి. వాళ్ళకిలాంటి పల్చటి తెల్ల అద్దాల వెనక వుండే నల్లటి అర్థాలు బాగా తెలిసినవే!

"ఫలానా పదవి మీద నాకు వ్యామోహం లేదు అని ఎవరన్నా ఒక రాజకీయవేత్త శెలవిస్తే తను ఆ పదవి కోసం పడిచస్తున్నాననే అర్థం"

విజయకుమారి నానా గడ్డీ కరిచి హోం మినిస్టరయ్యింది.

హోం మినిస్టర్ అయీ అవగానే యింక ముఖ్యమంత్రి పదవి మీద ఆశ!

అంటే....

రాజకీయాల్లో ఇవాళ నుంచి కొత్త గ్రూపులు!

సరికొత్త అసమ్మతి వర్గం!

విలేఖర్లకి కొత్త "స్టోరీ!"

ఆ విలేఖర్ల సమావేశంలోనే తెలిసింది విజయకుమారికి –

తనకి తెలియకుండానే, తనని సంప్రదించకుండానే, తనకి సహాయమంత్రిగా, సదాశివబ్రహ్మంగారి పెద్ద కూతురు అంకితని నియమించారని!

ఆమెకి సంబంధించినంత వరకు పిడుగులాంటి వార్తే అది.

అదిగో! ఆ పాయింటు మీద ధ్వజం ఎత్తి, కొత్త అసమ్మతి వర్గానికి ఊపిరి పోసింది విజయకుమారి.

అసలు కారణం వేరే ఉందని అందరికీ తెలుసు.

✦ ✦ ✦

ఈ తమాషాలన్నీ ట్రయినింగ్‌లో ఉన్న రాజాకి ఎప్పటికప్పుడు తెలుస్తూనే వున్నాయి.

వాళ్ళకి సంబంధించిన శాఖా మంత్రిణే కాబట్టి సమాచారం చాలా సులభంగా వచ్చేస్తూ ఉండేది.

ఆ ట్రయినింగ్ అంతా ఆటలో అరటి పండులాగా ఉంది రాజాకి.

అతను అక్కడ నేర్చుకున్నది దాదాపు ఏమీ లేదనే చెప్పాలి.

పైగా, అతనే కొన్ని కొన్ని రకాల కొత్త టెక్నిక్స్ అక్కడి ఇన్‌స్ట్రక్టర్స్‌కి నేర్పించాడు.

వాళ్ళకి ఒక రోజున ఒక తమాషా ఫీట్‌ని చేసి చూపించాడు రాజా.

పోలీస్ మాన్యుయల్‌ని వెనక నుంచి ముందుకు ఒప్పగించేశాడు.

అదిరిపోయారు అందరూ.

ఆడుతూ పాడుతూ గడిచిపోయింది ట్రయినింగ్ పీరియడ్ అంతా!

ట్రయినింగ్ పూర్తి అయిపోయాక, తిరిగి వస్తున్నప్పుడు రాజాకి బాచ్‌మేట్ అయిన వాసు అన్నాడు – ఒక్కరోజు వాళ్ళ వూరికి వెళ్ళి ఆ తర్వాత డ్యూటీకి రిపోర్ట్ చేద్దామని.

సరేనన్నాడు రాజా.

ఇద్దరూ కలిసి వాసు వాళ్ళ వూరికి వెళ్ళారు.

వాళ్ళ ఇంట్లో వాసుని ఎట్లా ట్రీట్ చేశారు?

మామూలు మనిషిలా కాదు.

దేవలోకంలో నుంచి దిగివచ్చిన వాడిని చూసినట్లే చూశారు.

ఇంటిల్లిపాదీ అతని అడుగులకి మడుగులొత్తారు.

అతను మాట్లాడిన ప్రతి మాటా చెవులప్పగించి విన్నారు.

అతను వేసిన ప్రతి జోకుకీ నవ్వారు.

అక్కడ ఉండడం ఒక్కరోజే అని వాసు అన్నాడు గానీ రెండు రోజులు ఉండక తప్పలేదు వాళ్ళకి.

ఆ రెండ్రోజుల్లో పొద్దునా, మధ్యాహ్నం, రాత్రి కూడా వాసుకి యిష్టమయిన వంటకాలన్నీ యిష్టంగా వండి పెట్టారు.

రెండో రోజు మధ్యాహ్నం....

భోజనాలు అయ్యాయి.

హాల్లో పెద్ద జంబుఖానా పరిచింది వాసూ వాళ్ళ అమ్మ.

తమలపాకులు వేసుకుంటూ కొంతమంది కుర్చీల్లో కూర్చున్నారు.

కొంతమంది జంబుఖానా మీదే కూర్చున్నారు.

వాసూ వాళ్ళ అమ్మ తాంబూలం నములుతూ కాళ్ళు బారజాపి గోడకి జేరగిలబడి కూర్చుని ఉంది.

ఆమె పక్కన వాసూ వాళ్ళ కజిన్ ఒక అమ్మాయి పడుకుని వుంది.

వాసూ ముందు కాసేపు జంబుఖానా మీద కూర్చున్నాడు. ఆ తర్వాత వెనక్కి వాలి, వాళ్ళ అమ్మ ఒళ్ళో తల పెట్టుకుని, చాలా ఆరామ్‌గా పడుకున్నాడు.

వాళ్ళ అమ్మ చిరునవ్వుతో అతని జుట్టు నిమురుతోంది.

అప్రయత్నంగానే, ఆ దృశ్యాన్ని కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడు రాజా.

సన్నటి జెలసీ లాంటిది కలిగింది అతనికి.

కానీ, క్షణాలలోనే ఆ జెలసీ కరిగిపోయి, ఆ స్థానంలో అదో రకమయిన డల్ ఫీలింగ్ ఏర్పడింది.

ఒక అమ్మ.

ఆరామ్‌గా ఆ అమ్మ ఒళ్ళో తలపెట్టుకుని ఉన్న ఒక కొడుకు.

పెద్దాడయి, ప్రయోజకుడయిన కొడుకుని చూసి మురిసిపోతూ ఉన్న అమ్మ గర్వంగా, మురిపెంగా, ఆప్యాయంగా చూస్తూ కొడుకు తల నిమురుతూ, జుట్టు సవరిస్తున్న తల్లి.

అలా అమ్మ వళ్ళో పడుకున్నందుకు ఎంత అదృష్టవంతుడు ఈ వాసు!

ఎంత గొప్పగా ఫీలవుతుంటాడో?

అలాంటి అదృష్టం తనకీ జన్మకి లేదు కదా!

ఎందుకీ జన్మ! వెధవ జన్మ!

అసలూ, అమ్మ ఒళ్ళో పడుకున్నప్పటి ఫీలింగు ఎలా ఉంటుందీ?

ఆ ఫీలింగ్‌తో పోలిస్తే తను ఒలింపిక్స్‌లో మూడు మెడల్సు గెల్చుకున్నప్పటి ఫీలింగు కూడా దిగతుడుపేనేమో!

నెమ్మదిగా అక్కడ నుంచి లేచి, దొడ్లోకి వెళ్ళిపోయి అక్కడ పరధ్యానంగా నిలబడిపోయాడు రాజా.

ఆ రాత్రే బయలుదేరి హైదరాబాద్ వచ్చేశారు యిద్దరూ.

మర్నాడు పొద్దున్నే అర్పిత యింటికి వెళ్ళిపోయాడు రాజా.

అర్పిత ఒక్కతే ఉంది ఇంట్లో. అంకిత యిప్పుడు ఆ ఇంట్లో ఉండడం లేదు. మినిస్టరయ్యాక, గవర్నమెంటు బంగళాలోకి మారిపోయింది.

కనీసం అరవైమంది మనుషులు సుఖంగా కాపరం చెయ్యగలిగినంత పెద్ద బంగళా అది! ఎనిమిది బెడ్ రూములు వున్నాయి. ఎనిమిదిట్లోనూ ఎయిర్ కండిషనర్లు.

అంకిత ఆ బంగళాలో చేరాక ఎవరో చెప్పారుట.

ఆ ఇంటికి వాస్తు అంత సరిగా లేదని, ఆ వాస్తు లోపాలు గనక అలాగే వుంటే, అంకిత రాజకీయ జీవితానికి ఎదుగూ బొదుగూ వుండవుట! వాస్తు గనక సరిచేయిస్తే, కాబినెట్ మినిస్టర్ కావడమో, ముఖ్యమంత్రి కావడమో ఖాయమట!

వాస్తు గట్టిగా ఉండాలంటే నైరుతి వైపు బాగా "లోడ్" వుండాలిట. అందుకని అటువైపు మేడ మీద ఒక రూము ఎక్స్‌ట్రాగా కట్టించింది. మెట్లు ఈశాన్యంలో వున్నవి మార్పించి నైరుతికి తెచ్చింది ఇంకేవో చేసింది.

మొత్తానికి ప్రజల సొమ్ము పదిహేను లక్షల రూపాయలు ఆ బంగళా రీమోడలింగ్ కోసం ఖర్చు పెట్టించింది.

ప్రజలు కట్టిన పన్నులతో ప్రజల పనులు చెయ్యడానికి మాత్రం డబ్బు వుండదు!

కొత్తగా ఒక కుళాయి పెట్టడానికి డబ్బు ఉండదు.

కొత్తగా ఒక రోడ్డువెయ్యడానికి డబ్బు ఉండదు.

కొత్తగా ఒక చెత్తకుండీ పెట్టడానికి కూడా డబ్బు ఉండదు.

కానీ మినిస్టర్ల బంగళాల రిపెయర్లకి, ఎయిర్ కండిషనర్లకీ, నౌఖర్లకీ, చాకర్లకీ, విదేశ విహార యాత్రలకీ విదేశాల్లో వైద్యం చేయించుకోవడానికి మాత్రం డబ్బుకి ఏ మాత్రం లోటు వుండదు.

"మీ అక్కయ్య లేదా?" అని రాజా అడగ్గానే గబగబా యిదంతా చెప్పింది అర్పిత. ఆమెకి వళ్ళు మంటగా ఉంది అక్క వేస్తున్న వేషాలు చూస్తుంటే!

వెంటనే అన్నాడు రాజా.

"నేను యిప్పుడు యిక్కడికెందుకొచ్చానో తెలుసా? నీ ఒళ్ళో తలపెట్టుకుని పడుకోవడానికి!"

నవ్వింది అర్పిత.

"భలేవాడివే! ప్రేమ డైలాగులు కూడా చెంప మీద కొట్టినట్లు చెప్పడమేనా?"

"ఇలా వచ్చి కింద కూర్చో!" అన్నాడు రాజా, ఆజ్ఞాపిస్తున్నట్లు.

"బావుంది! ఎవరయినా చూస్తారు"

"అందరూ చూడాలి! నేనంటే యిష్టపడే ఒక మనిషి ఉందని అందరికీ తెలియాలి."

"అంతటితో ఊరుకుంటావా ఏం?"

"ఊరికే చీప్‌గా మాట్లాడకు!" అంటూ అర్పిత చెయ్యి పట్టుకుని లాగి, కింద కూర్చోపెట్టాడు రాజా. తను ఆమె ఒళ్ళో తల పెట్టుకు పడుకుని, దీర్ఘంగా శ్వాస తీసుకున్నాడు.

"ఇప్పుడు తృప్తిగా వుంది నాకు" అన్నాడు రాజా. అతనికి తెలియకుండానే అతని గొంతు కొద్దిగా వణికింది.

అప్రయత్నంగానే అతని జుట్టులో వేళ్ళు పోనిచ్చి, ఆర్ద్రంగా చూస్తూ, తల నిమిరింది అర్పిత.

"అంతా ఆమెలాగే చేస్తున్నావ్" అన్నాడు రాజా.

అతను అంటున్నది అర్థం కాకపోయినా నవ్వుతూ చూసింది అర్పిత.

కళ్ళు మూసుకుని కాసేపు అలాగే ఉండిపోయాడు రాజా. తర్వాత లేచి కూర్చున్నాడు.

"థాంక్స్!" అన్నాడు సిన్సియర్‌గా.

మళ్ళీ నవ్వింది అర్పిత. "అదేమిటి? పరాయివాడిలాగా?"

అర్పిత చేతిని తన చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు రాజా.

ఆమె గాజులు రహస్యాలు చెబుతున్నట్లు గలగల్లాడాయి.

రాజా అన్నాడు. "ఇంక మనం పెళ్ళి చేసుకుని కాపరం పెట్టడం మంచిదను కుంటాను."

ఆ అమ్మాయి కళ్ళలో కొద్దిగా సిగ్గు కనబడింది.

"నీ ఇష్టం!" అంది వినీవినబడనట్లు.

"సింపుల్ మ్యారేజ్! రిజిస్ట్రార్ ఆఫీసులో! తర్వాత చాలా దగ్గరి వాళ్ళకి డిన్నరు! ఓకే?" అన్నాడు రాజా. అప్పటికప్పుడే ప్రోగ్రాం ఫిక్స్ చేసేస్తూ.

"పెళ్ళవగానే తిరుపతి వెళ్ళొద్దాం ఏం?" అంది అర్పిత.

"గ్రాంటెడ్! యిప్పుడు రిజిస్ట్రార్ ఆఫీసుకి యిద్దరం కలిసి వెళ్ళాలేమో – ఒక నెల నోటీసు ఇవ్వాలిగా!"

"అప్పుడే అన్నీ ఎన్‌క్వయిరీ చేసి పెట్టేశావా ఏం?"

"తొందర నాకేనా? నీకు లేదా?"

నవ్వింది ఆమె.

✦ ✦ ✦

ఒళ్ళు తేలికైపోయి, మేఘాల్లో నడుస్తున్నట్లు వాసు దగ్గరికి వెళ్ళిపోయాడు రాజా.

ఇప్పుడు తను వాసూని ఈక్వల్ టెర్మ్స్‌లో ఎదుర్కొని మాట్లాడగలడు.

అతనికి అమ్మ వుండొచ్చు.

తనకి అర్పిత వుంది.

అర్పితే తనకు అన్నీ!

ఏమిటా శ్లోకం?

కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ, భోజ్యేషు మాతే, శయనేషు రంభా....

తను అదృష్టవంతుడు. నిజంగానే!

రాజా! యూ ఆర్ ఏ లక్కీ బగర్! రియల్లీ!

వెళ్ళగానే గుమ్మంలోనే కనబడ్డాడు వాసు.

అతని మొహంలో భావం చిత్రంగా వుంది.

అతని మొహంలోకి పరిశీలనగా చూస్తూ "ఏమిటి?" అన్నాడు రాజా.

ఏం మాట్లాడకుండా, జేబులోనుంచి ఒక కవరు తీసి రాజాకి అందించాడు వాసు.

కవరు విప్పి చూశాడు రాజా.

లోపల ఒక లెటర్.

ఒక కలర్ ఫోటో.

ఆ కలర్ ఫోటో అర్పితది.

లెటరేమో చాలా ఖరీదయిన ఎగ్జిక్యూటివ్ బాండ్ పేపర్ మీద ప్రింట్ చేసి వుంది.

అందులో నాలుగే లైన్లు.

"మీకు మీ భార్య దగ్గర సుఖం దొరకడం లేదా?

అయితే నా దగ్గరికి రండి!

అందాన్ని మించిన టెక్నిక్స్!

టెక్నిక్స్‌ని మించిన అందం!

100 శాతం శాటిస్‌ఫాక్షన్ గ్యారంటీ!"

ఒక్కసారిగా ఊపిరాగిపోయినట్లయిపోయింది రాజాకి.

ఆ తర్వాత, క్రమంగా అతని మొహంలో కాఠిన్యం చోటు చేసుకుంది.

అతని కళ్ళు ఎర్రబడ్డాయి.

"ఎప్పుడొచ్చింది ఇది నీకు?" అన్నాడు వాసుతో.

"నేను వచ్చేసరికే ఇది నా లెటర్ బాక్స్‌లో వుంది."

ఆ ఉత్తరాన్ని మళ్ళీ పరీక్షగా చూశాడు రాజా.

కలర్ ఫోటో, ఖరీదైన ప్రింటు. ఉత్తరం కూడా ప్రింటు ఉంది కాబట్టి చాలా కాపీలు తీసి, అనేక మందికి పంపి వుండాలి.

రాజా అంత అప్‌సెట్ అయిపోవడాన్ని వాసు చిత్రంగా గమనిస్తూ అన్నాడు –

"క్లియర్ కేస్ ఆఫ్ వెనెజెన్స్! ఆ అమ్మాయి మీద ఎవరికో భరించలేనంత కోపమో, అసూయో ఉండితీరాలి! లేకపోతే ఇంతటి అఘాయిత్యం చేస్తారనుకోను!"

మాట్లాడకుండా తల పంకించాడు రాజా.

ఎవరు చేశారో గ్రహించడం కష్టం కావచ్చుగానీ, దీని ఎఫెక్టు ఎంత దారుణంగా ఉంటుందో గ్రహించడం మాత్రం తేలికే!

ఇప్పటికే, ఇలాంటి ఉత్తరమే, అర్పిత పేరుమీద, అర్పిత ఫోటోతో సహా అనేక మందికి వెళ్ళి వుంటుంది.

ఆ ఉత్తరాలు అందుకున్న వాళ్ళలో కొంతమందైనా కనీసం కుతూహలం కొద్దీ అర్పిత ఇంటికి వెళతారు.

ఆ వెళ్ళిన వాళ్ళలో అతి కొద్దిమంది ఆమెతో అసభ్య ప్రేలాపన మొదలెట్టవచ్చు!

విన్న వెంటనే ఎడం కాలి చెప్పు తీస్తుంది అర్పిత.

సందేహంలేదు!

కానీ –

అలా ఎంత మంది మీద?

అలా ఎంత కాలం పాటు?

"వాసూ! నాకు అర్జెంట్ పని వుంది! నేను వెళ్ళొస్తా!" అనేసి, వాసు జవాబు కోసం కూడా ఎదురు చూడకుండా అక్కడనుంచి చరచరా వెళ్ళిపోయాడు రాజా.

ఆ వెళ్ళడం వెళ్ళడం నేరుగా అర్పిత ఇంటికే వెళ్ళిపోయాడు.

అసహనంగా కాలింగ్ బజర్ నొక్కాడు.

లోపల బజర్ మోగుతున్న శబ్దం వినబడుతోంది.

కానీ తలుపు తియ్యలేదు ఎవ్వరూ.

మళ్ళీ నొక్కాడు బజర్.

నో రెస్పాన్స్!

రెండు నిమిషాలు ఆగి మళ్ళీ నొక్కాడు.

నో రెస్పాన్స్!

అర్పిత ఇంట్లో లేదా? లేకపోతే బాత్‌రూంలో ఉందా?

కొద్ది నిమిషాలు ఆగి బజర్ నొక్కాడు మళ్ళీ.

అప్పుడు వినబడింది అడుగుల చప్పుడు. చరచరా నడిచి వస్తున్న సవ్వడి.

విసురుగా తలుపు తెరుచుకుంది.

ఎదురుగా అర్పిత! ఆమె కళ్ళు ఎర్రగా వున్నాయి.

అప్పుడర్థమయ్యింది రాజాకి – అర్పిత తలుపు తియ్యడం ఎందుకంత ఆలస్యం అయ్యిందో?

ఇప్పటి దాకా ఏడుస్తూ ఉండి వుండాలి ఆమె.

అంటే, అప్పుడే మొదలయిపోయిందన్న మాట "గిరాకీ"ల తాకిడి!

ఇప్పుడు తలుపు కొట్టింది కూడా ఎవరో అలాంటి అలగారకమే అని అనుకుని ఉండవచ్చు అర్పిత.

"అర్పితా!" అన్నాడు ఆర్ద్రంగా.

రాజాని చూడగానే వికసించింది ఆమె మొహం.

మరుక్షణంలోనే ఆమె పెదిమలు ఒణికాయి. కళ్ళెంబడి నీళ్ళు తిరిగాయి.

"రా!" అంది రుద్ధమైన కంఠంతో అంటూనే లోపలికి దారితీసింది.

రాజా లోపలికి రాగానే సోఫాలో కూలబడిపోయింది అర్పిత. చేతుల్లో మొహం దాచుకుని వెక్కిళ్ళు పెట్టడం మొదలెట్టింది.

ఆమె పక్కనే కూర్చున్నాడు రాజా. మృదువుగా ఆమె వీపు నిమిరాడు.

వెక్కిళ్ళు ఎక్కువయ్యాయి.

ఆమెని కాసేపు అలాగే ఏడవనిచ్చాడు రాజా.

కొద్ది నిమిషాలు గడిచి, వెక్కిళ్ళు తగ్గిన తర్వాత, హఠాత్తుగా తల ఎత్తి అంది అర్పిత.

"నేను యింక బతికి వుండడం అనవసరం అనుకుంటా"

"అంత కష్టం ఏం వచ్చింది యిప్పుడు?" అన్నాడు రాజా అనునయంగా.

"ఏం జరిగిందో నీకు తెలియదు."

"నాకు అంతా తెలుసు!"

"నేనింక ఏ మొహం పెట్టుకుని జనం మధ్యకి రాగలను?"

"జరిగిన దాంట్లో నీ తప్పేమన్నా ఉంటే కదా, నువ్వు సిగ్గుపడాల్సింది?"

"అరిటాకు, ముల్లూ సామెత నీకు తెలియదా ఏం?"

"లోకానికి భయపడే వాళ్ళ విషయంలోనే ఆ సామెత నిజం అవుతుంది. నువ్వు అలాంటిదానివనుకోను."

"ఏదో చెప్తావ్!"

కొద్ది క్షణాలు మౌనం.

తర్వాత నెమ్మదిగా అన్నాడు రాజా.

"ఇంకో విషయం!"

చటుక్కున అంది అర్పిత. "నువ్వు చెప్పబోయేది నాకు తెలుసు! అసలు నేనే చెబుదామనుకుంటున్నాను. ఆ సంగతి. నువ్వు నన్ను పెళ్ళిచేసుకోనక్ఖర్లేదు. నువ్వేం బాధపడకు! నేను అర్థం చేసుకోగలనులే."

రాజా మొహంలో నవ్వు కనబడింది.

"నవ్వు కూడా ఎందుకు? నా బతుకు యిట్లా అయిందనా?" అంది అర్పిత.

తక్షణం అర్పితని బలంగా దగ్గరికి లాక్కుని ఆమె పెదిమలని తన పెదిమలతో మూసేశాడు రాజా. కొద్ది క్షణాలపాటు ప్రతిఘటించింది అర్పిత.

తర్వాత ప్రతిఘటన మానేసి పెదిమలు అతనికి అప్పగించేసి, అతని చేతుల్లో ఒదిగిపోయింది.

ఇంకాసేపటి తర్వాత అతని పట్టు విడిపించుకుని, తల వెనక్కి వాల్చి, నీళ్ళలో నుంచి పైకి వచ్చిన దానిలా ఒక్కసారి దీర్ఘంగా శ్వాస తీసుకుంది అర్పిత.

అప్పుడన్నాడు రాజా.

"అసలైన ప్రణయం అంటే ఏమిటో తెలుసా? ప్రళయం వచ్చినా చలించకుండా ఉండడం! అవునా? అర్పితా! అనుమానాలూ, అవమానాలూ, ఇవన్నీ నాకు కొత్తకావు, అన్నిటికీ ఇమ్యూన్ అయిపోయాను నేను. అన్నీ అనుభవించిన వాడిని గనక నీ

పరిస్థితి పూర్తిగా అర్థం చేసుకోగలను. నీకు నేను తోడు అర్పితా, నాకు నువ్వు తోడు. రా! ఇద్దరం కలసి ఈ లోకాన్ని వెక్కిరిద్దాం. కమ్ మైడియర్!"

అతను చెప్పిన దాంట్లో పెద్ద హాస్యం ఏమీలేదు. కానీ ఆ మాటలు అర్పితకి చాలా రిలీఫ్ కలిగించాయి. ఆ రిలీఫ్ వల్ల టెన్షన్ అంతా తగ్గిపోయి, నవ్వు రూపంలో బయటపడిపోయింది. ఉధృతంగా నవ్వొచ్చింది అర్పితకి.

నవ్వుతూంటే కళ్ళెంబడి నీళ్ళు తిరిగాయి కూడా.

తదేకంగా ఆమె మొహంలోకి చూస్తూ అన్నాడు రాజా.

"నవ్వినా కన్నీళ్ళే వస్తాయి కదూ!"

తన మొహాన్ని అతని షర్టుకి రాసి, కన్నీళ్ళు తుడుచుకుంది అర్పిత.

ఇప్పుడామె కళ్ళు క్లియర్‌గా ఉన్నాయి.

అంతలోనే కాలింగ్ బజర్ మోగింది.

విహ్వాలంగా చూసింది అర్పిత.

"మళ్ళీ ఎవడో వచ్చాడు!" అంది.

గట్టిగా మాట్లాడవద్దని సైగ చేశాడు రాజా. తర్వాత నెమ్మదిగా అన్నాడు -

"నీ బెడ్‌రూంలోకి పద!"

"ఎందుకు?" అంది అర్పిత అనుమానంగా.

"ఇప్పుడు నిన్నేం చెయ్యనులే! వచ్చిన వాడి పని పట్టాలి!"

ఇద్దరూ అర్పిత బెడ్‌రూంలోకి వెళ్ళారు.

కాలింగ్ బజర్ నిర్విరామంగా మోగుతూనే ఉంది.

షర్టూ, ప్యాంటూ విప్పేశాడు రాజా.

"ఊఁ! అర్జెంటుగా నాకు చీరె కట్టు."

"ఛీ! పాడు! ఇవేం వేషాలు?" అంది అర్పిత సిగ్గుపడుతూ.

"పాండవ వనవాసంలో భీముడు వెయ్యలా ద్రౌపది వేషం! అట్లాంటిదే."

బయట మళ్ళీ కాలింగ్ బజర్ మోత.

వార్డ్‌రోబ్ దగ్గరికి నడిచాడు రాజా.

"ఏం కట్టుకోను?" అన్నాడు చీరెలు చిందరవందర చేసేస్తూ.

కాసేపటి తర్వాత ఎర్రచీరె, ఆకుపచ్చ జాకెట్టు, నీలం పరికిణీ నల్ల బ్రా తీశాడు.

"అదెందుకు! చిరిగిపోతుంది! వద్దు!" అంది అర్పిత బ్రాని లాక్కుని బీరువాలో పడేస్తూ.

"నా చెస్టు కంటే, నీ చెస్టే ఎక్కువ సైజు అయి ఉండాలే" అన్నాడు రాజా నవ్వుతూ. "ఊఁ! చీరెకట్టు!"

అతనికి గబగబ చీరె కట్టింది అర్పిత.

ఎలా కుదురుతుందీ? కుదరలేదు! అస్తవ్యస్తంగా ఉంది అది.

దానికితోడు ఒకదానికొకటి ఏమాత్రం మ్యాచ్‌కాని ఎర్రచీరె, పచ్చ జాకెట్టు, నీలం పరికిణీ!

అది కూడా చాలదన్నట్లు పెదిమలకి లిప్‌స్టిక్ పూశాడు రాజా. కళ్ళకి ఇంత కాటుక పులిమాడు. స్టిక్కర్ బొట్టు ఒకటి పెట్టాడు.

ఒక్క అడుగు వెనక్కి వేసి, అతన్ని పరీక్షగా చూసి అంది అర్పిత.

"దడుచుకుంటాడేమో పాపం!"

"వాడికి యివ్వాళ మూడిందిలే!" అంటూ కొంగు తల మీదికి లాక్కుని, తలుపు వైపు నడిచాడు రాజా.

తలుపు తెరిచీ తెరవగానే కనబడ్డాడు కృష్ణాజీ.

అదిరిపడి, ఒక్క అడుగు వెనక్కి వేశాడు రాజా.

రాజాని ఒక్క క్షణంసేపు గుర్తుపట్టలేదు కృష్ణాజీ.

తర్వాత అన్నాడు –

"ఏమిటీ వాలకం?"

జరిగిందంతా చెప్పాడు రాజా.

కృష్ణాజీ మొహంలో ఆగ్రహం కనబడింది.

రాజా అన్నాడు –

"నన్నడిగితే.... ఈ వెధవ పని వెనక వున్న ఈవిల్ జీనియస్ కీర్తే అయి వుంటాడు."

"అందులో సందేహం ఏముంది?" అన్నాడు కృష్ణాజీ.

"ఇంక ఊర్కోవడానికి వీల్లేదు! డ్రాస్టిక్ యాక్షన్ తీసుకోవాల్సిందే వాడి మీద."

"వాడి మీద ఎంత సీరియస్ యాక్షన్ తీసుకున్నా అర్పితకి వచ్చిన చెడ్డపేరు పోదుగా!" అన్నాడు రాజా.

"అవును!" అన్నాడు కృష్ణాజీ సాలోచనగా.

రాజా అన్నాడు "ఇందుకు విరుగుడుగా నేనొకటి చెయ్యాలి తక్షణం."

"ఏమిటది?"

"కీచక వధ!" అన్నాడు రాజా, అప్పుడే గేటు దగ్గరికి వస్తున్న ఒక శాల్తీని చూపిస్తూ.

"చంపేస్తావా ఏమిటి వాణ్ణి?" అన్నాడు కృష్ణాజీ ఆదుర్దాగా.

"చంపను! కానీ చావుకంటే దారుణమైన స్థితికి తెస్తాను."

"ఏమిటది?"

"మీకు తెలుస్తుందిగా! ప్రస్తుతం మీరిక్కడ ఉండకుండే వుంటే మంచిది. వెనకదారి నుంచి వెళ్ళిపోండి. ప్లీజ్."

లోపలికి వచ్చి, తలుపు వేస్తూ అన్నాడు కృష్ణాజీ

"రాజా! డోన్ట్ టేక్ లా ఇన్ టూ యువర్ ఓన్ హాండ్స్! ఆ సంగతి నీకు గుర్తు చెయ్యఖ్ఖర్లేదనుకుంటాను"

స్మార్ట్‌గా సెల్యూట్ చేశాడు రాజా.

"నా డ్యూటీ ఏమిటో, నా పరిధులు ఏమిటో కూడా నాకు బాగా తెలుసు సర్!"

"ఓకే! ప్రొసీడ్!" అంటూ వెనక గుమ్మంలోనుంచి వెళ్ళిపోయాడు కృష్ణాజీ.

వెంటనే కాలింగ్ బజర్ మోగింది.

మొహం కనబడకుండా పమిటకొంగు లాక్కుంటూ తలుపు తీశాడు రాజా.

ఎదురుగా ఒక వ్యక్తి వున్నాడు. వ్యసనాలతో పుచ్చిపోయినట్లు ఉన్నాడతను. ముప్ఫయ్యేళ్ళవాడి శరీరానికి అరవైఏళ్ళవాడి తలకాయ అతికించినట్లు ఉంది.

"అర్పిత...." అన్నాడు ఆశగా.

"నేనే" అన్నాడు రాజా ఆడగొంతుతో. "రండి"

"ఏం పర్సనాలిటీ?" అన్నాడు ఆ మనిషి లొట్టలేస్తూ.

అతను లోపలికి రాగానే తలుపేశాడు రాజా.

"కూర్చోండి"

కూర్చున్నాడా వ్యక్తి. ఆబగా రాజా వేపు చూడడం మొదలెట్టాడు.

రాజా అన్నాడు –

"నేను చెప్పేది శ్రద్ధగా వినాలి. అర్థమయ్యిందా? అప్పుడే మంచి ఎంజాయ్‌మెంట్! ఏం?"

తదేకంగా చూస్తూ తలూపాడు అతను.

"శ్రద్ధగా వింటున్నావా? చెవులప్పగించి వింటున్నావు నువ్వు! అవునా? నేను చెప్పే ప్రతిమాటా అతి జాగ్రత్తగా వింటున్నావు. ఇదిగో యిదేమిటో చూశావా?"

కళ్ళార్పకుండా చూస్తున్నాడా మనిషి.

రాజా చేతిలో ఇప్పుడు ఒక బ్రా వుంది. అర్పిత బ్రా.

ఆ బ్రాని గడియారంలోని పెండ్యులంలా అటూ ఇటూ వూపడం మొదలెట్టాడు రాజా.

బ్రాతోపాటు ఆ మనిషి కనుగుడ్లు కూడా అటూ ఇటూ తిరుగుతున్నాయి.

కొద్దిక్షణాలలోనే హిప్నాటిక్ ట్రాన్స్‌లోకి వెళ్ళిపోయాడతను.

బ్రాని అటూ ఇటూ వూపుతూనే డల్‌గా, మోనాటనస్‌గా చెప్పడం మొదలెట్టాడు రాజా.

"ఈ బ్రాసరీ ఎవరిదో తెలుసా? ఒక అందమైన ఆడపిల్లది. ఒకప్పుడు బ్రతికి వుండి యిప్పుడు ఆత్మగా మారిన ఒక ఆడపిల్లది. అంటే నేనే! అర్థమయ్యిందా? అహహహ" ఒక్కసారి రాజా గొంతు బొంగురుగా మారి, మళ్ళీ అంతలోనే నాజూకైన ఆడపిల్ల గొంతులా మారిపోయింది.

"అత్యాచారం పాలయి, అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకున్న అమ్మాయి ఆత్మని! ఇప్పుడు కామినీ పిశాచాన్ని" అన్నాడు రాజా.

ఈ పిల్ల ఇంత ఏపుగా, యింత దృఢంగా ఎందుకుందో ఆ అచేతనావస్థలోనే ఆ మనిషికి అర్థమైంది.

"ఒక మొగవాడు చేసిన అన్యాయంవల్లే యివాళ నాకీ స్థితి పట్టింది. అందుకే ఇవాళ మొగజాతి మీద ప్రతీకారం తీర్చుకుంటున్నా. అందుకే ఈ ఫోటోలు, ఈ వుత్తరాలు, ఈ వ్యవహారం అర్థమైందా? మొదటగా వచ్చిన మొగాడివి నువ్వే. నీ అంతు తేలుస్తారా! కోరి వచ్చావుగా! బస్తీమే సవాల్! బట్టలిప్పేయ్" అన్నాడు రాజా.

ఆ వ్యక్తి కళ్ళలో ఏ భావం కనబడలేదు. ఉలుకూ పలుకూ లేకుండా కూర్చునే వున్నాడు.

"బట్టలిప్పరా!" అన్నాడు రాజా.

లేచి వినయంగా బట్టలు విప్పేశాడతను. కమిలిపోయిన వంకాయలాంటి ఒళ్ళు.

వాడి దగ్గరికి వెళ్లి, ఎడం చేతిని పట్టుకుని, మునక్కాడని విరిచినట్లు సునాయాసంగా విరిచేశాడు రాజా.

వాడు విలవిల్లాడటం మొదలెట్టాడు.

"అహహహా! కామినీ పిశాచం కసి తీర్చుకుంది. అర్థమయిందా? అహహహా! కామినీపిశాచం కసి తీర్చుకుంది. ఇవాళ్టికి నీ పనిష్‌మెంటు పూర్తయింది. రేపు మళ్ళీ వస్తా నీ యింటికి. లే! మేలుకో! మెలకువ తెచ్చుకో! ఆ! అదీ....అలాగే.... మెల్లిగా....మెల్లిగా...." అంటున్నాడు రాజా.

హిప్నాటిక్ ట్రాన్స్‌లో నుంచి స్పృహలోకి వచ్చాడా మనిషి.

స్పృహలోకి వచ్చి ఎదురుగుండా వున్న నిలువెత్తు విగ్రహాన్ని చూడగానే "అమ్మో! కామపిశాచి" అంటూ వెర్రికేకపెట్టాడు.

అప్పుడు అతనికి గుర్తువచ్చింది విరిగిన చెయ్యి తాలూకు బాధ. వలవల ఏడుస్తూ "కామపిశాచి! కామపిశాచి" అని పెడబొబ్బలు పెడుతూ పరిగెత్తబోయాడు అక్కడ నుంచి.

అతను రోడ్డు మీదకు మళ్ళీ వెళ్ళగానే అతని చుట్టూ ఒక గుంపు పోగయింది.

ఈలోగా అర్పిత గదిలో నుంచి బయటికి వచ్చింది.

"ఏం చేశావ్ వాడిని?" అంది.

"ఒక పిశాచం ఈ వ్యవహారమంతా నడిపిస్తోందని వాడి బుర్రకి ఎక్కేలా చేశాను హిప్నాసిస్ సాయంతో. ఈ సజెషన్ వాడి మనసులో నాటుకుపోయింది. ఇంక జన్మలో మర్చిపోడు. నోరుతెరిస్తే ఇదే మాట చెపుతుంటాడు. ఇలాంటి నీలివార్తలు ఆఘమేఘాలమీద అందరికీ అందిపోతాయి. అందులోనూ దెయ్యం కథ కదా! ఇంకా స్పీడుగా స్ప్రెడ్ అయిపోతుంది న్యూస్. ఇంక లక్షకోట్ల ఉత్తరాలు వెళ్ళనీ! ఒక్కడు కూడా ధైర్యం చెయ్యడు యిటు రావటానికి. వీడి చెయ్యి అతుక్కునే లోపల జరిగినదానికి కౌంటర్‌గా జరగాల్సిన ప్రచారం జరిగిపోతుంది" అన్నాడు రాజా.

"అబ్బ! ఏం క్రిమినల్ బ్రెయిను?" అంది అర్పిత నవ్వుతూ. ఆమెకి పూర్తి రిలీఫ్ కలిగిందిప్పుడు.

మళ్ళీ అంది –

"నువ్వు గనుక యిప్పుడు వచ్చి వుండకపోతేనా, ఎంతగా అప్‌సెట్ అయిపోయి వుండేదాన్నో నేను! నిజంగా పిచ్చిపట్టి వుండేది అనుకో! థాంక్స్ రాజా" అంది సిన్సియర్‌గా.

✦ ✦ ✦

ఆ మహానగరంలో అదొక ఫైవ్‌స్టార్ హోటల్.

అందులో ప్రెసిడెన్సియల్ సూట్‌లో వుంటున్నాడు కీర్తి.

కీర్తి! ది ప్రిన్స్ ఆఫ్ డార్క్‌నెస్.

మంచంమీద నుంచి లేచి, టైం చూసుకున్నాడు కీర్తి. పొద్దున ఆరు గంటలు.

బజర్ నొక్కి రూం సర్వీస్ రిక్వెస్ట్ చేశాడు. స్టీవార్డ్ రాగానే చాలా లైట్‌గా బ్రేక్‌ఫాస్ట్ ఆర్డర్ చేస్తూ, బ్రెడ్‌టోస్ట్, ఆరంజ్ జ్యూస్ మాత్రం చెప్పాడు.

బ్రేక్‌ఫాస్ట్ వచ్చేలోపల షేవ్‌చేసుకుని స్నానం చేశాడు కీర్తి. నల్ల షర్టూ, నల్ల ఫ్యాంట్ వేసుకున్నాడు. ఫెర్‌ఫ్యూమ్ స్ప్రే చేసుకుంటూ అద్దంలోకి చూసుకున్నాడు. సన్నగా, దృఢంగా వున్న అతని పర్సనాలిటీ అతనికే బాగా నచ్చింది.

లైట్‌గా ఆర్డర్ చేసిన బ్రేక్‌ఫాస్ట్‌లో మళ్ళీ సగం వదిలేశాడతను. అతనికి తిండి మీద పెద్ద ఇంట్రెస్ట్ లేదు.

చెడు చెయ్యడంలోనే అతనికి కడుపు నిండినట్లనిపిస్తుంది. చెడు చెయ్యడంలోనే అద్భుతమైన థ్రిల్ దొరుకుతుంది అతనికి. రిలీఫ్ దొరుకుతుంది.

హోటల్ లాబీలోకి వచ్చాడు కీర్తి.

అప్రయత్నంగానే అతని కళ్ళు రిసెప్షన్ కౌంటర్ వేపు తిరిగాయి.

కళ్ళు తిరిగేటంత అందగత్తె కాకపోయినా, కంటికి నదురుగా, కళగా కనబడుతున్న ఒక అమ్మాయి రిసెప్షన్‌లో కూర్చుని వుంది. మొహంలో మర్యాదా, మన్ననా కనబడుతున్నాయి. మాటిమాటికీ పమిట సవరించుకుంటోంది.

ఆమెను చూసీ చూడగానే చెప్పెయ్యవచ్చు.

చాలా గౌరవప్రదమైన మధ్యతరగతికి చెందిన అమ్మాయి అయి వుంటుందని.

కీర్తి అనుకున్నాడు.

"ఇలా మిడిల్ క్లాస్ మొరాలిటీతో కొట్టుకు చచ్చిపోతూ ఉండేవాళ్ళను చెడగొడితేనే గదా మజా? వాట్ కీర్తీ? వాట్ సేయూ?"

అలా అనుకుంటూ, చిన్నగా నవ్వుకుంటూ ఆ అమ్మాయి దగ్గరికి నడిచాడతను.

కౌంటర్ మీదికి వంగి, మృదువుగా అన్నాడు –

"మీరు చాలా బాగుంటారు"

ఇబ్బందిగా, మొహమాటంగా చిరునవ్వు నవ్విందా అమ్మాయి. తన పేరు మాలతి. ఇలాంటి ఉద్యోగంలో చేరడం తప్పయిపోయిందేమో అని అనిపించింది మాలతి మనసుకి. ఈ ఉద్యోగంలో ఇలాంటి మనుషులు తరచుగా తగులుతూనే వున్నారు తనకి.

కానీ తప్పదు.

తన కుటుంబ పరిస్థితులు –

తనమీద ఆధారపడ్డ జీవితాలు.

కాలే కడుపులు, తినే నోళ్ళు.

చాలా ప్లెజంట్‌గా వుండే తన పర్సనాలిటీని చూసే ఈరిసెప్షనిస్టు ఉద్యోగం యిచ్చారని అర్థమైపోతూనే వుంది.

అలాంటప్పుడు అతను తన అందాన్ని పొగిడితే ఇంతగా బాధపడిపోతే ఎలా?

కీర్తి అన్నాడు చాలా మృదువుగా.

"ఇవాళ నాతో స్పెండ్ చెయ్యకూడదూ?"

ఉలిక్కిపడింది మాలతి.

ఆ అమ్మాయి భయాన్ని ఎంజాయ్ చేస్తూ గొంతు ఇంకొంచెం తగ్గించాడు కీర్తి.

"పదివేలు ఇస్తాను.'

మాలతి కోపంగా చూసింది.

"నేనలాంటిదాన్ని కాను" అంది పదునుగా.

ఇరవై వేలు"

"ప్లీజ్! హద్దుమీరి మాట్లాడకండి"

నవ్వాడు కీర్తి.

"పాతికవేలు?"

ఇంక మాట్లాడటం తనకి ఇష్టంలేనట్లు తలవంచుకుని తన పని తను చూసుకోవడం మొదలెట్టింది మాలతి.

"బాగా ఆలోచించుకో" అని అక్కడ నుంచి కదిలాడు కీర్తి.

పావుగంటదాకా తల ఎత్తి చూడడానికి ధైర్యం చాలలేదు మాలతికి.

ఆ తర్వాత చూస్తే –

ఎదురుగా ఉన్న సోఫాలోనే వెనక్కి జారగిలబడి కూర్చుని ఉన్నాడు కీర్తి.

డార్క్ గ్లాసెస్ పెట్టుకుని ఉండడంవల్ల అతను ఎటు చూస్తోందీ తెలియడం లేదు.

కానీ అతను తదేకంగా తనవైపే చూస్తూ ఉండి ఉంటాడని మాత్రం రూఢి అయిపోయింది మాలతికి.

మెల్లిమెల్లిగా అతని చుట్టూ మంది మూగడం మొదలెట్టారు.

మాలతి మళ్ళీ తల వంచుకున్నా కూడా అక్కడి సందడి ఆమె చెవుల్లో పడుతూనే వుంది.

అతను చాలా ఇన్ఫ్లుయెన్షియల్ పర్సన్ అని ఆమెకి అర్థమైపోయింది. ఎవరెవరో వస్తున్నారు. అతనికి విష్ చేస్తున్నారు. సలాములు కొడుతున్నారు.

అతను వాళ్ళని పాట్రనైజ్ చేస్తున్నట్లు, వాళ్ళని ఉద్ధరిస్తున్నట్లూ, మెహర్బానీ చేస్తున్నట్లూ గొంతుపెట్టి మాట్లాడుతున్నాడు. హొటల్ స్టాఫ్‌లో సగం మంది అతని ప్రతి అవసరాన్నీ కనుక్కుంటూ, అడుగులకి మడుగులొత్తినట్లు ప్రవర్తిస్తున్నారు.

అతను అక్కడే కూర్చుని సగం వ్యవహారాలు సెటిల్ చేసుకున్నాడు. తన కారు రెడీ చెయ్యమని ఒక బాయ్‌తో కబురంపించి, తర్వాత మాలతి దగ్గరికి వచ్చాడు.

"ముప్ఫయ్ వేలు! ఏమంటావ్?" అన్నాడు నవ్వుతూ.

నవ్వి ఊరుకుంది మాలతి. అతను అమర్యాదగానే మాట్లాడుతున్నా తను మర్యాద ఇవ్వక తప్పదు. ఇది తన డ్యూటీ.

కాదు! క్వశ్చన్ ఆఫ్ సర్వైవల్!

కీర్తి వెళ్ళిపోయాడు.

మళ్ళీ మధ్యాహ్నం వచ్చాడు.

అతను వస్తూనే మళ్ళీ సందడి మొదలయ్యింది.

కీర్తి కౌంటర్ దగ్గరికి వచ్చి రూం కీస్ తీసుకుంటూ గుసగుసగా అన్నాడు "యాభై వేలు! నేను వదిలిపెట్టే రకాన్ని కాను."

కళ్ళు దించుకుని, తన గోళ్ళ వైపు చూసుకుంటూ ఉండిపోయింది మాలతి.

"ఇటీజ్ జస్ట్ మాటర్ ఆఫ్ టైం. నువ్వు మనసు మార్చుకుంటావు. నాకు తెలుసు" అంటూ లిఫ్టు వైపు నడిచాడు కీర్తి.

మాలతి పక్కనే ఉన్న కాషియర్ ఇదంతా గమనించి అడిగింది.

"పెద్ద ఆఫరా?"

జవాబు చెప్పడానికి కూడా చిన్నతనమనిపించి ఏం మాట్లాడకుండా ఉండి పోయింది మాలతి.

"ఫూలిష్‌గా వదిలేసుకోకు. ఇక్కడ ఇలాంటివన్నీ మామూలే. మడి కట్టుకు కూర్చుంటే ఒరిగేది ఏం ఉండదు" అంది క్యాషియర్.

"లీవ్ మీ ఎలోన్" అంది మాలతి అసహనంగా.

"అతను స్మగ్లర్ కూడా. లాస్ట్ టైం నాకు డైమండ్ రింగ్ ప్రెజెంట్ చేశాడు. వర్తు వన్ లాక్" అంది క్యాషియర్.

దానికి జవాబు చెప్పలేదు మాలతి. కానీ అనిపించింది.

లక్షరూపాయలు!

ఒక సగటు మనిషి ఒక జీవిత కాలంలో సంపాదించగలిగిన డబ్బు!

రాత్రికి స్పెషాలిటీ రెస్టారెంట్‌లో డిన్నర్ తీసుకున్నాడు కీర్తి.

మామూలే!

సూప్ – ఒక నాన్ – ఒక కర్రీ.

అతనికి తిండిమీద బొత్తిగా ఇంట్రెస్ట్ లేదు.

తింటున్నంతసేపూ మాలతి గురించే ఆలోచిస్తున్నాడు అతను.

ఆ అమ్మాయి ఫక్తు ఫామిలీ టైపు.

కలియుగ సీతే! అందుకే తనకింత గ్లామరు కలిగింది.

డిన్నర్ అయ్యాక, షాంపేన్ గ్లాసుని చేతిలో పట్టుకుని, ఆరారా సిప్ చేస్తూ మళ్ళీ కౌంటర్ దగ్గరికి వచ్చాడు కీర్తి. డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్ళడానికి రెడీగా ఉంది మాలతి.

ఫ్యాంటు జేబులో ఎడం చెయ్యి పెట్టి తీసి, మాలతి ముందు గుప్పెట తెరిచాడు.

అతని చేతిలో నవరత్నాలు ఉన్నాయి!

రంగు రంగుల రత్నాలు!

"ఒకటి తీసుకో!" అన్నాడు కీర్తి నవ్వుతూ.

ఊపిరాగిపోయినట్లయింది మాలతికి. అప్రయత్నంగానే అటూ ఇటూ చూసింది. పక్కన కాషియర్ లేదు. తనని ఎవరూ గమనించడం లేదు కూడా.

మాలతికి తన ఇల్లు గుర్తొచ్చింది.

అమ్మా - నాన్నా -

తమ్ముడూ - చెల్లీ -

ఆకలీ - అనారోగ్యం.

ఇష్టం లేకపోయినా ఇలాంటి ఉద్యోగంలో తను!

కీర్తి గుసగుసగా అన్నాడు "నన్నడిగితే డైమండ్ తీసుకోమంటా. లక్షా పాతికవేలకి తక్కువ పలకదు."

హఠాత్తుగా ఒక నిశ్చయానికి వచ్చేసి, ఒణికే చెయ్యి ముందుకు జాచి డైమండ్ తీసుకుంది మాలతి.

హాపీగా నవ్వాడుకీర్తి.

"నౌ యూ ఆర్ బిహేవింగ్ లైక్ ఏ సెన్సిబుల్ గరల్! ఇప్పుడు నీ డిన్నర్. తర్వాత కాసేపు కాలక్షేపం."

"డిన్నర్ వద్దు! నన్ను తొందరగా పంపించెయ్యండి" అంది మాలతి కంపిస్తున్న స్వరంతో.

నవ్వాడు కీర్తి.

అతని గదిలో గంటసేపు స్పెండ్ చేసింది మాలతి.

తర్వాత ఆమె చీరె కట్టుకుంటూ ఉండగా అన్నాడు కీర్తి.

"మళ్ళీ ఎప్పుడు పునర్దర్శనం?"

మాలతి నిదానంగా అంది-

"మంచికో, చెడుకో ఇవాళ ఇలా చేశాను. ఇదే మొదలు, ఇంక ఇదే ఆఖరుసారి కూడా!'

"మరి రేపట్నుంచీ?"

"ఇంక ఈ ఉద్యోగం మానేస్తాను. మీరు డైమండ్ ఇచ్చారుకదా. అది అమ్మితే

వచ్చే డబ్బు బ్యాంకులో వేసుకుంటే గడిచిపోతుందనుకుంటాను."

చులకనగా నవ్వాడు కీర్తి.

"అది అమ్మజూపకు! అమ్మితే అర్థరూపాయి కూడా రాదు"

అదిరిపడింది మాలతి.

"అంటే?"

"అదంతే! గాజుముక్కకి అర్థరూపాయికంటే ఎక్కువ ఎవరిస్తారు?"

"గాజుముక్కా! నన్ను మోసం చేశావ్" అంది మాలతి దుఃఖాన్ని ఆపుకుంటూ.

"నీకు తెలీదా? మోసాలు చెయ్యడమే నా ప్రొఫెషన్" అన్నాడు కీర్తి.

దీనంగా అంది మాలతి.

"ఎలాగూ చెడిపోయాను. కనీసం ఆ యాభై వేలన్నా నాకు ఇచ్చెయ్"

మళ్ళీ నవ్వాడు కీర్తి. "యాభై వేలా? అద్దంలో మొహం చూసుకున్నావా ఎప్పుడన్నా?"

కోపం పట్టలేక వణుకుతూ, శపిస్తున్నట్లు చూసింది మాలతి.

"నువ్వేగా పొద్దున్నంతా నా వెంటబడి తిరిగి పదివేలనీ, పాతికవేలనీ, యాభై వేలనీ వేధించుకు తిన్నది."

"అది నీ అందం చూసి కాదు! నీ భయం చూసి. నీతి నియమాల కోసం పడిచచ్చే ఆడదాన్ని చెడగొట్టడంలోనే కదా జన్మ సార్థకత."

"నీచుడా!" అంది మాలతి ఉద్వేగంగా. "దేవుడున్నాడు. మర్చిపోకు."

"నేను సైతాన్‌ని. దేవుడే నాకు భయపడాలి" అన్నాడు కీర్తి.

మాలతి రోదిస్తూ అక్కడనుంచి వెళ్ళిపోయింది.

మర్నాడు పొద్దున టాంక్‌బండ్‌లో తేలింది ఆమె శవం.

టాంక్‌బండ్‌మీద జాగింగ్‌కి వెళ్ళిన కీర్తి మాలతి శవాన్నీ, అలవికాని దుఃఖంతో

విలపిస్తున్న ఆమె కుటుంబాన్నీ దూరం నుంచి చూసి ఎంతో థ్రిల్ ఫీలయ్యాడు.

అప్పుడు అక్కడ కనబడ్డాడు అతనికి.

కృష్ణాజీ.

కృష్ణాజీ ప్రక్కనే రాజా!

కృష్ణాజీని చూడగానే తనకి అప్పగించబడిన అసైన్‌మెంటు గుర్తొచ్చింది కీర్తికి.

వాళ్ళు తనని చూసే లోపలే అక్కడి నుంచి నెమ్మదిగా తప్పుకున్నాడు.

తను అక్కడికి రావడం, పోవడం రాజా, కృష్ణాజీ ఇద్దరూ కూడా గమనించలేదనే అనుకున్నాడు కీర్తి. నిజానికి వాళ్లు చూసినందువల్ల అతనికి వచ్చిన నష్టమూ ఏమీ లేదు.

కానీ చూడకుండానే చూస్తాడు రాజా. అది అతని టెక్నిక్. అతనికి వళ్ళంతా కళ్ళే!

కీర్తిని చూశాక అనిపించింది రాజాకి.

ఈ కీర్తి ఇక్కడికి ఎందుకు వచ్చాడు?

ఊరికే జాగింగ్‌కేనా?

అయితే అంత హఠాత్తుగా మనసు మార్చుకుని వెనక్కి ఎందుకెళ్ళిపోయాడు?

తమకి ఎదురుపడడం ఇష్టం లేకనా?

లేకపోతే అంతకు మించినది యింకేమన్నా ఉందా?

ఈలోగా ఈతగాళ్ళు మాలతి శవాన్ని పైకి తీశారు.

ఆమె కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఏడుపు మొదలెట్టారు. వాళ్ళని ఊరడిస్తూ, ఏవేవో ప్రశ్నలు అడుగుతున్నాడు కృష్ణాజీ.

ఆ దర్యాప్తుతో అధికారికంగా రాజాకి ఏమీ సంబంధంలేదు. అతను ఊరికే కృష్ణాజీని కలుసుకోవడానికి వచ్చాడు. ఆయన యిక్కడికి వస్తుంటే ఆయనతోబాటు తను కూడా వచ్చాడు.

రాజాని బాగా లైక్ చేస్తాడు కృష్ణాజీ.

పోలీసు అఫీషియల్స్ శవాన్ని పోస్ట్‌మార్టంకోసం మార్చ్యురీకి పంపించారు.

ఆమె కుటుంబ సభ్యులని కనిపెట్టి ఉండమని తన క్రింది ఉద్యోగులకు ఆర్డర్స్ ఇచ్చి, రాజాని తనతో రమ్మని పోలీసు జీపు ఎక్కాడు కృష్ణాజీ.

జీపు కదిలింది.

కృష్ణాజీ అన్నాడు.

"ఆ అమ్మాయి తల్లిదండ్రులతో మాట్లాడాను. వాళ్ళు చెప్పిన దానిని బట్టి మాలతి పిరికిది కాదు. ఆత్మహత్య చేసుకుని చనిపోవలసినంత అగత్యం ఆ అమ్మాయికి లేదు. బీదరికం, డబ్బు ఇబ్బందులూ వాళ్ళకి కొత్తకాదు. వాటికి భయపడి ఆ అమ్మాయి ఇవాళ హఠాత్తుగా బలవన్మరణం పాలు కావడం నమ్మశక్యంగా లేదు. ఊహించలేని ఘోరం ఏదన్నా జరిగి ఉండాలి."

రాజా అన్నాడు –

"వాళ్ళు చెప్పినదాన్నిబట్టి ఆ అమ్మాయి చాలా రెస్పాన్సిబుల్ పర్సన్! ఒకవేళ బతుకు మీద విరక్తి పుట్టినా, కనీసం తల్లిదండ్రులకి ఒక ఉత్తరం అన్నా రాయకుండా ఆత్మహత్య చేసుకోవడం అసంబద్ధంగా ఉంది."

రాజా వేపు నిశితంగా చూశాడు కృష్ణాజీ.

"సరిగ్గా నా నాలుక మీద ఉన్న మాటనే నువ్వు అనేశావ్!" అన్నాడు.

కీర్తి అప్పటిదాకా అక్కడే తారట్లాడిన సంగతి చెప్పాడు రాజా.

"అది నేనూ గమనించాను" అన్నాడు కృష్ణాజీ.

"వీడు ఈ ఊళ్ళో సర్‌ఫేస్ అయ్యాక, రోజుకో శవం, పూటకో ఘాతుకం జరిగిపోతున్నాయి."

"సదాశివబ్రహ్మంగారిని చంపించడంతోనే ఈ ఊళ్ళో వీడి ఆరంగ్రేటం మొదలయ్యిందనుకుంటాను" అన్నాడు రాజా.

"ఎగ్జాక్ట్‌లీ! ఇంక ఉపేక్షిస్తే లాభంలేదు అని ఆగి, రాజా వేపు అభిమానంగా చూశాడు కృష్ణాజీ. "రాజా! నువ్వు నా దగ్గరే పనిచేస్తే మనిద్దరి కాంబినేషన్ అమోఘంగా ఉండిఉండేది. తొందరలోనే ఈ యాంటీ సోషల్ ఎలిమెంట్స్ పనిపట్టేసి వుండేవాళ్ళం. కానీ, దురదృష్టవశాత్తు అలా జరగడం లేదు."

ప్రశ్నార్థకంగా కృష్ణాజీ వేపు చూశాడు రాజా.

కృష్ణాజీ చెప్పాడు.

"యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్" అని కొత్తగా ఒకటి పెడుతున్నారు. నిన్ను అందులో వేస్తున్నారు. బహుశా కొద్ది నెలల పాటు కమెండోగా అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇస్తారనుకుంటాను. అయినా నీకు ట్రైనింగ్ ఎందుకులే! నువ్వు కమెండోలకి కమెండోలాంటి వాడివిగదా?"

సంతోషం, నిరాశా ఒకేసారి కనబడ్డాయి రాజా మొహంలో.

"యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్" ఫార్మ్ అవుతోందని అతను కూడా విన్నాడు. అంటే అది ఒక ఎలైట్‌ఫోర్స్! చాలా సమర్థత ఉన్న వాళ్ళకి గానీ అందులో స్థానం దొరకదు.

కృష్ణాజీ చెప్పేదాని ప్రకారం ఆ స్క్వాడ్‌లో తనకి ప్లేస్ దొరికింది.

చాలా సంతోషమే.

కానీ తను కోరుకున్నది అదికాదు.

ఎలాగయినా సరే తను కృష్ణాజీ దగ్గరే చేరాలనుకున్నాడు. కృష్ణాజీ కింద పనిచేస్తే తన జీవితం ధన్యమైపోతుందని ఆశపడ్డాడు.

ఆ ఆశ మరి ఇప్పట్లో తీరేలా లేదు.

కృష్ణాజీ మొహంలో భావం కూడా దాదాపు అలాగే వుంది.

కొద్దిసేపు కృష్ణాజీ మొహంలోకి చూసి, స్మార్ట్‌గా సెల్యూట్ చేశాడు రాజా.

"నేను వెళ్ళి వస్తాను సర్!"

"ఆల్‌ది బెస్ట్! యంగ్‌మాన్!"

వెనక్కి తిరిగాడు రాజా.

"మిస్టర్ రవిరాజ్‌కుమార్?" అన్నాడు కృష్ణాజీ.

మళ్ళీ ఆయనవేపు తిరిగి, ప్రశ్నార్థకంగా చూశాడు రాజా.

"ఊళ్ళో ఏ ఇంటి తలుపు మీద చూసినా, "ఓ స్త్రీ! రేపురా!" అని రాసి వుంది! నీ స్ట్రాటెజీ తాలూకు ఎఫెక్టేనా?"

"అర్పితనిసేవ్ చెయ్యడానికి దయ్యాలనీ, భూతాలనీ, కామినీ పిశాచాలనీ రంగంలోకి దింపక తప్పలేదు సర్! "రేపు నీ ఇంటికొస్తా!" అని ఒక అభాగ్యుడితో చెప్పాను. వాడు పిశాచాలనే ఏమార్చాలనే ఉద్దేశ్యంతో అలా రాసి వుంటాడు. అంటే కామినీ పిశాచం ఏ రోజు వచ్చినా "ఓ స్త్రీ! రేపు రా!" అని తలుపుమీద కనబడుతుంది. ఆ రేపు యింక ఎప్పటికీ రాదన్న మాట! ఒకళ్ళని చూసి ఒకళ్ళుగా ప్రతివాళ్ళూ ఇంటి తలుపుల మీద అదే రాశారు" అన్నాడు రాజా నవ్వుతూ.

"నీ తప్పేమీ లేదు!" అన్నాడు కృష్ణాజీ గంభీరంగా.

మళ్ళీ సెల్యూట్ చేసి, అక్కడి నుంచి కదిలాడు రాజా.

✦ ✦ ✦

ఆ తర్వాత నెలరోజులు గడిచాయి.

ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా హైదరాబాద్ పోలీసు డిపార్ట్‌మెంట్‌కి సంబంధించి నంతవరకూ ఆ ముప్ఫయ్ రోజులూ అత్యంత దుర్దినాలుగా రికార్డు అయ్యాయి.

కారణం....

ఆ నెలరోజుల్లోనే ప్రతిరోజూ కనీసం ముప్ఫయ్ మర్డర్లు చొప్పున జరిగాయి.

ఆబిడ్స్‌లోని జనరల్ పోస్ట్ ఆఫీస్ దగ్గర దారుణమైన ప్రేలుడు జరిగి అక్కడి కక్కడ రెండొందల మంది చనిపోయారు.

ఆ నెలలోనే హెరాయిన్ స్మగ్లింగ్‌కి హైదరాబాద్ ఇండియా మొత్తానికీ

సెంటరయ్యింది. ఇండియాకే కాక పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్, బర్మా, శ్రీలంకలన్నిటికీ కూడా సెంటరయ్యింది.

హైదరాబాద్ నుంచి అరబ్ దేశాలకు అమ్మాయిలని అమ్మెయ్యడం ముప్ఫయ్ రెట్లు పెరిగింది.

ఇండియా మొత్తం మీద అత్యంత ఆధునికమైన అండర్ గ్రవుండ్ ఆయుధాల ఫ్యాక్టరీ ఒకటి మొదలయ్యింది.

వారానికి ఒకటి చొప్పున నాలుగు భీకరమైన గ్యాంగ్ వార్స్ చెలరేగాయి. మొత్తం తొంభైమంది చనిపోయారు.

మూడుసార్లు మత కలహాలు చెలరేగాయి.

రెండుసార్లు కర్ఫ్యూ పెట్టారు.

అండర్ వరల్డ్‌తో సంబంధం ఉందని రుజువై ఎనిమిది మంది సీనియర్ పోలీస్ ఆఫీసర్లు డిస్మిస్ అయ్యారు.

ఆ నెలలో గ్యాంగ్ రేప్ జరగని దినం లేదు.

ఇరవై గృహదహనాలు జరిగాయి.

ఎనభై మూడు లూటీలు జరిగాయి.

నగరం నడిబొడ్డులో మిట్టమధ్యాహ్నంపూట బందిపోటు దొంగతనాలు వారానికి రెండు చొప్పున జరిగాయి.

కిరాయి మూకలు వంద బస్సులని తగలబెట్టారు.

జైల్లో వున్న ఒక నరరూప రాక్షసుడిలాంటి హంతకుడిని వదిలిపెట్టాలని డిమాండ్ చేస్తూ బంద్ జరిగింది. దౌర్జన్యం చెలరేగింది. కోటి రూపాయల నష్టం జరిగింది.

ఇవన్నీ నిజాయితీగా రిపోర్టు చేయబోయిన ఇద్దరు రిపోర్టర్లనీ, ఒక కెమేరామాన్‌నీ అక్కడికక్కడే సజీవ దహనం చేశారు.

అట్టుడికినట్లు ఉడికిపోతోంది నగరం.

అలజడి చెలరేగింది జనంలో.

పత్రికలు ఎడిటోరియల్స్ రాశాయి.

శాసనసభలో ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వం మీద అన్ని వైపుల నుంచి ఎదురుదాడి మొదలెట్టారు.

అలాంటి నేపథ్యంలో –

ఆరోజు తన ఆఫీసుకి వెళ్ళి కూర్చునీ కూర్చోగానే కృష్ణాజీకి వచ్చింది ఫోన్.

హెూం మినిస్టర్ విజయకుమారి దగ్గర నుంచి ఆ ఫోన్ కాల్!

ఆమె గొంతువింటేనే గొంతు భగభగ మండినట్లవుతుంది కృష్ణాజీకి.

నిజం మాట్లాడితే, రెండొందల కేసులు పెట్టి, నాలుగొందల సంవత్సరాల జైలు శిక్ష వెయ్యవలసిన రాటుదేలిన క్రిమినల్ ఈ విజయకుమారి.

కానీ, ప్రజలు చేసుకున్న పాపంకొద్దీ హెూం మినిస్టరయి కూర్చుంది.

ఈ మనిషి ఆర్డర్స్ ఇవ్వడం....

తను విధేయత ప్రకటిస్తూ పాటించడం....

అయ్యో! ఈ లోకం రాంగ్‌సైడ్‌లో పోతోంది.

బట్....

వాట్ టూ డూ?

లైన్లో అవతల నుంచి విజయకుమారి గొంతు కాట్లకుక్క అరుపులాగా వినబడుతోంది.

“ఊ అనవు ఆఁ అనవేమిటి? చెప్పేది వినబడుతోందా? లేదా?”

“యస్ మేడమ్” అన్నాడు కృష్ణాజీ కోపాన్ని ఆపుకుంటూ.

“నువ్వు డ్యూటీ చేస్తున్నావా, నిద్రపోతున్నావా?”

అతి కష్టం మీద తనని తాను నిగ్రహించుకున్నాడు కృష్ణాజీ.

మళ్ళీ అంది విజయకుమారి "డిపార్ట్‌మెంట్‌లో నీలాంటి ఓ పదిమంది ఉంటే చాలు, ఇంక డిపార్టుమెంటు హోల్ మొత్తం ఎత్తెయ్యవలసిందే."

తిరగబడాలనిపిస్తోంది కృష్ణాజీకి.

కానీ ఊరుకుంటున్నాడు.

అతన్ని రెచ్చగొట్టడం, కవ్వించడం విజయకుమారికి ఇష్టం! చాలా ఇష్టం!!

అతన్ని శంకరగిరి మాన్యాలు పట్టించెయ్యడం కూడా తనకి ఎంతో ఇష్టం.

శంకరగిరి మాన్యాలేమిటి?

వీలయితే డిస్మిస్ చేసి నేరుగా ఇంటికే పంపించెయ్యడం మరీ మరీ ఇష్టం!

నిజానికి తను ఈ హోం మినిస్ట్రీకి వచ్చినప్పటి నుంచి అదే ప్రయత్నంలో వుంది కూడా.

ఈ మినిస్ట్రీలో ఛార్జి తీసుకోగానే తను చేసిన మొదటి పని కృష్ణాజీని ట్రాన్స్‌ఫర్ చేయించడం.

కానీ అతను ట్రాన్స్‌ఫర్ మీద కొత్త ప్లేస్‌కి వెళ్ళలేదు.

పైపెచ్చు కోర్టుకి వెళ్ళాడు.

గొప్ప పెంట లేవదీసింది ఆ కేసు.

పోలీసు డిపార్టుమెంటులో సబార్డినేషను ఎక్కువ.

నోరెత్తకుండా కుక్కిన పేనులా పని చేస్తారు పోలీసు అధికారులు.

పైవాళ్ళు అమ్మనా బూతులు తిట్టినా కిక్కురు మనకుండా పడి వుంటారు.

అలాంటి డిపార్టుమెంటులో –

సీనియర్ కేడర్‌లో పనిచేసే కృష్ణాజీ లాంటి ఆఫీసర్లు కోర్టుకి ఎక్కడం అనేది కోటికి ఒక్కసారి కూడా జరగని పని.

ఎవ్వరూ ఊహించని విధంగా కోర్టుకెళ్ళాడు కృష్ణాజీ.

తన ట్రాన్స్‌ఫర్ వెనక దురుద్దేశ్యం వుందన్న ఆర్క్యుమెంటు మీద!

కోర్టులో అతని వితండ వాదన యిలా ఉంది.

తను అతి నిజాయితీ పరుడైన ఆఫీసరుట!

తనది అత్యంత నిష్కల్మషమైన రికార్డుట!

తనకి ప్రెసిడెంటు మెడలు కూడా వచ్చి ఏడిచిందట!

ఇంటర్నేషనల్ పోలీసు సంస్థ అయిన ఇంటర్‌పోల్ నుంచి తనకు ప్రశంసా పత్రం వచ్చిందిట!

తను లండన్‌లోని రాయల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కి ఇండియా తరఫున అభ్యర్థిగా ఎన్నికై అక్కడ ట్రైనింగ్ అయి వచ్చాడుట!

కానీ తన సొంత డిపార్టుమెంటు మాత్రం తన మెరిట్‌ని అస్సలు గుర్తించలేదుట!

తనకు రావలసిన ప్రమోషన్లు రాలేదుట!

ప్రతిభకి తగినట్లుగా టాప్ లెవెలుకి రాలేదుట తను!

వీడి పిండాకూడు!

పూర్తిగా పీకెయ్యకుండా ఇంకా ఉద్యోగంలో వుండనిచ్చారు.

అది చాలదూ?

ప్రమోషన్లు కావాలిట!

ట్రాన్స్‌ఫర్లు వద్దుట!

కృష్ణాజీ కోర్టులో చెప్పిన మిగతా ఆర్క్యుమెంటు గుర్తు వచ్చింది విజయకుమారికి.

పై అధికారులు కృష్ణాజీ మీద కక్షకట్టారుట!

కానీ తనని పూర్తిగా కండెమ్ చెయ్యలేకపోయారుట!

ప్రతిభని బట్టి కాకపోయినా, సీనియారిటీనిబట్టి తనకి కొన్ని ప్రమోషన్లు వచ్చాయిట! అంతేట!

కానీ–

సంవత్సరానికి రెండు చొప్పున బదిలీలు మాత్రం తప్పలేదుట!

ఒక్కోసారి అయితే, తను ట్రాన్స్‌ఫర్ అయి, తను ఆ కొత్త ప్లేస్‌కి వెళ్ళి జాయిన్ అయ్యేలోపలే మళ్ళీ యింకో చోటికి ట్రాన్స్‌ఫర్ అయ్యేదిట.

అయితే, తను ట్రాన్స్‌ఫర్‌కి బెదరడట!

కానీ, కక్ష సాధింపు చర్యలని మాత్రం యిన్నాళ్ళూ భరించినా యికపైన భరించడుట!

అందుకే న్యాయం కోసం కోర్టుకెక్కాడుట!

గాడిదెక్కలేకపోయాడూ?

కేసు పెట్టడంతో కృష్ణాజీ కట్టెలాంటి పెడసరం మనిషి అని అందరికీ మళ్ళీ ఒకసారి రుజువయిపోయింది.

ఈ కోర్టులు అనేవి ఉన్నాయే మనం మారుతీ కారుమీద ఆఘమేఘాల మీద వెళ్ళిపోతుంటే అడ్డం వచ్చే స్పీడ్ బ్రేకర్ల లాంటివి.

కోర్టువారు కేసు విచారించారు.

అన్యాపదేశంగా డిపార్టుమెంటు పెద్దలకీ....

వాళ్ళతోబాటూ హోం మినిస్టర్‌కి....

అంటే తనకి....తనకే!

తనంతటిదానికి కూడా అక్షింతలు వేశారు.

దాని ఫలితంగా కృష్ణాజీ ట్రాన్స్‌ఫర్ ఆగిపోయింది.

కానీ తనకు మాత్రం పర్సనల్‌గా పెద్ద ఎదురు దెబ్బే తగిలింది.

తను హోం మినిస్టర్ అయి ఉండి, ఆఫ్టరాల్ ఒక పోలీసు ఆఫీసర్ని ట్రాన్స్‌ఫర్.... డిస్మిసల్ కూడా కాదు.... ఆఫ్టరాల్ ట్రాన్స్‌ఫర్ చేయించలేక పోవడమా!

ఎంత పరువు తక్కువ!

అయితే అప్పట్లో తనుబయటపడి పోలేదు.

రాజకీయాలు ఆ నేర్పుని అలవాటు చేశాయి తనకి.

తగిన సమయం కానప్పుడు తగ్గి ఉండాలి.

అవకాశం కోసం కాచుకుని ఉండాలి.

ఇప్పుడొచ్చింది ఆ అవకాశం తనకి....

ఈ ఏస్ క్రిమినల్ కీర్తి పుణ్యమా అని....

"యస్ మేడమ్!" అంటున్నాడు కృష్ణాజీ లైన్లో అవతలవైపు నుంచి,

ఇంక అందుకుంది విజయకుమారి.

"ఏం చేస్తున్నారు మీరంతా! నిద్రపోతున్నారా?"

"మేడమ్?"

"గుర్రుపెట్టి నిద్రపోతున్నారా అంటున్నాను!"

"కీర్తి విషయమేనా మీరు మాట్లాడేది?"

"లేకపోతే నీ బర్త్‌డే ఏర్పాట్ల గురించి అనుకున్నావా?"

"వాడు అండర్‌గ్రౌండ్‌కి వెళ్లిపోయాడు. ఆచూకీ తెలియడంలేదు. వెతుకుతున్నాం మేడమ్!"

"ఏం వెదకడం! చీకట్లో వెతుకు చేతికి తగులుతుంది" అంది అసభ్యంగా.

"కీర్తిని ట్రేస్‌చేసి పట్టుకోవడం ఫస్ట్ ప్రయారిటీగా పెట్టుకున్నాం. తర్వాత వెతుకుతున్నాం" అన్నాడు కృష్ణాజీ.

"ఓ పన్జెయ్! వచ్చి నా రూంలో వెదుకు కనబడతాడేమో" అంది విజయకుమారి వ్యంగ్యంగా.

అంటూనే తన పక్కన కూర్చుని సిగరెట్ కాలుస్తూ పొగని రింగులు రింగులుగా

తనమీదికి వదులుతున్న కీర్తివేపు చూసి కన్ను గీటింది హెూం మినిస్టర్ విజయకుమారి.

కీర్తి పెదిమలు విషపు నవ్వుతో వంకర తిరిగాయి.

లైన్లో అవతలి వేపునుంచి కృష్ణాజీ అన్నాడు.

"మేడమ్! ఎన్నివిధాల వీలవుతుందో అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాం – అయితే కొంచెం టైము కావాలి. ఆ బగర్ని పట్టుకుని శిక్ష వేయించడం అతిత్వరలోనే జరుగుతుంది. ష్యూర్!"

"ఈలోగా నీకు శిక్షపడకుండా వుంటే!"

"అంటే....వాట్ డూ యూ మీన్?"

తీవ్రంగా అంది విజయకుమారి.

"ఇంకా ఎన్నాళ్ళు టైము కావాలి నీకు? ఎన్నేళ్ళు?"

"నా ఉద్దేశంలో కొద్దినెలలలో...."

"సింప్లీ అవుటాఫ్ క్వశ్చన్! ఇదిగో కృష్ణాజీ!

జాగ్రత్తగా విను! ఈ నెలాఖరిదాకా టైమిస్తున్నాను నీకు. ఆ లోపల కీర్తిని పట్టుకోగలిగితే సరేసరి! లేదా నీకు ట్రాన్స్‌ఫరో, రివర్షనో, డిస్మిసలో ఏదో ఒకటి తప్పదు. కుర్చీలో కూర్చుని బొజ్జలు పెంచుకోవడానికా మీకు ప్రభుత్వం జీతాలిచ్చేది?"

కృష్ణాజీ వంట్లో నెత్తురు మసులుతున్నట్లయింది.

ఈ బజారు మనిషి....తనకు నీతులు చెప్పడమా?

విజయకుమారి యింకా అంటూనే వుంది.

"మాట్లాడవేం! కీర్తిని వెదకటానికి కళ్ళు ఎలాగూ లేవు. నేను చెప్పేది వినబడకుండా చెవులు కూడా చెడిపోయాయేం?"

ఒక్కొక్క అక్షరం విడివిడిగా పలుకుతూ అన్నాడు కృష్ణాజీ.

"మేడం! దిసీజ్ ఏ ప్రామిస్! నెలరోజుల్లో కీర్తిని పట్టుకుని తీర్తాను నేను. అలాకాని పక్షంలో, మీరు నామీద యాక్షన్ తీసుకోవలసిన అవసరం వుండదు. నా

మీద నేనే చాలా సిన్సియర్ యాక్షన్ తీసేసుకుంటాను.

"సరే! ఒకే ఒక్క నెల! గుర్తుంచుకో"

"థాంక్స్ మేడమ్!" అని ఫోన్ పెట్టేశాడు కృష్ణాజీ.

విజయగర్వంతో కీర్తి వేపు చూస్తూ రిసీవర్ క్రెడిల్‌మీద పెట్టేసింది హెూం మినిస్టర్ విజయకుమారి.

అప్పటికే రెండుగ్లాసుల్లో జానీవాకర్ స్కాచ్ విస్కీపోసి పట్టుకొస్తున్నాడు కీర్తి.

"ఏమంటాడు? నెల్రోజుల్లో నన్ను పట్టుకుంటాడటనా?" అన్నాడు కీర్తి హేళనగా.

"ఏదో పేలుతున్నాడు" అంది విజయకుమారి. "నిన్ను నా కొంగు చాటున దాచేస్తా! వీడుకాదు, వీడి బాబు కూడా పట్టుకోలేదు"

"థాంక్స్ విజ్జీ!" అన్నాడు కీర్తి చనువుగా.

అతనికి తల్లి కాగల వయసు వుంది హెూం మినిస్టర్ విజయకుమారికి.

అయినా ఆమెకి తను ఒక కన్నెపిల్ల అనే భావం కలిగేటట్లు ట్రీట్ చేస్తాడు కీర్తి. సైకాలజీ బాగా తెలుసతనికి. ఎవరిని ఎలా హేండిల్ చేయాలో యింకా బాగా తెలుసు.

"విజ్జీ" బెడ్‌రూం తలుపు వేసేసి వచ్చింది. హెూం మినిస్టరూ, ఏస్ క్రిమినలూ యిద్దరూ కలిసి మాస్టర్ బెడ్ మీద కూర్చుని తాగడం మొదలు పెట్టారు.

అక్కడ –

తన ఆఫీసులో –

నిస్పృహగా, నిర్వేదంగా కుర్చీలో వెనక్కి జారగిలబడిపోయాడు కృష్ణాజీ.

✦ ✦ ✦

"ఎలా వుంది నీ కొత్త జాబ్?" అంది అర్పిత రాజా వేపు ఇష్టంగా చూస్తూ.

"చల్తా" అన్నాడు రాజా తేలిగ్గా.

"నచ్చలేదా?"

"కృష్ణాజీ దగ్గర పనిచెయ్యడం నాకు యిష్టం" అని సిగరెట్ వెలిగించాడు రాజా. "నాకేమో కృష్ణాజీ నా బాస్‌గా వుండాలని కోరిక. కానీ అలా కుదరడం లేదు. పాపం కృష్ణాజీకేమో ఆయన దురదృష్టంకొద్దీ విజయకుమారి డైరెక్ట్ బాస్ అయింది. నెత్తి మీద పెద్దమ్మలా!"

నవ్వి వంటింట్లోకి నడిచింది అర్పిత, కాఫీ కలపడానికి. ఆమెతో బాటే తనూ లోపలికి నడిచాడు రాజా.

"హెూం మినిస్టర్ విజయకుమారి కృష్ణాజీకి నెలరోజులు డెడ్‌లైన్ పెట్టిందట– కీర్తిని పట్టుకోవటానికి. ఆయన చాలా వర్రీడ్‌గా వున్నాడు" అన్నాడు రాజా.

సాలోచనగా అంది అర్పిత

"మనిషి పెద్దవాడయిపోతున్నాడుకదా! ఇదివరకు వున్నంత అగ్రెసివ్‌గా లేడిప్పుడు. ఆయన సాల్వ్ చేసిన కేసులను గురించి కథలు కథలుగా చెప్పుకుంటారు జనం. నాన్నగారికి ఆయనంటే ఎంతో గురి"

"బహుశా ఆయన వయసుకన్నా, మొదటినుంచి అడుగడుగునా ఆయన ఎదుర్కొన్న వ్యతిరేకతే ఆయన్ని నిరుత్సాహపరచి, మానసిక గ్లాని కలిగించి వుంటుంది. ఆయన సర్వీసు మొత్తంలో ఆయనతో ఆదరంగా మాట్లాడి, ప్రోత్సాహం యిచ్చింది మీ నాన్నగారు సదాశివబ్రహ్మంగారు అయుండచ్చు. ఆయన పోయారు. మళ్ళీ కృష్ణాజీ పరిస్థితి యథాప్రకారంగా తయారయిపోయింది. మీ నాన్నగారు హెూం మినిస్టర్ కాక ముందు ఒంటరిపోరాటం సాగించాడు కృష్ణాజీ. మీ నాన్నగారి ప్రోత్సాహంతో పుంజుకుని ఏవేవో సాధించెయ్యగలననుకున్నాడు. మీ నాన్నగారు పోయారు. అప్పటినుంచి అప్‌సెట్ అయిపోయాడు కృష్ణాజీ. ఆయనకి మానసికంగా పెద్ద దెబ్బ తగిలి, నిరుత్సాహం ఆవరించేసిందనుకుంటాను" అన్నాడు.

"మరి ఈ విషయంలో నువ్వేం చెయ్యలేవా?" అంది అర్పిత.

చిన్నగా నవ్వాడు రాజా.

"అందుకేగా, ఇవాళ వెళ్ళి ఆయన్ని కలుసుకోబోతోందీ?"

కాఫీ సిప్ చేస్తూ కొద్దిక్షణాలు మౌనంగా వుండిపోయి ఆ తర్వాత అన్నాడు రాజా.

"ఈ విజయకుమారి వుందే....వుండాల్సిన మనిషిలే. విజయకుమారే ఏమిటి? పొలిటీషియన్స్ అందరూ అంతే. చేతలు తమ కోసం, మాటలు మంది కోసం." అని ఆగి మళ్ళీ అన్నాడు – "ఒక పొలిటీషియన్ జోక్ చెప్పనా?"

నవ్వు మొహం పెట్టింది అర్పిత.

రాజా చెప్పాడు. "ఒక రాజకీయవేత్త వున్నాడు. ఆయన పెళ్ళాం చావు బ్రతుకుల్లో వుంది. డాక్టర్‌ని పిలిపించారు.

డాక్టర్ రాటుదేలిన రకం. అందుకని ముందే నిర్మొహమాటంగా అన్నాడు రాజకీయవేత్తతో.

"మీ రాజకీయవేత్తలున్నారే....బొత్తిగా నీతి నిజాయితీ లేని మనుషులు. నేను ఇంత కష్టపడి ట్రీట్‌మెంట్ యిచ్చాక నువ్వు ఏదో ఒక సాకు చెప్పి ఫీజు ఎక్కొడితే?" అన్నాడు.

రాజకీయవేత్త ఇన్సల్టుని పట్టించుకోకుండా నవ్వి అన్నాడు.

"నువ్వు నా భార్యని బతికించినా, లేకపోతే ఆమెను చంపేసినా కూడా నీకివ్వాల్సిన ఫీజు యిచ్చి తీరతా! సరేనా!"

సరేనన్నాడు డాక్టరు. ఎన్నో రకాలుగా ఆమెకు ట్రీట్‌మెంటు యిచ్చాడు.

అయినా కూడా ఆమె చనిపోయింది.

ఆమెని బతికించినా ఆమెను చంపినాకూడా రాజకీయనాయకుడు ఫీజు యిస్తానన్నాడు గనుక ఆయన దగ్గరకెళ్ళాడు డాక్టరు, తన ఫీజు వసూలు చేసుకోవడానికి.

డాక్టర్‌ని ఎగాదిగా చూశాడు పొలిటీషియన్.

"నువ్వు నా భార్యని బతికించావా?" అన్నాడు.

"లేదు" అన్నాడు డాక్టర్.

"పోనీ నువ్వు నా భార్యని చంపావా?"

"బాబోయ్! అంతమాటనకండి. నేనెందుకు చంపుతాను?"

"అలాంటప్పుడు నేను నీకు దమ్మిడీ ఇవ్వవలసిన అవసరంలేదు ఫో!" అన్నాడు పొలిటీషియన్ గడుసుగా.

వింటున్న అర్పిత నవ్వింది.

"జంట తుమ్ములలాగే జోకులు కూడా కనీసం రెండు చెప్పకపోతే నాకు తోచదు. విను" అంటూ మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు రాజా.

"ఓ రోజున ఒక జంట ఒక పెద్ద రెస్టారెంట్‌లో డిన్నర్ తీసుకుంటున్నారు. ఆ అమ్మాయి హొటల్ డోర్ వైపు యథాలాపంగా చూసి ఉలిక్కిపడి, అటే చూస్తూ ఉండి పోయింది.

ఈ లోపల వెయిటర్ పరిగెత్తుకొచ్చాడు.

"మేడమ్! మీవారు స్పృహ తప్పి బల్ల కిందికి జారిపోయినట్లున్నారు" అన్నాడు కంగారుగా.

"అబ్బే అదేం లేదు! మా ఆయన ఇప్పుడే హొటల్లోకి ఎంటర్ అవుతున్నారు. అదీ సంగతి" అంది ఆ అమ్మాయి గాభరాగా టేబుల్ క్రింద దూరిన ప్రియుడి వైపు చూస్తూ.

నవ్వాపుకుని అంది అర్పిత–

"వాడెవడో నీలాటోడే అయ్యుంటాడు. ఇలాంటి భ్రష్టు జోకులు నాకింకెప్పుడూ చెప్పకు"

నవ్వి, లేచాడు రాజా.

"నేను కృష్ణాజీని మీటయి వస్తా"

"ఆల్ ద బెస్ట్"

కావసాకీ మోటార్ సైకిల్ స్టార్టు చేశాడు రాజా.

కొద్ది నిమిషాల తర్వాత ఆఫీసు రూం వెనకాతలే ఉన్న చిన్నయాంటీరూంలో ఉన్నాడు. అక్కడొక ఈజీ ఛెయిర్ ఉంది. లంచ్ తీసుకోవడానికి ఒక చిన్న టేబుల్, దానిమీద క్రాకరీ, ఫ్లాస్కూ ఉన్నాయి. ఒకవైపు కోట్ హాంగర్ ఉంది.

ఈజీ ఛెయిర్‌లో పడుకుని, సిగరెట్ మీద సిగరెట్ కాల్చేస్తున్నాడు కృష్ణాజీ.

అతని పక్కన ఉన్న యాష్‌ట్రేలో గుట్టగా పడి ఉన్నాయి సిగరెట్లు.

రాజా తన విజిటింగ్ కార్డు పంపగానే వెంటనే లోపలికి రమ్మన్నాడు కృష్ణాజీ.

లోపలికి వెళ్ళి స్మార్టుగా సెల్యూట్ చేశాడు రాజా.

"సిట్ డవున్ యంగ్‌మాన్" అంటూ కుర్చీ చూపించాడు కృష్ణాజీ.

కూర్చోలేదు రాజా.

ఒక్కసారిగా వంగి, కృష్ణాజీ పాదాలను భక్తిగా స్పృశించి చేతులని కళ్ళకి అద్దుకున్నాడు.

ఆశ్చర్యంగా చూశాడు కృష్ణాజీ.

"రవిరాజ్! ఏమిటిది?"

"ఈ రవిరాజే చిన్నప్పటి రాజా అని మీరు ఇంకా గుర్తుపట్టలేదా సర్?"

విస్మయంగా రాజా మొహంలోకి చూశాడు కృష్ణాజీ.

"ఏ రాజా? యూ మీన్ దట్ గుడ్‌ఫర్ నథింగ్ పిక్‌పాకెట్?"

నవ్వాడు రాజా.

"ఒకప్పుడు పిక్‌పాకెట్‌గాడే! కానీ, మీరిచ్చిన స్ఫూర్తితో ఇవాళ ఒక కమెండోగా మీ ముందు నిలబడ్డాడు."

హఠాత్తుగా కుర్చీలో నుంచి లేచాడు కృష్ణాజీ. రాజా భుజాలు పట్టుకుని లేవదీశాడు. ఆపాదమస్తకం ఎగాదిగా చూసి, "నువ్వా? రాజావి నువ్వేనా? ఈపాటికి పూర్తిగా భ్రష్టుపట్టిపోయి ఉంటావనుకున్నాను" అన్నాడు పట్టలేని ఆశ్చర్యంతో.

"పరోక్షంగానే అయినా మీ స్ఫూర్తి నాకు ఉన్నంతకాలం నేను తప్పుదారిలో

ఎలా పోతాను?" అన్నాడు రాజా నవ్వుతూ.

"పిక్‌పాకెట్ రాజా....ఆనందరావుగారి తల పగలగొట్టి డబ్బుతో పారిపోయిన కిలాడీ....ఒలింపిక్స్‌లో మూడు బంగారు పతకాలు సాధించిన రాజా....ఇప్పుడు నా ముందు నిలబడి ఉన్న కమెండో....అన్నీ నువ్వేనా?"

"అన్నీ నేనే....అయితే ఆనందరావుగారి తల పగలగొట్టిన అప్రాచ్యుడిని మాత్రం నేను కాదు."

"కూర్చో" అన్నాడు కృష్ణాజీ తను కూడా కూర్చుంటూ. "ఏం జరిగిందో వివరంగా చెప్పు" అతని మొహంలో పట్టరానంత ఆశ్చర్యం కనబడుతోంది.

జరిగినదంతా వివరంగా చెప్పాడు రాజా.

మధ్య మధ్య ప్రశ్నలు వేస్తూ, శ్రద్ధగా విన్నాడు కృష్ణాజీ.

తర్వాత కోపంగా అన్నాడు "అయితే ఆ ఆనందరావు మాష్టారూ, దాసూ కలిసి నన్ను గాడిదని చేశారన్నమాట."

చిన్నగా నవ్వి ఊరుకున్నాడు రాజా.

తర్వాత అన్నాడు కృష్ణాజీ –

"నమ్మశక్యంకానంత చిత్రమైన జీవితం నీది. కానీ నమ్మక తప్పడం లేదు."

"ట్రూత్ ఈజ్ స్ట్రేంజర్ దాన్ ఫిక్షన్ సర్. ఒక్కోసారి అభూతకల్పనలకంటే అసలు సిసలైన నిజాలే ఎక్కువ ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి."

"మరి నీ చదువు?"

"ప్రైవేట్‌గానే పూర్తిచేశాను."

"నా విజయానికి కారణం మీరేనని మర్చిపోతున్నారు సర్"

"నీ అభిమానం నీ చేత అలా అనిపిస్తోంది"

ఉద్వేగంగా అన్నాడు రాజా.

"కాదు సర్! కాదు! ఇవాళ నేను కూడా ఒక మనిషిలాగా చలామణీ

అవుతున్నానంటే, నేను కూడా పోలీసు ఆఫీసరునయ్యానంటే, ఒలింపిక్స్ ఛాంపియన్‌ని అయ్యానంటే, మార్షల్ ఆర్ట్స్ అన్నీ నేర్చుకున్నానంటే, షూటింగ్, ఆర్చెరీ, రన్నింగ్, రెజ్లింగ్, హార్స్ రైడింగ్, స్విమ్మింగ్, మౌంటెన్ క్లైంబింగ్, జంపింగ్, రేసింగ్ ఇన్నిట్లో ప్రావీణ్యం సంపాదించానంటే, అదంతా మీ చలవే సార్. మీరు ఇచ్చిన స్ఫూర్తే. ప్రతిరోజూ మిమ్మల్ని తలుచుకుంటూ నిద్ర లేచేవాడిని. మీకు నమస్కరిస్తూ నిద్రపోయేవాడిని. మళ్ళీ మళ్ళీ, పదే పదే చెప్పినా నాకు తనివి తీరదు సర్! మీరు ద్రోణాచార్యులు! నేను ఏకలవ్యుడిని. మీరు నా తొలి గురువు! నేను మీకు శిష్యుడిని.

సర్! ఇవాళ నేను మీకు గురుదక్షిణ సమర్పించుకోవాలని వచ్చాను."

వాత్సల్యంగా చూశాడు కృష్ణాజీ.

"నాకు గురుదక్షిణా? ఏమిస్తావ్?"

ఒక్క క్షణం ఆగి చెప్పడం మొదలెట్టాడు రాజా.

"సర్! యూ ఆర్ ఏ సూపర్ కాప్! పోలీసు డిపార్టుమెంటులో మిమ్మల్ని మించిన సమర్థుడు ఇంకొకడు ఉండడు. మీరు ప్రెసిడెంట్ మెడల్స్ సంపాదించగలిగారు గానీ దేశ దౌర్భాగ్యం వల్ల నీతి నియమాలు, నిజాయితీ నశించిపోవడం వల్ల తగినన్ని ప్రమోషన్లు మాత్రం సంపాదించుకోలేకపోయారు.

ఇంటర్‌పోల్ మీ సేవలని గుర్తించి మెచ్చుకుందిగానీ ఇక్కడి వాళ్లు మిమ్మల్ని ఎక్కడికక్కడ తొక్కెయ్యాలని చూశారు. టాప్ లెవెల్‌కి వెళ్ళిపోవలసిన మీరు మిడిల్ మేనేజ్‌మెంటు లెవెల్లో ఆగిపోయారు.

సర్! అయినా ఇవన్నీ పట్టించుకోకుండా మీరు దేశానికి ఎంత సేవ చేశారో, ఎంతమంది క్రిమినల్స్‌ని కటకటాల వెనక్కి పంపించారో, ఫలితంగా మీరెన్ని కష్టాలు అనుభవించారో నాకు బాగా తెలుసు.

మీరు సాల్వ్ చేసిన కేసుల వివరాలు కొత్త రిక్రూట్స్‌కి టెక్స్ట్ బుక్‌లాగా పనికి వస్తాయి.

అంతటి టాలెంట్ ఉన్న మీరు, ఎందువల్లనోగానీ ఈ కీర్తిని టాకిల్ చెయ్యలేకపోతున్నారు. బహుశా మానసికంగా మీరు అలిసిపోయి ఉంటారనీ,

అందువల్లనే ఈ మధ్య అంత విగరస్‌గా పనిచెయ్యలేకపోతున్నారనీ నేను అనుకుంటున్నాను.

సర్! నేను మీకు గురుదక్షిణ ఇచ్చుకోవలసిన సమయం ఇప్పుడు ఇంక వచ్చేసింది.

మీరు అనుమతించండి. ఒక్క వారం తిరిగేలోపల ఆ కీర్తిని పట్టుకొచ్చి మీ కాళ్ళ దగ్గర పడేస్తాను" అన్నాడు ఉద్వేగంగా.

మెరుస్తున్న కళ్ళతో రాజా వైపు చూశాడు కృష్ణాజీ.

ఆ కళ్ళలో మెరుపుతో బాటు తడి కూడా కనబడుతోంది.

రుద్ధమైపోతున్న గొంతుని స్వాధీనంలోకి తెచ్చుకుంటూ అన్నాడు కృష్ణాజీ.

"బాబూ! రాజా! నువ్వు చెబుతోంది అంతా నిజంగా నిజమేనా?"

అవునన్నట్లు భక్తిగా తల పంకించాడు రాజా.

"నేనే నీకు పరోక్షంగా ప్రథమ గురువుననీ, ద్రోణాచార్యుడిని గురువుగా భావిస్తూ ఏకలవ్యుడు శిష్యరికం చేసినట్లు నువ్వు కూడా నన్ను స్ఫూర్తిగా పెట్టుకుని సాధన చేశావనీ.... ఇదంతా నిజమేనని నమ్మమంటావా?"

"అందులో అనుమానం ఏమీ లేదు" అన్నాడు రాజా.

ఇంకా అపనమ్మకంగానే అడిగాడు కృష్ణాజీ.

"ఇప్పుడు నీకొచ్చిన విద్యలూ, నీవు సాధించిన విజయాలూ....ఇవన్నీ కూడా నా వల్లనే సాధ్యమయ్యాయని నిజంగా నువ్వు నమ్ముతున్నావా రాజా?"

"ఆ రోజు మీరు నాకు కనబడి మంచి మాటలు చెప్పి, నా భవిష్యత్తు కోసం మీ సొంత డబ్బు ఖర్చు పెట్టడానికి సిద్ధపడకపోతే, ఈపాటికి నేను పెద్ద కేటుగాడినై పోయి వుండేవాడిని. నన్ను సరయిన దారిలోకి మళ్ళించిన గురువులు మీరే సర్!"

అప్పటికి నమ్మకం కుదిరింది కృష్ణాజీకి.

ఆనందంగా నవ్వుతూ అన్నాడు.

"అయితే యిప్పుడు నాకు గురుదక్షిణ యివ్వడానికే వచ్చానంటావ్!"

"అవును సర్!"

"గురుదక్షిణగా నేనేం చెబితే అది చేస్తావా?"

"నా ప్రాణాలు యిమ్మని అడగండి! యిప్పుడే....మీ ముందే...."

"అంత అఘాయిత్యం వద్దులే!"

"ఏదయినా సరే! జస్ట్ ఆర్డర్ మీ!"

కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయాడు కృష్ణాజీ.

తర్వాత గంభీరంగా అన్నాడు.

"అలా అయితే నేను నిన్నొకటి కోరుతాను రాజా!"

చెవులు రిక్కించాడు రాజా.

కృష్ణాజీ అన్నాడు.

"రాజా! కీర్తిని పట్టుకునే ప్రయత్నం పెట్టుకోకు. అదే నేను నిన్ను అడిగేది!"

విని, నిర్ఘాంతపోయాడు రాజా.

"ఏమిటి?"

మళ్ళీ స్థిరంగా అన్నాడు కృష్ణాజీ.

"కీర్తిని పట్టుకునే ప్రయత్నం చెయ్యకు.

నువ్వు తలుచుకుంటే పట్టుకోగలవు అతన్ని. అందుకే వద్దంటున్నాను."

"మీరు చెప్పేది నాకు అర్థం కావడంలేదు."

బాంబ్ షెల్ పేల్చినట్లు అన్నాడు కృష్ణాజీ.

"అర్థం కావడం లేదా! అయితే విను. కీర్తి నా కన్నకొడుకు."

నోట మాట రాక, నిశ్చేష్టుడై వుండిపోయాడు రాజా.

కృష్ణాజీ అన్నాడు.

"అవును! కీర్తి నా కొడుకే! పసితనంలోనే తప్పిపోయాడు. వాడి కోసం ఎంతో వెదికాం మేము. దొరకలేదు. ఆ దిగులుతోనే మంచం పట్టింది నా భార్య.

ప్రస్తుతం చావు బతుకుల్లో వుంది.

కీర్తి వస్తాడు, తిరిగి వస్తాడని యిన్నాళ్ళూ కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురు చూశాం.

చివరికి తిరిగి వచ్చాడు కీర్తి.

కానీ ఎలా వచ్చాడు?

ఇంటర్నేషనల్ క్రూక్‌గా తిరిగి వచ్చాడు.

ఈ నిజం జీర్ణించుకోలేక పోతున్నాను నేను.

కీర్తి! నా కన్న కొడుకు!

అతి నిజాయితీ పరుడయిన ఒక పోలీసు ఆఫీసరు కడుపున ఒక దొంగ పుట్టాడా?

న్యాయంగా అయితే నేను వాడిని అరెస్టు చేసి ఉండాల్సింది ఈపాటికి.

ఎన్నో కేసులు సాల్వ్ చేశాను నేను. వాటిల్లో చాలా కేసులు ఇంతకంటే వంద రెట్లు కష్టమైనవి.

కానీ యిప్పుడు అలా చెయ్యలేకపోతున్నాను.

ఎందుకు?

పుత్ర వ్యామోహం.

రాజా! నా లోపం నాకు తెలుసు.

పుత్ర వ్యామోహం నన్ను కట్టిపడేస్తోంది.

వాడిని ఏమీ చేయలేకపోతున్నాను."

రాజా పెదిమలు బిగుసుకుపోయాయి. మాట్లాడకుండా వింటున్నాడు.

కృష్ణాజీ దీర్ఘంగా శ్వాస తీసుకుని, మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు.

"తెలియక చేస్తున్న పని కాదు యిది! అన్నీ తెలిసి చేస్తున్న పనే! తెలివైన మూర్ఖుడిని నేను. నిజం రాజా! ధృతరాష్ట్రుడి కథ నీకు తెలిసే వుంటుంది.

చాలా మంచివాడాయన! కానీ పుత్ర వ్యామోహం ఆయన్ని పూర్తిగా మార్చేసింది. అందువల్లే అన్యాయాలు చేశాడు.

అప్పట్లో ధృతరాష్ట్రుడు ఎలా ఫీలయి వుంటాడో, ఆయన సైకాలజీ ఏమిటో, యిప్పుడు నాకు చాలా క్లియర్‌గా అర్థమౌతుంది రాజా."

తన మొహంలో భావాలు కృష్ణాజీకి కనబడకుండా, తల వంచుకున్నాడు రాజా.

కృష్ణాజీ మళ్ళీ అన్నాడు.

"ఈ స్వార్థం అనేది ఉందే! చాలా చిత్రమైంది రాజా. ఒక విశేషం చెబుతాను.

నేను ఒరిజినల్‌గా చాలా సింపుల్ మాన్‌ని.

పెద్దగా అలవాట్లు ఏమీ లేవు నాకు. నాకు వచ్చే జీతమే నాకు పుష్కలంగా సరిపోతుంది.

ఒకవేళ నేను అసలు పెళ్ళే చేసుకోకుండా వుండిపోయాననుకో! అప్పుడు నా జీతంలో ముప్పాతిక మూడొంతులు మిగిలిపోతూ వుండేది. దానితో యింకా ఎన్నో మంచి పనులు చేసి వుండేవాడిని. నేనేమో దాదాపు సన్యాసిగా బతుకు వెళ్ళమార్చేసి వుండేవాడిని.

కానీ పెళ్ళి చేసుకున్నాను – లోక సహజం కాబట్టి.

అప్పుడు మొదలైంది కాస్త తాపత్రయం.

సహజంగానే!

తప్పదు కదా!

కట్టుకున్న తర్వాత భార్య మంచి చెడ్డలు చూడాలి. అవసరాలు కొద్దిగా పెరిగాయి.

కానీ రాజా–

మనిషికి అసలు సిసలైన స్వార్థం ఎప్పుడు మొదలవుతుందో తెలుసా?

బిడ్డలు పుట్టాక!

బిడ్డలు పుడతారు.

ఇంక అప్పటి నుంచి తాపత్రయం వెయ్యిరెట్లు అవుతుంది.

ఆ కొత్త జీవితాలని మొదటినుంచి చివరిదాకా ప్లాన్ చెయ్యాలి.

ఐదేళ్ళ వయసు దాకా పిల్లలకి సాధారణంగా వచ్చే రకరకాల అనారోగ్యాలు!

ఆ తర్వాత స్కూలు సీట్ల కోసం ఆరాటం!

వాళ్ళు టీన్స్‌లోకి వచ్చాక వాళ్ళ ప్రవర్తన – మనం గైడెన్స్ యివ్వడం!

ఆ తర్వాత కాలేజిలో సీట్లు –

చదువులయ్యాక ఉద్యోగాల కోసం ప్రయత్నం –

ఉద్యోగపర్వం తర్వాత పెళ్ళిళ్ళు, పేరంటాలు.

ఒకవైపు యివన్నీ చేస్తూనే ఉన్నా, మరోవైపున మనసులో మళ్ళీ గుబులు.

వాళ్ళు జీవితంలో సక్సెస్ కాకపోతే ఎలా?

వాళ్ళు సక్సెస్ అవుతారో లేదో అన్న ఆరాటంతో, వాళ్ళు సక్సెస్ కాలేరనే భావనని భరించలేక –

ఇప్పటి నుంచే వాళ్ళ భద్రత కోసం ఆస్తులు, పాస్తులు కొనడం, వెనకెయ్యడం, దానికోసం దగా, దోపిడీ, అన్యాయాలు, అక్రమాలు, అవినీతి –

అర్థమయ్యిందా రాజా! స్వార్థం ఎక్కడ ఎలా పెరుగుతోందో?

చాలామందిని చూశాను నేను.

సొంతానికి సంపాదించుకోవడం కన్నా, ముందు తరాల వాళ్ళకోసం ఆరాటపడి సంపాదించేదే ఎక్కువ.

అలా వుంటుంది పిల్లల పట్ల వ్యామోహం!

నేను ఇవన్నీ తెలిసే చేస్తున్నాను రాజా!

నిజమే! అన్నీ తెలిసే చేస్తున్నాను.

అన్ని విషయాల్లో మంచివాడినే నేను.

కానీ కన్న కొడుకు విషయానికొచ్చేసరికి నీతీ, నిజాయితీ వెనకబడి పోతున్నాయ్! ఏం చెయ్యను.

రాజా! ఈ ప్రపంచంలో అన్నిటికంటే, అందరికంటే నాకు నా కొడుకు ముఖ్యం!

నిజం రాజా!

నన్ను నమ్ము!

నన్ను గురించి నువ్వు తప్పుగా అర్థం చేసుకున్నా నేను చెయ్యగలిగింది ఏమీ లేదు.

నేను ఉన్న మానసికస్థితి ఇది.

రాజా! నీకు ఇంకా వివరంగా చెప్పనవసరం లేదు.

నువ్వు నాకు ఇవ్వవలసిన గురుదక్షిణ ఇదే!

నా కొడుకు కీర్తిని నాకు దక్కించడం!

వాడిని నువ్వు పట్టుకుని ప్రభుత్వానికి అప్పగించకుండా ఉండడం! ఇదే నేను కోరే గురుదక్షిణ. కాదనకు!" అన్నాడు ఆర్తిగా.

వింటున్న రాజాకి ప్రపంచం అంతా ఒక్కసారిగా తలక్రిందులై పోతున్నట్లు అనిపించింది.

ప్రళయం అతి దగ్గరలోనే ఉన్నట్లనిపించింది.

ప్రకృతి విలయతాండవం చేస్తున్నట్లు అనిపించింది.

అంతా మనసులోనే!

తను ఎరిగిన కృష్ణాజీ ఊహల్లోనే మరణించి, అతని స్థానంలోకి ఉప్పు, కారం తింటూ రాగద్వేషాలకు ఏ మాత్రం అతీతుడుకాని ఒక అతి మామూలు మనిషి వచ్చేసినట్లనిపించింది.

నిప్పులాంటి మనిషీ, నీతికీ, నిజాయితీకీ మారు పేరు అయిన కృష్ణాజీ నైతిక మరణానికి సంతాపం పాటిస్తున్నట్లు రెండు నిమిషాలపాటు మౌనంగా ఉండిపోయాడు రాజా.

తర్వాత గొంతుని స్వాధీనంలోకి తెచ్చుకుని, చాలా మామూలుగా అన్నాడు –

"ఓకే సర్! కీర్తిని పట్టుకునే ప్రయత్నం ఏదీ చెయ్యను నేను. నిజానికి నాకు ఆ అవసరం కూడా లేదు! అది నా డ్యూటీ కాదు కూడా! మీకు అసిస్ట్ చెయ్యాలనే ఉద్దేశ్యంతోనే కీర్తిని పట్టుకుంటానని ఆఫర్ చేశాను. అంతకు మించి ఇంకేం లేదు. సర్? మే ఐ టేక్ లీవ్?"

"రాజా! వీలైతే నన్ను క్షమించు!" అన్నాడు కృష్ణాజీ సిగ్గుపడుతున్నట్లు.

సంతోషంలేని నవ్వు నవ్వాడు రాజా.

"ఇట్సాల్ రైట్ సర్!"

అని చెప్పి నెమ్మదిగా బయటికి వచ్చాడు.

అతనికి అర్జెంటుగా అర్పితని చూడాలనిపించింది.

లేకపోతే తను మళ్ళీ మామూలు మనిషి కాలేదు.

రాజా తన కావసాకీని స్టార్ట్ చెయ్యబోయేటంతలో, వేగంగా వచ్చి అతని పక్కనే వచ్చి ఆగింది ఒక గవర్నమెంటు కారు.

అందులో ఉంది అంకిత.

అంకిత!

అర్పిత వాళ్ళ అక్కయ్య.

డిప్యూటీ హోం మినిస్టర్ విత్ ఇండిపెండెంట్ ఛార్జ్!

"ఆ మోటార్ సైకిల్ అక్కడ ఉంచెయ్! కారెక్కు! అర్జెంటు పని వుంది!" అంది అధికారం ధ్వనిస్తున్న గొంతుతో.

ఒకసారి సందేహంగా ఆమె వేపు చూశాడు రాజా.

"చూస్తావేం! కారెక్కు!" అంది అంకిత.

మోటార్ సైకిలు స్టాండ్ వేసి, లాక్ చేసి, కారెక్కాడు రాజా. ఫ్రంట్ సీట్లో కూర్చున్నాడు.

ఆ తర్వాత యింక అతన్ని పట్టించుకోలేదు అంకిత.

తన పక్కన కూర్చుని ఉన్న మనిషితో ఏదో సీరియస్‌గా మాట్లాడటం మొదలెట్టింది.

కొద్ది నిమిషాల తర్వాత అంకిత బంగళా ముందు ఆగింది కారు.

"లోపలికి రా!" అంది అంకిత క్లుప్తంగా.

ఆమె వెంట లోపలికి వెళ్ళాడు రాజా.

డ్రాయింగ్ రూంలోనే ఆగిపోబోయాడు అతను.

"పైకి రావచ్చు!" అంది ఆమె మేడమీదికి దారితీస్తూ.

మేడమీద ఒక వరండా వుంది.

అందులో కుర్చీలు వేసి వున్నాయి.

ఒక వేపున ఫ్యాషనబుల్‌గా తయారు చేసిన ఒక చిన్న బార్ కనబడుతోంది.

"డ్రింక్?" అంది అంకిత చాలా మామూలుగా.

"డ్యూటీలో వున్నాను" అన్నాడు రాజా.

"డ్యూటీలో ఉన్నప్పుడు ఇంకా ఏమేం చెయ్యవు?" అంది అంకిత భావగర్భితంగా.

అలా అంటూ ఉంటే ఆమె పమిట జారిపోయింది.

తెల్ల జాకెట్ కింద నల్ల బ్రా ప్రస్ఫుటంగా కనబడుతోంది.

అయినా రాజా దృష్టి ఏ మాత్రం చెదరకపోవడం గమనించి, పమిట మళ్ళీ సరిగా వేసుకుంది ఆమె.

"ఏమంటున్నాడు కృష్ణాజీ?" అంది ఆరాగా.

భుజాలు ఎగరేసి, ఏం మాట్లాడకుండా ఊరుకున్నాడు రాజా.

"విజయకుమారి అతనికి అల్టిమేటమ్ ఇచ్చిందిటగా? నెల్రోజుల్లోగా కీర్తిని పట్టుకోలేకపోతే పనిష్మెంటు తప్పదని డెడ్లైన్ పెట్టిందటగా?"

తల పంకించాడు రాజా.

"నీకు మంచి ఇంపార్టెంట్ అసైన్మెంటు కావాలా?" అంది అంకిత.

"ఏ పని ఇచ్చినా చేస్తాను గవర్నమెంటు జీతం తీసుకుంటున్నాను కదా" అన్నాడు రాజా ముక్తసరిగా.

హఠాత్తుగా అంది అంకిత.

"నువ్వూ, అర్పితా ప్రేమించుకుంటున్నారా?"

"అవును!"

"ఏవుంది దాన్లో! నీతి సూత్రాల కాసెట్లాంటి నోరుతప్ప! నా వేపు వచ్చెయ్! నా భర్తగా వుండు. అదే నేను చెప్పిన ఇంపార్టెంట్ అసైన్మెంట్! నువ్వూ, నేనూ కలిశామంటే రాజకీయాలని ఒక ఊపు ఊపెయ్యవచ్చు! ఎన్ని జీతపు రాళ్ళు కలిస్తే ఒక కోటి అవుతుందీ" అంది.

"మనిషికి తిండీ, బట్టా, తల దాచుకోవడానికి గూడూ యిచ్చేంత లిమిట్ వరకూ డబ్బుని డబ్బు అనొచ్చు! ఆ తర్వాత అది గడ్డి కిందే లెక్క? నాకెందుకు కోట్లు" అన్నాడు రాజా.

"డబ్బు విలువ అందరికీ అర్థం కాదు."

"అర్థం చేసుకోవలసిన విలువలు ఇంకా చాలా వున్నాయి."

"డబ్బే నిత్యం! డబ్బే సత్యం! ఇది ప్రతి మనిషీ తన జీవితంలో ఏదో ఒక

స్టేజిలో గ్రహిస్తాడు. నాలాగా చిన్నతనంలోనే గ్రహించిన వాళ్ళు బాగుపడతారు" అంది ఆమె.

"ఓకే! మీ ఫిలాసఫీ మీది! నా ఫిలాసఫీ నాది! మే ఐ టేక్ లీవ్?"

"మళ్ళీ కలుద్దాం! యింతకంటే ప్లెజెంట్ అకేషన్‌లో! ఏం?"

చిరునవ్వు నవ్వి, అక్కడ నుంచి ఊళ్ళోకి వెళ్ళి, తన మోటార్ సైకిలు తీసుకుని, అర్పిత ఇంటికి వచ్చాడు రాజా.

వివర్ణమైపోయి వున్న రాజా మొహాన్ని చూడగానే కంగారు పడిపోయింది అర్పిత.

"వంట్లో బాగాలేదా ఏం?" అంది ఆదుర్దాగా.

"అర్జెంటుగా కాఫీ ఇవ్వు! ఉత్త డికాషన్! అంతే! ఆ తర్వాత నీ ఒళ్ళో పడుకోనివ్వు! అరగంట సేపు మాట్లాడించకు" అన్నాడు రాజా.

మారుమాట్లాడ కుండా అతను చెప్పినట్లే చేసింది అర్పిత.

కృష్ణాజీతో జరిగిన సంభాషణ గురించి అర్పితతో చెప్పేద్దామా అని అనుకున్నాడు రాజా.

కానీ ఆ చేదు నిజాన్ని తన మనసులోనే వుంచుకోవడం మంచిదని అతనికి అనిపించింది.

ఈ విచిత్రమైన అవస్థలో నుంచి, మనో వికారంలో నుంచి తను ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది.

తను ఈ విషయాన్ని గురించి ఎంత త్వరగా మర్చిపోగలిగితే అంత మంచిది.

కానీ....

మర్చిపోవడం అనేది సాధ్యమేనా అసలు?

అందుకని తెచ్చిపెట్టుకున్న సరదాతో అన్నాడు.

"నా ప్రేమ కోసం నీతో ఇంకో అమ్మాయి పోటీపడడం లైక్ చేస్తావా?"

"అలాంటి వేషాలు కూడా వేస్తున్నావా ఏం?"

"వెయ్యమంటోంది అంకిత."

"అయితే జాగ్రత్తగా వుండాల్సిందే!"

"ఎవరు?"

"నేను"

"ఇద్దరూ నవ్వుకున్నారు.

ఆ చిన్న ఇన్సిడెంటుతో అర్థమయిపోయింది రాజాకి. ట్రూలవ్ అంటే ఏమిటో?

ఒకళ్ళ మీద ఒకళ్ళకి నమ్మకం!

అభిమానం!

సానుభూతి!

బాగా ఎండలో తిరిగి చితచితలాడుతున్న ఒంటితో యింటికి తిరిగి వచ్చాక, చన్నీళ్ళ షవర్ కింద నిలబడి, కొలోన్ సోపుతో, సన్‌సిల్కు షాంపూతో స్నానం చేస్తే ఒళ్ళెంత హాయిగా ఉంటుందో, కృష్ణాజీ అఫెయిర్ తర్వాత అర్పితతో మాట్లాడితే రాజా మనసు కూడా అలాగే ఫ్రెష్‌గా అయ్యింది.

మళ్ళీ ఫ్రెష్‌గా ఆలోచనలు!

ఫ్రెష్‌గా ధైర్యం!

ఫ్రెష్‌గా ఉత్సాహం!

కృష్ణాజీ చెప్పినది విని ఆయనలో వచ్చిన ఊహాతీతమైన మార్పుని కళ్ళారా చూశాక, తను హారిబుల్‌గా అప్‌సెట్ అయిపోయిన మాట నిజమే!

కానీ అలా ఎంతసేపు!

ఒక్క గంట!

ఇప్పుడనిపిస్తోంది!

అసలు అప్‌సెట్ కావడానికేముంది ఇందులో?

అందరిలాగానే ప్రవర్తించాడు కృష్ణాజీ కూడా.

ఇన్నాళ్ళూ ఆయనలో ఉన్న మంచితనమే తనకు కనబడింది.

ఆయనలో ఏ మూలో ఉన్న స్వార్థం, పుత్రవాత్సల్యం రూపంలో యిప్పుడు బయటపడి కాసేపు తనని భయపెట్టింది.

ఇది కృష్ణాజీ తప్పుకాదు.

ముమ్మాటికీ తన తప్పే!

ఎందుకనీ?

కృష్ణాజీని మనిషిగా చూడలేదు తను! పురుషోత్తముడని భావించాడు.

తప్పుకాదూ మరి.

మంచితనాన్ని అంచనావేసే పద్ధతి యిది కాదు.

అసలు మంచి మనిషి అంటే ఎవరు?

మనుషుల్లో నూటికి నూరుపాళ్ళు మంచివాళ్ళుగానీ నూటికి నూరుపాళ్ళు చెడ్డవాళ్ళుగానీ ఉండడం అరుదు.

అందరిలోనూ కాస్తో కూస్తో మంచితనం ఉంటుంది.

అందరిలోనూ కాస్తో కూస్తో చెడు కూడా ఉంటూనే ఉంది.

అయితే –

ఇటీజే క్వశ్చన్ ఆఫ్ డిగ్రీ!

కొందరిలో మంచితనం పాలు ఎక్కువై వుండవచ్చు.

ఇంకొందరిలో చెడు లక్షణాలే మంచిని డామినేట్ చేస్తూ వుండవచ్చు.

మనసులనీ, మనస్తత్వాలనీ పూర్తి తెలుపులోనో, పూర్తి నలుపులోనో చూడడం తప్పు.

మనస్తత్వాలు వేరియస్ షేడ్స్ ఆఫ్ గ్రేలో వుంటాయి. నలుపు, తెలుపుల కలయిక.

కొన్ని మనస్తత్వాలు డార్క్‌గ్రే!

కొన్ని మనస్తత్వాలు లైట్‌గ్రే.

అంతే!

ఈ మంచిని గురించి చెప్పుకోవడంలో ఇంకో విశేషం కూడా ఉంది.

మనిషి అంటేనే మంచి చెడుల కలయిక అనేది నిర్వివాదాంశం.

అయితే, పరిసరాల ప్రభావం, పరిస్థితుల ప్రభావం, చుట్టూ వున్నవారి ప్రవర్తన ప్రభావం మనిషి మీద ఉంటుంది.

ఒక మనిషి చాలా మంచివాడు కావచ్చు!

కానీ అతని చుట్టూ వున్న పరిస్థితులు చెడుని ప్రేరేపించేవయితే, అతనూ చెడు మార్గంలోపోయే అవకాశం వుంది.

అలాగే, ఒక దుర్మార్గుడు సన్మార్గుల మధ్య పడినా అతను మంచి మార్గంలోకి మళ్ళే అవకాశాలు ఎక్కువవుతాయి!

స్వతహాగా కృష్ణాజీ మంచివాడు. అందుకు తిరుగులేదు.

అయితే –

ఆయన అను నిత్యం ఎదుర్కునే పరిస్థితులు ఎలాంటివి?

ప్రతికూలత ఎంతటిది.

ఎంతమంది పర్వర్టెడ్ పర్సన్స్‌తో ఆయన ప్రతిరోజూ డీల్ చెయ్యాలి?

వీటన్నిటి ప్రభావం ఇప్పుడు ఆయన యిలా మారిపోయేలా చేసి ఉండవచ్చుకదా!

అక్కడిదాకా ఆలోచించాక –

హఠాత్తుగా అనిపించింది రాజాకి.

ఈ లెఖ్ఖన తను కూడా మామూలు మనిషేనా?

తను కూడా ఎమోషన్స్‌కి లొంగిపోయి, గురువుగారి మీద అభిమానాన్ని చంపుకోలేక, ఆయన చెడుని సమర్థించడానికి చూస్తున్నాడా?

దానితోబాటే ఇంకోటి కూడా అనిపించింది రాజాకి.

రేపు తను ఈ అర్పితని పెళ్ళి చేసుకుని పిల్లల్ని కంటే, తను కూడా కృష్ణాజీ లాగానే అయిపోతాడా?

"నా పిల్లలు, నా పిల్లలు" అనుకుంటూ డ్యూటీని మర్చిపోతాడా?

చటుక్కున అర్పిత వైపు తిరిగి అన్నాడు రాజా

"అర్పితా! మనం పెళ్ళి చేసుకున్నాసరే పిల్లల్ని కనొద్దు!"

వింతగా చూసింది అర్పిత.

"ఉన్నట్లుండి ఇదేమిటి?" అంది.

"అదంతే! అందుకు ఇష్టమైతేనే నన్ను చేస్కో, లేకపోతే ఊర్కో" అన్నాడు.

అతను పైకి చెప్పకపోయినా, అతని మనసులో వీస్తున్న తుఫాను ప్రభావాన్ని గ్రహించగలిగింది అర్పిత.

అందుకే, అప్పటికేం మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయింది.

ఇంకాసేపటి తర్వాత అక్కడి నుంచి నేరుగా వాసూ దగ్గరికి వెళ్ళాడు రాజా.

"ఇవాళ తప్పతాగి పడిపోవడానికే ఇక్కడికి వచ్చాను. ఎందుకని అడక్కు!" అన్నాడు రాజా.

ఎందుకని అడగలేదు వాసు. మారు మాట్లాడకుండా విస్కీ బాటిలు ఓపెన్ చేశాడు. స్పృహ తప్పేదాకా తాగాడు రాజా. తర్వాత వామిట్ చేసేసుకున్నాడు.

అప్పుడు నిద్ర పట్టింది అతనికి.

కలత నిద్ర!

కృష్ణాజీ విషయం గురించి చాలా విధాలుగా మనసు సరిపెట్టుకుందామని చూశాడు గానీ సరిపెట్టుకోలేక పోయాడు.

విపరీతంగా అప్‌సెట్ అయిపోయాడు అతను.

అది నిజం!

✦ ✦ ✦

కృష్ణాజీ అరుస్తున్నట్లు ఆర్డర్స్ ఇష్యూ చేస్తుంటే, అతను మీదపడి కరుస్తున్నట్లు అనిపిస్తోంది సబార్డినేట్ శ్రీనివాస్‌కి.

పోలీసు డిపార్ట్‌మెంటులో అంతే.

పైవాడు క్రిందవాడిని బూతులు తిడతాడు!

ఆ క్రిందవాడు తన క్రిందవాడి మీద ఆ కోపం అంతా చూపిస్తాడు.

ఛెయిన్ రియాక్షన్!

హెూం మినిస్టర్ విజయకుమారి తనని తిట్టిన తిట్లన్నీ తను శ్రీనివాస్‌ని తిట్టాడు కృష్ణాజీ.

“నిద్రపోతున్నావా? గుర్రుపెడుతున్నావా? కుర్చీలో కూర్చుని బొజ్జ పెంచుతున్నావా?

కీర్తిని ఎందుకు పట్టుకోలేకపోతున్నావ్?

మొగతనం చచ్చిందా?

అర్జెంటుగా రెయిడ్ ఏర్పాటు చెయ్.

ఇన్ ఎఫిషియెన్సీని నేను టాలరేట్ చెయ్యను.

అర్థమయ్యిందా? వానిష్ ! వెళ్ళు! కీర్తిని అరెస్టు చేయడానికి ఏర్పాట్లు చెయ్! ఏడు సముద్రాల అవతల ఒంటిస్థంభం మేడలో దాక్కున్నా వదలకు! గెట్‌లాస్ట్”

శ్రీనివాస్‌ని తిడుతున్నంతసేపూ కృష్ణాజీకి తెలుసు.

ఆ కీర్తి శ్రీనివాస్‌కి దొరకదు!

శ్రీనివాస్‌కే ఏమిటి?

నరమానవుడికెవడికీ కూడా దొరకదు.

ఎందుకంటే, అతను ఏడు సముద్రాల అవతల ఒంటి స్థంభం మేడలో దాక్కోలేదు.

స్ట్రెయిట్‌గా హోం మినిస్టర్‌గారి బెడ్‌రూంలోనే మకాం పెట్టేశాడు మాస్టర్ క్రిమినల్ కీర్తి.

కీర్తి! తన కొడుకు!

ఆ విషయం తనకి తెలియదనుకుంటోంది ఈ హోం మినిస్టర్.

కానీ తనెవరు?

కృష్ణాజీ!

బార్న్ డిటెక్టివ్!

ఈ రహస్యాన్ని అతి సులభంగానే కనిపెట్టేశాడు తను.

ఇప్పుడు తన మనసులో మెదులుతున్న భావాలు కాక్‌టెయిల్‌లా కదిలించి వేస్తోంది కృష్ణాజీని.

కీర్తి వీళ్ళెవరికీ దొరకదులే అన్న ధైర్యం.

అయ్యో! తప్పు చేశానేమోనన్న భయం.

తప్పు చేస్తోంది ఈ ఒక్క విషయంలోనేగదా అన్న ఊరట!

శ్రీనివాస్‌ని అసవసరంగా తిడుతున్నందుకు బాధ.

తను తన ఆత్మసాక్షికి విరుద్ధంగా ప్రవర్తించనన్ని రోజులూ యిలాంటి రంపపుకోత లేదు తనకి.

ఇప్పుడది మొదలయింది.

శ్రీనివాస్ భయభక్తులతో చెప్పడం మొదలెట్టాడు.

"సర్! కీర్తిని యివాళ సాయంత్రంలోగా అరెస్టుచేసే అవకాశాలు వున్నాయి"

మనసులోని కలవరపాటుని కనబడనివ్వకుండా అన్నాడు కృష్ణాజీ –

"చాలా భరోసాగా చెప్పేస్తున్నావే?"

"100% శాతం భరోసాతోనే చెబుతున్నాను సర్!"

"ఏమిటి నీ ధైర్యం?"

చిన్నగా నవ్వాడు శ్రీనివాస్.

"దాదాపు ఒక అద్భుతంలాంటిదే జరిగింది. కీర్తికి క్లోజ్ కాన్ఫిడెంట్ అయిన ఒక వ్యక్తి వచ్చి మనకి లొంగిపోయాడు.

హీ స్టార్టెడ్ సింగిల్ సర్! కీర్తి రహస్యాలన్నీ ఒక్కొక్కటే బయట పెట్టేస్తున్నాడు."

బిగుసుకుపోయి వింటున్నాడు కృష్ణాజీ.

తర్వాత అతికష్టం మీద గొంతు పెకలించుకుని అన్నాడు –

"ఏమిటా రహస్యాలు?"

"కీర్తి డైరీ అంతా వప్పచెప్పేస్తున్నాడనుకోండి సర్!

అతని వ్యవహారాలు, అతని బిజినెస్ డీలింగ్స్, ఎవరి దగ్గర నుంచి ఎంతెంత, ఎలా వసూలు చేస్తున్నాడో....

సర్! అన్నిటికంటే ముఖ్యంగా....అతను ఇవ్వాళ ఎక్కడ వుంటాడో....అన్నీ చెప్పేశాడు సర్"

"కీర్తి....ఇవాళ ఎక్కడుంటాడు?" అన్నాడు కృష్ణాజీ.

అతని గొంతు కొద్దిగా జీరబోయింది.

అది గమనించలేదు శ్రీనివాస్.

ఎగ్జయిటెడ్‌గా అన్నాడు –

"కీర్తి తన అనుచరులతో పాటు నర్సాపూర్ అడవుల్లోకి వెళుతున్నాడు సర్!

అక్కడ అతన్ని ట్రాప్ చేయటానికి ఏర్పాట్లు రెడీ అయ్యాయి. వీ విల్ కాచ్ హిమ్ డెడ్ ఆర్ అలైవ్"

అని సెల్యూట్ చేసి, వెళ్ళిపోయాడు శ్రీనివాస్.

నిస్త్రాణగా వెనక్కి జారగిలబడిపోయాడు కృష్ణాజీ.

కీర్తిని పట్టుకుంటాడట!

డెడ్ ఆర్ అలైవ్!

✦ ✦ ✦

సాయంత్రం అవుతుండగా కృష్ణాజీ ఫోను రింగయింది.

లైన్లో అవతలి వేపున హెూం మినిస్టర్ విజయకుమారి.

"యస్ మేడమ్!" అన్నాడు కృష్ణాజీ అనీజీగా.

"నీ అంత ఎఫిషియంట్ ఆఫీసర్ ఈ భూమ్మీద వుండడు" అంది విజయకుమారి ఆగ్రహంగా.

"మేడమ్!"

"సిగ్గూ ఎగ్గూ వుండదా మీ ఆఫీసర్లకి. ఇంత ఘోరం జరిగి పోయినా రాయిలాగా చలనం లేకుండా ఎలా వుండగలుగుతున్నావ్?" అంది విజయకుమారి.

"మేడమ్? ఏమయింది?" అన్నాడు కృష్ణాజీ సాధ్యమైనంత మర్యాదగా.

"నీ సబార్డినేట్....శ్రీనివాసేనా....యంగ్ బాస్....పాపం ఫినిషైపోయాడు."

కుర్చీలో నిటారుగా కూర్చున్నాడతను.

"మేడమ్!" అన్నాడు షాక్ అయిపోయి.

"అవును! రెయిడ్ చెయ్యడానికి ఆ ఇన్ఫార్మర్తో కలిసి వెళ్ళింది శ్రీనివాస్ పార్టీ.

నర్సాపూర్ అడవుల్లోకి తీసుకెళ్ళాడు ఇన్ఫార్మర్.

అక్కడ వీళ్ళకోసం కాచుకుని వున్నారు కీర్తి మనుషులు.

ఏ.కే. 56 రైఫిల్‌తో పిట్టల్ని కాల్చినట్లు కాల్చిపారేశారు పోలీసు పార్టీని.

శ్రీనివాస్ శవానికి తల నరికేశారు.

నీ మనుషులు ఎలా మోసపోయారో అర్థమయ్యిందా?

ఇన్‌ఫార్మర్‌నంటూ వచ్చి లొంగిపోయిన మనిషి కీర్తిని వదిలేసి వచ్చినవాడు కాదు.

స్వయంగా కీర్తి పంపితే వచ్చిన మనిషే.

చాలా తెలివిగా మీ మనుషుల్ని నమ్మించి, కీర్తి స్థావరం చూపిస్తానని తీసికెళ్ళాడు. మీవాళ్ళు తేలిగ్గా మోసపోయారు. మీ తెలివితక్కువతనం ఖరీదు ఏడుప్రాణాలకి లెక్క తేలింది.

కృష్ణాజీ! యూ ఆర్ సింప్లీ యూస్‌లెస్"

ఆ వార్త వినగానే ముందు సంతోషం, ఆ వెంటనే విచారం ఆవరించాయి కృష్ణాజీ మనసుని.

పోలీసుపార్టీ తన కొడుకుని చంపలేకపోయినందుకు సంతోషం!

తన కొడుకు పోలీసు పార్టీని చంపినందుకు విచారం!

"కృష్ణాజీ! గుర్తుంచుకో. ఇంకొక్క వారమే నీకు టైముంది. ఆ తర్వాత బహుశా నువ్వింక ఆఫీసుకి రావలసిన అవసరం వుండదు. అలా టాకిల్ చేస్తాను నీ కేసుని" అంది విజయకుమారి.

అని పెద్ద చప్పుడు వచ్చేటట్లు విసురుగా పెట్టేసింది రిసీవర్‌ని.

స్థాణువైపోయినట్లు కదలకుండా కూర్చున్నాడు కృష్ణాజీ.

పదిహేను నిమిషాల తర్వాత అతనికొక వైర్లెస్ మెసేజ్ వచ్చింది.

హెూం మినిస్టర్ చెప్పిన న్యూసే.

అప్పుడు స్ఫురించింది కృష్ణాజీకి.

తనకు వైర్‌లెస్ మెసేజ్ రాకముందే విజయకుమారి దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది.

నిజానికి ఆమెకంటే తనకే ముందు తెలిసి వుండాలి ఈ వార్త.

అంటే....కీర్తే స్వయంగా చెప్పి వుంటాడు విజయకుమారికి ఈ విషయం.

ఒక మహానేరంలో తను కూడా భాగస్వామి అవుతున్నాడేమో అన్న భయంతో కృష్ణాజీకి ఒక్కసారిగా బీ.పి. పెరిగిపోయినట్లయింది.

ఆ తర్వాత మళ్ళీ అతని ఆలోచనలు శ్రీనివాస్ మీదికి మళ్ళాయి.

స్మార్ట్‌గా వుండే కుర్రాడు.

అందగాడు కూడా.

వర్క్ అంటే చాలా కమిట్‌మెంట్ వుంది అతనికి.

డ్యూటీ కోసం ఇంత యంగ్ ఏజ్‌లోనే ప్రాణాలు అర్పించేశాడు.

పాపం! ఎవరు కన్న బిడ్డడో!

ఆ తల్లిదండ్రుల మనసులు ఎంతగా కోతకి గురవుతాయో!

కడుపుతీపి అందరికీ ఒక్కలాగే ఉంటుందా?

ఉండదేమో?

ఉంటే, ఆ దాసు అనే నికృష్టుడు రాజాని అంత ఘోరంగా ఎట్లా ట్రీట్ చేస్తాడు?

రాజా అసలు తన కొడుకే కానట్లు ఎట్లా ప్రవర్తిస్తాడు?

అయితే, ఈ లెక్కన తనకి పుత్రప్రేమ మరీ అతిగా వున్నట్టా?

ఏమో?

ఆ రాత్రి ఆరు స్లీపింగ్ టాబ్లెట్లు వేసుకుంటేగానీ కృష్ణాజీకి నిద్ర అనేది పట్టలేదు.

తెల్లవారుజామున కొద్దిగా కునుకు పడుతుండగా, ఉలికిపాటుతో గ్రహించాడు కృష్ణాజీ.

కీర్తి తిరిగి వచ్చాక –

కీర్తి తన కొడుకని తెలిశాక –

తను కంటినిండా నిద్రపోయిన రోజు ఇంతవరకూ లేదు.

✦ ✦ ✦

శ్రీలంక నుంచి వచ్చిన తమిళ తీవ్రవాదుల ట్రైనింగ్ క్యాంపులు మొన్న మొన్నటిదాకా తమిళనాడులో చాలా వుండేవి.

కనీసం ఇరవై వుండి ఉండేవని అంచనా!

నగరం బయట ఒక ప్రదేశంలో ఉన్న ట్రయినింగ్ కాంప్‌కి కొంచెం దూరంలో ఆగి చూస్తున్న రాజాకి ఎల్.టి.టి.ఈ. ట్రయినింగ్ కాంపులు గుర్తొచ్చాయి.

పరిసరాలని జాగ్రత్తగా పరికించి చూశాడు.

తను ఇదివరకు ఎక్కి చూసిన తాటి చెట్టు యిప్పుడక్కడ లేదు.

కొట్టేశారన్నమాట!

తాటి చెట్టు ఎక్కి, ఆ లోపల జరుగుతున్నదేమిటో చూడవచ్చుననే ఆలోచన వాళ్ళకు మొదట్లో వచ్చి ఉండదు.

ఆ తర్వాత వచ్చి ఉంటుంది.

కృష్ణాజీ మనసులో మెదులుతున్న ఆలోచనలకి ప్రతిరూపం లాంటి ఆలోచనలు రాజా మనసులో మెదులుతున్నాయి.

తను చేస్తోంది తప్పా? కరెక్టా?

డ్యూటీ కంటే గురుదక్షిణే ఎక్కువనుకుని తను దేశానికి ద్రోహం చేస్తున్నాడా?

స్ట్రిక్ట్‌గా మాట్లాడితే, ఇందులో తను చేస్తున్న తప్పేమీ లేదు.

అసలు కీర్తిని పట్టుకోవలసిన డ్యూటీ తనది కాదు.

అది తన జూరిస్‌డిక్షన్ కూడా కానే కాదు.

కానీ....

అదే సమయంలో....

ఎక్కడ చెడు జరుగుతున్నా దాన్ని ఆపడానికి శాయశక్తులా ప్రయత్నించడం ప్రతి మనిషికీ కర్తవ్యం! కాదా?

"తగలబడిపోతున్నది పక్కవాడి ఇల్లు, నాకేం పట్టింది!" అని ఊరుకుని ఉండడం సంభవమా?

అది తెలివైన పనా?

"కీర్తిని పట్టుకోవలసిన డ్యూటీ నాది కాదు?" అని తనకి తాను నచ్చచెప్పుకోవడం తెలివైన ఆర్గ్యుమెంటు అవుతుందేమో గానీ సరైన ఆర్గ్యుమెంటు మాత్రం కాదు.

ఈ సమస్యకి ఒక మధ్యే మార్గం ఉంది.

కీర్తిని తను పట్టుకోడు.

కానీ కీర్తిని పట్టుకోవడానికి తగిన సమాచారం తను కరెక్ట్ పర్సన్‌కి అందజేస్తాడు.

ఈ కేసులో....ఆ కరెక్ట్ పర్సన్ హెూం మినిస్టర్ విజయకుమారే అవుతుంది.

అతను అలా ఆలోచిస్తూ వుండగానే, తుపాకి పేలిన శబ్దం వినబడింది.

వందలకొద్దీ పక్షులు ఒక్కసారిగా విలవిల్లాడుతూ ఆకాశంలోకి లేచాయి.

అంటే....

ట్రయినింగ్ ఉధృతంగా, నిరాటంకంగా సాగిపోతోందన్నమాట!

తను ఈ సంగతి విజయకుమారికి చెప్పాలి.

ఇవాళే!

అక్కడనుంచి నేరుగా విజయకుమారి యింటి దగ్గరికి వెళ్ళాడు రాజా.

సరిగ్గా అదే సమయానికి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఉంది విజయకుమారి.

ముఖ్యమంత్రి మీద దండయాత్రలో ఒక భాగమే ఆ ప్రెస్ కాన్ఫరెన్స్.

"మీరు హెూం మినిస్టరయ్యాక దారుణాలు జరగడం మరీ ఎక్కువైపోయింది"

అన్నాడు ఒక విలేఖరి.

అతన్ని అందరూ ముక్కురాజు అని పిలుస్తారు. దానికి రెండు కారణాలున్నాయి.

ఒకటి....

అతని ముక్కు మరీ పెద్దదిగా, కార్టూనిస్టులకి ఆనందం కలగజేసేదిగా వుంటుంది.

రెండు....

సెన్సేషనల్ "స్టోరీస్"నీ, వార్తలనీ, పసిగట్టడంలో అతనికి అతనే సాటి!

అందుకని కూడా అతన్ని ముక్కు రాజు అని పిలుస్తారు అందరూ. అతనికి నదురూ బెదురూ అనేవి లేనేలేవు.

నిప్పులు కక్కుతూ అతని వైపు చూసింది విజయకుమారి.

"ముక్కు రాజూ! నువ్వు గానీ, నేను గానీ....మనిద్దరిలో ఎవరో ఒకళ్ళమే వుంటాం ఈ స్టేట్‌లో! గుర్తుంచుకో" అంది.

"మంచిది! ఎప్పుడు మీ ప్రయాణం?" అన్నాడు ముక్కురాజు, ఏ మాత్రం తొణక్కుండా.

అందరూ నవ్వారు.

కష్టంమీద కోపాన్ని అదుపులో పెట్టుకుంది విజయకుమారి.

ముక్కురాజు మళ్ళీ అన్నాడు.

"జరుగుతున్న దారుణాల గురించి మీ వివరణ రాలేదు"

"ఏం దారుణాలు! మనుషులున్న చోట నేరాలు జరగవా? మనందరం దేవతలమా ఏమిటి?" అంది విజయకుమారి కన్నింగ్‌గా.

"నేరాలు అరికట్టడం మీ బాధ్యత కాదా?"

"జనాభాతో పాటు నేరాలు కూడా పెరుగుతూనే వుంటాయ్! అందులో అబ్బురం ఏముంది?"

"అయితే మీరున్నదెందుకు? మంత్రి పదవులు అనుభవించడానికా?"

"నేనున్నదెందుకో ప్రజలకు తెలుసు! నేను ప్రజలకు జవాబుదారీ! నీకు కాదు!

అయినా ముఖ్యమంత్రి సరైనవాడు కాకపోవడం వల్లే ప్రజలకు యిన్ని కష్టాలు! ముఖ్యమంత్రిని తొలగిస్తే అన్నీ చక్కబడతాయి."

"మీ శాఖకు ఆయనెట్లా జవాబుదారీ అవుతాడు?"

"అన్నిటికీ ఆయనే బాధ్యుడు!"

"ముఖ్యమంత్రి వైదొలగితే మీరు ముఖ్యమంత్రి కావాలనా?"

"నాకు ముఖ్యమంత్రి పదవి మీద వ్యామోహం లేదు.

ముఖ్యమంత్రి గద్దెదిగితే అన్ని సమస్యలూ వాటంతట అవే సర్దుకుంటాయి."

"మీరు ముఖ్యమంత్రిని గద్దె దింపడం కంటే, ఆ కీర్తి అనే క్రిమినల్‌ని పట్టుకోవడం ముఖ్యమనుకుంటున్నారు ప్రజలు!"

"ప్రజలు అమాయకులు! వాళ్ళకేం తెలుసు! ఆ కీర్తి అనే వాడికంటే కొమ్ములు తిరిగిన క్రిమినల్ మన ముఖ్యమంత్రి"

"అలా అని రాసుకోమంటారా?"

"చంపుతావా ఏం! అదంతా ఆఫ్ ద రికార్డ్! పత్రికల్లో రాయడానికి కాదు."

"పోనీ, ప్రస్తుతం మీ ఏకైక కార్యక్రమం ముఖ్యమంత్రిని గద్దె దింపడమనే రాసుకోవచ్చా?"

హఠాత్తుగా కంట్రోలు తప్పిపోయింది విజయకుమారి. సభ్యత మర్చిపోయి, సిగ్గులేనితనాన్నీ విచ్చలవిడితనాన్నీ ప్రదర్శిస్తూ, మర్యాదస్తులు ఉపయోగించడానికి సంకోచించే, వికృతమయిన, వికారం కలిగించే పదాలని ఉపయోగిస్తూ, తన అక్కసు వెళ్ళ గక్కడం మొదలెట్టింది.

ముఖ్యమంత్రి అవినీతిని "ఎండగడతా"నంది "దమ్ములుంటే" రంగంలోకి దిగి "సత్తా" తేల్చుకోవాలంది.

ముఖ్యమంత్రికి ప్రజాబలం లేదని "తొడ కొట్టి సవాల్ చేస్తున్నా" అంది.

ముఖ్యమంత్రి అవినీతి గురించి తన దగ్గర ఆధారాలు ఉన్నాయనీ వాటిని "సరైన సమయంలో" బయట పెడతాననీ అంది.

అవినీతిని రుజువు చేస్తే ముఖ్యమంత్రి రాజకీయ సన్యాసం స్వీకరిస్తారా అని "ప్రశ్నించింది".

అక్కడున్న విలేఖరులెవ్వరికీ ముఖ్యమంత్రి మీద పెద్ద సదభిప్రాయం ఏమీ లేదు.

కానీ విజయకుమారి గురివిందగింజ సామెతలాగా తన చరిత్ర మర్చిపోయి ముఖ్యమంత్రి మీద జెండా ఎత్తడం వాళ్ళకు చిరాకనిపించింది.

ఆ మాటకొస్తే, ఈ రోజుల్లో ఏ ఒక్క రాజకీయ వేత్తకయినా ఇంకో రాజకీయవేత్తపై ఆరోపణలు చేసే నైతిక స్థాయి ఉందా?

అందరూ దొంగలే!

కొందరు పెద్ద దొంగలు!

కొందరు చిన్న దొంగలు!

కొందరు ఘరానా దొంగలు!

అంతే తేడా!

విలేఖరులందరూ మొహమొహాలు చూసుకున్నారు.

"ఈవిణ్ణి తేలిగ్గా వదల కూడదు" అన్న ఏకాభిప్రాయం అందరి మొహాల్లోనూ కనబడింది.

ఇంక ప్రశ్నలు మొదలయ్యాయి.

ఈ కీర్తి ఎవరు?

ఎందుకని అతన్ని పట్టుకోలేక పోతున్నారు?

అతని ఆగడాలకి అంతం ఉందా?

జరుగుతున్న ఘాతుకాలకి హోం మంత్రి బాధ్యత లేదా?

ఒకప్పుడు ఏదో రైలు ప్రమాదం జరిగితేనే లాల్ బహద్దూర్‌శాస్త్రి బాధ్యత వహించి రాజీనామా చేశారు.

అలాంటి సాంప్రదాయం మళ్ళీ నెలకొల్పుతూ హోం మంత్రి రాజీనామా చెయ్యడం మంచిది కదా?

"నేను రాజీనామా చెయ్యవలసిన అగత్యం లేదు!" అంది విజయకుమారి ఖండితంగా. "చేస్తేగీస్తే ముఖ్యమంత్రే చెయ్యాలి రాజీనామా! నేను ప్రజల మనిషిని. ప్రజలే నాకు ప్రత్యక్ష దైవాలు! రాజీనామా ప్రసక్తిలేదు. అలాగే ముఖ్యమంత్రి అవినీతి మీద రాజీ ప్రసక్తి కూడా లేదు."

ఆవిణ్ణి యింక ఎంత వాగించినా ఆ ట్రాక్‌లో నుంచి బయటికిరాదని అర్థమయ్యింది విలేఖరులకి.

కాన్ఫరెన్స్ ముగిసింది.

అంతదాకా అక్కడే నిలబడి యిదంతా అబ్జర్వ్ చేస్తున్న రాజా లోపలికి వచ్చాడు.

చేతిలో వున్న స్లిప్‌వేపు చూస్తూ అంది విజయకుమారి.

"రాజా! ఎక్కడ పని చేస్తున్నావ్?"

చెప్పాడు రాజా.

"ఏం మాట్లాడాలి?"

"కీర్తి విషయం"

విజయకుమారి కళ్ళలో ఒక్కసారి బెదురు కనబడింది. మళ్ళీ అంతలోనే మామూలుగా అయిపోయింది ఆమె.

"ఏం తెలుసు నీకు?"

"తమిళనాడులో, శ్రీలంక తీవ్రవాదులు రన్ చేశారే, ట్రైనింగ్ కాంప్స్, ఆ లెవెల్లో ఒక ట్రైనింగ్ కాంపు మొదలెట్టాడు కీర్తి."

"ఎక్కడ?"

చెప్పాడు రాజా.

"నీకెలా తెలుసు?"

"నేను నా కళ్ళతో ప్రత్యక్షంగా చూశాను."

"ఎప్పుడు?"

చెప్పాడు.

కొద్దిసేపు ఆలోచించింది.

"వాళ్ళకి తమిళ తీవ్రవాదులతో సంబంధం ఉందంటావా?"

"అన్ని రకాల ఆరాచక శక్తులూ ఒక దానితో ఒకటి సంబంధాలు పెట్టుకుంటూనే వున్నాయి ఈ రోజుల్లో!"

"కీర్తికి తమిళ తీవ్రవాదులతో సంబంధాలు వున్నాయా లేదా?"

"పంజాబ్ తీవ్రవాదులతో కూడా సంబంధాలు వుండవచ్చు!"

"అయితే ఇది మనపరిధిలోది కాదు. సెంట్రల్ గవర్నమెంట్ లెవెల్లో టాకిల్ చెయ్యవలసిన ప్రాబ్లెం!" అంది విజయకుమారి.

"ఇల్లు కాలిపోతుంటే అప్పుడు కొత్తగా బావి త్రవ్వుతానంటే ఎలా మేడమ్!

కళ్ళెదురుగా కనబడుతున్న దాని మీద మనం యాక్షన్ తీసుకోకుండా సెంట్రల్ ఇన్‌వాల్వ్‌మెంట్ కోసం చూడడం...."

"నీకు తెలిసిందంతా రాసి నా కివ్వు! నేను ఫార్వర్డ్ చేస్తాను"

"యస్ మేడమ్!" అని బయట వున్న సెక్యూరిటీ రూంలోకి వచ్చి, వైట్ పేపర్ అడిగి తీసుకుని, తను చూసినదీ, గ్రహించినదీ అంతా వివరంగా రాసి, సంతకం పెట్టి ఇచ్చాడు రాజా.

అప్పుడతనికి కాస్త రిలీఫ్ కలిగింది.

✦ ✦ ✦

ఇంకో వారం గడిచింది.

హోం మినిస్టర్ విజయకుమారి కృష్ణాజీకి పెట్టిన డెడ్‌లైన్ ముగిసిపోయింది.

ఆ రోజు పొద్దున్నే ఆడంబరంగా మళ్ళీ ప్రెస్‌మీట్ పెట్టించింది విజయకుమారి.

"కీర్తి కేసులో పెద్ద టర్నింగ్ పాయింట్‌ని గురించి మీకు చెప్పాలని పిలిపించాను" అంది.

"ఏమిటి విశేషం? కీర్తిని పట్టేసుకున్నారా?" అన్నాడు రిపోర్టర్ ముక్కు రాజు.

ఎగ్జయిటెడ్‌గా అంది విజయకుమారి.

"పోలీసాఫీసర్ కృష్ణాజీని సస్పెండ్ చేశాం! ఆ తర్వాత బహుశా డిస్మిస్ చేసెయ్యవచ్చేమో కూడా."

ముక్కురాజు వ్యంగ్యంగా అన్నాడు –

"ప్రజలకు కావలసింది కీర్తి అనే పీడ విరగడవడం. కృష్ణాజీ అనే ఓ పోలీసాఫీసరుని సస్పెండ్ చేస్తే ప్రజలకు ఒరిగేదేమిటి? చెయ్యకపోతే తరిగేదేమిటి?"

"సమస్యని అన్ని కోణాల్లో నుంచి చూడాలి! కీర్తిని పట్టుకోలేనందుకు పనిష్‌మెంటుగానే కృష్ణాజీని తీసేస్తున్నాం"

"అదే న్యాయం మీకూ వర్తించాలిగా! మీరెప్పుడు రిజైన్ చేస్తున్నారు?"

"ముక్కు రాజూ! మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను. ఈ స్టేట్‌లో నువ్వన్నా వుండాలి? నేనన్నా ఉండాలి!"

"మంచిది! ఎప్పుడు మీ ప్రయాణం?" అన్నాడు ముక్కురాజు అలవాటుగా.

అలవాటుగానే ఆ విలేఖర్లతో సమావేశం రసాభాసగా ముగిసింది.

ప్రెస్‌తో మంచి టరమ్స్ మెయిన్‌టెయిన్ చెయ్యడం అన్నది ఒక కళ.

ఆ కళకీ, విజయకుమారికీ చుక్కెదురు. ఒక ఇంగ్లీషు ప్రయోగాన్ని తెలుగు చేసి చెప్పాలంటే, "ఆమెని ద్వేషించడాన్ని ప్రేమిస్తారు విలేఖరులు."

ఇక్కడ విజయకుమారి ప్రెస్ కాన్ఫరెన్స్ జరుగుతున్నప్పుడే....

చీఫ్ మినిస్టర్ దగ్గరికి వెళ్ళింది విజయకుమారికి సహాయమంత్రిణి అయిన అంకిత.

హెూంమినిస్టర్ అసమ్మతి వర్గం తాలూకు అయితే....

ఆమె డెప్యూటీ హెూమ్ మినిస్టర్ అంకిత మాత్రం అధికార పక్షమే.

చాలా చాకచక్యంగా ముఖ్యమంత్రికి అంతరంగికురాలయి పోయింది అంకిత.

అందుకే, చాలా జూనియర్ మంత్రిణి అయ్యి వుండి కూడా, ఆ రోజు ముఖ్యమంత్రితో కలిసి బ్రేక్‌ఫాస్ట్ తీసుకునేంత చనువు సంపాదించింది.

"ఏమిటి పొద్దున్నే వచ్చావ్?" అన్నాడు ముఖ్యమంత్రి నవ్వుతూ.

చెప్పడం మొదలెట్టింది అంకిత.

"ఆ విజయకుమారి మిమ్మల్ని ప్రధమ శతృవులాగా ట్రీట్ చేస్తోంది.

"గుడిసెల్లో ఉండేదాన్ని తెచ్చి గౌరవ ప్రదమైన స్థానం కలిపించాను. ఇప్పుడు నాకే ఎసరు పెట్టాలని చూస్తోంది." అన్నాడాయన కసిగా.

"కీర్తి గొడవ తెలుసుగా."

"ఇంత అల్లరవుతుంటే ఎందుకు తెలియదూ?"

"ఇంత అల్లరీ విజయకుమారే చేయిస్తోందని నా అనుమానం!"

"ఎందుకు?"

"మిమ్మల్ని బద్‌నామ్ చెయ్యడానికి."

"చేసి?" అన్నాడు ముఖ్యమంత్రి.

కానీ జవాబు ఆయనకే తెలుసు!

తనని అల్లరిపాలు ఎందుకు చేస్తుందీ?

తన పదవికి ఎసరు పెట్టడానికే!

ఆ తర్వాత తనే ఈ పదవిని దక్కించుకోవడానికి!

కృతఘ్నురాలు!

అంకిత అంది.

“కీర్తిని పట్టుకోవాలని కృష్ణాజీకి అల్టిమేటమ్ ఇచ్చింది.

అతను పట్టుకోలేకపోయాడు. ఇవాల్టితో డెడ్‌లైన్ ఎండ్ అయిపోయింది. అందుకని కృష్ణాజీని సస్పెండ్ చేసింది.”

మాట్లాడకుండా గంభీరంగా వుండిపోయాడు ముఖ్యమంత్రి.

అతనికి కృష్ణాజీ గురించి తెలుసు.

కట్టెలాంటి మనిషే!

కానీ మంచివాడు.

అయితే ఏం లాభం!

ఇప్పటి ఆటు పోట్లకి తట్టుకోలేడు.

పనికిరాడు.

కృష్ణాజీ అంటే గడ్డి వామి దగ్గర కుక్కలాంటి వాడు.

తను తినడు!

ఇంకొకళ్ళని తిననివ్వడు!

అంకితే మళ్ళీ అంది.

“కృష్ణాజీ అనవసరంగా బలై పోయాడు. కానీ నా ఉద్దేశ్యంలో, కీర్తి అనే ఆ క్రిమినల్ విజయకుమారి దగ్గరే ఉన్నాడు.”

“అలా ఎందుకనుకుంటున్నావ్?”

“నా కారణాలు నాకు ఉన్నాయి.”

ముఖ్యమంత్రి నిశితంగా అంకిత వైపు చూశాడు.

ఆమె అలా జవాబు సరిగా దాటేసినందుకు అతనికి కాస్త విసుగూ కలిగింది–

ముచ్చటా వేసింది.

ఈ పిల్ల రాజకీయాల్లో పైకి వస్తుంది. నిజం!

“ష్యూర్?” అన్నాడు.

“ష్యూర్” అంది అంకిత.

“మరి ఏం చెయ్యాలని నీ ఆలోచన?”

“ఊదరబెట్టి వాణ్ణి బయటికొచ్చేటట్లు చెయ్యాలి”

“వాడి హిస్టరీ వింటుంటే అది అంత సులభమా అనిపిస్తుంది.”

“సులభమైన పని కాదు. అందుకే జాగ్రత్తగా టాకిల్ చెయ్యాలి” అంది అంకిత.

సాలోచనగా అన్నాడు ముఖ్యమంత్రి.

“కృష్ణాజీ చాలా ఎఫిషియెంటు! మరి ఈ కేసులో ఎందుకు ఫెయిలయి పోయాడో?”

“ముసలాడైపోలా?” అంది అంకిత అనాలోచితంగా.

అని, మళ్ళీ వెంటనే గ్రహించింది ఆ మాట ముఖ్యమంత్రికి కూడా తగలవచ్చని.

అందుకనే తనకి సహజమైన చాతుర్యంతో వెంటనే కవర్ చేసుకుంటూ అంది –

“మీ సంగతి వేరనుకోండి”

ముఖ్యమంత్రి నవ్వాడు.

ఆయనకి తెలుసు – ఈ పిల్ల చాలా “చాలూ!”

అంకిత అంది –

“నా దృష్టిలో ఒక కమెండో ఉన్నాడు. రాజా అని!”

ప్రశ్నార్థకంగా చూశాడు ముఖ్యమంత్రి.

“చిన్నప్పటి నుంచి తెలుసు నాకు! ఎక్స్‌ట్రార్డినరీ పర్సన్. జానపద చిత్రాల్లో

అద్భుతాలు చేసే హీరో ఉంటాడే అలాంటి రకమన్న మాట"

నవ్వాడు ముఖ్యమంత్రి.

"అతనికి ఈ కేసు అప్పగిద్దామనుకుంటున్నాను" అంది అంకిత.

"సరే" అన్నాడాయన.

"కానీ విజయకుమారి అడ్డంపడొచ్చు" అంది అంకిత.

"ఆర్డర్సు పుటప్ చేసి ఫైలు డైరెక్టుగా నా దగ్గరికి తీసుకురా. నేనే స్వయంగా సంతకం పెడతా. స్పెషల్ కేసు కదా."

అంకిత మొహంలో సంతోషం కనబడింది.

"థాంక్యూ సర్" అని చెప్పి బయటికి వచ్చేసింది అంకిత.

బయట క్యాబినెట్ మంత్రులు నలుగురు కూర్చుని ఉన్నారు ముఖ్యమంత్రితో మాట్లాడడం కోసం.

ముఖ్యమంత్రి పి.య్యే. బయటికి వచ్చి, ఆయన ఇవాళ ఎవరినీ కలుసుకునే మూడ్‌లో లేరని చెప్పాడు.

వాళ్ళందరికంటే తను వీ.ఐ.పీ.ని అన్న ఎక్స్‌ప్రెషన్ ఒకటి పారేసి తన కారెక్కింది అంకిత.

✦ ✦ ✦

అర్పితను ఆనుకు కూర్చుని చంద్రుడిని చూస్తున్నాడు రాజా.

"చంద్రుడిని చూస్తూ ఉంటే వెన్నెలకంటివారు రాసిన ఒక గీతం గుర్తొస్తోంది" అని, చెప్పడం మొదలెట్టాడు రాజా.

*"చిరునవ్వులు వరమిస్తే,*
*చితి నుండీ లేచొస్తాను.*
*మరు జన్మకు కరుణిస్తే,*
*ఈ క్షణమే మరణిస్తాను."*

"బాగుంది! కానీ జంట తుమ్ములలాగా ఏది చెప్పినా రెండు చెబుతానంటావుగా" అంది అర్పిత సంతోషం మొహంలో కనబడిపోతూ ఉండగా –

మళ్ళీ అన్నాడు రాజా –

*"ఏక్ రాత్ మే దో దో ఛాంద్ ఖిలే,*
*ఏక్ ఘూంఘట్‌మే,*
*ఏక్ బద్‌లే మే."*

అంటే

*"చూడు చూడు! ఒకే రాత్రిలో రెండు చందమామలు కనబడుతున్నాయి.*
*ఒకటి మేలి ముసుగులో....*
*ఒకటి మేఘాల్లో...."*

అతని వీపు మీద గట్టిగా కొట్టింది అర్పిత.

"ఏం చెప్పినా కాపీ సరుకే! సొంత కవిత్వం ఒక్క ముక్క కూడా రాదా ఏం?"

"సరే! చెబుతున్నా కాచుకో" అంటూ మొదలెట్టాడు రాజా.

*"కొత్త మంగళం సుబ్బు,*
*రాగాల్ని రోట్లో వేసి రుబ్బు.*
*ఆయన వాడే సబ్బు,*
*ఏదయితేనేంలే మనకెందుకా గబ్బు!"*

ఉధృతంగా నవ్వొచ్చింది అర్పితకి.

"ఇదా కవిత్వం అంటే. ఇది కవిత్వం కాదు....కపిత్వం" అంది నవ్వుతూనే.

"ఏదోలే....పిండి కొద్దీ రొట్టె అన్నారు. నా టాలెంటుకి ఈమాత్రం తట్టింది కదా!"

"మొత్తానికి ఏ సబ్జెక్టు ఎత్తినా నేనూ ఉన్నానంటూ తయారవుతావుగానీ నాకు తెలియదని ఒప్పుకుంటావా ఏం?"

"ఇంక ఒక్క సబ్జక్టులోనే నా ప్రావీణ్యం నిరూపించుకోవాల్సి ఉంది" అన్నాడు రాజా.

"ఏమిటది?" అంది అర్పిత.

వంగి, గుసగుసగా ఆమె చెవులో అన్నాడు రాజా "కోకశాస్త్రం.... ఐ మీన్ కోక్కోక శాస్త్రం."

"ఏయ్!" అంది అర్పిత బెదిరిస్తున్నట్లు.

నవ్వాడు రాజా.

అర్పిత మళ్ళీ అంది "అంటావుగానీ, ఇప్పటికే ఎవరి దగ్గరో ఆ ప్రావీణ్యం కూడా నిరూపించుకునే ఉంటావు. ఇన్ని దేశాలు తిరిగినవాడివి."

"షిప్పులో వెళ్తున్నప్పుడు సీరియస్‌గా ఒక అమ్మాయితో ప్రయత్నించానుగానీ కుదరలేదు" అన్నాడు రాజా.

"ఆఁ! నమ్మూతా" అంది అర్పిత అపనమ్మకంగా తల ఊపుతూ – కానీ ఆమె మొహంలో భయం కనబడింది.

"విషయం చెబుతా ఇనుకో బుల్లెమ్మా" అన్నాడు రాజా.

"ఆరోజు మహా దుర్దినం. సముద్రంలో వెళ్తున్నాం. పెనుతుఫాను వస్తోంది చలి! చలి! పక్కనో అమ్మాయి ఉంది. ఇంకోవైపు సారా పీపా ఉంది.

కానీ ట్రాజెడీ ఏమిటంటే, సారా సీపాకి కింద కన్నం ఉంది. ఆ అమ్మాయికి లేదు."

"నీకు సిగ్గు లేదు" అంది అర్పిత.

"నిజంగానే! ఆ అమ్మాయి మెర్ మెయిడ్! మత్స్యకన్య అన్న మాట! నడుము కిందంతా చేప శరీరం. పైన ఆడపిల్ల శరీరం. ఏం లాభం?"

"నీకు సిగ్గులేదు! నీకు నిజంగానే సిగ్గూ ఎగ్గూ లేదు. ఆడపిల్లలతో ఇట్లాగేనా మాట్లాడేది?"

"కాబోయే పెళ్ళాంతో కూడా కాసిని జోకులు వేసుకోకూడదా?"

అర్పిత ఏదో అనబోతూ వుండగానే అంకిత దగ్గర నుంచి కబురు వచ్చింది.

రాజా ఉన్నపళంగా వచ్చెయ్యాలనీ, టాప్ ప్రయారిటీ అనీనూ.

వార్త తెచ్చినవాడు వెళ్ళిపోయాక తన పెదిమలని అర్పిత పెదిమలకు తేలిగ్గా రాశాడు రాజా.

"నేను వెళ్ళొస్తా"

"అర్ధరాత్రిపూట....ఏమిట్ట అంత అర్జెంటు పని?" అంది అర్పిత అనుమానంగా.

నవ్వాడు రాజా.

"తెలుస్తుందిగా" అన్నాడు.

✦ ✦ ✦

రాజాకి గాలంట్రీ అవార్డు, అలాంటది మరేదే ఇస్తున్నట్లు మొహం పెట్టి, ఉపోద్ఘాతం లేకుండానే చెప్పింది అంకిత.

"రాజా! యూ ఆర్ లక్కీ! కీర్తిని పట్టుకునే అసైన్‌మెంట్ నీకిస్తున్నా! సి.యం.తో మాట్లాడాను."

అచేతనంగా నిలబడిపోయాడు రాజా.

కీర్తిని పట్టుకునే అసైన్‌మెంటు తనకి యిస్తున్నారా?

కీర్తి! ది ఏస్ క్రిమినల్.

మరి యిప్పుడు కృష్ణాజీ ఏమనుకుంటాడు?

కృష్ణాజీ సస్పెండు అయిన సంగతి రాజాకి తెలుసు.

చాలా పబ్లిసిటీతో సస్పెండు చేశారు ఆయన్ని.

ఇంక ఆ కేసుల్లో ఈ కేసుల్లో ఇరికించి డిస్మిస్ చేసేస్తారు కూడా –

రాజు తలచుకుంటే దెబ్బలకేం కొదవ?

ఇప్పుడు ఈ కేసు తనకి అప్పగిస్తున్నారు.

ఇందులో ఈ అంకిత చొరవ ఉందని స్పష్టంగా అర్థం అవుతూనే ఉంది.

మరి తను కృష్ణాజీకి యిచ్చిన మాట.

ఇక్కడొక మతలబు వుంది. తను ఆ మాట యిచ్చినప్పుడు నిజానికి కీర్తిని పట్టుకోవలసిన డ్యూటీ తనకు లేదు.

కేవలం కృష్ణాజీకి సాయం చెయ్యాలనే కోరికతోనే తను కీర్తిని పట్టుకుని ఆయన కాళ్ళ దగ్గర పడేస్తాననే ప్రపోజల్ చేశాడు.

ఆయన వద్దన్నాడు.

తను ఊరుకున్నాడు.

ఇప్పుడు పరిస్థితి మారింది.

ఇప్పుడు కీర్తిని పట్టుకోవలసిన రెస్పాన్సిబిలిటీ తన నెత్తిమీద పెడుతోంది అంకిత. డిప్యూటీ హెూం మినిస్టర్.

ఇప్పుడింక యిది తన డ్యూటీ!

తన డ్యూటీని ఎలా తప్పించుకుంటాడు తను?

ఇప్పుడింక దేవుడే దిగివచ్చి వద్దన్నా ఊర్కోడు.

తన మటుకు తనకి డ్యూటీనే దేవుడు.

చీఫ్ మినిస్టర్ స్వయంగా సంతకం పెట్టిన ఆర్డర్సు రాజా చేతికి అందించింది అంకిత.

"రాజా! ఆ సంతకం ఎవరిదో చూశావుగా!

టాప్ లెవల్లో నీకు సపోర్టు వుంది. నీ మాట అంటే యింక వేదవాక్కే! నువ్వు ఏం చేస్తావనీ, ఎట్లా చేస్తావనీ అడగం. రిజల్టు కావాలి నాకు.

కీర్తిని కటకటాల వెనక తొయ్యాలి.

ఇదంతా పొలిటికల్ డ్రామా! నీకు అర్థమయ్యే వుంటుంది.

కీర్తి చేత అల్లకల్లోలం సృష్టించి, ముఖ్యమంత్రిని గద్దె దింపాలని విజయకుమారి కుట్ర! అది సాగనివ్వకూడదు. అండర్‌స్టాండ్" అంది.

నిర్మొహమాటంగా అన్నాడు రాజా.

"నాకు పొలిటిక్స్‌తో సంబంధం లేదు. వ్యక్తులు అనవసరం నాకు. కీర్తి అనేవాడు ఒక ఈవిల్!

ఆ ఈవిల్‌ని అణిచెయ్యడం నా డ్యూటీ మేడమ్. కీర్తిని పట్టుకోవడం జరిగిపోయినట్లే భావించండి!"

ఆరోపణగా అంది అంకిత.

"నేనేదో పరాయి దాన్నయినట్లు తేపతేపకీ మీరు మీరు అంటావేం?"

"మీరు పెద్దవారు కదా!"

"అంటే ముసలిదాన్ననా నీ అర్థం?" అంది కోపంగా.

"మీరు బాస్! నేను మీ కింది ఉద్యోగిని."

"నా పైకి వచ్చే ఛాన్సు ఇస్తాగా! నా బాడీ గార్డుగా ఉండిపోరాదూ? ఒంటిని నీకు అప్పగించేసి సుఖంగా వుంటా" అంది అంకిత.

అటెన్షన్‌లో నిలబడి మొహంలో గౌరవ ప్రపత్తులు కనబరుస్తూనే అన్నాడు రాజా.

"ఈ స్థితిని ఏమంటారో తెలుసా మేడమ్!"

"చెప్పు!"

"మెదడు మోకాళ్ళలోకి రావడం అంటే ఇదే!"

"నువ్వు నన్ను రేప్ చేసినా నాకింత కోపంవచ్చి ఉండేది కాదేమో! తిక్కరేగేలా చేస్తున్నావ్ నీ మాటలతో."

"నా మాటలకే తిక్కరేగుతుంటే, నా చేతలకింక పూర్తిగా పిచ్చెక్కిపోతుందేమో!

ఎందుకైనా మంచిది, నన్ను దూరంగా ఉంచండి" అన్నాడు రాజా.

"ఈ కీర్తి సంగతి తేలనీ! ఆ తర్వాత నీ పని పడతా!" అంది అంకిత సరదాగానే!

"కీర్తిని మాత్రం పట్టుకో! మనిద్దరి పరువూ దక్కించు.

నువ్వు జానపద చిత్రాల్లో హీరోవి అన్నంత లెవెల్లో చెప్పాను పి.యం.గారికి."

సెల్యూట్ చేసి బయటికొచ్చేశాడు రాజా.

తన రూంకి వచ్చాక ఆలోచించడం మొదలెట్టాడు రాజా. తర్వాత నోట్‌పాడ్, పెన్నూ తీసుకుని పాయింట్సు రాయడం మొదలెట్టాడు.

ప్రాజెక్టు : డేంజరస్.

ఎనిమీ : పవర్‌ఫుల్, ఇంటలిజెంట్ ,యారోగెంట్.

మాన్‌పవర్ : దాదాపు చిన్న ఆర్మీలాంటి దళం ఒకటి వుంది కీర్తి వెనకాతల. వాళ్ళలో చాలా మందికి మిలిటరీ ట్రైనింగు ఇస్తున్నారు!

ఆర్మ్సు : అనేక రకాలయిన ఆయుధాలు వున్నాయి.

పర్సనల్ ఫాక్టర్ : కీర్తికి తనంటే గిట్టదు. తనకి కీర్తి అంటేనే అలర్జీ. తను రంగంలో ఉన్నాడని తెలిస్తే కీర్తి ఇంకా ఫెరోషియస్‌గా తయారయిపోతాడు. ఎంతకైనా తెగిస్తాడు.

స్ట్రాటెజీ : ఈ వ్యవహారాన్ని సింగిల్ హాండెడ్‌గా డీల్ చెయ్యడమే తనకి యిష్టం! కానీ ఈ కేసులో, స్టాండ్‌బైగా కొందరు మనుషులు తన వెనక వుండడం మంచిది. ఎమర్జెన్సీలో వాళ్ళని కూడా తను రంగంలోకి దింపవచ్చు.

ఆయుధాలు : రెండో ప్రపంచ యుద్ధకాలం నాటి .303 రైఫిల్సూ, .38 కాలిబర్ సర్వీసు రివాల్వర్లూ, బాయొనెట్‌లూ ఇలాంటివి తనకి ఇస్తే పని జరగదు.

తనకి మినిమమ్ స్టెన్‌గన్స్ కావాలి.

ఏం చేస్తాడో, ఏం చెయ్యబోతాడో తనని అడగమని భరోసా ఇస్తున్నారు కాబట్టి, తనకి ఉన్న ఓల్డ్ కాంటాక్ట్స్ యూస్ చేసి –

రెండు మూడు ఏ.కే. 47లూ,

రెండూ ఏ.కే. 56 రైఫిల్సూ,

ఒక చైనీస్ అస్సాల్ట్ రైఫిలూ పట్టుకురాగలడు.

ఈ లోపల తను గనక ఒక్కసారి ఆఫ్ఘనిస్తాన్ వెళ్ళి రాగలిగితే –

'డ్రాగనోవ్' రైఫిల్ కూడా తేగలడు.

డ్రాగనోవ్ : సూపర్ రైఫిల్. తుపాకుల్లో లేటెస్ట్ మోడల్. విత్ ఇన్‌ఫ్రా రెడ్ విజన్. రాత్రిళ్ళు కూడా లక్ష్యాన్ని గురితప్పకుండా షూట్ చెయ్యొచ్చు.

తొమ్మిదొందల మీటర్ల రేంజ్ పది రౌండ్లు కాల్చవచ్చు.

నెక్స్‌ట్ ఐటెమ్ : అమ్యూనిషన్ సరిపడా తీసుకెళ్ళాలి.

వాట్ మోర్?

అతను అలా ఆలోచిస్తూ ఉండగానే, తలుపు చప్పుడయ్యింది.

రాజా తల ఎత్తి చూసేసరికి కృష్ణాజీ ఎదురుగా నిలబడి వున్నాడు.

ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు రాజా. త్వరత్వరగా ఎదురెళ్ళి కృష్ణాజీ కాళ్ళకు నమస్కరించాడు.

"సర్! కూర్చోండి" అన్నాడు గౌరవం ప్రకటిస్తూ.

కుర్చీలో కూర్చున్నాడు కృష్ణాజీ. ఒక్క నెలరోజులలో అతనికి పదేళ్ళ వయసు పెరిగిపోయినట్లు అనిపిస్తోంది. డ్రెస్సు విషయంలో కూడా అతను అంత కేర్ తీసుకుంటున్నట్లు లేదు. నైట్ డ్రెస్సే వేసుకుని వచ్చేశాడు. కళ్ళు ఎర్రగా వున్నాయి.

"రాజా!" అన్నాడు కృష్ణాజీ. అతని గొంతు బలహీనంగా వుంది.

"ఏమిటన్నట్లు" చూశాడు రాజా.

"ఒక్క నెల రోజుల క్రితం మన యిద్దరి మధ్యా ఒక సంభాషణ జరిగింది గుర్తుందా?"

"ఎలా మర్చిపోతాను సర్?"

"నేనే నీకు పరోక్షంగా గురువుననీ, నేను ద్రోణాచార్యుడినైతే నువ్వు ఏకలవ్యుడిలాంటి వాడిననీ, నాకు గురుదక్షిణ ఇవ్వాలని ఉందనీ అన్నావు! అదంతా బాగానే గుర్తుంది కదా!"

కృష్ణాజీ నిట్టూర్చి, నిదానంగా అన్నాడు.

"రాజా! కీర్తిని పట్టుకోవద్దని ఇప్పుడు నేను అడగను. నాకు తెలుసు. ఇదివరకు నీ డ్యూటీ కాకపోయినా కూడా,నాకు సాయం చేయాలనే ఉద్దేశ్యంతో అలా ఆఫర్ చేశావు. నేను వద్దన్నాను. నువ్వు వూరుకున్నావు.

కానీ యిప్పుడు పరిస్థితి మారింది.

"ఏమీ చేతకానివాణ్ణి" అన్న ముద్రతో నేను సస్పెండ్ అయిపోయాను. కీర్తిని పట్టుకునే డ్యూటీ ఇప్పుడు నీకప్పగించారు.

ఇప్పుడు నేను కాదుగదా, దేవుడు వచ్చి అడిగినా కూడా నువ్వు కీర్తిని వదిలేసే ప్రసక్తి లేదని నాకు తెలుసు.

నీకు నీ డ్యూటీనే దైవం అని కూడా నాకు తెలుసు రాజా!"

"అది మీ దగ్గరనుంచి నేర్చుకున్నదే సర్" అన్నాడు రాజా సిన్సియర్‌గా.

ఉదాత్తమైన తన గతం గుర్తొచ్చి విషాదంగా నవ్వాడు కృష్ణాజీ.

"కీర్తిని పట్టుకోవద్దని నేను అడగను రాజా! కానీ ఒక్క కోరిక కోరతాను"

"సర్! జస్ట్ ఆర్డర్ మీ! నా ప్రాణాలు ఇమ్మన్నాసరే...." అన్నాడు రాజా.

అతన్ని వారించాడు కృష్ణాజీ.

"అంత పెద్దమాటలు వద్దు. సింపుల్‌గా జరిగేదే!"

"చెప్పండి సర్!"

దీర్ఘంగా శ్వాస తీసుకుని అన్నాడు కృష్ణాజీ.

"రాజా! నువ్వే చెప్పావు. నువ్వు నేర్చుకున్న విద్యలన్నీ పరోక్షంగా నాద్వారా నేర్చుకున్నవే అని! అవునా?"

"అవును సర్!"

"అలాంటి పక్షంలో, రాజా! నావల్ల అబ్బిన విద్యలేవీ కూడా కీర్తిని పట్టుకోవడంలో ప్రయోగించకు.

నా వల్ల నేర్చుకున్నానంటున్న షూటింగ్, ఆర్చెరీ, రెజ్లింగ్, రేసింగ్, డ్రయివింగ్, జంపింగ్, స్విమ్మింగ్....ఒకటేమిటి రాజా....నా వల్ల నేర్చుకున్న విద్యలు ఏవీకూడా నా కీర్తిని పట్టుకోవడంలో ప్రయోగించకూడదు. అలా అని ప్రామిస్ చెయ్యి రాజా!"

అంటూ చెయ్యి ముందుకు జాపాడు కృష్ణాజీ.

నెమ్మదిగా ఆ చేతిలో తన చెయ్యివేశాడు రాజా. అతని మొహంలోకి క్రమంగా నవ్వు వచ్చింది.

చిన్నగా నవ్వుతూనే అన్నాడు.

"సర్! మీ భావం నాకర్థమయ్యింది. నా కాళ్ళూ చేతులూ కట్టేసి, నన్ను యుద్ధ రంగంలోకి వెళ్ళమంటున్నారన్నమాట!

ఆల్‌రైట్ సర్!

ఐయామ్ రెడీ!

కానీ సర్! ఒక్కవిషయం గుర్తుంచుకోండి! చిన్నప్పుడు మీకు కనబడేటప్పటికే నేను పెద్ద కేటుగాడిని! పుట్టుకతోనే వచ్చాయి నాకు చాలా రకాల తెలివితేటలు!

సర్! మీ చలవవల్ల అబ్బిన విద్యలేవీ కూడా మీ పుత్రరత్నం మీద ప్రయోగించనని ప్రమాణం చేస్తున్నాను!

కానీ సర్! కీర్తిని పట్టుకోవడం మాత్రం ఖాయం!

దానికి తిరుగులేదు" అన్నాడు రాజా దృఢంగా.

కొద్దిసేపు రాజా మొహంలోకి వెదుకుతున్నట్లు చూశాడు కృష్ణాజీ. తర్వాత అన్నాడు–

"థాంక్స్ రాజా!"

"ప్లీజ్ డోన్ట్ మెన్షన్ సర్!"

రాజా భుజం తట్టి వెళ్ళిపోయాడు కృష్ణాజీ.

వెంటనే కుర్చీలో కూలబడిపోయాడు రాజా.

అతనికి అంతా అగమ్యగోచరంగా అయిపోయింది.

దాదాపు కురుక్షేత్ర యుద్ధం లెవెల్లో జరగవలసిన ఆపరేషన్ యిది!

కురుక్షేత్రంలో కర్ణుడి పొజిషన్‌లో పడతాడా! ఇప్పుడు తను!

యుద్ధభూమిలో రథం కూరుకుపోయి శాపంవల్ల మంత్రాలు గుర్తురాక, నిస్సహాయుడైపోయాడు కర్ణుడు. అవసరమైన క్షణంలో అతనికి వచ్చిన విద్యలేవీ అక్కరకు రాకుండా పోయాయి.

ఇప్పుడు కృష్ణాజీ పెట్టిన ఈ ఆంక్షలతో తనూ నిస్సహాయుడైపోయాడు.

నిస్సహాయుడై పోయాడా?

కాదు కాదు!

అది అతని భ్రమ.

తను తన ఐదో ఏటనుంచే అసహాయుడు!

అప్పుడెట్లా నెగ్గుకొచ్చాడో ఇప్పుడు అట్లాగే నెగ్గుకు రాలేడా?

అంత చిన్న వయసులోనే తను విజయకుమారి కళ్ళలో కారం కొట్టలేదూ?

అప్పుడు తన దగ్గర ఈ విద్యలన్నీ ఏవీ?

విజయకుమారి వృత్తాంతం గుర్తురాగానే చటుక్కున బోధపడిపోయింది రాజాకి, తను ఎత్తవలసిన ఎత్తేమిటో!

మెరుపువేగంతో అతని మనసులో ఒక స్ట్రాటజీ రూపుదిద్దుకుంది.

ఉత్సాహంగా విజిలేస్తూ లేచాడు రాజా.

✦ ✦ ✦

రాజాకీ విజయకుమారి గుర్తువచ్చిన సమయంలోనే విజయకుమారి కూడా గొప్ప మూడ్‌లో వుంది.

రెండు అతికష్టమైన పనులు ఒకే రోజున సాధించింది తను.

ఒకటి : ఆ గుడ్‌ఫర్ నథింగ్ కృష్ణాజీని వదిలించుకోవడం. ఇక అతన్ని భూస్థాపితం చెయ్యడం అట్టే కష్టం కాదు.

రెండు : అందరికీ తెలిసినా ఎవరికీ అందని ఆ ఫైలు తనకి చెందడం అదే! ఎక్స్ హెూం మినిష్టరూ, కీర్తిశేషుడూ అయిన సదాశివబ్రహ్మంగారు "ప్రజాక్షేమం" అనే పైత్యంతో తను అందరి లొసుగులూ కనిపెట్టి తయారుచేసిన పిశాచపు ఫైలు.

అది గనుక జనంలోకి వెళ్ళిందంటే....

అమ్మో....

అందరికీ రాజకీయ సన్యాసం తప్పదు.

ఆటంబాంబు పేలినట్లు పేలుతుంది అది!

దానికోసం తెగ వెదుకుతున్నారు అందరూ.

తెగ వెదికిస్తున్నారు కూడా.

హఠాత్తుగా ఇవాళ దొరికింది అది.

ఎక్కడో కాదు, తన ఆఫీసులోనే, ఎవరికో కాదు! తనకే –

ఆ ఫైలు కోసం తన ఆఫీసులో వెదకని అంగుళం లేదు!

అయినా దొరకడం లేదు అది.

అయితే, ఆ వెదకడంలో దొరికింది ఒక బౌండు బుక్కు –

ముసలాయన చాదస్తంగా రామకోటి రాయడం మొదలెట్టిన ఒక పెద్ద బౌండు బుక్కు –

వెయ్యి తెల్లకాగితాలు ఉంటాయి అందులో.

మొదటి వంద పేజీలమీదా, పాతకాలపు గొలుసుకట్టు రాతతో రాసి వుంది "శ్రీరామ శ్రీరామ" అని.

ఆ తర్వాత వున్న కాగితాలన్నీ ఖాళీనే!

ఫైలు కోసం వెదకడంలో ఈ బౌండు బుక్కు కూడా చూసి విసుక్కుని పక్కన పడేశారు.

ఆ తర్వాత అది ఎట్లా చేరిందోగానీ ఒక అల్మారాలో చేరింది.

ఇన్నాళ్ళు గడిచాక.... ఇవాళ ఆఫీసులో చిన్న ఫైర్ యాక్సిడెంటు అయింది.

తన ఆఫీసు గదిలోనే వుంది "సీజ్ ఫైర్" అనే చిన్న ఫైర్ ఫైటరు. దానితో మంటలని ఆర్పటానికి ప్రయత్నించారు.

కానీ గోడలకి అంత ఖరీదయిన ఉడ్‌పానెలింగ్ చేయించి ఉండడంవల్ల మంటలు పెద్దవయ్యాయి.

ఆ తర్వాత ఫైరింజన్లు రావడం – మంటలని తొందరగానే ఆర్పెయ్యడం జరిగింది.

ఈ లోగానే విపరీతంగా వేడెక్కిపోయింది అల్మారా!

అది చల్లబడ్డాక ఆదుర్దాగా తీసి చూశారు. కాన్ఫిడెన్సియల్ పేపర్స్ చాలా వున్నాయి అందులో.

అదృష్టవశాత్తు అవేవీ పాడయిపోలేదు.

కాస్త కమిలిపోయాయి – అంతే.

కాయితాలు తియ్యడంలో ఆ బౌండు పుస్తకం కింద పడింది. అప్పుడు కనబడ్డాయి– షాకింగ్‌గా.

అందులో గోధుమ వర్ణంలో వున్న అక్షరాలు.

రామకోటి రాసి వున్న పేజీల్లో కాదు.

ఇదివరకు ఖాళీపేజీలు అనుకుంటున్న వాటిలో!

సీక్రెట్ రైటింగ్!

మామూలు తెల్లకాగితాల మీద పాలు, మజ్జిగ, తేనె, చక్కెర నీళ్ళు కూల్‌డ్రింక్స్ లాంటి పానీయాలను ఇంకులాగా వుపయోగించి రహస్య సమాచారాన్ని రాయవచ్చు.

తర్వాత ఆ కాగితాలని ఎలక్ట్రిక్ బల్బు వేడిమి ద్వారానో, కాండిల్ ద్వారానో, గ్యాస్ స్టౌ వేడిమి ద్వారానో జాగ్రత్తగా వెచ్చజేస్తే, గోధుమ రంగులోగానీ, నలుపు రంగులో గానీ అక్షరాలు దర్శనమిస్తాయట.

వీటన్నిటిలోనూ ఆర్గానిక్ కాంపౌండ్స్ ఉంటాయట! వాటిలో మూల పదార్థం కార్బన్‌ట!

ఎప్పుడయితే ఈ పానీయాలతో రాయబడిన కాగితం వేడిచేయ బడుతోందో అప్పుడు ఆ కన్పించకుండా వున్న కార్బన్ విరిగిపోయి, ఆ స్థానంలో అక్షరాలు కనబడతాయట!

ఆ సీక్రెట్ రైటింగ్ వున్న బుక్కు లాక్కుని, యాంటీ రూంలో కెళ్ళి గబగబా తిరిగేసింది తను.

ప్రస్తుతం సొసైటీలో మహా మహులన్న వాళ్ళందరి పేర్లూ ఉన్నాయి అందులో!

పేజీలు తిప్పింది.

ఒక పేజీలో తన పేరు ఉంది.

ఆదుర్దాగా చదివింది.

విజయకుమారి పవర్ మాంగర్. పోట్ల గిత్తలాంటి మనస్తత్వం అందరినీ మించిన అవినీతి.

అని ఆ కింద తన వ్యవహారాల తాలూకు గుట్టుమట్లన్నీ రాసి వున్నాయి.

చివరగా రాసి వుంది.

ఒక మాంత్రికుడి ప్రాణం చిలక గొంతులో వున్నట్లు, విజయకుమారి భవిష్యత్తు అంతా ఆమె కొడుకు తీసిన ఒక "బ్లూ ఫిలిమ్" కేసెట్‌లో వుంది.

విజయకుమారి, బలరామిరెడ్డిల మన్మధ లీలలు పంచ రంగుల్లో రికార్డు అయి ఉన్నాయి.

ఆ కేసెట్లో!

ఆ తర్వాత ఎంట్రీ ముఖ్యమంత్రి.

గుండె జారిపోయింది తనకు.

మళ్ళీ అంతలోనే పట్టలేనంత సంతోషం కూడా కలిగింది.

దేవుడు తనని చల్లగా చూడబట్టి ఈ వేళ ఈ సీక్రెట్ ఫైలు తనకి దొరికింది గానీ....

లేకపోతే....

ఓర్నాయనోయ్!

ఆమె అలా అనుకుంటూ ఉండగానే షాంపేన్ బాటిలు తీసుకుని అక్కడికి వచ్చాడు కీర్తి.

"కంగ్రాట్స్ విజ్జీ!" అన్నాడు మృదువుగా.

వగలుబోతూ చూసింది "విజ్జీ"

"అసలు ఆ ఫైలు కోసమే నేను నీ దగ్గర చేరింది." అన్నాడు కీర్తి.

విజయకుమారి మొహంలో అనుమానం కనబడింది.

"కీర్తీ! ఏమంటున్నావ్!"

"ఆ సీక్రెట్ ఫైలు కోసమే నేను నీ దగ్గర చేరింది! కృష్ణాజీకి భయపడి కాదు."

"అంతేనా? నేను దేవతనన్నావ్ అదన్నావ్ ఇదన్నావ్!" కీర్తి పగలబడి నవ్వాడు. "నువ్వా! నువ్వు దేవతవైతే నేను అపర శ్రీరామచంద్రుణ్ణే!"

"అంటే....ఏమిటి నీ ఉద్దేశ్యం?"

"మొత్తం రాజకీయ రాబందుల హేయమైన జీవిత చరిత్రలన్నీ దీన్లో ఉన్నాయి! ఇది ఎవరి చేతిలో వుంటే వాళ్ళే రాష్ట్రాని కంతా మొగుడు!"

"ఆడదాన్ని....నాకా ఉపమానం బాగుండదేమో!"

"ఆ ఫైలు నీ దగ్గర లేదు. ఇప్పుడు నా దగ్గర ఉంది. రాష్ట్రానికి నువ్వు కాదు.... నేనే మొగుణ్ణి!"

జీవితంలో అంత పెద్ద ఎదురుదెబ్బ తగలడం అదే మొదటిసారి విజయకుమారికి.

కోపంతో వికృతంగా మారింది ఆమె మొహం.

నిదానంగా అన్నాడు కీర్తి.

"విజ్జీ! యువర్ టైం ఈజ్ అప్! నీ కొడుకు సంజీవ్ గాడిని టాకిల్ చేసి నీ కాసెట్ కూడా ఎత్తుకొచ్చా!"

"తెచ్చావా? ప్లీజ్! అది నాకిచ్చెయ్!" అంది విజయకుమారి ఆతృతగా.

నవ్వాడు కీర్తి.

"నో! ఈ కాసెట్‌ని రేపు అసెంబ్లీ స్పీకర్‌కి పంపిస్తున్నా!"

"ఎందుకు?"

"నీ పరువు తియ్యడానికి!"

"నీకెందుకు నా మీద పగ? నీకు నేను ఎంత చేశాను. అన్నీ మర్చిపోయావా?"

"నాకోసం చేసింది ఏమైనా ఉన్నా కూడా, మళ్ళీ దాని ద్వారా నీకేమయినా మేలు జరగాలనే చేశావు. నిన్ను మించిన సెల్ఫిష్ పర్సన్ ఇంకెవ్వరూ ఉండరు!"

కోపంతో కంట్రోలు తప్పి గొణగడం మొదలుపెట్టింది విజయకుమారి.

కీర్తి అన్నాడు.

"విజ్జీ! నీ పరువు దక్కాలంటే ఒకే పద్ధతి ఉంది!"

హీనస్వరంతో అంది విజయకుమారి.

"ఏమిటది?"

"నువ్వు ఆత్మహత్య చేసుకో!"

అదిరిపడింది విజయకుమారి.

"ఏమంటున్నావ్!"

"కమిట్ సూయ్‌సైడ్ విజ్జీ!

విషం తాగుతావా, ఉరేసుకుంటావా, ఒళ్ళు కాల్చుకు చస్తావా? నీ ప్రిఫరెన్స్ ఏమిటో చెబితే నేను ఏర్పాట్లు చేస్తాను. నేను ఎవర్నీ చంపను విజ్జీ! చచ్చేటట్లు చేస్తాను."

విజయకుమారి వణకడం ఎక్కువయ్యింది.

"ప్లీజ్! ప్లీజ్! కీర్తీ! నన్ను వదిలెయ్!" అంది ప్రాధేయ పూర్వకంగా.

"నువ్వు బతికి ఉంటే నాకు ప్రమాదం విజ్జీ! ఆర్గ్యుమెంట్సు అనవసరంగా టైం వేస్టు! త్వరగా కానియ్! నాకు నిద్రవస్తోంది."

"ప్లీజ్! కీర్తీ...."

"సైనైడ్ మింగడం అన్నిటికన్నా ఈజీ!" అంటూ చిన్న బాటిల్‌ని కర్చీఫ్‌తో వేలి ముద్రలు పడకుండా తుడిచి, అందించాడు కీర్తి.

"కీర్తీ...."

"షటప్ బిచ్! హర్రీ!"

ఏడవడం మొదలెట్టింది విజయకుమారి.

"హర్రీ! హర్రీ! హర్రీ!" అంటున్నాడు కీర్తి.

నల్లప్యాంటు వేసుకుని ఉన్నాడు అతను.నల్లషర్టు వేసుకుని ఉన్నాడు. అర్ధరాత్రిపూట కూడా నల్లకళ్ళద్దాలు! నల్ల బూట్లు! నల్ల సాక్స్! నల్ల హాంకీ!

మూర్తీభవించిన చెడు!

"హర్రీ! హర్రీ! హర్రీ!" అంటున్నాడు.

వెక్కిళ్ళు పెడుతూ, బాటిలు తెరిచింది విజయకుమారి.

హర్రీ! హర్రీ! హర్రీ!

ఒణికే చేతులతో ఒక క్యాప్సూల్ తీసింది.

నోట్లో పెట్టుకుంది. మింగేసింది.

మరుక్షణంలో గిలగిల్లాడుతూ విరుచుకు పడిపోయింది.

విలవిల కొట్టుకుంటూ, ఆమె పడుతున్న మరణయాతనని ఆసక్తిగా గమనించాడు కీర్తి.

తర్వాత అక్కడి నుంచి బయలు దేరాడు.

అతనికి తెలుసు!

ఇప్పుడు మొదలవబోతోంది ఆఖరి యుద్ధం.

ఫైనల్ కాన్ఫ్లిక్ట్!

రాజాతో!

ఫైట్ బిట్వీన్ గుడ్ అండ్ ఈవిల్!

తను ఈవిల్! అందుకే తను గెలుస్తాడు.

చెడు చేతిలో చావు దెబ్బలు తినడం మంచికి నిత్య కృత్యమే కదా!

వెళ్ళేముందు ఆగి, వెనక్కి వచ్చి విజయకుమారి చేతిలో నుంచి జారి పక్కన పడి ఉన్న వక్కపొడి పొట్లాం తీసుకుని నములుతూ కులాసాగా బయటికి నడిచాడు కీర్తి.

✦ ✦ ✦

తన స్ట్రాటజీని మళ్ళీ ఒకసారి తరచి చూసుకున్నాడు రాజా.

కీర్తి నడుపుతున్న ట్రైనింగ్‌కాంప్‌ని సమూలంగా నాశనం చెయ్యాలి.

దానితోబాటే కీర్తిని అరెస్టు చెయ్యాలి కూడా.

తను ఫాలో అవబోయే ప్లాను ఇంతకుముందే ఒకసారి తమిళనాడులో ప్రయోగించబడి సక్సెస్ అయింది.

ఆ వివరాలన్నీ గుర్తు వచ్చాయి రాజాకి.

కొన్నేళ్ళక్రితం –

తమిళనాడులోకి

శ్రీలంక తమిళ కాందిశీకులు వలసరావడం మొదలయింది.

శ్రీలంకలో జాతి వైషమ్యాలు చెలరేగడం –

సింహళీయులు శ్రీలంకలోని మైనారిటీలు అయిన తమిళులపట్ల విచక్షణ చూపి కష్టాలు పెట్టడం మొదలయింది. తమిళులు తమ హక్కుల కోసం పోరాటం మొదలెట్టారు. దానితో సింహళీయుల వేధింపులు ఎక్కువయ్యాయి.

ఆ బాధలు భరించలేక చాలామంది తమిళులు ఇండియాకి పారిపోయి రావడం మొదలెట్టారు.

అక్కడ శ్రీలంకలో –

తమిళుల హక్కుల కోసం పోరాడడానికి కొన్ని తీవ్రవాద సంస్థలు తయారయ్యాయి. గెరిల్లా పోరాటం మొదలెట్టాయి.

ఆ తమిళ గెరిల్లాలకి కావలసిన ఆయుధాలూ, పెట్రోలూ, డీసెల్, కిరోసిన్, మందులూ అవన్నీ సింహళ తీరానికి అతి దగ్గరగా ఉండే తమిళనాడులో దొరుకుతూ ఉండేవి (రామేశ్వరం నుంచి చూస్తే శ్రీలంక తీరం లీలగా కనబడుతూ ఉంటుంది. స్పీడ్ బోటులో ముప్ఫయ్, నలభై నిమిషాల ప్రయాణం. అంతే!)

ఆ తమిళ తీవ్రవాదులు ఒకప్పుడు భారతీయ సంతతివాళ్ళే కాబట్టి తమిళనాడు రాష్ట్రంలో వారిపట్ల అపరిమితమైన సానుభూతి ఉండేది.

ఆ సానుభూతిని ఆసరా చేసుకుని శ్రీలంక తమిళ తీవ్రవాదులు తమిళనాడు రాష్ట్రంలో అనేకచోట్ల ట్రైనింగ్ కాంపులు పెట్టారు. తమ మెంబర్లకి అక్కడ మిలిటరీ ట్రైనింగ్ ఇవ్వడం మొదలెట్టారు.

అప్పట్లో తమిళనాడుకి యం.జి.రామచంద్రన్ ముఖ్యమంత్రిగా ఉండేవాడు.

అదే టైంలో మోహన్‌దాస్ అని అత్యంత విశ్వాసపాత్రుడయిన పోలీసు ఆఫీసరు ఒకాయన ఉండేవాడు. యం.జి.ఆర్. అని ప్రజలచేత అభిమానంగా పిలవబడే యం.జి. రామచంద్ర మీనన్, పోలీస్ ఆఫీసర్ మోహన్‌దాస్ వీళ్ళు ఇద్దరూ కూడా మళయాళీలే.

అందువల్లే వాళ్ళిద్దరి మధ్య అంతటి సన్నిహిత సంబంధం నెలకొన్నదని కొంతమంది అంటారు.

తమిళ తీవ్రవాద సంస్థలన్నిటిలో కూడా డేరింగ్‌గా, చాలా అగ్రెసివ్‌గా, ఫెరోషియస్‌గా ఉండేది ఎల్.టి.టి.ఈ. (లిబరేషన్ టైగర్స్ ఆఫ్ టామిల్ ఈలం : తమిళ విమోచనోద్యమ పులులు) దీనికి తిరుగులేని నాయకుడు వేలు పిళ్ళే ప్రభాకరన్.

తమిళనాడులో ఉన్న ఈ తమిళ పులుల స్థావరాల గురించిన ఆచూకీ పోలీస్ ఆఫీసర్ మోహన్‌దాస్‌కి తెలిసింది. ఆయన ఆ విషయాన్ని వెంటనే ముఖ్యమంత్రి యం.జి.ఆర్.కి నివేదించాడు.

కానీ యం.జి.ఆర్. ఆ విషయాన్ని చాలా తేలిగ్గా తీసుకోవడం మోహన్‌దాస్‌కి చిత్రమనిపించింది.

అప్పటికి ఊరుకుండిపోయినా మోహన్‌దాస్ ఆ తర్వాత చాలాసార్లు పదేపదే ఈ విషయం యం.జి.ఆర్. దృష్టికి తేవడానికి ప్రయత్నించాడు.

ఒకసారి యధాలాపంగా మోహన్‌దాస్‌తో అన్నాడు యం.జి.ఆర్.

"ఈ విషయాలని గురించి మనం పట్టించుకోవలసిన అవసరం లేదు. అవి కేంద్ర ప్రభుత్వం పరిధి కిందికి వస్తాయి. ఇంటర్నేషనల్ వ్యవహారం కదా" అని.

ఆ తర్వాత తెలిసింది మోహన్‌దాస్‌కి సెంట్రల్ సోర్సెస్ ద్వారా –

సంగతేమిటంటే –

అప్పట్లో భారత ప్రభుత్వం శ్రీలంక సమస్యని అడ్డుపెట్టుకుని, శ్రీలంకని తన గ్రిప్‌లో పెట్టుకోవాలనే ఉద్దేశ్యంతో ఉండింది.

వీలయితే బంగ్లాదేశ్‌లో ఒకప్పుడు వచ్చిన పరిస్థితులలాంటివి సృష్టించి శ్రీలంక

తీరంలో ఉన్న ఒక రేవుని భారతదేశపు అదుపులోకి తెచ్చుకోవటం కూడా అప్పటి భారత విదేశాంగ విధానంలో ఒక భాగంగా ఉండేది.

(ఈ విషయాన్ని మోహన్ తను రిటయిరయ్యాక రాసిన పుస్తకం :"**MGR: THE MAN AND THE MYTH**" లో స్పష్టం చేశాడు సీనియర్ పోలీస్ ఆఫీసర్ మోహన్ దాస్)

అలాంటి ఉద్దేశ్యం ఉండడం వల్ల, శ్రీలంక తమిళ తీవ్రవాదుల యాక్టివిటీస్ గురించి పెద్దగా పట్టించుకోనక్కరలేదని అన్యాపదేశంగా కేంద్ర ప్రభుత్వం నుంచి సూచన అందింది మోహన్ దాస్‌కి.

దాని ఫలితంగా తీవ్రవాదుల యాక్టివిటీస్ రోజు రోజుకీ పెరిగిపోయాయి. వాళ్ళు పోలీసులని ఏ మాత్రం లక్ష్యపెట్టని స్థితి వచ్చేసింది.

వివిధ తీవ్రవాద సంస్థలు ఒకదానితో ఒకటి పోటీ పడుతూ తమదే పైచెయ్యి కావాలనే ఆశతో ఒకళ్ళని ఒకళ్ళు మట్టుపెట్టడం మొదలయింది.

క్రమక్రమంగా స్థానికులైన ప్రజల మీద ఈ కాందిశీకుల డామినేషన్ విపరీతంగా పెరిగిపోయింది.

ఒకసారి ఒక ఆటోని నువ్వు ఆపావా, నేను ఆపానా అన్న చిన్న విషయంలో వివాదం చెలరేగి, తీవ్రవాదులు స్థానికులని కాల్చి చంపేటంతగా పరిస్థితి విషమించింది.

పోలీస్ ఆఫీసర్ మోహన్‌దాస్ వీలయినప్పుడల్లా యం.జి.ఆర్‌కి ఈ విషయాలన్నీ చెబుతూనే ఉన్నాడు.

ఎప్పటికప్పుడు విని తల పంకిస్తూనే వున్నాడు యం.జి.ఆర్.

పరిస్థితి అలా వుండగా –

అప్పుడు యం.జి.ఆర్.కి ఇంకో ఆలోచన వచ్చింది.

ఈ తీవ్రవాదులని తనే చేరదీసి, తన పొజిషన్ మెరుగుపరుచుకుని భారత ప్రభుత్వంతో రాజకీయ బేరం ఆడవచ్చని అనుకున్నాడు ఆయన.

ఉన్న తీవ్రవాద సంస్థలన్నిటిలోనూ ఎల్.టీ.టీ.ఈ. చాలా పవర్‌ఫుల్ అని గ్రహించి దాని నాయకుడయిన వేలు పిళ్ళై ప్రభాకరన్‌ని తన దగ్గరికి తీసుకురమ్మని

పోలీసు ఆఫీసర్ మోహన్‌దాస్‌కి ఆదేశించాడు యం.జి.ఆర్.

యం.జి.ఆర్.కీ, ప్రభాకరన్‌కీ మీటింగు అరేంజ్ చేశాడు మోహన్‌దాస్.

అప్పటి నుంచి యం.జి.ఆర్, ప్రభాకరన్ ఇద్దరూ చాలా క్లోజ్ అయిపోయారు.

ఆ తర్వాత ప్రభాకరన్‌కి తన సొంత డబ్బూ, పార్టీ డబ్బూ కూడా ధారాళంగా విరాళంగా ఇచ్చాడు యం.జి.ఆర్. ఒక దశలో నాలుగు కోట్ల రూపాయలకి చెక్కు కూడా ఇచ్చాడు ప్రభాకరన్‌కి.

ఒకవైపు యం.జి.ఆర్.కి మోహన్‌దాస్ చెబుతూనే ఉన్నాడు – ఇదంతా ఎప్పుడో ఒకప్పుడు వికటించి తీరుతుందని.

చివరికి అతను ఊహించినంతా అయింది.

పోను పోను ఒక దుష్టశక్తిగా విపరీతమైన బలం పుంజుకుంది ఎల్.టి.టీ.ఈ. ఇండియాలో ఉంటూ, ఇండియానే ఖాతరు చెయ్యని స్థితికి వచ్చారు ఆ సంస్థ సభ్యులు.

పైపెచ్చు శ్రీలంకలోని ఉత్తర భాగాన్నీ, ఇండియాలోని తమిళనాడునీ విడగొట్టి, కొత్త తమిళ మహాదేశాన్ని తయారుచెయ్యాలనీ, చేసి దాన్ని చరిత్రకాలపు చక్రవర్తులలాగా తనే పరిపాలించాలనీ, ఎల్.టి.టీ.ఈ. నేత ప్రభాకరన్ కలలు కంటున్నట్లు కూడా రుజువులు దొరికాయి.

ఎల్.టి.టీ.ఈ సభ్యులు ఎక్కడ ఉంటే అక్కడ కాల్పులూ, ఎదురుకాల్పులూ, హత్యలూ, స్మగ్లింగ్ ఇవన్నీ నిత్యకృత్యాలయిపోయాయి. భారత భూభాగం మీదే అనేకమైన స్థావరాలు పెట్టుకుని, పవర్‌ఫుల్ వైర్‌లెస్ సెట్లతో శ్రీలంకలోని హెడ్ క్వార్టర్స్‌తో సంబంధాలు మెయిన్‌టెయిన్ చెయ్యడం మొదలెట్టారు ఎల్.టి.టీ.ఈ మెంబర్లు.

వీళ్ళు యిలా ఏకు మేకై కూర్చున్న సమయంలో భారత ప్రభుత్వం ఒక అంతర్జాతీయ సమావేశం జరపవలసి వచ్చింది.

అదే సమయంలో –

ఈ తీవ్రవాదులు ఆ సమావేశానికి వచ్చిన వి.ఐ.పీలని అఘాయిత్యముగా చంపేస్తారేమో అన్న భయం కూడా అందరిలో మొదలయింది.

అప్పుడు యం.జి.ఆర్. మోహన్‌దాస్‌ని పిలిచి "ఈ సమావేశం జయప్రదంగా ముగిసేదాకా, ఎల్.టి.టీ.ఈ. మెంబర్లందరి దగ్గరా వున్న ఆయుధాలు లాగేసుకుని మన పోలీసు స్టేషన్లలో ఉంచు" అని ఆర్డర్ ఇష్యూ చేసేశాడు తేలిగ్గా.

అది విని అదిరిపడ్డాడు మోహన్‌దాస్.

తర్వాత చెప్పాడు "సర్! నేను మొదటి నుంచి మొత్తుకుంటూనే వున్నాను. వాళ్ళు సూదిలా వచ్చి దబ్బనంలా తేలతారని.

నౌ ఇటీజ్ టూ లేట్. వాళ్ళు చాలా సోఫిస్టికేటెడ్ ఆయుధాలు సమకూర్చుకున్నారు.

మన దగ్గర ఇక్ష్వాకుల కాలం నాటి ఆయుధాలు తప్ప ఇంకేమీ వుండవు. మనం వాళ్ళని ఈ స్థితిలో ఎలా నిరాయుధులుగా చెయ్యగలం? వాళ్ళు లొంగుతారా?" అన్నాడు.

"అదంతా నాకు తెలియదు తక్షణం వాళ్లదగ్గర ఆయుధాలు జప్తు చెయ్యాలి. ఇది సెంట్రల్ గవర్నమెంటు ఆర్డర్. అలాగే చేస్తానని హామీ ఇచ్చాను నేను" అన్నాడు యం.జి.ఆర్.

చాలాసేపు ఆలోచించాడు మోహన్‌దాస్.

తర్వాత అన్నాడు –

సర్! అలాంటి పరిస్థితులలో మనం అవలంభించవలసిన మార్గం ఒకటే వుంది.

"ఏమిటది?" అన్నాడు యం.జి.ఆర్.

"అదేమిటో నేను మీకు చెప్పను. మీకే కాదు ఇంకెవ్వరికీ కూడా చెప్పను.

పని పూర్తి అయ్యేదాకా పథకం అతి రహస్యంగా ఉండాలి.

ఆ షరతు మీదే నేను చెయ్యగలను" అన్నాడు మోహన్‌దాస్.

తప్పదు గనక ఒప్పుకున్నాడు యం.జి.ఆర్.

తీవ్రవాదులని నిరాయుధులని చెయ్యడానికి ఒక ప్లాను వేశాడు మోహన్‌దాస్.

ప్రపంచంలో తయారవుతున్న అతి లేటెస్ట్ మారణాయుధాలని కుప్పలు తెప్పలుగా కొని వుంచుకున్న ఎల్.టి.టీ.ఈ. సభ్యులని పాతకాలపు తుపాకులతో తను వెళ్ళి లొంగదీసి, నిరాయుధులని చెయ్యడానికి ప్లాన్ స్ట్రాటెజీ.

రాజాకి అనిపించింది –

పవర్‌ఫుల్ పొజిషన్‌లో వున్న కీర్తిని, ఇప్పుడు తను ఏ ఆయుధమూ, ఏ విద్యాసాయం లేకుండా లొంగదీయవలసి వచ్చినట్లు అప్పుడు ఆ విషమస్థితి వచ్చింది మోహన్‌దాస్‌కి.

తీవ్రవాదులని నిరాయుధులని చెయ్యటానికి అప్పుడు ఒక ప్లానువేసి సక్సీడ్ అయ్యాడు మోహన్‌దాస్.

అతి భయంకరమైన పరిస్థితిలో –

అతి తెలివైన, కానీ అతి తేలికయిన ప్లాన్‌వేశాడు, సాధించాడు.

అలాంటి ప్లానే ఇప్పుడు కీర్తి మీద ప్రయోగించబోతున్నాడు తను.

టెన్షన్‌తో నరాలన్నీ బిగుసుకుపోయినట్లయింది రాజాకి. కొంత సేపటితర్వాత మనసునీ, ఒంటినీ స్వాధీనంలోకి తెచ్చుకుని –

ప్లాన్ ఎగ్జిక్యూట్ చేయడం మొదలెట్టాడు.

ఏస్ కమెండోస్‌ని కొంతమందిని సెలెక్ట్ చేసుకున్నాడు రాజా.

మొత్తం ఇరవై మంది.

ఇరవైమందే! అంతే!

వాళ్ళను రెండు పార్టీలుగా విభజించాడు.

ఎ. పార్టీ, బి. పార్టీ. ఒక్కొక్క పార్టీలో పదిమంది కమెండోలు.

ఎ.పార్టీని తన వెంట తీసుకుని నేరుగా కీర్తి ట్రైనింగ్ క్యాంపుకి వెళ్ళిపోయాడు రెండు జీపుల్లో.

రాజాని చూసి కూడా లేవలేదు కీర్తి.

రాజాని కూర్చోమని అనలేదు కూడా.

"ఏమిటి?" అన్నట్లు హేళనగా చూశాడు రాజా వేపు.

"ఆల్‌రైట్! యూ విన్" అన్నాడు రాజా నిస్సహాయతని సూచిస్తూ చేతులు పైకెత్తి.

"వాట్ డూ యూ మీన్?" అన్నాడు కీర్తి.

రాజా అన్నాడు – "కీర్తీ! చెడే ఎప్పుడూ గెలుస్తుందనే నిత్యసత్యాన్ని చాలా ఆలస్యంగా యివాళే అర్థం చేసుకున్నాను నేను"

"దటీజ్ యువర్ ఫ్యూనరల్" అన్నాడు కీర్తి బోర్‌గా.

"కీర్తీ! యూ ఆర్ వెరీ పవర్‌ఫుల్! రాజకీయపరంగా కూడా అపారమైన సపోర్టు వుంది నీకు"

"కాబోయే ముఖ్యమంత్రిని నేనే! ఆడిస్తా అందరినీ"

"అది కూడా తెలుసు నాకు" అన్నాడు రాజా.

"అందుకేనా కాళ్ళ బేరానికి వచ్చావ్?"

"తప్పదు. నేను కూడా బతకాలి గదా!"

"నువ్వింత తేలిగ్గా లొంగిరావడం నాకు తృప్తిగా లేదు. ఐ ఎక్స్‌పెక్టెడ్ ఏ ఫెరోషియస్ ఫైట్ ఫ్రమ్ యూ"

"ఏం చెయ్యను! సారీ టూ డిసప్పాయింట్ యూ"

విసుగ్గా తలపంకించాడు కీర్తి.

"ఓకే! నువ్వు చెప్పదల్చుకున్నదేదో చెప్పు" అన్నాడు.

గొంతు సవరించుకుని అన్నాడు రాజా.

"విజయకుమారిని కూడా నువ్వే చంపేసి వుంటావని...."

కీర్తి అతన్ని కట్ చేశాడు. "నేను చంపలేదు. తనే విషం తాగి చచ్చింది."

"దటీజ్ కీర్తి" అన్నాడు రాజా మెప్పుదలగా.

"ఎవర్నీ చంపవు. వాళ్ళే చచ్చేలా చేస్తావు.

కీర్తి! ఇప్పుడు స్టేట్‌కి మగాడివి నువ్వే. మేమంతా ఇంక చేయవలసిన పని ఒక్కటే! ఫాలో ద లీడర్....నాయకుడు....అంటే నువ్వు ఎలా చెబితే అలా చెయ్యడం."

"గుడ్" అన్నాడతను క్లుప్తంగా.

"కానీ కీర్తీ! ప్రజలలో నీపట్ల వ్యతిరేకత వుంది. గత నెలలో నువ్వు చేసిన దారుణాలు వాళ్ళు యిప్పట్లో మర్చిపోరు! పోలేరు"

"పబ్లిక్ మెమొరీ ఈజ్ వెరీ షార్ట్! నాయకుల గతాన్ని ఇట్టే మర్చిపోతారు ప్రజలు. ఆ టాలెంటు వాళ్ళకి వుంది. లేకపోతే ఈ లీడర్లంతా ఇట్లా వెలిగిపోగలరా?"

"గతం మర్చిపోవాలంటే కనీసం కొన్నినెలలన్నా పడుతుంది కీర్తీ!'

"అయితే?"

"ఇప్పుడు సిటీలో చాలా ఇంపార్టెంటు ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఒకటి జరగబోతోంది." అన్నాడు రాజా.

"అవును"

"ప్రపంచం నాలుగు మూలలనుంచి అనేకమంది వి.ఐ.పీ.లు వస్తారు."

"అఫ్‌కోర్స్"

"ఆ కాన్ఫరెన్స్ సమయంలో నువ్వు ఎలాంటి అరాచకం సృష్టిస్తావో, దాని ఫలితాలు అంతర్జాతీయంగా ఎంత దారుణంగా వుంటాయో అని అందరూ భయపడుతున్నారు"

తేలిగ్గా అన్నాడు కీర్తి –

"ఆ కాన్ఫరెన్స్ నాకేం ఇంట్రెస్టు కలిగించదు. నేను చెయ్యవలసినదంతా ఇప్పటికే చేసేశాను. ఇవాళో, రేపో స్టేట్‌ని అంతా నా గ్రిప్‌లోకి తెచ్చేసుకుంటున్నాను."

"ఆ సంగతి ప్రజలకు యింకా తెలియదు కదా! ప్రజల సంగతి నీకు తెలుసు.

వెర్రిగొర్రెలు. కానీ తిరగబడితే వాళ్ళే పెద్దపులులు అయిపోతారు. అంతదాకా రానివ్వకూడదు. రానివ్వడం అవివేకం”

“సో?”

“ప్రజల కోసం, కన్నీటి తుడుపుగా ఏదో కొంత చేసినట్లు నటించక తప్పదు.”

కాలుమీద కాలేసుకుని ఊపుతూ నిశితంగా రాజా వేపు చూస్తున్నాడు కీర్తి.

రాజా అన్నాడు –

“ఈ కాన్ఫరెన్స్ లోపల నిన్ను లొంగదియ్యాలని ప్రజల కోరిక. లేకపోతే ఊరుకోరు. మేం నిన్ను లొంగదీశాక నువ్వు నిరపరాధివని మళ్ళీ కేసు తయారు చెయ్యొచ్చు. మసి పూసి మారేడుకాయ చేయవచ్చు. అది మన చేతిలో పనే!”

“నేను లొంగడమా? కల్లోని మాట”

“నిజంగా లొంగిపొమ్మని అడగట్లేదు నేను”

“మరి?”

నిదానంగా, స్పష్టంగా చెప్పడం మొదలెట్టాడు రాజా.

“కీర్తీ! ఇదంతా ఉత్తుత్త నాటకంలాంటిదని మళ్ళీ చెబుతున్నాను. చెయ్యవలసింది చాలా సింపుల్. నీ మనుషుల దగ్గర ఆయుధాలున్నాయి. నాకు తెలుసు! ఆస్సాల్ట్ రైఫిల్స్, AK 47, AK 56, స్టెన్‌గన్స్ దగ్గర నుంచి కత్తులు కటార్లదాకా అనేక రకాలు.

ఆ ఆయుధాలన్నిటినీ నువ్వే, ఈ ట్రెయినింగ్ క్యాంపులోనే, ఒక గదిలో పడేసి తాళంవెయ్. ఆ తాళం చెవి నీ దగ్గరే వుంచుకో! చిన్న డ్రామా! దానితో ప్రజలు తృప్తిపడతారు. నీ రికార్డు క్లియర్ అవుతోంది.

ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పూర్తయిపోగానే మళ్ళీ నీ ఆయుధాలు బయటికి తెచ్చేసుకో! వాట్ యూ సే?” అన్నాడు రాజా.

కనుబొమలు ముడేసి కొద్దిసేపు మౌనంగా వుండిపోయాడు కీర్తి. తర్వాత అన్నాడు –

"నాకు ఇందులో నష్టం ఏమీ కనబడటం లేదు." అన్నాడు సాలోచనగా. "నా ఆయుధాలని, నా ట్రైనింగ్ క్యాంపులో నేనే ఒక గదిలో పడేసి తాళం వేసి, తాళం చెవి నా దగ్గరే ఉంచుకోవాలి! అంతేనా? వైనాట్?"

"థాంక్స్ ఎలాట్!" అన్నాడు రాజా. "ఇది నీకు చాలా చిన్న పనే కావచ్చు. కానీ దీనివల్ల మాకు చాలా ఇబ్బందికరమైన పరిస్థితి తప్పిపోతుంది."

"కానీ.... ఫైట్ లేకుండా నువ్వు మెత్తబడిపోవడం....నాకు అసంతృప్తిగానే వుంది. ఓకే. నాతోరా!" అని దారి తీశాడు కీర్తి.

బంగళాలో నుంచి బయటికి రాగానే పెద్దగా అరుస్తూ ఆర్డర్స్ చేశాడు కీర్తి.

సరిగ్గా అయిదు నిమిషాల్లో అక్కడున్న అందరూ త్వరత్వరగా స్టోర్ రూం దగ్గరికి వచ్చేశారు.

"అన్ని ఆయుధాలూ అందులో పడెయ్యండి!" అన్నాడు కీర్తి.

వినయంగా అందరూ తమ తమ ఆయుధాలు స్టోర్ రూంలో పడేశారు.

"దటీజ్ ఇట్! ఇప్పుడెవరన్నా వచ్చి ఇల్లంతా చెక్ చేసినా, ఒక్క ఆయుధం కూడా కనబడదు. క్లీన్ ఇమేజ్ వస్తుంది నీకు!" అన్నాడు రాజా. అని కాస్త మొహమాటంగా మళ్ళీ అన్నాడు "కీర్తీ! నువ్వు చీఫ్ మినిస్టర్‌వి అయ్యాక నా మీద కచ్చిపెట్టకోవని ఆశిస్తాను."

"లెటజ్ ఫర్ గెట్ అండ్ ఫర్ గివ్!"

విజయగర్వంతో తల పంకించాడు కీర్తి.

"మరి నేను శెలవు తీసుకోనా?" అన్నాడు రాజా. కరస్పర్శ కోసం చెయ్యి జాపుతూ.

అలక్ష్యంగా తన చేతిని అందించాడు కీర్తి.

అతని కరస్పర్శలో అభిమానం లేదు.

స్నేహం లేదు.

చచ్చిన పాములాగా చల్లగా ఉంది ఆ చెయ్యి.

కానీ రాజా మాత్రం కీర్తి చేతిని నాలుగైదు సార్లు గట్టిగా ఊపాడు.

తర్వాత అన్నాడు.

"వస్తాను కీర్తీ! లోకం అంతా మారిపోతుంది. నేనూ మారిపోక తప్పదేమో. నన్ను గుర్తుంచుకో! ప్లీజ్!"

అని చెప్పి, చకచకా బయటికి వచ్చేశాడు రాజా.

అతను బయటికి వచ్చీ రాగానే గేట్లు మూసుకుపోయాయి.

కమెండోలు వున్న జీపు ఎక్కాడు రాజా.

జీపు ఎక్కి కూర్చున్న తర్వాత, తన జేబులో వున్న తాళం చెవి తడిమి చూసుకున్నాడు.

కీర్తి తాలూకు ఆయుధాలు ఉంచిన స్టోర్‌రూం తాలూకు తాళంచెవి.

కీర్తి తన జేబులో భద్రంగా దాచుకున్న తాళం చెవే అది.

అతనికి షేక్‌హాండ్ ఇస్తూ చాకచక్యంగా దాన్ని కొట్టేశాడు తను.

చెబుతున్నాడుగా.

తనకీ విద్య కొత్తకాదు.

చిన్నప్పటినుంచే కేటుగాడు తను.

అప్పట్లోనే విజయకుమారి హ్యాండ్‌బ్యాగుని అంతమంది పోలీసులూ, అంతమంది జనం చూస్తుండగానే కొట్టెయ్యలేదూ?

ఈ 'హస్తలాఘవం' తనకి కృష్ణాజీ పరిచయం కాకముందు నుంచే వుంది.

ఆయన స్ఫూర్తివల్ల నేర్చుకున్న విద్యల్లో ఇది ఒకటి కాదు.

అందుకనే తను కృష్ణాజీకి యిచ్చిన మాట తప్పినట్లు కాదు యిప్పుడు!

తనని ఏం అడిగాడు కృష్ణాజీ?

"నా స్ఫూర్తివల్ల నేర్చుకున్న విద్యలేవీ నా కొడుకుని పట్టుకోవడంలో ఉపయోగించ కూడదు" అని.

ఈ జేబులు కొట్టే విద్య ఆయనతో పరిచయానికి ముందుటిదే.

నో! తను మాట తప్పలేదు. రాజా ఎక్కాక కదిలింది జీపు.

అప్పుడు సమయం సరిగ్గా అర్ధరాత్రి పన్నెండు గంటలు.

ఆ తర్వాత అయిదున్నర గంటలకి....

అంటే....సరిగ్గా తెల్లవారుఝామున అయిదు గంటల ముప్ఫయ్ నిమిషాలకి, అప్పటిదాకా ఆ ప్రాంతాలలోనే కాచుకుని వున్న బి పార్టీ కమెండోల తాలూకు జీపు ట్రైనింగ్ క్యాంపుని సమీపించింది.

"సరెండర్! ఎవ్వరూ వెధవ్వేషాలు వేయకండి! అందరూ లొంగిపోంది" అన్నాడు అందరికంటే వెనక దిగిన రాజా.

రాజా గొంతు వినగానే అదిరిపడ్డాడు కీర్తి.

అప్రయత్నంగా అతని చెయ్యి జేబులో వున్న తాళం చెవి మీదకు పోయింది.

నవ్వుతూ అన్నాడు రాజా.

"నో యూస్ కీర్తీ! అది నా దగ్గర వుంది."

"నమ్మకద్రోహం!" అన్నాడు కీర్తి పళ్ళు కొరుకుతూ.

"అది నీకు కొత్తా కీర్తీ!"

తన మనుషుల కోసం అటూ యిటూ చూశాడు కీర్తి. ఒక అరడజను మంది కంటే ఎక్కువ మంది లేరక్కడ.

అప్పుడు అర్థమయ్యింది కీర్తికి, రాజా వేసిన మాస్టర్ స్ట్రాటెజీ ఏమిటో.

టైం!

సరిగ్గా తెల్లవారు ఝామున అయిదున్నర గంటలకు

అంటే....

ఆ టైంలో ట్రైనింగ్ కాంపులో వున్న వాళ్ళలో కొందరు నిద్రలో వుంటారు.

కొందరు అప్పుడే లేచి బద్ధకం తీర్చుకుంటూ వుంటారు!

ఇంకొందరు మొహాలు కడుగుతూ వుంటారు.

కొందరు బాత్‌రూంలలో, టాయిలెట్లలో వుంటారు.

అంతేగానీ ఫైటింగ్‌కి రెడీగా వుండేవాళ్ళు ఆ టైంలో తక్కువ.

చాలా కరెక్ట్ టైంలో దెబ్బకొట్టాడు రాజా.

మిలిటరీ జీనియస్ తియ్యాల్సిన దెబ్బ యిది.

ఇదివరకు అరబ్ ఇజ్రేలీ యుద్ధం జరిగినప్పుడు –

ఇజ్రేల్ ఇలాగే చావు దెబ్బ కొట్టింది ఈజిప్టుని.

కరెక్ట్ టైం చూసి!

ఈజిప్షియన్ ఎయిర్ ఫోర్స్ తాలూకు పైలట్లు పొద్దున్నే డ్యూటీలు మార్చుకుంటారు.

ఆ టైంలో ఎయిర్ ఫోర్స్ విమానాలన్నీ గ్రవుండ్ అయ్యి నేల మీదే వుంటాయి.

రాత్రంతా డ్యూటీలో వున్న పైలట్లు క్రిందికి దిగుతారు.

అప్పుడే డ్యూటీకి వచ్చిన పైలెట్లు విమానాలు ఎక్కుతుంటారు.

వాళ్ళెవరూ కూడా యుద్ధానికి సిద్ధంగా వుండని టైం అది.

ఆ టైంలో ఇజ్రేలీ జెట్ బాంబర్లువచ్చి నేలమీదే ఉన్న ఈజిప్షియన్ యుద్ధ విమానాలని బాంబులు వేసి నేలమీదే ధ్వంసం చేసి పారేశాయి.

బ్రిలియంట్ స్ట్రాటెజీ.

టైం మహత్యం అలాంటిది.

ఆ టైంని ఆధారం చేసుకునే ఇప్పుడు ఇలా దెబ్బకొట్టాడు రాజా.

కమెండోలు అదిలిస్తుంటే, కీర్తి మనుషులు ఒక్కొక్కళ్ళే లొంగి పోతున్నారు.

చివరి ప్రయత్నంగా, బింకంగా అన్నాడు కీర్తి.

"అందరి జాతకాలూ బయటపడేసే ఫైలు నా దగ్గర వుంది. ఆ విషయాలు బయటపడితే రాష్ట్రం అల్లకల్లోలమై పోతుంది జాగ్రత్త!"

"పొరబడ్డావ్! ఆ ఫైలు ఇప్పుడు నా దగ్గర వుంది" అన్నాడు రాజా.

"నీ దగ్గరి కెలా వచ్చింది?"

"మీ ఇంట్లో నుంచి దొంగిలించా! నేనే.

దొంగతనం నాకు చిన్నప్పటి నుంచి అలవాటు.

ఆ ఫైలు రేపు ప్రజల్లోకి వెళ్తుంది.

అసలు అది తయారయ్యింది కూడా అందుకే.

అదే అప్పటి హెూం మినిస్టర్ సదాశివబ్రహ్మంగారు కోరుకున్నది" అన్నాడు రాజా.

నిశితంగా రాజా వైపు చూసి, తర్వాత నవ్వాడు కీర్తి.

"రాజా! నీకు సమఉజ్జీ అయిన ప్రత్యర్థిగా చెబుతున్నాను. మాస్టర్ స్ట్రోక్! ఐ కంగ్రాచ్యులేట్ యూ!"

"థాంక్స్ బడ్డీ" అన్నాడు రాజా.

అప్పటిదాకా నల్ల ఫెల్ట్‌హాట్‌ని చేతిలో పట్టుకుని యథాలాపంగా తిప్పుతున్నాడు కీర్తి. హఠాత్తుగా అతని ఎడమ చెయ్యి పొజిషన్‌లోకి వచ్చింది.

ఫెల్ట్‌హాట్‌ని విష్ణుచక్రంలా రాజా మెడ వైపు గురిపెట్టాడు అతను. ఆ టోపీ అంచులో పదునయిన కత్తి ఉంది.

ఆ క్షణంలో రాజా వీపు కీర్తి వేపు తిరిగి ఉంది.

కమెండోలకి ఏదో చెబుతున్నాడు అతను. కీర్తి చేతుల తాలూకు మూమెంటుని అతను గమనించలేదు.

గురిచూసి ఫెల్ట్‌హాట్‌ని విసిరాడు కీర్తి.

సరిగ్గా అదే క్షణంలో –

రివాల్వర్ పేలిన శబ్దం వినబడింది.

పెద్ద కేక పెట్టి, మరుక్షణంలో నేలకి ఒరిగాడు కీర్తి.

కీర్తి విసిరిన ఫెల్ట్‌హాట్ రాజా మెడని తాకకుండా, గురితప్పి పక్కన పడిపోయింది.

ఒకసారి ఆ హాట్‌ని చూసి, తర్వాత చటుక్కున తిరిగాడు రాజా.

కృష్ణాజీ నిలబడి వున్నాడు అక్కడ.

అతని చేతిలో రివాల్వర్!

“సర్!” అన్నాడు రాజా ఆశ్చర్యంగా, కృతజ్ఞతగా.

కృష్ణాజీ గనక సరిగ్గా ఆ క్షణంలో కీర్తిని షూట్‌చేసి ఉండకపోతే, కీర్తి విసిరిన ఫెల్ట్‌హాట్ తన శిరచ్ఛేదం చేసేసి వుండేది. అనుమానంలేదు.

కృష్ణాజీ తనని కాపాడాడు.

తన కన్న కొడుకుని షూట్ చేసి!

ఎందుకని?

రాజా ఆశ్చర్యాన్ని గమనించి కృష్ణాజీ అన్నాడు.

“నా కళ్ళు తెరిపించావు రాజా! పుత్ర వాత్సల్యంతో నాకు మంచీ చెడూ అనేది తెలియకుండా పోయింది తాత్కాలికంగా.

స్వార్థం ప్రవేశించి నేను మారిపోయాను.

కానీ నువ్వు....నువ్వు మాత్రం ఎన్ని ఆటుపోట్లు వచ్చినా తట్టుకుంటూ, ఏ క్షణంలో కూడా నీ డ్యూటీని మర్చిపోలేదు.

“నీ ప్రవర్తనే నన్ను మార్చింది రాజా” అంటూనే చటుక్కున కీర్తి శవం పక్కన కూలబడిపోయి, “ఎన్నాళ్ళు ఎదురు చూశాం రా బాబూ నీ కోసం. ఎదురు చూసింది చివరికి నిన్ను ఇలా శవంలా చూడడానికా?” అంటూ దుఃఖించడం మొదలెట్టాడు.

అప్పుడు గమనించాడు రాజా కృష్ణాజీ వెనక ఉన్న స్త్రీని.

పచ్చగా, పండు తమలపాకులాగా ఉంది ఆమె.

ప్రపంచంలోని దిగులంతా ఆమె కళ్ళలోనే గూడు కట్టుకుని ఉందా అనిపించేటట్లు విచారంగా కనబడుతోంది ఆమె. నిస్సత్తువగా, నీరసంగా వుంది.

"అమ్మా!" అన్నాడు ఆర్ద్రంగా.

"అమ్మా!" అనే ఆ రెండు అక్షరాల కలయికతో కూడిన పిలుపు వినడానికే అన్నేళ్ళు బతికి ఉన్నట్లు ఒక్కసారిగా కళ్ళు తెరిచింది ఆమె.

"అమ్మా!" అన్నాడు రాజా మళ్ళీ.

"ఇంకేం అమ్మ నాయనా! నా కొడుకు, నా కీర్తి శవమైపోయాడుగా! నన్నూ పోనియ్" అంది ఆమె రోదిస్తూ.

నెమ్మదిగా అన్నాడు రాజా.

"అమ్మా! ఇటు చూడు! నేను! నేనే నీ కొడుకుని. కీర్తి కాదు. కీర్తి ఒక క్రిమినల్ అమ్మా. నేనే నీ కొడుకుని."

గిరుక్కున ఇటు తిరిగాడు కృష్ణాజీ.

"ఏమిటి నువ్వనేది?" అన్నాడు అసహనంగా.

"నాన్నా!" అన్నాడు రాజా "నువ్వు నీ కెరీర్ మొత్తం మీద ఒకే ఒక్కసారి పొరపాటు చేశావ్ ఐడెంటిఫికేషన్‌లో.

క్రిమినల్ కీర్తిని చూసి నీ కొడుకని భ్రమపడ్డావ్....పరోక్షమయిన సాక్ష్యాధారాల వల్లా, కీర్తి వంటిమీద ఉన్న రెండు పుట్టు మచ్చల వల్లా, అతనే నీ కొడుకన్న భ్రమలో పడ్డావ్. అతన్ని రక్షించడం కోసం నిప్పులాంటి నీ నీతి నియమాలని ఒదిలేశావ్. నాన్నా! నన్ను నమ్ము. నీ కొడుకుని నేనే! కీర్తి కాదు.

వింటున్న కృష్ణాజీ మొహం కఠినంగా మారింది.

"నువ్వు బ్లఫ్ చెయ్యడం లేదని నమ్మకం ఏమిటి?" అన్నాడు తీవ్రంగా.

జీపు దగ్గరికి వెళ్ళి ఫైలు తీసుకొచ్చాడు రాజా.

నోట మాటరానట్లు అలాగే చూస్తూ ఉండిపోయాడు కృష్ణాజీ. తర్వాత హఠాత్తుగా

ఇంకేదో గుర్తు వచ్చినట్లు అన్నాడు.

"అసలు ఈ సంగతి నీకెట్లా తెలిసింది?"

"నేను చిన్నప్పుడు తప్పిపోతే ఎత్తు కొచ్చాడు ఆ దాసు అనే వ్యక్తి."

అనేక విధాలుగా ఎక్స్‌ప్లాయిట్ చెయ్యాలని చూశాడు నన్ను.

చివరికి రోగాలతో వళ్ళంతా పుచ్చిపోతే నేనే హాస్పిటల్లో చేర్పించి ట్రీట్‌మెంటు ఇప్పించాను.

కన్ను మూసేముందు కళ్ళెంబడి నీళ్ళు పెట్టుకుని ఈ రహస్యం చెప్పాడు. నిజానికి నేను తప్పిపోలేదుట. అతనే ఎత్తుకొచ్చాడుట" అన్నాడు రాజా.

అలా చెబుతున్నప్పుడు అతని గొంతు వణికింది.

ఈలోగా కృష్ణాజీ భార్య పరుగున వచ్చి రాజాని చుట్టేసింది తన చేతులతో.

"నువ్వే! నువ్వే నా కొడుకుని. రాజా! నా రాజా!

నువ్వేనా చిన్నప్పుడు తప్పిపోయింది. దేవుడా! నువ్వెంత దయ చూపిస్తున్నావయ్యా!

నా కొడుకుని నేను కళ్ళారా చూసుకున్నాను. ఇంక నేను చనిపోయినా దిగుల్లేదు. నన్ను తీసుకెళ్ళిపో!" అంది ఏడుస్తూ, నవ్వుతూ, ఏడుస్తూ –

"నిన్ను ఎక్కడికీ పోనివ్వనమ్మా! నాతో తీసుకెళ్ళిపోతా" అన్నాడు రాజా ఆర్ద్రంగా.

అప్పటికి నమ్మకం కుదిరింది కృష్ణాజీకి – రాజా తన కన్న కొడుకేనని.

అయినా సందేహంగానే అడిగాడు.

"రాజా! మరి ఇంతటి సంతోష వార్త ఇంతకు ముందే ఎందుకు చెప్పలేదు నాకు?"

చిన్నగా నవ్వాడు రాజా.

"చెబితే మీలో పుత్రవాత్సల్యం ఉప్పొంగి, నాకు ఏ ప్రమాదం జరుగుతుందో అన్న భయంతో నా డ్యూటీ నేను పెర్‌ఫార్మ్ చెయ్యకుండా మీరు అడ్డం పడతారేమోనని

భయపడ్డాను" అన్నాడు.

"కరెక్టే! మంచిపనే చేశావ్" అన్నాడు కృష్ణాజీ మనస్ఫూర్తిగా నవ్వుతూ.

అప్పటికే జనం గుమిగూడడం మొదలెట్టారు అక్కడ.

వాళ్ళలో అర్పిత కూడా వుంది.

అర్పిత మొహం అదోలా ఉండడం చూసి ఆమెని పక్కకి తీసుకెళ్లాడు రాజా.

"అర్పితా! ఏమయ్యింది....?" అన్నాడు.

"జరగాల్సిందే జరిగింది. అంకితని అరెస్టు చేశారు. నాన్నగారిని హత్య చేసిన నేరం మీద! వాళ్ళిద్దరూ లేకపోతే ఇంక మిగిలింది నేనొక్క దాన్నే" అంది అర్పిత దిగులుగా.

అతని భుజం మీద తల వాల్చింది అర్పిత.

✦ ✦ ✦

"పిచ్చా! మేం ఇంత మందిమి నీకోసం వున్నప్పుడు నువ్వు ఒంటరిదానివి ఎలా అవుతావు?" అన్నాడు రాజా. అంటూనే అర్పితని తన తల్లి దగ్గరికి నడిపించుకెళ్లాడు.

"నీకు కాబోయే కోడలు" అన్నాడు టూకీగా.

కళ్ళు తుడుచుకుంటూ నవ్వి, రాజానీ, అర్పితనీ చెరో చేత్తో దగ్గరికి తీసుకుంది ఆమె.

కృష్ణాజీ వచ్చి, వాళ్ళ ముగ్గురి చుట్టూ సరదాగా చేతులు వేశాడు.

"ఇది నా ఫ్యామిలీ!" అనుకున్నాడు రాజా తృప్తిగా.

అలాంటి అనుభూతి కలగడం అతనికి జీవితంలో అదే మొదటిసారి!